నిన్ను శరణంబుఁ జొచ్చితినని మూఁడవసారి చెప్పఁ గారణ మేమందువా? విూరందఱు తన విషయమై విరోధముగాఁ జెప్పఁగా నాకు ముఖ్యులైన విూ మాటలచే నా మనస్సు కలవరపడి యుండునని సందేహించి యీ సందేహము దీఱ వీరు చెప్పినదోషము నాయందు లేదు, నీ రక్షణము కోరియే వచ్చితినని చెప్పెను. కావున ప్రపత్తికి హానిలేదు. ప్రపన్నునకు హానిలేదు. నాకు హానిలేదు.

రామచంద్రునిన్ శరణము గచ్ఛితి యను వాక్యమునందు విడువ వలసినవి విడుచుట చెప్పఁబడెను. ఇందు పరుషము లను పదమునందలి యుప సర్గము 'పరిత్యజ్య' యను చరమశ్లోకమునందలి పరి యను నుపసర్గార్థమును బోధించుచున్నది. వానరులతోఁ జెప్పుకొనుటచే పురుషకారపూర్వకముగఁ ప్రపత్తిచేసెననియు జెప్పఁబడెను. కావున నిదియే ప్రధానప్రపత్తి. సకృత్ప్రపత్తివలనఁ బ్రపన్నుఁడైన వానికిఁ దరువాతఁ జేయు వాచిక కాయిక ప్రపత్తులు పునః ప్రపత్తిలోఁ జేరవు. కాఁబట్టి యొకపరి యనియే రామచంద్రమూర్తి చెప్పెను. మూఁడవసారి సమక్షమునఁ జెప్పఁబడినదే ప్రపత్తి వాక్య మందు మేని ప్రపన్నుఁడు కాకముందే రక్షించె నను నాక్షేపము వచ్చుటకాక పురుషకారము లేదను నాక్షేపము వచ్చును. తల్లిని బిడ్డ యమ్మా! యన్న మనును. ఆమె తెచ్చులోపల మీఁదమీఁద పదిమార్లు అమ్మాయన్న మనును. అన్నము తెచ్చుటకు మొదటిసారి పిలిచినదే చాలునుగదా. తక్కినవి రుచివిశేషమును దెలుపును.

కావున నొకసారి ప్రపత్తిచేసెనుగాని పలుమాఱు చేయలేదు. అంతే కాదు. మన మతని యింతసేపు నిరాధారముగ నాకాశమున నిలువఁబెట్టి రక్షింతమా, వలదా? దుష్టుఁడా, శిష్టుఁడా యని యీ విధముగ నింతకాలముగ నాలోచించుచున్నాము గాని యతఁడో రావణుఁడు ఛీ పొమ్మనఁగానే యక్కడ లేచినవాఁ డిచ్చట వచ్చి ముహూర్తములో నిలచెనే కాని వీఁడు పొమ్మననే, ఇంటికి భార్యయొద్దకుఁబోయి చెప్పిపోదునా, తల్లిదండ్రుల యొద్దకుఁ బోదునా, అన్న కుబేరుని యొద్దకుఁబోదునా, దేశాంతరము బోదునా, రాముని యొద్దకుఁబోదునా, నేను మాత్రము పోయిన నా పెండ్లాము బిడ్డలగతి యేమి? వారిని రక్షించువా రెవ్వరు? రావణుని కాళ్ళమీఁదనే పడుదునా, రాముని యొద్దకుఁబోయిన నాయన నన్ను నమ్మునో నమ్మఁడో- అనుగ్రహించునో- నిగ్రహించునో- చెఱయందుంచునో తెఱుమఁగొట్టునో, రాముఁ డనుగ్రహించిన వానరు లేమందురో, వారును నిగ్రహించిరేని తమ్మువాలె నెక్కడికిఁబోదును అని యిట్టు లాలోచించెనా? మనయం దెంతో నమ్మకము లేకుండిన నిట్లు సాహసించి రాఁ గలఁడా? సుగ్రీవా! నీవు

నాతో స్నేహము చేయునపుడే నా యన్నను జంపుమని నా చేతఁ బ్రమాణము చేయించుకొంటివే ఇతని నోట నిట్టిమాట వచ్చెనా? నీవు కోరినట్లు రాజ్యము నా కిమ్మని కోరునేమో పరీక్షింపుము.

సుగ్రీ—రామచంద్రా! విభీషణుఁడు భక్తుఁడే కాని ప్రపన్నుఁడు కాఁడు. ఏల యందువా? 'శ్రీరాముని కప్పగింపు సీతాదేవిన్' అని మంచిమాట చెప్పుట నీ యందలి ప్రేమచేఁ గదా. అట్టులే దూతను జంపవల దనుట భార్యచేత బిడ్డలచేత నీ భార్యకు ధైర్యోక్తులు చెప్పి పంపుట ఇట్టివి పురశ్చరణ వంటివి కావా? కావున వీఁడు ప్రపన్నుఁడు కాఁడు.

రామ—దూతను జంపవలదని చెప్పుట యన్నకుఁ బాపము, అపకీర్తి వచ్చునే యని యతని గౌరవముగోరి చెప్పెనుగాని నాయందు, హనుమంతునియందుఁ బ్రేమ గలిగిగాదు. సీత నిమ్మని చెప్పుటకును వాఁడు వంశనాశమై పోవునే యను తలంపుతోఁగాని నాయందుఁ బ్రేమచేఁగాదు. అలకుయిలు, ఆఁడుకుయిలు నెవరైన నాలకించి యాదరింపవలసినదే ధర్మము అతఁడు జన్మ ప్రభృతి ధర్మనిష్ఠుఁడు. "కం. పరమాపత్కాలమునను, దొరసినయేనియు మనంబు దొలఁగక యెపుడున్, బరఁగుతధర్మమునందే" యనియు "కం. ఏయే యాశ్రమ మందును, నేయే మతి సంభవించునీశ్వర నిరతం, బాయాయదిధర్మమునం, దే యనువర్తించుగాక" యనియు (ఉత్తర-౨౧౧-౨౧౨) బ్రహ్మనుగోరి వరము పొందినవాఁడు. రాక్షసచేష్టలు లేవని శూర్పణఖయే చెప్పెను. దుష్టునకు దుష్టకార్యములు చేయుట యెట్లు స్వభావమో, ధర్మాత్మునకు ధర్మము స్వభావసిద్ధము. తన్ను రావణుఁడు వెడలఁగొట్టును, ఇచ్చటికి రావలసియుండును అని ముందుగాఁ దెలిసియే యీ కార్యములు చేసెను. ప్రపన్నుఁడు ధర్మకార్యములు చేయరాదా? మంచిమాట లాడరాదా? హిత మెవరికైన బోధింపరాదా? కావున విభీషణుఁడు ప్రపన్నుఁడే. నేను ప్రపన్నుఁడ నని సోమరియై ముద్దవలెఁ గూర్చుండువాఁడు వాస్తవ ప్రపన్నుఁడు గాఁడు. లోకహితార్థము ఫలకాంక్షలేక యథాశక్తి ధర్మ కార్యము చేయువాఁడే వాస్తవ ప్రపన్నుఁడు. వీఁడే నా కనుకూల సంకల్పుఁడు.

వీఁడు భక్తుఁడై యుండెనేని వీఁడిట్లు వచ్చిన సహించియుండను. స్నానము చేసి నిత్యకర్మానుష్ఠానములు దీర్చుకొని శుచియై వచ్చియుండవలెను. వీఁ డిచ్చట స్నానముచేసి యే పట్టువస్త్రము గట్టుకొని వచ్చెను. భక్తి యోగమునందు నధికారనియతి, ఆచారనియతి, కలదుగదా. "యదహరేవ విరజేత్, తదహరేవ ప్రవ్రజేత్" ఏనాఁడు విరక్తి గలిగెనో, యానాఁడే యిల్లు విడిచిపోవలెను-అన్నట్లు రావణువిషయమున నేనిమిషమున మనస్సు రోసెనో, యా నిమిషముననే కదా బయలుదేఱి వచ్చెను. సంసారకాంక్ష

యున్నయెడఁ బెండ్లాలకు, బిడ్డలకుఁ జెప్పియైన వచ్చియుండఁడా? దిన వార నక్షత్రయోగకరణములు మంచివగునా, కావా యని పంచాంగము చూచి వచ్చెనా? నాస్తి నాక్షత్ర సంబంధో ననిమిత్తపరీక్షణమ్, శ్రద్ధైవ నిత్యమష్టాక్షర పరిగ్రహే" అష్టాక్షర స్వీకారమందు నక్షత్రము మంచిదగునా కాదా, శకునము మంచిదగునా కాదా యని పరీక్షింపవలసిన పనిలేదు. శ్రద్ధయే, రుచియే దానికిఁ గావలసిన యధికార మని ప్రపత్తి విషయమునఁ గదా చెప్పఁబడెను. కావున వీఁడు ప్రపన్నుఁడే కాని భక్తుఁడుగాఁడు.

ఇచ్చట నొక్క విషయము చెప్పవలసియున్నది. శరణాగతికి దేశకాలాది నియమములు లేవనియుఁ, బారిశుద్ధ్యము లేదనియుఁ జెప్పుటచే నెవ్వఁడైన నేస్థితియందైనఁ బ్రపత్తి చేయవచ్చు ననియు, దానికి నియతి లేదనియు నీ మొదలయిన దురభిప్రాయములు గలవారు కారాదు. న్యాసము, సన్న్యాసము ఈ రెంటికి జ్ఞానము ప్రధానము. ఆ మాత్రమున స్వవర్ణాశ్రమాచార ధర్మములు త్యాజ్యములు కావు. ఆతుర సన్న్యాస మెట్టిదో యీ శరణాగతియు నట్టిదే. "యద్యాతురస్స్యాన్మనసా వాచా సన్న్యసేత్" అని శ్రుతి. అనఁగా ఆతురుఁడైనయెడల మనస్సుతోఁగాని వాక్కుతోఁగాని సన్న్యసింప వచ్చును. ప్రపత్తికి నిదియే లక్షణము. ఇదియే విధి.

ఆతురుఁ డనగా— "ఉత్పన్నే సంకటే ఘోరే చోరవ్యాఘ్రాది గోచరే, భయభీతస్య సన్న్యాసమంగిరా మునిరబ్రవీత్" ఘోర కష్టదశ ప్రాప్తించినను దొంగలచే, పులులు మొదలగు వానిచే భయము గలిగినపుడు, ఇఁక బ్రతుక నని తోఁచెనేని మీఁదఁ జెప్పినట్లు వాక్కుతోనో, మనస్సుతోనో సన్న్యసింప వచ్చును.

ఆపత్కాలేతు సన్న్యాసః కర్తవ్య ఇతి శిష్యతే
జరయాభిపరీతేన శత్రుభి ర్వ్యాధితేనచ
ఆతురాణాం చ సన్న్యాసే నవిధిర్నైవ చ క్రియా
ప్రేషమాత్రం సముచ్చార్య సన్న్యాసం తత్రపూరయేత్
సన్న్యస్తోహమితి బ్రూయాత్ నవనేషు పరిక్రమాత్
ఆతురాణాం విశేషోస్తి న విధి ర్నైవచ క్రియా
ప్రేషమాత్రస్తు సన్న్యాస మాతురాణాం విధీయతే.

ఆపత్కాలమందు సన్న్యాసము కర్తవ్యము. ముసలితనముచేతనో, శత్రుబాధచేతనో బాధపడువాఁడు ఆతురసన్న్యాసి కావచ్చును. ఆర్తికలవాఁడై సన్న్యసించితి నని చెప్పుట చాలును. దీనికి విధిలేదు. హోమాది కర్మములు లేవు. ఆర్తిమాత్ర ముండవలెను. ఆర్తుఁడై సన్న్యాసినైతి నని చెప్పిన

వెంటనే చచ్చినా వానికి దహనాది క్రియలు లేవు. సన్న్యాసులను బూడ్చునట్లు పూడ్చవలయును. బ్రదికినా మరల యథావిధిగా హోమాదులతోడ సన్న్యాస కల్పప్రకారము కర్మకాండము జరుపవలయును.

"ఆతురస్య ప్రైష మాత్రేణ సన్న్యాసస్య పూర్తి శ్రవణాత్ తదుత్తర కాలమేవ మృతస్య ఉపదేశవికలస్యాపి ఖననసంస్కారమేవ కుర్యాత్. జీవితశ్చేచ్ఛిఖాయజ్ఞోపవీతంచ నికృత్య దండకాషాయవస్త్రాదీని చాదాయ సద్గురు మన్విష్య తదుపదేశం గృహీత్వా యతిధర్మా ననుతిష్ఠేత్" ఆతురుడను నార్తితో సన్న్యసించితి ననుటచేతనే సన్న్యాసపూర్తి కలదు, కావున వాఁడు తత్క్షణమందుఁ జచ్చినేని ఉపదేశము లేకపోయినను ఖననసంస్కారమే చేయవలయును. ఆ వల జీవించెనా శిఖాయజ్ఞోపవీతములు వదలి దండము కాషాయవస్త్రాదులు తీసికొని సద్గురు నొద్దకుఁబోయి యాయనచే మంత్రోపదేశము గొని యతిధర్మమం దుండవలెను.

ఇట్లులే యార్తప్రపన్నునకు కే విధియు నక్కఱలేదు. కాని యావల వాఁడు జీవించెనా యథావిధిగా దేవతాసన్నిధానమందు సదాచార్యునిచే మంత్రోపదేశము గొని స్వవర్ణాశ్రమధర్మములను దప్పక జరుపవలెను. విభీషణుఁడు, ద్రౌపది, అర్జునుఁ డిట్టి కష్టదశయందు విధిరహితముగఁ బ్రపత్తి చేసి యావల నియమములు జరపినవారే. కావునఁ బ్రపన్నుఁడు వర్ణాశ్రమాచార రహితుఁడై యావజ్జీవము నాస్తికుఁడై చరింపవచ్చునని ప్రపత్తి శాస్త్రములు చెప్పవు. ఆర్తి కలిగి ప్రపత్తి చేయువానికి విశ్వాసము, పారతంత్ర్యము ముఖ్యములు. దృప్తుఁడైన ప్రపన్నునకు నన్ని యనుష్ఠేయములే. నాకు దాసుల మనువారు నా యాజ్ఞ నుల్లంఘింప వచ్చునా? శ్రుతులు, స్మృతులు నా యాజ్ఞా వచనములు. వాని నతిక్రమించి స్వేచ్ఛగా వర్తించువాఁడు నా భక్తుఁ డెట్లగును? ప్రపన్నుఁ డెట్లగును? నీ యందు నాకుఁ బ్రేమ గలదు, గాని నీవు చెప్పినమాట వినను అనిన నేమి యర్థము - అని రామచంద్రమూర్తి యభిప్రాయము.

'యోజనలు సేయు తెలుఁగుల వ్యూహములను నుపమలం దేని నప్రమత్తుండనై యుండవలయు'నని కర్మమం దెక్కువ నిష్ఠగల నీ కంటెను, "జాంబవాం స్త్వర్థ సంప్రేక్ష్య శాస్త్రబుద్ధ్యా విచక్షణః" అని జ్ఞానయోగనిష్ఠగల జాంబవంతుని కంటెను, 'భక్తిశ్చ నియతా వీర' నియమముతోఁ గూడిన భక్తి యని చెప్పి భక్తిమార్గ నిష్ఠుఁడైన హనుమంతుని కంటెను, 'రామచంద్రునిన్ శరణము చొచ్చితి' ననిన విభీషణుఁడే నాకు విశేషముగఁ బరిగ్రహింపఁదగినవాఁడు. హనుమంతుఁ డంత శ్రమము పడినఁగదా యతనికి నన్ను సమర్పించుకొంటిని. విభీషణుని 'శరణం గతః' శరణు చొచ్చితి నన్న

రెండు మాటలలోనే గ్రహింపఁదలచితిని. కావున కర్మయోగులు, ఆత్మ జ్ఞానయోగులు, భక్తులు నాకుఁ బ్రియులే యైనను ప్రపన్నులు వారికంటె నాకిష్టులు. కావున నెప్పుడు శరణను మాట నా చెవిని బడెనో యభయ మని యప్పుడే యంటిని. వీరు చంటిబిడ్డలవంటి వారు.

సుగ్రీ—నేను రాజ్యకాంక్ష నిన్నాశ్రయించితి నంటివి సత్యమే. నేను గాదనను గాని విభీషణుఁడు "తానును రాజ్యము వేఁడుపొంటె నీయెడకుఁ దారసిలెన్ మతి పూర్వకంబుగన్" (౩౬-౨౫) అని మీా హనుమంతుఁడే కదా చెప్పెను.

రామ—అది చెప్పినవాఁడు హనుమంతుఁడేకాని, విభీషణుఁడు గాఁడు. విభీషణుఁడు నాయభిప్రాయ మిది యని హనుమంతునకుఁ జెప్పలేదు. విభీషణు రాకకుఁ బ్రయోజనముఁ గల్పింపఁగోరి తన యూహచేఁ దనకు విభీషణుఁ డుపకారము చేసియుండుటచేఁ బ్రత్యుపకారబుద్ధిఁ జెప్పెను. సుగ్రీవా! నేను నిన్నాక్షేపించుచున్నా నని తలఁపకుము. ప్రపత్తిలక్షణము విభీషణుఁడు ప్రపన్నుఁడను విషయము నీకుఁ దెలిపి నీ సందేహమును బోఁగొట్టఁ జెప్పుచున్నాను. ఇప్పుడు నీవు నాకింతటి మిత్రుఁడవుగదా. ఎన్ని విధముల నన్ను నీవు పరీక్షించి నాయందు నీవు విశ్వాసముగల వాఁడవైతివి. రెండవనారి యుద్ధమునందు వాలిని నేను జంపువఱకు నీ సందేహము తీరలేదుకదా! విభీషణుఁడో నాయం దింతటి దృఢవిశ్వాసము లేకుండిన జంకు గొంకులేక నేను దండింతునో, నిరాకరింతునో యను భయము లేక చివాలున లేచి తన పూర్వపరిచితు లగు నాప్తుల యొద్దకువచ్చినట్లు వచ్చెనే! అది నీవాలోచింప వలదా? నీది గుణకృతదాస్యము. నా గుణముల బరీక్షించి దాసుఁడవైతివి. అతనిదో స్వరూపప్రయుక్త దాస్యము. గుణకృతదాస్యమున కంటె స్వరూపప్రయుక్తదాస్యమే కదా శ్రేష్ఠము. ఈ కారణముచే నూతనముగఁ బుట్టిన దూడయందలి ప్రీతిచే దానికి ముందుపుట్టిన దూడను ఆవు పొడిచి తన్నినట్లు నేను నీ పక్షము నిరాకరించి యతని పక్షమునే మాటలాడు చున్నాను. సుగ్రీవా! నాకు శరణాగతుఁడైనవాఁడు వెంటనే నాయొద్దకు రాకుండ నీ వడ్డుపడుటచే నింతకాలముగ నయ్యో! నిరాధారముగ నాకాశ మున నిలఁబడియున్నాఁడు గదా యని నామనస్సెంత పరితపించుచున్నదో నీ వెఱుఁగవు కదా.

సుగ్రీ—నాకుఁ జేసిన శరణాగతి వ్యర్థము పోరాదంటివి గదా. నేను నీ యొద్దకు విభీషణుకంటె పమీాపముగ వచ్చితిని, చేతులు జోడించితిని, నాయభిప్రా యము చెప్పితిని. విభీషణువలన నాకుఁ జావులేకుండఁ గాపాడు మంటిని. ఇంత దూరము నేను వినయముతో మనవిచేసినను నా శరణాగతి వ్యర్థము చేయుచున్నావేల?

రామ—విభీషణు శరణాగతికంటె నీది వెనుకటిది, దానికి విరుద్ధమైనది. అతనికి నా ప్రాప్తి లేకుండఁ జేయవలయు నని నీ సంకల్పము. ఆయనవలన నీకు భయము లేదు. నే నెఱుఁగుదును. నీది యస్థానభయము. దానికి నీ యూహాతిప్ప దగిన కారణము లేదు. ఒక భాగవతుఁడు చేసిన శరణాగతికి విరుద్ధముగ మఱియొకఁడు చేయు శరణాగతి ఫలింపదు, నీమేలు నీవు కోరవచ్చును. ఇతరులకుఁ గీడు గోరరాదు. ఒకఁడు చెడవలె, నేను బాగుపడవలె నను తలంపు సరిగాదు.

సుగ్రీ—రామచంద్రా! ప్రపత్తి యుపాయమా? యుపేయమా? ఉపాయమంటివా కర్మజ్ఞాన భక్తులకు దానికి నేమి భేదము? దాని వైశిష్ట్య మెట్లు?

రామ—ఒక సాధనముచే మఱియొక వస్తువును సాధించునెడల నా సాధనము పాయమనఁబడును. ఒకఁడు పండును కత్తితో ముక్కలుగాఁగోసి తినును. కత్తి సాధనము, పండు సాధ్యము. కత్తి యుపాయము, పండు ఉపేయము. కర్మజ్ఞాన భక్తులు భగవత్ప్రాప్తి యను ఫలమునందు నీ కత్తివంటివి. మఱియొకఁడు పండునే యెత్తి నోటఁగఱచుకొని భుజించెను. వానికిఁ గలిగిన ఫలమే వీనికి గలిగెఁగదా. వీనికి సాధన మేది? సాధ్యమేది? సాధనమే లేదంటివా, పండు పండుగా నుండవలసినదే, వీఁడు వీఁడుగా నుండవలసినదే. కావున సాధనమునకు సాధ్యమునకు భేదములేదు. అట్లులే ప్రపత్తికి, నాకు భేదములేదు. కావునఁ బ్రపత్తియే నేను, నేనే ప్రపత్తి. నన్నాశ్రయించుటే ప్రపత్తి నాశ్రయించుట. నిన్ను సాధించుటకు నాకు వేఱుపాయము-సాధనము లేదు. నీవే యుపాయము-సాధనము గమ్మని ప్రార్థించు జ్ఞానమే రూపముగాఁగలది ప్రపత్తి. గత్యర్థకము లన్నియు జ్ఞానార్థకములు గదా.

సుగ్రీ—అట్లైన నచేతనమగు జ్ఞానము చేతనుఁడ వగు నీ వెట్లగుదువు?

రామ—వానికిఁ దీపను జ్ఞానము లేదు, తెలుపను జ్ఞానము లేకుండువుగదా. తీపు తెలుపు జ్ఞాన మెట్లగు నని నీవనెదవు? జ్ఞానమునకు వన్నె రుచి కలవా? అట్లులే నాకును, బ్రపత్తికి నభేదము చెప్పఁబడును, ప్రపత్తికి నేను విషయము. నేనే యుపాయము. కావున నన్ను సాధించుటకు నేనే యుపాయ మగుదునుగావున నభేదము

సుగ్రీ—రామచంద్రా! నీవు ప్రపన్నున కభయము ఘటియించెద నంటివి. అంతకు ముందు లేనిదానినేఁగదా నీవు క్రొత్తగాఁ గలిగించితివి. "ఉత్పన్నస్య వినాశయోగాత్" ఏది యుత్పన్న మగునో యది నాశ మగును. అను న్యాయముఁ బట్టి నీ విచ్చు ముక్తికి నాశము కలదుగదా.

రామ—సుగ్రీవా! జీవులు నిత్యులు. "అపహతపాప్మా విజరో విమృత్యు ర్విశోకో విజిఘత్సోఽపిపాస" యన్నట్లు జరామరణాదులు లేనివారు చేతనులు, ఇవి జీవుల స్వరూప స్వభావములు. ఇట్టి జీవులు ప్రకృతికి వశపడి దాని బలముచేఁ

దమ గుణములను మఱచి తమ్ముఁ జచ్చువారిగాఁ, బుట్టువారిగాఁ దలఁచుచున్నారు. ఈ ప్రకృతి బాధ తొలఁగిపోయెనేని మఱల యథాపూర్వము స్వప్రకాశముతోఁ బ్రకాశింతురు. అద్దము ప్రకాశించునదే, అది మురికి వలనఁ బ్రకాశము మఱుఁగుపడి యున్నది. ఈ మురికి దాని ప్రకాశము వెలికి గానరాకుండఁ జేసినదే కాని, దాని ప్రకాశమును రూపుమాపఁ జేయలేదు. కుండలో దీప ముంచితిమేని దీపకాంతి వెలికి రాకుండఁ గుండ జేయఁగలదు గాని దీపమునకు గాంతి లేకుండఁ జేయఁజాలదు. అట్లే ప్రకృతియు జీవునికి స్వరూప స్వభావనాశము గలిగింపఁ జాలదు. మఱుఁగు పఱుపఁగలదు. మఱుఁగు తొలఁగి పోయిన మునుపటివలె నుండును. క్రొత్తగా వచ్చినది లేదు. ప్రపత్తి ఈ ప్రకృతిని దొలఁగించును. అది చేయు కార్య మంతియే. ప్రకృతి తొలఁగిపోవుటచేఁ బ్రపన్నుఁడైన జీవుఁడు తన స్వస్వరూపముతోఁ బ్రకాశించును. కావున నే నభయము ఘటియింతు ననఁగా భయకారణము తొలఁగింతుననియే యర్థముగాని, యభయ మను క్రొత్తదాని నెక్కడనుండియో తెచ్చి యిచ్చెదనని యర్థము కాదు. నీవు యువరాజవై యుంటివి. వాలి యను ప్రతిబంధము నీకా సుఖము లేకుండఁజేసెను. నే నా ప్రతిబంధము దొలఁగించితిని. నీ పూర్వస్థితికి నీవు వచ్చితివి. నీకు నేను క్రొత్తగా వానరరాజ్యమును, రుమను దెచ్చి యిచ్చితినా?

ఈ విషయమున "స్వేనరూపేణాభినిష్పద్యతే- ఆవిర్భూత స్వరూపస్తు- అవబోధాదయో గుణాః" అనియు "ప్రకాశ్యంతే న జన్యంతే నిత్యా ఏవాత్మనో హి తే" యనునవి ప్రమాణములు. ఆత్మలు నిత్యములు కావున వాని కాస్థితియు నిత్యమే. కావున ముక్తియు నిత్యమే.

సుగ్రీ— ఈ ముక్తుఁడు మఱల సంసారముపాలఁబడిన నీ వేమి చేయఁగలవు? ముక్తికి హాని రాలేదా?

రామ— ఏటిప్రవాహమునం దొకఁడు కొట్టుకొని పోవుచుండ లాగి యొడ్డున వేసితిని. మరల వానిని నీళ్ళలోఁ ద్రోయుదునా?

సుగ్రీ— వాఁడై పడిన నీ వేమి చేయఁగలవు?

రామ— నా సంకల్పము లేక గడ్డిపోఁచయుఁ గదలదు. ప్రపన్నుఁడు ముక్తుఁడు కావలయునని సంకల్పించి ముక్తునిఁ జేసితిని. నా సంకల్పమునకు విరోధముగ మరల సంకల్పించుటకు నేను వెఱ్ఱినా? చపలచిత్తుఁడనా? అట్లెప్పటికి జరగదు.

న పునరావృత్తి శబ్దాత్ న పునరావృత్తి శబ్దాత్ - బ్ర. సూ.

యద్ గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ. భ. గీ. ౮-౨౧.

సుగ్రీ—తక్కిన యుపాయములకంటెఁ బ్రపత్తి శీఘ్రఫలద మంటివే. అది యెట్లు?

రామ—నీవు మామిడిపండు తినవలయునని కోరిక గలిగి పండెత్తుకొని నోరఁబెట్టుకొంటివి. మఱియొకఁడు అట్టిపండే తినవలయునని కత్తిని సంపాదించుకొని దానిని జక్కఁబఱచుకొని చేతిని గోసికొందునో యని మెల్లగా పండును ముక్కలుగాఁ జేసి ముందుంచుకొని యొక్కొక్క ముక్కయే తిన నారంభించెను. ఫలము రుచి శీఘ్రముగ ననుభవించిన వారెవరు? నీవే కదా. అట్లే ప్రపత్తి యనఁగా నాప్రాప్తియే, నన్ననుభవించుటయే. కావునఁ బ్రపత్తిచేసిన నిమిషము మొదలు వానిని నేను రక్షించువాఁడనే. తక్కిన వట్లుగాదు గదా!

సుగ్రీ—రామచంద్రా! ధనధాన్యాదులఁ గోరువారు నిన్ను నిర్బంధించుచున్నారంటివి. వారు చేయునది యాచనయే. విభీషణుఁడు శరణు వేఁడెను, ఇదియు యాచనయే. అది నిర్బంధ మైనపుడు. ఇదియేల నిర్బంధము కాదు?

రామ—అతిథి యెవఁడైన వచ్చునా యని యన్నదాత వగు నీ వెదురు చూచుచుంటివనుకో. నీ భోజన సమయమునకు సత్పురుషుఁడు వచ్చెననుకో, వాని కన్నము పెట్టుట నీకు నిర్బంధముగాఁ దోఁచునా? మఱియొకఁడు త్రాగఁబోతు నాకుఁ బదిరూపాయ లిమ్మని వాకిట ధారణ పండుకొనెననుకో! ఇచ్చుటకు నీ కిష్టము లేదు. ఇది నిర్బంధ పఱుచుట కాదా? ఈయిరువురను నీవు సమానముగాఁ జూతువా? అట్లే నేనును రక్షించుట యనునది నాకు స్వభావధర్మము. కావున నెవఁడైన రక్షింపుమని కోరునా యని నే నెదురు చూచుచుందును. ఇట్టిచోట నొకఁడు నన్ను రక్షింపుమని తన యభిప్రాయముఁ దాను దెలిపిన నాకుఁ గష్టముగాఁ దోఁచునా? ధనము, ధాన్యము కోరువారి విషయము మట్టిదికాదు. ధనధాన్యాదులఁ గోరువారు వానివలనఁ గలుగు కీడు నాఱుఁగరు, నే నెఱుఁగుదును. వానివలన వారు ముక్తికి దవ్వైపోదురు. కావున వారి కది యిచ్చుట నాకభిమతము గాదు. కావున నది నిర్బంధ మంటిని. వేఁడుట యనఁగాఁ దన యభిప్రాయము తెలియఁజేయుట. ప్రపన్నుఁడు తెలియఁజేయువలసిన దింతయే; ఒకఁడు నీయొద్దకు వచ్చి 'యయ్యా నీవు నాకు జీతము బత్తెమియ్యవలసిన పనిలేదు. నీకొలువు చేయుచుండెద' ననును, ఇది నిర్బంధించుట యగునా?

విభీషణునియందు ప్రపత్తి లక్షణపూర్తి గలదా?

ఆనుకూల్య సంకల్పము, ప్రాతికూల్యవర్జనము, రక్షించు నను విశ్వాసము, గోప్తృత్వవరణము, ఆత్మనిక్షేపము, కార్పణ్యము- ఈ యాఱును ప్రపత్తి కంగములు. ఇవి విభీషణునియందుఁ గలవు. సర్వభూతహితము ఆనుకూల్య సంకల్పము. సర్వము భగవంతునకు శరీరము కావున నెవరిని హింసింపకుండుట

ఆనుకూల్య సంకల్ప మగును. ఇది విభీషణునియందుఁ గలదనుటకు, "ఉ. అన్నవు నీ వటంచు హిత మారవచించిన యట్టి నానుడుల్, మన్నన సేయవైతి విఁక లంకకు రాక్షససంఘ యుక్తమున్, నిన్నును లెస్స కాచుకొని నెమ్మదినుండుము స్వస్తి నీకగున్, నన్నెడఁబాసి సౌఖ్యము ఘనంబుగ నందుము పోయివచ్చెదన్ (౩౧౬ ప.) అను దానిని లక్ష్యముగాఁ బూర్వాచార్యు లుదాహరించి యిట్లు సమర్థించిరి.

నన్నెడఁబాసి సౌఖ్యమందు మనునది సౌత్రిహాకువు మాటయే కాని నిండుమనస్సుతోఁ జెప్పినమాటగాదు. నీవు చచ్చుట సిద్ధ మనియే వాస్తవార్థము. ఇట్టిది యానుకూల్య సంకల్ప మగునా యని శంక.

శత్రుఁడైనను, మిత్రుఁడైనను, నుదాసీనుఁడైనను సర్వము భగవచ్ఛరీరమను తత్త్వజ్ఞానము గలిగి హింసించు మానినేని యానుకూల్య సంకల్ప మగునుగాని, అన్నవుగాన నీకు హితము చెప్పితిని అని చెప్పుటచేఁ దన కర్తవ్యము తాను నిర్వహించినవాఁ డయ్యెగాని, తత్త్వజ్ఞానమునకు నెడము లేదు. అయినను రావణుఁడు దుష్టుఁ డగుటచే నతివియందు నన్న యను గౌరవము విభీషణునకు లేదు. తండ్రియైనను జారుఁడయ్యెనేని వానియందుఁ దండ్రియను గౌరవ ముంపరాదనికదా భారతము చెప్పుచున్నది. అట్లుండఁ బరమ దుర్మార్గుఁడయి బుధుఁడు తన తల్లియగు రోహిణిని బట్టినట్లు జగన్మాతయగు సీతనుగూడఁ జెఱపట్టించిన వానియందు సోదరప్రీతి యెట్లుండఁగలదు. ఆ కారణముచే కండి గర్వముననో, యజ్ఞానముననో యకార్యములు చేయు గురువునైనను శాసింపవలసిన దనియే శాస్త్రము చెప్పుచున్నది. కావున రావణుఁడు దండ్యుఁడే కాని, వంద్యుఁడు కాఁడు. కావున శత్రుకోటిలోఁ జేరినవాఁడే (౧౭౮వ పద్యంబున నీవు చేసినది ఆయువు, సంపద, కీర్తి సర్వము నాశముచేయునది యని రోసి పలికెను. అదియునుగాక యింద్రజిత్తుతో విభీషణుఁడు (౨౦౧౮- ౨౦౧౯- ౨౦౧౬- ౨౦౧౭- ౨౦౧౮ పద్యములందు) రావణు దుశ్చేష్టలును, రావణుని దాను విడిచిన కారణము స్పష్టముగఁ జెప్పెను. అదియునుగాక రావణ వధానంతరము (౨౯౦౧౯) పద్యమునందు) భ్రాతృరూపముగొన్న పరమవైరి యని యిట్టిమాటలు చెప్పెను. ఈ కారణముచే సీతాహరణము మొదలు రావణునందు విభీషణునకు భ్రాతృభక్తి లేదని స్పష్టపడుచున్నది. ఇట్టులుండియు వానికి హిత ముపదేశించుట యానుకూల్య సంకల్పముచేతనే యనియు, భ్రాతృభక్తిచేఁ గాదనియు నిర్ణయించిరి.

ప్రాతికూల్య వర్జన మనఁగా హింసింప శక్తియుండియు హింసింపకుండుట 'శీతో భవ' అగ్నిహోత్రుఁడా చల్లగాఁ గమ్మని చెప్పు శక్తిగల సీతాదేవి రావణుని 'హతో భవ' చావుము అని చెప్పశక్తిగలిగియు స్వరూపహాని యను

భావములో వానిని హింసింపక సహించి యూరకుండెను. అట్లే విభీషణుఁడును బ్రహ్మచేఁ జావులేకుండ వరమును, బ్రహ్మాస్త్రమును బొందినవాఁడు కావున రావణుని దల పగులగొట్టి యుండవచ్చును. రాక్షసులచే వానికిఁ జావులేదుగదా యనిన చావులేని కబంధుని నింద్రుఁడు చేసినట్లు చేసియుండవచ్చును. అయినను నట్లు చేసినవాఁడు కాఁడు. కావున నాయన యందుఁ బ్రాతికూల్య వర్జనము కలదు. ఇది సరిగాదు. విశేష సహాయ సంపత్తిగల రావణునకు భయపడినాఁడని యేల తలంపరాదని యాక్షేపము రాఁగా హింసాద్యపాయ విరతి యను లక్షణమందు అపాయ శబ్దమునకుఁ బ్రాపకాంతర మని యర్థము కావున తన్నవమానించిన రావణు నిగ్రహింప యత్నించుటయుఁ బ్రాపకాంతర మగును. కావున నట్టిది చేయు తలంపు లేకుండుటే ప్రాతికూల్య వర్జన మని గ్రహింపనగు. పరతంత్ర స్వరూప నాశక మగు స్వయత్నమును మానుటకంటెఁ బ్రాతికూల్య వర్జనము వేఱొక్కటి లేదు. కావున నిచ్చటఁ జెప్పఁబడిన ప్రాతికూల్య వర్జన మిదియే.

మఱియు హింసమానుట, అపాయము మానుట, ప్రాతికూల్య వర్జన మన్నప్పుడు ఆత్మకు బంధకారణము లగుటచే కామ్యకర్మములే హింసా శబ్దమున కర్థమనియు ప్రపత్తిని దప్ప నితరోపాయములందు సంబంధము కలిగించుకొనుట అపాయమనియు జెప్పఁబడెను. కావున కామ్యకర్మములు మాని ప్రపత్తినిష్ఠుఁడగు వాఁడు ప్రాతికూల్యమును వర్జించినవాఁడగును. ఇట్లు చూచినను స్వయత్న త్యాగము ఫలితార్థ మగును. కావున ముందు చెప్పినది దీనితోఁ బొసఁగుచున్నది.

శరణాగతుని రామచంద్రమూర్తి వాత్సల్యంబున రక్షించు నని సీతాదేవి చెప్పి యుండుటను, వాలినిజంపి సుగ్రీవునకు రాజ్య మిచ్చె నని విని యుండుటను శరణాగతుఁడైనచోఁ దన్నుమాత్ర మేల రక్షింపఁడను నమ్మకముతో ముందు వెనుకఁ జూడక యితరాలోచనలు లేకవచ్చుట మహావిశ్వాసమును దెలుపును.

ఇట్టి విశ్వాసము కలుగుటకు నాలుగు కారణములు చెప్పఁబడెను.

"శక్తేస్సూపసదత్వాచ్చ, కృపాయోగాచ్చ శాశ్వతాత్,
ఈశేశితవ్యసంబంధా దనిదం ప్రథమా దపి॥"

శక్తి, సూపసదనము, కృపాయోగము, రక్షకరక్ష్య సంబంధము - ఇవి భగవంతునియందు గల వనుజ్ఞానము విశ్వాసకారణ మగును.

శక్తి యనఁగా దన యాశ్రితుల కార్యములను జక్కఁజేయుటయందు అఘటితఘటనాసామర్థ్య రూపశక్తి. తన యాశ్రితుల కొఱకితరుల కసాధ్యమైన వానిని గూడఁ జేయుట. లోకముల నన్నిటినిజయించిన రావణుని జయించిన వాలిని నొక్కబాణముతోఁ జంపుట యెవ్వరికిని సాధ్య మగు కార్యము గాదు. అట్టి దానిని రామచంద్రమూర్తి చేసెను.

సూపసదనము, అనగా సౌశీల్యము. ఎట్టివారైనను దగ్గఱఁ జేరుటకు సులభుఁడై యుండుట. తాను గొప్పవంశమునఁ బుట్టిన మహారాజయ్యును క్రోఁతులను గ్రద్దలను, బోయలను దగ్గఱఁదీసి వారితో మైత్రిచేయుట సౌలభ్యమును దెలుపును. యక్షరక్షః పిశాచ దానవుల నందఱను కొనవ్రేలితో మీటఁ గలవాఁడు సహాయార్థియై వాలివధముచేసి సుగ్రీవునిఁ బట్టాభిషిక్తునిఁ జేసినాఁడనుట యసంగతము కావున నివి కృపచేఁ జేసినాఁడని పూర్వులు నిర్వహించిరి.

రక్ష్యులైన యాశ్రితులకు రామచంద్రమూర్తి రక్షకుఁ డనునది సుగ్రీవరక్షణమే తెలుపుచున్నది.

ఇవన్నియు విభీషణుఁ డెఱుఁగును గావున రామచంద్రమూర్తియందు విశ్వాసము కుదిరె నని యెఱుంగనగు.

గోప్తృత్వ వరణ మనఁగా నీవు నాకు రక్షకుఁడవని తన యభిప్రాయము దెలుపుట. 'జగచ్ఛరణ్యుతో నాస్థితిఁ దెల్పరే' యనుటచేఁ దన యభిప్రాయము దెలిపిన వాఁడయ్యెను.

'మనుజవరా భవద్గతము మత్సుఖజీవిత రాజ్యభోగముల్' ప. ౩౯౮. అనుటచే ఆత్మనిక్షేపము చెప్పఁబడెను.

కార్పణ్య మనఁగా దైన్యము. 'దైన్యం కార్పణ్య ముచ్యతే' ఇల్లు వాకిలి సర్వము వీడి వచ్చినను నన్ను నిచ్చట వానరులు చంపెద మనుచున్నారే యని భయపడి దీనుఁడై యుండుట కార్పణ్యమును దెలుపును. భయముచే దిక్కుదెలియక పోవుటయే దైన్యము.

శ్రీమద్రామాయణమందలి యీ శ్లోకమునకుఁ జరమశ్లోక మని పేరు. భగవద్గీతయందు శ్రీకృష్ణభగవానులు మోక్షమార్గములు పెక్కులుపదేశించి కడపట "సర్వధర్మాన్ పరిత్యజ్య"యను శ్లోక ముపదేశించిరి. వారి యుపదేశమం దిది కడపటిది. దీనికిఁ దరువాత నేమియుఁ జెప్పినవారు కారు. కావున నిది చరమశ్లోక మనఁబడెను. అట్లులే రామచంద్రమూర్తియు 'సీ సకృదేవ ప్రపన్నాయ' నీవాఁడని యొకపరియో'యని చెప్పి తరువాత నట్టి యుపదేశ మెవరికిని జేసినది లేదు. అదియునుగాక యీ రెండు చరమశ్లోకములందు సమాన విషయములు గలవు. ఎట్లన:— కృష్ణమూర్తి ముందు కర్మ, జ్ఞాన, భక్తి మోక్షసాధనము లుపదేశించి పిమ్మటఁ బ్రపత్తి నుపదేశించెను. ఇందు శ్రీరామచంద్రమూర్తి సుగ్రీవుని కర్మవాదము, జాంబవంతుని జ్ఞానమార్గము, తక్కిన వానరుల రాజనీతి ఖండించెను. హనుమంతుని భక్తిమార్గము కొంత యామోదించి యంతకు మేలయిన దని తన ప్రపత్తి మార్గము బోధించెను.

అచ్చట దాయాదులవలన రాజ్యము సంపాదింపఁ గోరిన వాని కుపదేశింపఁబడెను. ఇందు నంతియే. అచ్చట యుద్ధము నుపక్రమించు సందర్భమునఁ జెప్పఁబడెను ఇచ్చట నంతియే.

అచ్చట శోకనివృత్తికై చెప్పఁబడెను. ఇచ్చటను శోకనివృత్తికై చెప్పఁబడెను. అచ్చట చెప్పినవాఁడు రాజవంశమందుఁ జేరినవాఁడు, ఇచ్చటను రాజవంశజుఁడు.

అచ్చట నాకేది శ్రేయస్కరమో దానిని జెప్పుమని యర్జునుఁ డడిగెను. ఇందును నా శ్రేయస్సునుగోరు మీరు తెలిసికొనవలసినదానిని జెప్పెదను. "శ్రుత మిచ్ఛామి తత్సర్వం భవద్భిః శ్రేయసిస్థితైః" అని చెప్పెను.

అచ్చట స్వధర్మము మేలా, పరధర్మము మేలా యను ధర్మవిచారము చేయఁబడెను. ఇచ్చటను జేతునకు స్వధర్మమైన ప్రపత్తి మేలా? పరధర్మమైన రాజనీతి మేలా - యని చర్చింపఁబడెను. ఇది సామ్యము.

ఇఁక రెంటికిని భేద మేమనిన :—

భగవద్గీత చరమశ్లోకము తేరిమీఁద నుండువానికిఁ దేరిమీఁద నుండువాఁ డుపదేశించెను. ఇది రాజసమును సూచించును. ఇందు నేలమీఁద నుండువాఁడు నేలమీఁద నుండువానికి నుపదేశించెను. ఇది సత్త్వమును సూచించును.

అందు 'మాం శరణం వ్రజ' నన్ను శరణు పొందు' మనునది యాజ్ఞగాఁగాన వచ్చుచున్నది. ఇందు 'ఆనయైనం' సనుటచే చేతనుఁడు తానై సమ్మతించి చేయునట్లుగాఁ జెప్పఁబడినది. అందు సర్వధర్మాన్ పరిత్యజ్య' యని ప్రపత్తికి విరోధులగు సర్వమును వదలిపెట్టమని బోధింపఁబడెను. ఇందును భార్యను బిడ్డలను, లంకను, సిరిని సర్వము వదలి వచ్చినవాని గుఱించి చెప్పఁబడెను. కావుననే యచ్చట నుపదేశముగొన్న యర్జునుఁ డుపదిష్టార్థము మఱచెను. ఇచ్చట విభీషణుఁడు చక్కఁగాఁ గాపాడుకొనెను. అది పదునాఱువేల భార్యలుగలవానిమాట. 'షోడశ స్త్రీ సహస్రాణి ఇచ్చట నేకపత్నీవ్రతస్థునిమాట. తాను నియమమందు నిలచి యితరులకు నియమమును బోధించెను. ఇచ్చట బోధము, ఆచరణము, రెండును గలవు.

అందు ముందుమాట చెప్పి పిదప నేదైన యుపాయముచేఁ దప్పించుకొను నమ్మరానివానిమాట. కృష్ణవాక్యము అను పేరు తెచ్చుకొన్న వానిమాట. ఇచ్చట రాముం డిరుమాట లాడరాఁ డని పేరు తెచ్చుకొన్నవాని మాట. ఒక్కమాట ఒక బాణము వాఁడుగదా రామచంద్రమూర్తి. అది ములుకోలఁబట్టుకొని గుఱ్ఱములఁ దోలినట్లు భీమార్జునాదులచేఁ దన కార్యము చేయించుకొన్నవాని మాట.

ఇచ్చట చేత విల్లుధరించి స్వయముగాఁ గార్యము నిర్వహించినవానిమాట.

అందు శరణాగతుని యధ్యవసాయము చెప్పఁబడెను. ఇందు శరణ్యుని యధ్యవసాయము చెప్పఁబడెను.

అందు శరణాగతునిఁ 'మోక్షయిష్యామి' 'వదలిపెట్టెద' ననెను. అట్లులే కృష్ణుఁడు తన నిర్యాణానంతర మర్జునుని గవ్వకుఁ గొఱగానివానిని జేసెను. రామచంద్రమూర్తి చిరకాలము ప్రభునై యుండ ననుగ్రహించెను.

అది భీష్మ ద్రోణ భగదత్తసైంధవ వధాదులందు రాజనీతి ననుసరించిన వానిమాట. ఇది తన ప్రాణాపదయందును - శత్రువు చేచిక్కినపుడు ధర్మమందే నిలచిన వానిమాట.

అది నరకాసురునింటఁ జెఱఁబడిన కన్యకలఁ బరీక్షింపకయే గ్రహించిన వానిమాట. ఇది పరీక్షించి సర్వదేవతల సమ్మతి గ్రహించిన వానిమాట.

అందు శరణాగతుని చేపీడువాఁడగాను అని, వదలను అని చెప్పెను. అట్టులే స్థిరముగ నిలిపెను.

అందుఁ బాపములన్ని పోవునట్లు చేసెద ననెనేకాని, ప్రసన్నుని స్వీకరించెద ననలేదు. ఇందు దోషము లున్నను స్వీకరించెద ననెను.

అందుఁ గాలాంతరమున నదృష్టఫలము చెప్పఁబడెను. ఇందు సద్యఃఫలమైన దృష్టఫలము ప్రత్యక్షముగఁ జూపెను.

అచ్చట నర్జును విషయమును ప్రతిబంధకులు లేకుండఁ జూచి రక్షించెద నని చెప్పఁబడెను. ఇచ్చటఁ బ్రతిబంధకు లుండినను వారి నిరాకరించి రక్షింపఁ బడినవిధము చెప్పఁబడెను.

అది ప్రజాక్షయము చేయఁబూనిన వానిచేఁ జెప్పఁబడినది. ఇది ప్రజాభివృద్ధి చేయఁబూనిన వానిచేఁ జెప్పఁబడినది.

ఈ కారణములచేఁ గరుణాకాకుత్స్థుఁ డని పేరొందిన శ్రీరామచంద్రమూర్తి వాక్యమునందే యెక్కువ మెఱుఁగు కానవచ్చుచున్నది.

ఈ విధముగ శరణాగతిని గుఱించి విశేషముగా బోధించుటచే శ్రీమద్రామాయణమునకు దీర్ఘశరణాగతి యని పేరు వచ్చెను. అనఁగా నాది నుండి యంత్యము వఱకు శరణాగతియే పలుతావులఁ జెప్పఁబడెను. ఈ విషయము బాలకాండమందు వ్రాయఁబడెను.

ఉ. పొమ్మిక తెమ్ము కంజహితపుత్రక ! వాఁడు విభీషణుఁడ యేన్
సమ్మతి రావణుండ యయి సన్నిదు మే నభయం బొసంగితిం
దెమ్మట వాని నన్న రఘుధీరదయాగుణచోదితాత్ముఁడై
సమ్మద మార దాశరథి సత్తముతోఁ గపినేత యిట్లనున్. ౩౦౪

అర్థములు. కంజహితపుత్రక = సూర్యనందనా! ఒసంగితిన్ = ఇదివఱకే యిచ్చితిని, చోదితాత్ముఁడు=ప్రేరింపఁబడినవాఁడు, కపినేత = వానరరాజు.

రామచంద్రమూర్తి తన వ్రత మిది యని చెప్పఁగా సుగ్రీవుఁడు మరల నేమియుఁ జెప్పకుండుటయే గాక కలఁక దేఱిన ప్రసన్నముఖము గల వాఁడగుట చూచి యితనిసందేహము దొలఁగినదని రామచంద్రమూర్తి తెలఁచెను. విభీషణుండయేన్ సమ్మతి=వాఁడు వాస్తవ విభీషణుఁడే యూయెనా సంతోషమే, అటు గాక రావణుఁడే యాయెనా యెక్కువ సంతోషము. ఏలనః—విభీషణుని రక్షించి

తినా విభీషణుఁడు ధర్మాత్ముఁడు గావున రాముఁడు రక్షించెను. అంతేమి విశేషము గలదని లోకులందురు. రావణునే రక్షించితినా, అంతటి పరమ ద్రోహిని గూడ శరణనఁగానే రాముఁడు రక్షించెఁగదా యని లోకులు మెత్తురు. విభీషణుని రక్షించితినా, ఏపురను మాత్రమే రక్షించినవాఁడ నగుదును. రావణుని రక్షించితినా లంకనంతయు నాబాలగోపాలము రక్షించిన వాఁడ నగుదును. అప్పుడు కరుణాత్ముఁడు రాముఁడను పేరు సార్థక మగును.

రావణుండయినన్ = ఏ రావణుని దుర్వర్తనము తలఁచి వాని తమ్ముఁడను కారణముతో విభీషణుని గూడ నీవు సందేహించు చున్నావో యట్టి రావణుఁడే వచ్చి యుండినను మిగుల సమ్మతము.

అర్థములు. అభయం తేఽసంగితిన్ = నీ వీయవల దని చెప్పుచున్నావు. నీరు పోయిన తరువాత సేతువు కట్టుచున్నావు. ఆ కార్య మప్పుడే ముగిసినది. దానిని నిర్వహింపవలసిన భారము మీయందున్నది. ఏన్ = నేను, రక్షించుట నాకు విధి. విధికృత్యము చేయక యూరక సోమరినై యెవఁడైన శరణు అనునా రక్షింతునా యనియే కోరుచున్న నేను.

తెమ్ము=నాస్థితి రామచంద్రునితోఁ దెలుపుఁడీ యని మిమ్ముఁ బ్రార్థించెను. ఆ ప్రార్థన చక్కఁగాఁ జెల్లింపవలసిన భారము మీయందున్నది. నేనభయ మిచ్చితినంటిని. అది నెరవేర్పవలసిన భారము మీయందున్నది. నీవు పిలుచుకొని రాకపోయిన నేనే పోవలసి వచ్చును. మీ పురుషకారము వ్యర్థమై మీ రా ఫలమును బోఁగొట్టుకొన్న వారగుదురు. ధీరదయా గుణచోదితాత్ముఁడు=శత్రువును దగ్గఱ చేర్చుకొనెద ననుచున్నాఁడే ఏమి యీయన దయ, ధైర్యము! మే మెక్కడ! తా మెక్కడ? మమ్ము సమాధాన పఱుప నింతదూరము శ్రమించు టెక్కడ? ఏమి యీయన దయ యని యాశ్చర్యపడి యింతటి దయాశాలి సమీపమున నా యట్టి శఠినుఁడు నిలుచుటకుఁ గూడఁ దగుదునా యని తలఁచినవాఁడై; కపినేత=వానర ప్రభువు, ఇట్లనుటచే వానరు లందఱు రాముపక్షమునే యంగీకరించి రని సూచన.

సుగ్రీవాదులు భగవత్ప్రాప్తికిఁ బ్రారబ్ధమువలె నడ్డపడుటచే విభీషణుఁడు దూరమున నిలిచెను. వారిని సమాధానపఱిచి తొలఁగఁ దీయుటకై సుగ్రీవునే పొమ్మనెను.

విభీషణుఁడు వానరుల పురుషకారభూతులఁ జేసెను. పురుషకారము ఫలించె ననుటకై సుగ్రీవునే పొమ్మనెను.

సుగ్రీవ విభీషణులు సమానదశయం దుండువారు. కావున విభీషణుని సుగ్రీవుఁడు పిలుచుకొని వచ్చుటే మర్యాద కావున నాయననే పొమ్మనెను.

సుగ్రీవునకు విభీషణుపట్ల నింకను సందేహమున్నదా పూర్ణముగఁ దొలఁగినదా పరీక్షించుటకై సుగ్రీవునే పొమ్మనెను.

సుగ్రీవుఁడిదప్పు మఱియొకరిని బంపిన నేనాక్షేపించితినని నాయందు సందేహము గలవాఁడైకదా మఱియొకరిని బంపెనని సుగ్రీవుఁడు తలఁచునేమోయని యా సందేహము దీర సుగ్రీవునే పంపెను.

తాత్పర్యము

సుగ్రీవా! నీవే విభీషణునొద్దకుఁబొమ్ము. నీవు రమ్మని సైఁగ చేయవలదు. పోయి పిలుచుకొనిరమ్ము. ఇఁక లెమ్ము. పోయిగాఁగూర్చుండి ముచ్చటలచేఁ గాలము గడపవలదు. ఇప్పటికే చాల నాలస్యమైనది. ఆతని మనస్సెంత తపించుచున్నదో నిష్కారణముగ నేల యాతనికి నట్టి సంకటము గలిగింపవలెను. చేయఁదగిన పనియైన యెడల వెంటనే చేయవలయును. రావణుని తమ్ముఁడే యని నీవు సందేహించితివి. వీఁడు రావణుని తమ్ముఁడైనను సంతోషమే. రావణుఁడే యీ వేషముతో వచ్చియుండినను సంతోషమే. నే నిదివఱకే వాఁడు శరణమన్నప్పుడే నే నభయమిచ్చితిని. మీ చిత్తవృత్తులు దెలిసికొని మీ సందేహము దీర్ప నింత నేపు ముచ్చటలాడు చుంటిని. ఇఁక నీవు వానిని దోడితెచ్చుటే చేయవలసిన కార్యము. అని చెప్పఁగా విని సుగ్రీవుఁ డాయన దయాగుణముచేఁ బ్రేరింపఁబడినవాఁడై సంతోషించి రామచంద్రునితో సుగ్రీవుఁ డిట్లనియె.

ఉ. ఏమి విచిత్ర మిద్ది జగ • దీశ్వర! ధర్మవిధిజ్ఞ! లోకసౌ
ఖ్యామితసక్తచిత్త! యిటు • లార్యనుతోక్తులఁ బల్కుటల్, సదా
ధీమతసత్యమార్గనిర • తిం దృఢసత్త్వయుత ప్రభావముం
భామహితత్వముం గలుగు • ప్రాజ్ఞ వరిష్ఠునకు ప్రయుగ్యమే. ౩౬

అర్థములు. ఇది శరణాగతరక్షణకార్యము, ఏమి విచిత్రము=ఆశ్చర్యకరమైనదికాదు. జగదీశ్వర = ప్రపంచమునంతయుఁ దాఁబుమాఁబు నాపుండ సక్రమముగానుంచు ప్రభువు. ధర్మవిధిజ్ఞ = ధర్మశాస్త్రము నెఱిఁగినవాఁడా, ఏ ధర్మమున వర్తించినచో లోకము సరియగు స్థితియందుండునో దానిని దెలిసినవాఁడవు శరణాగతుల భృత్యులను సంరక్షింప నెట్లు నడచుకొనవలయునో యా విధానము చక్కఁగా దెలిసినవాఁడవు, లోకసౌఖ్యామిత సక్తచిత్త = జనుల సౌఖ్యమందు మిగుల నాసక్తిగల మనస్సుగలవాఁడా! జనుల సౌఖ్యపఱచుటయందుండు నాసక్తి నీసౌఖ్యము నాలోచించుటయందును లేదని భావము. ఇటులు=విభీషణునకైనసరే, రావణునకైననసరే-అభయ మిచ్చితినని చెప్పుటలు, ఆర్యనుతోక్తులు=పెద్దలచేత స్తోత్రము చేయఁబడు మాటలు, పామరుల స్తోత్రము గొప్పగాదు. ఒప్పు తప్పు దెలిసినవారు మెచ్చుకొనుట గొప్ప, సర్వదా = సర్వకాల సర్వావస్థలందు, ధీమత= నీ మనస్సునకు సమ్మతమైన, సత్యమార్గ నిరతిన్ = యథార్థమైన మార్గమందు నడచునాసక్తియును, దృఢసత్త్వయుత ప్రభావమున్=దృఢమైన యధ్యవసాయము గలిగియున్నాఁడన్న కీర్తిని "ద్రవ్యాసు వ్యసనాయేషు సత్త్వమస్త్రీతు జంతుషు" అను

రము. ధామహితత్వమున్ = పరాక్రమముచేఁగలిగిన పూజ్యతను, ప్రాజ్ఞ వరిష్ఠతను = బుద్ధిమంతులలో శ్రేష్ఠునకు, రఘూద్వహ = రఘువంశము నుద్ధరించు వాఁడా, రఘురాక్షస సంవాదమందుఁ జెప్పఁబడిన ప్రకారము శరణాగతుఁడైన రాక్షసుని రక్షించి ప్రసిద్ధిగన్న రఘువంశమునఁ బుట్టిన వారిలో శ్రేష్ఠుఁడా! కీర్తికరమైన వంశమునకు నెక్కువ కీర్తి కలిగించువాఁడవు.

## తాత్పర్యము

సుగ్రీవుఁడు రామచంద్రమూర్తి యొక్క స్వాభావిక కల్యాణగుణములఁ జూచి యాశ్చర్యపడి తానాశ్చర్యపడిన విషయముఁ జెప్పఁబోయి మరల నాలోచించి యీ కార్యము రామచంద్రమూర్తికి సహజమైనది కావున నిందేమి యాశ్చర్య మున్నదని చున్నాఁడు. చరాచర ప్రపంచము నంతయుఁ గ్రమముదప్పి నడవ కుండ శాసించువాఁడవు. ఎట్లు ప్రవర్తించిన నది యట్లు చక్కనిస్థితిలో నుండునో దాని నెఱింగినవాఁడవు. లోకమునకు సమితసుఖ మెట్లు కలుగునా యని యాలోచించుచు నీ సౌఖ్యము గూడ నీవు లక్ష్యముచేయని వాఁడవు. నీ వాప్తసమస్త కాముఁడవై యొకరివలన నీకుఁ గావలసినది యేదియు లేకుండినను వారికి మేలు చేయుటయే ప్రధానకార్యముగ నుంచుకొని యుండువాఁడవు. రాక్షసుఁడు శరణాగతుఁడు కాఁగా రక్షించిన రఘువు వంశమునకు నెక్కువ కీర్తి గలిగించి, దాని నుద్ధరింపఁ బుట్టినవాఁడవు. ఈ లోకమున సన్మార్గమును స్థాపింపఁగోరి యవతరించిన వాఁడవు. దృఢమైన యధ్యవసాయము కలవాఁడని కీర్తిగలవాఁడవు. పరాక్రమ వంతుఁడని పూజ్యత సంపాదించిన వాఁడవు. బుద్ధిమంతు లనిపించుకొన్న వారిలో శ్రేష్ఠుఁడవు. ఇట్టి నీకు గొప్ప గుణములచేఁ బెద్దలనిపించుకొన్న వారలు మెచ్చునట్టి మాటలు, శరణాగతుఁ డెట్టివాఁడైనను వానిని రక్షింతునని చెప్పినమాటలు నీవు జెప్పుటయం దాశ్చర్య మేమికలదు? అల్పు లిటు చెప్పిన మెచ్చఁదగినదే కాని, యింతకు మించినవి ఎన్నైన చేయఁగల నీకు నిది తృణప్రాయము. జగదీశ్వరత్వము లోనగు నొక్కొక్కగుణమే యింతటి కార్యముచేయ సమర్థమగును ఇన్నియుఁగల నీవు చేయుట చిత్రముకాదు.

విభీషణుఁడు శత్రుసోదరుఁడు. ఆయనను స్వీకరించుటచేఁ గీడుకలిగినా తానే కాక తనకు సహాయులై వచ్చిన వారందఱు నాశమగుదురా! ఇట్టి ధర్మసందేహ మందు భారము తన యందేల యుంచుకొన వలయు నని రామచంద్రమూర్తి వానరప్రముఖులతో నాలోచించెను. ఇది ధర్మమే కాని, వారందఱు నొకరు తప్ప నేకవాక్యముగా విభీషణుని స్వీకరింపరాదని చెప్పినపుడు తన కిష్టముండనీ, లేకుండనీ భూయిష్ఠాభిప్రాయప్రకారము (Opinion of the majority) నడువ వలయునా, తన యిష్టప్రకారము నడువవలయునా? ఇది రాజనీతియా? ధర్మ రీతియా? దురభిమానమా? యని సందేహము

### సమాధానము

రాజధర్మమంతయు నామూలాగ్రము వివరించినఁగాని తగిన సమాధానము కుదురదు. ఇప్పటి ప్రజాప్రభుత్వమునకు పూర్వ రాజప్రభుత్వమునకు భేదము గలదు. కావున నుత్తరవీథికయం దిది విశదీకరింపఁబడును.

ఉ. నాకును నంతరాత్మ రఘు ♦ నాయక ! యీతఁడు శుద్ధుఁడంచు నే
ప్రాకటరీతిఁ దెల్పెడిని ♦ భావము చందము నారయం, ద్వద
స్తోకనయుక్తిసూక్తులను ♦ దోరముగాఁ బరికించినాఁడ, లే
దే కలుషంబు వీనియెడ ♦ నెంతయుఁ బూతుఁడు లోన వెల్పలన్. ౩౯౦

అర్థములు. నన్నుఁ బొగడిన మాత్రమున నేమి లాభము? అది క్రియారూపముగఁ బరిణమించి నీ సమ్మతిని విభీషణుని తోడి చెప్పుటచేఁ జూపినఁగదా యందువేమో యని యూశంకించుకొని సమాధానము చెప్పుచున్నాఁడు. నాకును=వీఁడు మోసగాఁడు, చారుఁడు, వీనిని ప్రకారముగఁ జంపవలసిన దని చెప్పిన నాకుఁగూడ, అంతరాత్మ=అంతఃకరణము, అంతరాత్మయును నని సముచ్చయ మావర్తించుకొనవలయును, నాకును, నంతరాత్మయును అని యన్వయము. భావము చందము=వీని స్వభావ లక్షణము, అనఁగా ముఖనయనాదులందలి చిహ్నములు, ఆరయన్=పరీక్షింపఁగా, (౨) ఈతని దీనధ్వనిచే స్పష్టమైన యీతని మృదు స్వభావము, త్వత్=నీయొక్క; అస్తోక = గొప్పదగు, నయుక్తి సూక్తులను=యుక్తితోఁ గూడిన మంచిమాటలను, తోరముగాన్ = విశేషముగ, పరికించి నాఁడన్=పరీక్షించితిని, ఏ కలుషంబు=ఏవిధమైన దోషము, ఎంతయున్=మిక్కిలి, పూతుఁడు=పవిత్రుఁడు, నిర్మలుఁడు, లోన=మనస్సునందు, వెల్పలన్ = బాహ్య చేష్టలందు.

### తాత్పర్యము

రామచంద్రా, వీఁడు ద్రోహి గాఁడు, నిర్మలచిత్తము గలవాఁడని నాయంతరాత్మ చెప్పుటయేగాక, వీని దీనస్వరము నాటకములందలి పాత్రములకువలె సమయోచిత కల్పితమా, స్వతస్సిద్ధమా యని పరీక్షించితిని. ఆ స్వరమునకుఁ దగిన వికారములు ముఖనయనములందుఁ గానవచ్చెను. నీవు యుక్తియుక్తముగాఁ బలికిన మాటలను బరికించినాఁడను. వాస్తవ శరణాగతుని లక్షణము లేవి యని నీవు చెప్పితివో యవి యన్నియు వీనియం దున్నవి. నీవు పరిశుద్ధుఁడని చెప్పిన కారణములు సరిగానున్నవి. వీని నన్నిటిని నాలోచించిచూడఁగా వీఁడు మనస్సునందు, బాహ్యమునందుఁ గూడ శుద్ధుఁడే. వీనియందు వంచన లేదని నిశ్చయించుకొంటిని కావున నా సందేహము తీఱినది.

ఉ. కావున మా సమానుఁడయి ♦ క్రాలుత మస్మిలఁగూడి యుద్ధమే
ధావి విభీషణుండు నభ ♦ తం గని యుం చన హర్ష యుక్తి సు

గ్రీవునివాక్యము ల్విని సుకీర్తి గ్రహించె దశాస్యభ్రాత వే
యా వినతాతనూజసఖ తాఁ స్తి సెనంగిన యింద్రుఁడై వడిన్. ౩౯౧

అర్థములు. మేధావి = బుద్ధి బలము గలవాఁడు, చక్కని యాలోచన గలవాఁడు, కనుకనే కదా తన సోపాధిక బంధువులనెల్ల విడిచి నిరుపాధికబంధు వగు శ్రీరామచంద్రమూర్తి నాశ్రయించెను. బుద్ధిలేనివాఁ డిట్లు చేయునా? మమ్ములఁ గూడి యనుటచే నతఁడు మాతో సముఁడై వర్తించుట నాకేకాదు, వానరుల కందఱకు నమ్మతమే యని భావము. ఇష్ట=ఈ క్షణమందే, ఇదివఱకు దృఢమైన యధ్యవసాయము లేమిచే సత్యాసత్యములు తటాలునఁ దెలిసికొనుటకై లేమిచే నాలసించితిని. ఇఁక నట్లు చేయను. సఖతన్=సఖ యనగా స్నేహితుఁడు. సహాయుఁడు, సమానగుణములు గలవాఁడని చెప్పఁబడువాఁడు సఖుఁడని వ్యుత్పత్త్యర్థము. అట్టివాని భావము సఖత. అనఁగా వీనిని మేము చేయు కార్యములందు మర్మము విడిచి స్నేహభావమునఁ గలిపికొందు మని భావము. హర్షయుక్తన్=శరణాగతుని రక్షించుటయందు వీఁ డిట్లు లక్ష్యపడెనే, కాలవిలంబన మగుచున్నదే, నన్ను నమ్మి వచ్చినవాఁడు రెంటికిఁ జెడిన రేవణునివలె నడుమ నాకాశమునఁ బక్షివలె నుండవలసి వచ్చెనే యని విచారగ్రస్తుఁడై యుండె నని సూచితము. ఇప్పుడు సంతోషించెను. సుగ్రీవుని వాక్యముల్ విని హర్షింపవలయును. హర్షమునకు సుగ్రీవుని వాక్యములు కారణములుగా నుండవలెను. అటుగాక యతని ముఖవికాసము చేతనే హర్షించి తదనుగుణము లైన యతని మాటలు వినె నని భావము. సుకీర్తి=(౧)శరణాగతుని పగవాని తమ్ముఁ డైనను సంశయింపక చేర్చుకొనె నని రామచంద్రమూర్తి కన్వయింపవచ్చును. (౨) ద్వితీయగా గ్రహించి సుకీర్తియగు దశాస్యభ్రాతనని యన్వయించినను నన్వయింపవచ్చును. విభీషణుఁడు రామచంద్రమూర్తి కాశ్రితుఁ డయ్యెను. ఎంతటి బుద్ధిమంతుఁడు ఎంతటి దూరాలోచనముగల వాఁడను కీర్తి సంపాదించెనని యర్థము. సుకీర్తియగు రామచంద్రమూర్తి దశాస్యభ్రాతను వేగ్రహించె నని యన్వయము. దీనివలన సుగ్రీవుఁడు పోయి విభీషణుని బిలిచికొని వచ్చెనని సూచితము. అట్లు వచ్చుచుండువానిని రామచంద్రమూర్తి గ్రహించెను. గ్రహించుట యనఁగా మనస్సుచే నంగీకరించుట యను నర్థముగలదు. అది యతఁడు శరణన్నప్పుడే జరిగెను. కావున నిచ్చటఁ జేతులచేఁ బట్టుకొనుట యనియే యర్థము చెప్పవలసి యున్నది. పట్టుకొనుట యనునది పట్టుకొనువాఁడు చేయు కార్యమే కాని పట్టుకొనఁబడువాఁడు చేయు కార్యముగాదు, కావున రామచంద్రమూర్తియే తన హస్తములతో విభీషణుని బట్టుకొనె నని గ్రహింపవలెను. చేతులతోఁ బట్టుకొనెనని చెప్పక రామచంద్రమూర్తి గ్రహించె ననుటచే రామచంద్రుఁడే నిండారు మనస్సుతో నెదురుగాఁ బోయి, చేయిపట్టుకొని పిలుచుకొని వచ్చెనని భావము. ఇంతవఱకు జరిగిన కాలవిలంబనమునే సహింపకుండినవాఁడు

కావున నాయన తనయొద్దకువచ్చు నాలస్యమును సహింపలేక తానే యెదురుగాఁ బోయెనని గ్రహింపనగు. ఇట్టియభిప్రాయము వాల్మీకికి లేదేని విభీషణుఁడు రాముని యొద్దకు వచ్చెనని చెప్పియుండవలెను. వే=త్వరగా, ఇది కాలవిలంబమును సహింప లేమిని దెలుపుచున్నది. (౨) సుగ్రీవుఁడు కపి, చంచలచిత్తుఁడు. హనుమంతుఁడు కూడ నీకపిత్వము పోలేదని చెప్పినవాఁడు. అట్టివానికి మరల నేదుర్బుద్ధిపుట్టునో యని యట్టిదాని కెడ మీయకుండుటకై వేగముగఁ దానే పోయి గ్రహించెను. ఎట్లన:— వినతాతనూజసఖతా ప్తిన్ = గరుత్మంతునితో స్నేహము లభించుటచే, ఇంద్రుకైవడిన్=ఇంద్రునివలె, గరుత్మంతునకు విభీషణునకు, ఇంద్రునకు రామునకునుపమానోపమేయములు. ఇంద్రుఁడెట్లు గరుత్మంతుని సఖ్యము గోరెనో యట్లు రామచంద్రమూర్తి విభీషణు సఖ్యము గోరెనని భావము. గరుత్మంతుని సఖ్యము గోరినవాఁడు ఇంద్రుఁడే - ఇది భారతములోని "సఖ్యం చానంత మిచ్ఛామి త్వయాసహ ఖగోత్తమ" అంతములేని నీ స్నేహము పక్షిరాజా! గోరుచున్నానని యింద్రుఁడు చెప్పినను వాక్యము దృఢపఱచుచున్నది. భార. ఆది. ౩౩ అధ్యా ౨౬ వ శ్లోకము. ఈసాంగత్యమువలన మేలు పడినవాఁడు రామచంద్రమూర్తియే యని వ్యావహారికార్థమువలనను పారమార్థికార్థమువలనను నేర్పడుచున్నది. వ్యవహారమున బలవంతుఁడు. రావణు మర్మ మెఱింగినవాఁడు, రేపు లంకకు రాజుగాఁ దగినవాఁడు, తన పక్షమునఁ జేరిన లాభకరమని యెంచవగు. యక్షరక్షః పిశాచ దానవులనెల్ల కొనవ్రేల నెగఁజిమ్ము వానికిది గొప్పగాదు. కావునఁ బరమార్థ మేమన దానను సత్పాత్రమువలె రక్ష్యప్రాప్తి రక్షకునకే విశేషశ్రేయస్కరము. రక్షాభారము దనయందుంచుకొనినవానికి రక్షింపఁదగినవాఁడు దొరకఁడేని రక్షకుఁడను నామము నేతి బీరకాయవంటిదే కదా యగును. ఆ కారణముచే భగవంతుఁడు రక్ష్యుఁడు దొరకునా యని యెదురుగా చూచుచుండునని "సర్వజ్ఞోఽపి హి సర్వేశస్సదా కారుణికోఽపిసన్। సంసారతంత్ర వాహిత్వాత్ రక్ష్యాపేక్షాం ప్రతీక్షతే" భగవంతుఁడు సర్వజ్ఞుఁడు, సర్వేశ్వరుఁడు, నిత్యకారుణ్య పూర్ణుఁడు అయినను సంసారమందుఁగల భోగమోక్షములను రెంటిని సాధనములగు నుపాయములకు నిర్వాహకుఁడగుటచేత రక్షింపఁబడఁదగినవారి యపేక్షను దెలిసికొన నెదురు చూచుచుండును. అనఁగా భోగవిరోధులఁ బోఁగొట్టి భోగములనే పూర్ణముగ నియ్య మనెదరా, మోక్షవిరోధుల నణఁచి పునరావృత్తి రహితమైన తన ప్రాప్తినిచ్చి రక్షింపు మనెదరా? యని యెదురుచూచుచుండును. ఇట్టియిరుదెగలవారిలో నిష్కాములైన తన యాశ్రితులను రక్షించుటకై తానే వారియొద్దకుఁ బోవుచుండును. దీనికిఁ బ్రమాణ వాక్యములు—సకాములఁ దనయొద్దకు రమ్మనును. "స్థితే మనసి సుస్వస్థే శరీరే సతి యో నరః, ధాతుసామ్యే స్థితే స్మర్తా విశ్వరూపంచ మామజమ్। తత స్తం మ్రియమాణస్తు కాష్ఠ పాషాణ సన్నిభమ్। అహం స్మరామి మద్భక్తం నయామి

పరమాం గతిం॥" శరీరము, మనస్సు, స్వస్థముగా నుండఁగా వాతపైత్య శ్లేష్మ నాడులు సమముగా నుండఁగా నెవఁడు విశ్వరూపుఁడను, పుట్టువు లేనివాఁడను నగు నన్ను స్మరించునో వాఁడు మరణకాలమందు కఫాదులచే మైమఱచి కట్టె వలె, రాతివలెఁ బడియుండినను అట్టి భక్తుని నేను స్మరించి పరమగతికిఁ దీసికొని పోదును. ఇది శ్రీ వరాహ చరమశ్లోకము.

"సత్యం బ్రవీమి మనుజాః స్వయమూర్ధ్వ బాహుః, యోమాం ముకుంద నరసింహ జనార్దనేతి జీవన్, జపంత్యనుదినం మరణే ఋణీవ, పాషాణకాష్ఠసదృశాయ దదామి ముక్తిమ్" మనుష్యులారా! చేతులెత్తి ప్రమాణముచేసి సత్యము చెప్పుచున్నాను. ఎవఁడు తాను జీవించియుండిన కాలమందే ముకుంద! నరసింహ! జనార్దన! ఇత్యాది నామములచే నన్ను స్మరించునో వాఁడు మరణకాలమున దేహము తెలియక రాతివలెఁ గట్టెవలెఁ బడియుండినను నేను స్మరించి వానికి ముక్తి నిచ్చెదను. ఇది నృసింహ చరమ శ్లోకము.

భగవంతుఁడే తానే గరుడవాహనారూఢుఁడై సీతాదేవిని శ్రీరామచంద్ర మూర్తి విమానమున నుంచి తీసికొని పోయినట్లు ప్రపన్నుని దీసికొని పోవును. ఇది ౨౮౦వ పద్య వ్యాఖ్యయందు వివరింపఁబడును. ఈ ప్రమాణములచే అగతికుఁడై, అకించనుఁడై మరణకాలయందు ప్రాణము వచ్చునో, పోవునో యను దశయందున్న వానివలె రామచంద్రమూర్తి యనుగ్రహించునో నిగ్రహించునో యని సందిగ్ధ దశయందు కదలక మెదలక నోటిమాటలేక నిరాధారముగ నాకాశముననుండు విభీషణుని నుద్దేశించి రామచంద్రమూర్తియే పోయెనని గ్రహింపవలెను. ఆ త్రరక్షణ మందు రామచంద్రమూర్తికిఁగల త్వరాతిశయమును నిది సూచించును.

తాత్పర్యము

ఈ కారణములచే విభీషణుఁ డీ క్షణమందే మాతో స్నేహితుఁడై మాలోఁ గలసి మెలసి, మాతో సమానుఁడై యుండునుగాక. ఇది నాకే కాక వానరు లందఱకు సమ్మతమైన కార్యము అని చెప్పిపోయి విభీషణా! నీకు శ్రీరామచంద్ర మూర్తి యభయ మిచ్చెను, రారమ్ము. అని పిలువఁగా సుగ్రీవుఁడు రామచంద్ర మూర్తి సంతోషించి యతఁడు చెప్పిన మాటలు విని సుగ్రీవుఁడు విభీషణున కెదురుగాఁబోయి యింద్రుఁడు గరుత్మంతునితో స్నేహము చేసినట్లు లతనికై చేతులు చాఁచి స్నేహము చేసెను. ఒక రాకాశమున నొకరు నేల నుండుటచే కరస్పర్శ చెప్పసాధ్యపడదు గానఁ జేతులు చాఁచె నని చెప్పఁబడెను.

— ౧౯వ సర్గము. విభీషణుఁడు శ్రీరాముపదంబులమీఁదఁ బడి తన్ను నివేదింపకొనుట. —

ఉ. అంతట రామభద్రుఁ డభ • యం బొసఁగం గని రావణానుజుం
డెంతయుఁ బ్రాజ్ఞుఁ డౌటను మ • హీస్థలిఁ జూచుచు సన్నతుండు నై

స్వాంతము పొంగ నల్వురు నిజాప్తులతో మత మింటనుండి స
త్స్వాంతుఁడు రాముపాదముల సత్వరుఁడై శరణార్థియై పడెన్. ౨

అర్థములు. ఇంతవఱకు రక్షకునకు శరణాగతిలాభము చెప్పఁబడెను. ఇఁక శరణాగతునకు స్వామి సేవాలాభము చెప్పఁబడును. శరణాగతుని పురుషార్థమిదియేకదా. అంతటన్=రామచంద్రమూర్తి సుగ్రీవుని సమ్మతింపఁ జేసిన పిమ్మట, అభయంబు=సర్వభూతముల వలన భయము లేమి, రావణానుజుండు=రావణునికిఁ దమ్ముఁడైనను వానివలె మతిహీనుఁడు గాక, ఎంతయుఁ బ్రాజ్ఞుఁ డౌటన్=మిగుల బుద్ధిమంతుఁడు గావున, రావణుఁడు ప్రాజ్ఞుఁడు-ప్ర+అజ్ఞుఁడు=బొత్తిగ బుద్ధిలేని వాఁడు. ఇది మంచి, యిది చెడ్డ యని తెలిసికొను బుద్ధికూడ లేనివాఁడు, కుంభకర్ణుఁడు=పెద్దచెవులవాఁడు కావునఁ దాఁకుతప్పులు తెలిసికొను నంతమాత్రము వినికిడి, తెలివి గలవాఁడే కాని కార్యశూరుఁడు కాఁడు. విభీషణుఁడు ఎంతయుఁ బ్రాజ్ఞుఁడు=మంచి చెడ్డలు, మేలుకీళ్ళు తెలిసికొను శక్తిగలవాఁ డగుటయే కాక తెలిసిన దాని ననుష్ఠానమం దుంచు శక్తిగలవాఁడు. మహాస్థలిన్ జూచుచు=రామచంద్రుని నాయన యత్యంతాప్తులు చుట్టుకొనియున్నారు. వారిలోఁ దన కుచితస్థానమేది, ఏచోటికిఁ బోయిన మనము రామచంద్రమూర్తి పాదములపైఁ బడఁగలము అని యాస్థలము వెదకుచు, స్వాంతము పొంగన్=రామచంద్రుని యత్యంతాప్తులలో నేనును గలిసియుండు నంత భాగ్యము గలిగెఁ గదా యని సంతోషముచే నుప్పొంగుచు, సన్నతుఁడునై=మిగుల వినయము గలవాఁడై, ఆకాశము చూచుచు నడచుట గర్విష్ఠుల లక్షణము. నేలచూచి నడచుట వినయ విధేయతలు గలవారి లక్షణము. "దృష్టిపూతం న్యసేత్పాద" మనికదా ధర్మశాస్త్రము చెప్పుచున్నది. కావున వినయముతో నేలఁజూచి వచ్చెను. నిజాప్తులు=తనకు నాప్తులగు మంత్రులు, శరణంబు జొచ్చితిన్ - నా స్థితి వేగఁ దెల్పరే యని విభీషణుఁ డొక్కఁడే శరణు చొచ్చినను శరణాగతుఁడగు వానికి లభించు భగవత్ప్రాప్తి శరణాగతి చేయకుండినను వాని కాప్తులగువారి కందఱకు లభించును గావున దక్కిన నల్వురును రామచంద్రమూర్తిచే ననుగ్రహింపఁబడిరి. ఈ విషయము ముందే వివరింపఁబడెను. ఆప్తులని చెప్పుటచే మెఱమెచ్చులకు ముఖప్రీతికి దాక్షిణ్యమునకు కడుపుకూటికి స్వప్రయోజనార్థము వెంటనుండువారికి లభింపదని భావము. సత్స్వాంతుఁడు=మంచి మనస్సు గలవాఁడు, ఇట్లనుటచేఁ గామాది పీడితుఁడు గాఁడనియు రామచంద్రసేవఁ గోరి వచ్చినాఁడనియు గ్రాహ్యము. సత్వరుఁడై=త్వరతోఁ గూడినవాఁడై, సుగ్రీవుని మాట వినినంత మాత్రముననే, శరణార్థియై = శరణము ప్రయోజనముగాఁ గలవాఁడై, "అర్థః ప్రకారే విషయే వ్యవహారే ప్రయోజనే" ।నానా॥ర॥ అర్థుఁడు కోరిన ప్రయోజనము శరణమే కాని రాజ్యాది కాంక్ష గాదని సూచన. పడెన్=ముందు కూర్చుండి తరువాత మోకాళ్ళు వంచి తరువాత నడుము వంచి తరువాతఁ జేతు

లూని యావల తలవంచి వ్రాలలేదనియుఁగట్టెపడినట్లు సాష్టాంగముగఁ బడెననియు భావము. రాముపాదములను=రామచంద్రమూర్తి పాదముల నుద్దేశించి, ఇది యుద్దేశార్థంబున ద్వితీయ. అనఁగా భగవంతుని ఆచార్యుని నెచ్చటఁ జూచునో యచ్చటనుండియే నమస్కరింపవలెనుగాని సమీపమునకుఁబోయి నమస్కరింతమని యుండరాదు. ఇది స్వామిని దర్శించునపుడు దూరమునుండిచేయు ప్రథమ నమస్కారము.

తాత్పర్యము

సుగ్రీవుఁడు సమాధానపడిన పిమ్మట రామచంద్రమూర్తి సర్వభూతాభయము ననుగ్రహింపఁగా రావణాసురుని తమ్ముఁడైనను మిగుల బుద్ధిమంతుఁడగు విభీషణుఁడు రామచంద్రమూర్తి సన్నిధానమందు నాయన యేకాంతులతోడ నిలుచు భాగ్యము కలిగెఁగదా యని మనస్సు సంతోషముచే నుప్పొంగుచుండ సవినయముగ నేలఁ జూచుచు తన యాప్తులగు నలువురు మంత్రులతో మంచి మనస్సు గలవాఁడు శీఘ్రముగ నాకాశమునుండి దిగి రామచంద్రమూర్తి పాదముల నుద్దేశించి శరణమే ప్రయోజనముగాఁ గలవాఁడై సాష్టాంగనమస్కారము చేసెను.

క. సరగ నిటు ధర్మబుద్ధియు, శరణాన్వేషియు సరాక్ష • సచతుష్కుఁడు నై
చరణముల వ్రాలి ధర్మా, శరముచితైతర్షిహర్ష • శరసూక్తి ననన్. ౧౯-౩

అర్థములు. సరగన్ = శీఘ్రముగ - శీఘ్రు శబ్దభవము సరగు - ధర్మబుద్ధియు=శరణాగతి ధర్మమునందు నిశ్చయమైన మనస్సుగలవాఁడు, వీనిని "గ్రూరంబుగఁ జంపుటయే కృత్య" మన్నప్పుడును, "కావున నమ్మకుఁ డీ విభీషణున్" అన్నప్పుడును, "ఎటులైనఁ జేపిము వాఁడఁగా" నన్నప్పుడును, "మా నమ్మానుఁడై క్రాలు" నన్నప్పుడును, నిట్టి సర్వావస్థల యందు బుద్ధిని చెదరనీక స్థిరమైన మనస్సుతో నుండువాఁడు-ఇది మహా విశ్వాసమును సూచించుచున్నది. శరణాన్వేషి=రక్షకుని వెదకుకొనిపోవువాఁడును - సరాక్షసచతుష్కుఁడు=నలువురు రాక్షసులతోఁ గూడినవాఁడు. తన రెండు కాళ్ళు రెండు చేతులవలెఁ దనకుఁ బరతంత్రులై యుండువారు. ఈ విధముగ వీరి నలువురయందు భాగవత పారతంత్ర్యము చెప్పఁబడెను గావుననే వీరు రక్షింపఁబడిరి. విభీషణు రక్షించె ననిన నాయన కాలు సేతులను రక్షించినట్లే కదా.

చరణములన్ = పాదములందు - చంటిబిడ్డ తల్లిసొద్దకుఁ బోవునపుడు-మాతృ స్తనములందు మనస్సుదృష్టి యుండునుగాని తక్కిన దేహముతో దానికేఁ బనిలేదు. భక్తునికి స్వామి పాదము లట్టివే. కావున విభీషణుఁడు తనకు భోగ్యములైనవి స్వామివారి శ్రీ పాదములే కదా యని వానిపై మనస్సు, దృష్టి యుంచి వాని నాశ్రయించె నని భావము. వ్రాలి=వంగి - పూర్వము పడినట్లు దబాలున పాదములు నలుగునట్లు పడలేదు. మెల్లగాఁ బడె నని భావము.

అయ్యో! విభీషణుఁ డిట్లు పడిపోయెనే యని పరువున వచ్చి యతని యవయవములను జక్కఁగఁ బట్టుకొని గూర్చుండఁ బెట్టునట్లు పడి-ఇది స్వామిసన్నిధానమునఁ జేయఁబడు కాయిక శరణాగతి-శరణార్థి యని పూర్వము మానసికము చెప్పఁబడెను. దీనిచే నాత్మనిక్షేపము సూచితము. ఇట్లు మానసిక, కాయిక, శరణాగతులు చెప్పి యిఁక వాచిక శరణాగతి చెప్పుచున్నాఁడు.

ధర్మాకరము= ధర్మమునకు స్థానమైనది, ధర్మముతోఁ గూడినది. ఇచ్చట శరణాగతి ధర్మమైన యానుకూల్య సంకల్పాదులు గలది. ఉచిత=సమయమునకుఁ దగినది. సమర్థుఁడై కరుణాలువగు రక్షకునిఁ గొనుట నెట్లు చెప్పఁబడవలయునో యట్లు ఏతర్హి=ఇప్పుడు 'ఏతర్హి సంప్రతీదానీ' మని యమరము, హర్షకర=సంతోషము కలిగించు 'రామచంద్రునిన్ శరణము జొచ్చినాఁడ'నని తొలుత నన్నప్పుడు సుగ్రీవాదులకుఁ గర్ణకఠోరముగ నుండినవి. ఆ మాటలే యిప్పుడు రామచంద్రమూర్తి యనుగ్రహించిన కారణమున సంతోషకరములుగా నున్నవని భావము. సూక్తిన్= 'రామచంద్రునిన్ శరణము చొచ్చినాఁడ' నని వానరులతోఁ జెప్పిన యీ మంచి మాటయే యిప్పుడు రామచంద్రమూర్తితోఁ బ్రత్యక్షముగ ననును. రామానుగ్రహము రానప్పుడు వానరులకు దురుక్తిగాఁ దోచిన యీమంచిమాటలే యిప్పుడు సూక్తులుగాఁ దోఁచెను. దీనికిఁ గారణము వానరుల భావ వికాసము. దీనివలన భగవదనుగ్రహమునకుఁ బాత్రుఁడు గానివాఁడు ఎంత శిష్టుఁడైనను అసూయాపరులకు దుష్టుఁడుగానే కానవచ్చును, "క్రూరుం డెన్ని సుధీగుణంబు దురితాపాదంబు సేయుంగదా" 'భర్తృ శరణాన్వేషి పాదముల వ్రాలె' ననుటచే భక్తులకుఁ బ్రపన్నులకు సేవ్యములు తారకములు స్వామివారి పాదములే యని యేర్పడుచున్నది.

ఇది ప్రధానశరణాగతి కాదని పూర్వమే చెప్పఁబడెను. ఇది ప్రధాన ప్రపత్తి యనినయెడలఁ బ్రపత్తిచేయుటకుఁ బూర్వమే స్వీకరించిన ట్లేర్పడును. అది సరిగాదు.

## తాత్పర్యము

ఈప్రకారము జాగులేక శరణాగత ధర్మమునందు నిశ్చయ బుద్ధిగలవాఁడును, రక్షకుని వెదకువాఁడును నగు విభీషణుఁడు తనకుఁ గాలుసేతులవంటి నలుగురు రాక్షసులతోడ శ్రీరామచంద్రమూర్తి పాదములపై వ్రాలి శరణాగత ధర్మలక్షణయుక్తము, యోగ్యము, పూర్వము వానరులకుఁ గటువుగా నుండినను ఇప్పుడు సంతోషకరమునైన మంచిమాట లిట్లు చెప్పెను.

చ. అనుజుఁడ రావణాసురున • కాతఁడు నన్నవమాన పెట్టఁ డెం
పునఁ జనుదెంచి నే సకల • భూతశరణ్యుని నిన్నుఁ జేరితిన్
నిను శరణంబుఁ జొచ్చితిని • నెయ్యెర లంక సిరిం ద్యజించితిన్
మనుజవరా! భవద్గతము • మత్సుఖజీవితరాజ్యభోగముల్. ౩౯౮

పూర్వము సుగ్రీవాదులతోఁ జెప్పినమాటలే యిప్పుడు రామచంద్రమూర్తితో జెప్పుచున్నాఁడు.

అర్థములు. అనుజుఁడన్ = తమ్ముఁడను, దీనిని ౩౪వ పద్యములోఁ బోల్చునది. రావణునకుఁ దమ్ముఁడ ననుటచేఁ దన దోషము చెప్పినవాఁ డయ్యెను. తెంపునన్=సాహసముచే; రామచంద్రుని పాదములపైఁ బడుదము. ఆయన రక్షించెనా రక్షింపనీ, శిక్షించెనా శిక్షింపనీ, ఆయన దయ యని సాహసించి, సకలభూత శరణ్యుదిన్=సమస్త భూతములకు రక్షకుఁడవు, అనుకూలుఁడయివచ్చిన రావణునే రక్షించువాఁడవు, నన్ను రక్షింపకుందువా యను విశ్వాసముచే, చేరితిన్=సమీపించితిని, నీకు నెవ్వరు లేరా నాయొద్దకు రానేల యందువా? నాకు నీవు తప్ప వేఱు ప్రాపు లేదనుచున్నాఁడు, నెయ్యురన్=మిత్రులను, సిరిన్=వారిమూలమున లభించిన సంపదను, త్యజించితిన్=నేనే వదలిపెట్టితిని, భవద్గతము=నీ స్వాధీనము, నీ యథేచ్ఛ వినియోగమునకు లోపడినది, మత్=నాయొక్క, సుఖజీవిత=సుఖమైన బ్రదుకు, ఇది ధారక పోషక యోగ్యముల కన్నింటికి నుపలక్షణము, రాజ్య = ఇది సమస్తోపకరణములకు నుపలక్షణము, లంకారాజ్యము రావణుని స్వార్జితము. ఆ విషయమున విభీషణుఁడు తోడుపడినవాఁడును గాఁడు. కావున రాజగాఁడు. యువరాజునుగాఁడు, ఇట్టివానికిఁ బాలింప దేశమెందుండివచ్చెను. కావున రాజ్య మన్నఁగాఁ బాలింపఁబడు దేశమని యర్థము సేయరాదు. కావున రాజునకు రాజ్య మెట్లు పాలనార్హమో యట్లు పాలనార్హములైన పదార్థము లనియే చెప్పవలెను. నష్టరాజ్య మనోరథుఁడ నన్నచోట నీ యర్థమే గ్రాహ్యము. భోగముల్ = ఐహికాముష్మికరూపములైన సర్వసుఖములు, ప్రవున్నలు = ప్రతిదినము చెప్పెడు "మమత్వేన అభిమతంచ వస్తు సర్వస్వామినే నారాయణాయ తుభ్యమేవ నమమ" అను వాక్యార్థముగలది. 'ఆత్మాత్మీయ నిక్షేపమాత్మనిక్షేప ముచ్యతే' అన్నఁ దనది యను నేదిగలదో చేతనా చేతనాత్మకమైన సర్వము భగవంతునకై సమర్పించుట యాత్మనిక్షేప మనఁబడును. నీ సేవమాత్రము నా కనుగ్రహించి యివి యన్నియు నీ యిష్టమువచ్చినట్లు వినియోగించుకొమ్ము. వీనియందు నాకేక స్వామిత్వము లేదని భావము. ఇది భవద్గతము. ఇది భరన్యాసమును తెలుపును.

## తాత్పర్యము

రామచంద్రా! నేను రావణాసురుని తమ్ముఁడను, అతఁడు నన్న వమానించిన కారణముచే సాహసించి సర్వప్రాణి రక్షకుఁడవైన నీ యొద్దకు వచ్చితిని. నీశరణము చొచ్చితిని. నీ కెవ్వరు రక్షకులు, సహాయులు లేరా, యిచ్చటికేల వచ్చితివందువా? స్నేహితులను, చిరకాలముగ నసించు లంకను, దానియందు నాకుఁగల సంపత్తును, సర్వము వదలిపెట్టితిని. కావున నా కెవ్వరు రక్షకులు లేరు. నేను, నా సుఖజీవనము

నా పాలనకు లోబడిన సమస్తోపకరణములు భోగములు నన్నియు నీ స్వాధీనము చేసితిని. ఇంక నా యోగక్షేమములకు నీవే దిక్కు.

క. అను తద్వచనంబుల విని, చనవున నాదరించి ♦ సాంత్వఫణితులన్
జనకసుతాపతి రాక్షస, వినిచయము బలాబలములు ♦ వినిపింపు మనన్. ౯౫

అర్థములు. తత్ + వచనంబులు = దారపుత్రాదులను, ఇల్లు వాకిండ్లను, గొడ్డుగోదలను తోటలు దొడ్లను సర్వమును నేనై వదలి శ్రీరామునందే భరన్యాసము గావించిన విభీషణుని యొక్క, తత్ + వచనంబులన్ = రామసేవయే తనకు భోగ్యమని శరణార్థియై చెప్పిన యా మాటలను, సాంత్వఫణితులన్ = ఊరార్పు మాటలచే, నీవు నన్ను శరణన్నప్పుడే రక్షింపవలసిన వాడనే, అలస్యము చేసి నీకు మనస్సునకు సంకటము గలిగించితిని; క్షమింపుము. అను మంచిమాటలచే ఆదరించి = నీకు భయములేదు. లెమ్మను మాటలచే మనస్సు తాపముచల్లార్చి, విభీషణుడు రామచంద్రుని నీ కైంకర్యము నాకనుగ్రహింపుమని కోరెనుగదా; దానిని రామచంద్రమూర్తి యంగీకరించి త్రివిధ కైంకర్యములలో వాచిక కైంకర్యము తొలుత గావింపు మనుచున్నాడు. వినిచయము = సమూహము, మీవారి బలాబలములు చెప్పుమని యడుగక రాక్షసుల బలాబలములని యడుగుటచేత విభీషణుడు శరణాగతుడైన వెంటనే భ్రమరకీటకముగా రాక్షసజాతి పోయి యిక్ష్వాకు వంశములోని వాడయ్యెనని రాముని యభిప్రాయ మని సూచితము. సన్న్యాస మెట్లు జన్మాంతరమని చెప్పబడునో యట్లులే శరణాగతునకు జన్మాంతరప్రాప్తి యీజన్మమందే లభించు ననియు నది భగవదాశ్రయణము కావున నాశ్రయణ మహత్వము చేత ముక్తియోగ్యత గలదై, ముక్తసామ్యత నొందు ననియు గ్రాహ్యము.

తాత్పర్యము

విభీషణుడు చెప్పినమాటలువిని మచ్చికచే నూరార్పుమాటల సమాధాన పఱిచి రామచంద్రమూర్తి విభీషణా! రాక్షసుల బలాబలములు చెప్పు మని యడిగెను.

అడవిచుట్టు నిప్పంటుకొనినందున తప్పించుకొని బయటకుఁ బోవుటకు వీలులేక నడుమఁ జిక్కుపడిన మృగాదులవలెనే తాపత్రయాత్మక మగు సంసారానుభవభీతు లైనట్టి ముముక్షువులకు ఆచార్యుండు ముందుగఁ బ్రపత్త్యనుష్ఠానము నుపదేశించును.

శ్రీ విభీషణులవారు రావణునితో "సీతాదేవిని శ్రీరామచంద్రున కొప్పగింపు" మని హితోపదేశముఁ జేసినట్టు లాచార్యుండును ముముక్షు వగు నీతనికి నీ యాత్మను సర్వేశ్వరునకు సమర్పింపు మని యుపదేశించును.

పెరుమాళ్ళ శ్రీపాదముల నాశ్రయింపు మని శ్రీ విభీషణులవారి యుపదేశములు "మనుష్యమాత్రుఁడు రక్షకుఁ డెట్లు కాఁగలఁడు" అను నిత్యాది ప్రవా

స్తాది వాక్యకోప దూషిత మగు రావణుని మనస్సున కెక్కనట్లు, ఆచార్యం డుపదేశించునట్టి యుపదేశములును ప్రకృతి వాసనాదూషిత మగు ఈ ముముక్షువు యొక్క మనస్సున కెక్కవు.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణు చొచ్చునప్పుడు లంకను, మిత్రులను ధనములను విడిచితిని అన్నట్లు ముముక్షువగు నీ చేతనుండును భగవద్విషయము యొక్క ప్రచారము లేని ప్రదేశమును విడనాడునది.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణుచొచ్చునప్పుడు ఆకాశమునం దుండె నన్నట్లు నిరాధారుండై నిలబడినట్లు, ముముక్షువు సర్వేశ్వరుని శ్రీ పాదములం బొందు విషయమున నుపాయాంతర శూన్యుండై యుండునది.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణు చొచ్చునప్పుడు, ఉపాదేయములు కాని, పుత్రులను భార్యను వదలి రామచంద్రుని శరణు పొందె నన్నట్లు ముముక్షువును సర్వేశ్వరుని శ్రీ పాదములను బొందుటకు నిర్బంధము లగు విరోధులను విడనాడునది.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణుజొచ్చునప్పుడు లక్ష్మణస్వామి వారితో నుండిన శ్రీరామచంద్రమూర్తి సన్నిధికి వచ్చినట్లు ఈ ముముక్షువును పెరుమాళ్ళు ప్రేమించి వేంచేసి యున్నట్టి దివ్యదేశమునే తనకు రక్షక మైనట్టి దానిగా నాశ్రయించునది.

• శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణుచొచ్చుటకై వచ్చినప్పుడు "నేను శరణు జొచ్చుటకై వచ్చియున్నానని శ్రీరామచంద్రుని సన్నిధి విన్నవింపుండు," అనియు "ఓ సుగ్రీవుండా! ఈతని గొనిరమ్ము" అనియు చెప్పంబడెను. ఈ త్తావుల శ్రీ విభీషణుల వాక్యకే విన్నవించినను ఫలమన్నా వీరితో పాటు కూడ వచ్చిన వారికిని లభించినట్లు ముముక్షువులకుంగాను సర్వేశ్వరుని సన్నిధిని నాచార్యుండొవర్చినట్టి ప్రవృత్తియే చాలును.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణు చొచ్చునప్పుడు శ్రీరామచంద్రుండు సుగ్రీవుని మూలముగ విభీషణులవారు శరణు చొచ్చుటకై వచ్చిన సంగతిని విని యింద్రుండు గరుత్మంతుని వలెనే వారిని గలిసికొనెను. అన్నటు పెరుమాళ్ళు సుగ్రీవుని పురుషకారముద్వారమున విభీషణులవారి నంగీకరించినట్లు లీ ముముక్షువును ఆచార్యుని పురుషకారముద్వారా అంగీకరించును.

ఇట్లు లంగీకరింపంబడిన ప్రపన్నుండు సంసారములో నుండునట్టి స్థితిని పిరాట్టి రావణుని గృహమునం దుండు నశోకమున నుండి చూపించినది. అదెట్లనిన:—పిరాట్టికి రావణసంబంధ మెట్లో ఈతనికి దేహ సంబంధము నట్టిదే. పిరాట్టికి యేకాక్షీ. యేకకర్ణి మొదలగు రాక్షసస్త్రీలు యెట్లో, ఈతని అహంకార మమకారములు నట్లే. పిరాట్టికి తనను పెరుమాళ్ళయొద్దనుండి కొనిపోందలచిన మారీచుండు ఎట్లో, ఈత

నికి విషయ ప్రావణ్యము వట్టిది. తర్జన భర్త్సనాదుల నొనర్చిన రాక్షస స్త్రీసంబంధము పిరాట్టి కెట్టిదో, ఈతనికి కళత్రపుత్ర సంబంధము నట్టిదే. పిరాట్టికి అంజనేయులవారి దర్శన మెట్టిదో ఈతనికి నాచార్యుని దర్శనము నట్టిదే. పిరాట్టికి శ్రీయాంజనేయులవా రొనర్చిన రామగుణకీర్తన మెట్టిదో ఈతని కాచార్యుఁడు సాయించిన గురుపరంపరయును అట్టిదే. పిరాట్టికి అంజనేయులవా రిచ్చిన యుంగర మెట్టిదో, ఈతని కాచార్యుఁ డుపదేశించిన తిరుమంత్ర మట్టిది. పిరాట్టి రామచంద్రుని యుంగరమునుజూచి దానిమూలముగ సుందరమగు వ్రేలిని, దానిమూలముగ బాహువులను, దాని మూలముగ దివ్యమంగళ విగ్రహమును అనుసంధించుకొని ప్రాణములను ధరించి యున్నట్లు శ్రీవైష్ణవుఁడును, ఆచార్యుఁడు కృపచేసిన తిరుమంత్రముయొక్క యర్థమును అనుసంధించుకొని ధరించియుండును. పిరాట్టి లక్ష్మణస్వామితో పరుషముగ మాట్లాడిన మాట ఆమెను పెరుమాళ్ళను విడిచి దూరముగా నుండునట్లు చేసిన చందమున, ఈతం డొనర్చినట్టి భాగవతాపచారము, ఈతనిని "క్షిపామి, న క్షమామి" అను భగవన్నిగ్రహమునకు విషయముగాఁజేసి పెరుమాళ్ళనుండి దూరముగా నుండునట్లు చేసినది. పిరాట్టికి విరోధులగు రావణాదులను వధించి పెరుమాళ్లు ఆమెను గొనిపోవుట యెట్లో, అట్లే యీతనికి విరోధియగు ప్రకృతి సంబంధమును బోఁగొట్టి సర్వేశ్వరుఁడు ఈతనిని పరమపదమునకుఁ గొనిపోయి నిత్యముక్తులతో పాటు నిత్యకైంకర్యమున సుఖయోగ పఱచుకొనును. ఈ పలి వార్తలను అనుష్ఠాన పర్యంతము గలిగి యున్నట్టి శ్రీవైష్ణవుఁ డుండునట్టి తావే పరమపదము.

—• విభీషణుఁడు శ్రీరామునకు రాక్షసబలంబుఁ దెల్పుట •—

చ. ప్రవిమలసచ్చరిత్రునకు • రాముని కిట్లను దేవ! యీస్వయం
భువువలన వ్వరంబులను • బొందుటచే దశకంఠు నాజిలో
దివిజపలాశిసంతతికిఁ • ద్రిక్కన భూతసమూహకోటికిం
దవిలి వధింపరాదు వసు • ధాధవనందన భక్తనందనా. ౨౯

అర్థములు. ప్రవిమల=మిగుల నిర్మలమైన - సచ్చరిత్రునకున్ = మంచి నడవడి గల వానికి - స్వయంభువువలనన్ = బ్రహ్మవలన - ఆజిలో = యుద్ధమునందు - దివిజపలాశి సంతతిన్=దేవతల రాక్షసుల సమూహమునకు - త్రిక్కన= తక్కిన-భూతసమూహకోటికిన్ = నరులు వానరులు తప్పఁ దక్కిన యొక్కొక్కజాతిసమూహముల గుంపులకు-వసుధాధవనందనా=రాజకుమారా-నీవు మనుష్యుఁడవు కావున రావణుఁడు నీచేఁ జచ్చునని భావము. భక్తనందనా=భక్తులసంతోషపెట్టువాఁడా- అనుటచే అట్లు నీవు రావణుని జంపిన భక్తులందఱు సంతోషింతురు. దానివలన సాధు పరిత్రాణము చేసినవాఁడ వగుదువు. అదియేకదా నీ యవతార ముఖ్యోద్దేశము.

మిగుల నిర్మలమైన పదవడిగల రామచంద్రునకు విభీషణుఁ డిట్లనియె. దేవా! బ్రహ్మచే రావణుఁడు యుద్ధమందు దేవరాక్షసులచే నరవానరులు తప్పఁ దక్కిన భూతకోటిచేఁ జావులేకుండ వరము పొందినాఁడు. నీవు రాజకుమారుఁడవు కావున నీచే వాఁడు చచ్చును. అట్లు నీవు చేసితి వేని భక్తు లందఱు సంతోషింతురు.

సీ. రావణుతమ్ముండు ♦ రణవీర్యవంతుండు, కుంభకర్ణుండు ని ♦ ష్కుంఠ తేజుఁ
డన్న నాకతఁడు బ ♦ లారికి నెదురుద్ది, యని దళవాయి ప్ర♦హస్తుఁ డతని
వినియుందు వేమొ యా♦వీరుండు కైలాసమున మాణిభద్రుని♦ మొక్కపఱిచెఁ
గలన నని ర్భేద్య ♦ కవచుండు బద్ధగో, ధాంగుళిత్రుండు శ ♦ రాసనమూని
తే. యింద్రజి యదృశ్యుఁడగుచును ♦ నేపుమీఱు, విగ్రహంబున హుతవహు ♦
వేల్చి తత్ప్రసాదమున మాయమగుచును ♦ జంపునరుల, రావణుని యీడు
వాఁడు ప ♦ రాక్రమమున.

అర్థములు. రణవీర్యవంతుండు=రణమునందు వీర్యముగలవాఁడు, సప్తమీ తత్పురుషము. నిష్కుంఠ తేజుఁడు = మొక్కపోని పరాక్రమము గలవాఁడు, బలారికిన్ = ఇంద్రునికి, ఎదురుద్ది = సమానశత్రువు, దళవాయి = సేనానాయకుఁడు, మాణిభద్రుఁడు = కుబేరుని సేనాపతి, కలనన్=యుద్ధమందు, అనిర్భేద్య కవచుఁడు = భేదింపరాని కవచముగలవాఁడు, బద్ధగోధాంగుళిత్రుండు=ఉడుము చర్మముతోఁ జేయఁబడిన వ్రేళ్ళకవచము తొడుగుకొనువాఁడు, శరాసనము=విల్లు, ఇంద్రజి=ఇంద్రజిత్తు, అదృశ్యుఁడు = కానరానివాఁడు, విగ్రహంబునన్ = యుద్ధమందు, హుతవహున్ = అగ్నిహోత్రుని, వేల్చి = హోమముచేసి, తత్ + ప్రసాదమున్నన్ = ఆయన యనుగ్రహముచేత, అరులన్ =శత్రువులను, ఈడువాఁడు= సమానుఁడు.

తాత్పర్యము

కుంభకర్ణుఁడు రావణునకుఁ దమ్ముఁడు. యుద్ధమునందు మిగుల శౌర్యము గలవాఁడు, మొక్కపోని పరాక్రమము గలవాఁడు, ఇంద్రునికి సమాన శత్రువు. వాఁడు నాకన్న కావలయును. ప్రహస్తుఁ డనువాఁడు సేనానాయకుఁడు. వీని విషయము నీవు హనుమంతునివలన వినియుందువు. అతఁడు కైలాసమున యక్షులకు రాక్షసులకు జరిగిన యుద్ధమందుఁ గుబేరు సేనాపతి యగు మాణిభద్రుని బరాభవించెను. ఇంద్రజిత్తు రావణుకొడుకు, భేదింపరాని కవచము గలవాఁడు. ఉడుము తోలుతోఁ జేయఁబడిన వ్రేళ్ళ కవచము (Glove) గలవాఁడు. యుద్ధమందు విల్లు ధరించి శత్రువులకుఁ గానరాకుండ వారిని జంపును. అగ్నిహోత్రుని హోమము చేసి యాయన యనుగ్రహమున విల్లు, తేరు గలవాఁడై వానితో నితరులకుఁ గానరాక శత్రువులఁ జంపును. బలపరాక్రమములందు రావణుతో సమానుఁడు.

తే. లోకపాలసమాను లనీకపతులు, మఱి మహాపార్శ్వుఁడును నకంపనుఁడునాఁగ
నధికబలుఁడు మహోదరుండనఁగఁ గలరు, వీర్యవిక్రమనిర్జితవిబుధవరులు. ౩౮

అర్థములు. లోకపాల సమానులు=దిక్పాలురతో సములు, అనీకపతులు=సేనానాయకులు, వీర్యవిక్రమ నిర్జిత విబుధవరులు=శౌర్యము చేతను, పరాక్రమము చేతను జయింపఁబడిన దేవశ్రేష్ఠులు.

తాత్పర్యము

మఱియు సేనానాయకులు దిక్పాలురతో సమ లగువారు మహోదర మహాపార్శ్వులు, అకంపనుఁడుననువారు గలరు. వీరు దేవశ్రేష్ఠులను శౌర్యపరాక్రమములచే జయించినవారు.

ఆ. కామరూపధరులు కల రాక్షసులు పదివేల, కోట్లు లంకయందుఁ గ్రూరబలులు
పలలభోజు లల్ల వారల బాసట, భంగపఱిచె సురల దశముఖుఁడు. ౩౯

అర్థములు. పలలభోజులు=మాంసభక్షకులు - రాక్షసులు - బాసటన్=సాహాయ్యముచే.

తాత్పర్యము

కోరినరూపము ధరింపఁగల రాక్షసులు పదివేల కోట్లున్నారు. వారి సాహాయ్యముచే రావణుఁడు దేవతల నోడించెను.

చ. విపులపరాక్రముండను రఘువీరుఁడు రాక్షసవంశదీపు నా
లపితము నాలకించి సకలంబు మదిం దలపోసి పల్కె- నీ
విపుడు దురాత్ము రావణుని వృత్తము సర్వము నో విభీషణా
నిపుణముగాఁగఁ దెల్పుటను నిశ్చలచిత్తమునన్ గ్రహించితిన్. ౪౦

అర్థములు. ఆలపితము = మాట - విపులముగ=సవిస్తరముగ - రాక్షసవంశదీపు = రాక్షస కుల మను నెరుశ్శకు దీపమువంటి వాఁడు - రాక్షసకుల నాశకుఁడు.

తాత్పర్యము

విస్తార పరాక్రమముగల రామచంద్రమూర్తి విభీషణుఁడు చెప్పిన మాటలు విని కార్యము లెట్లెట్లు చేయవలయునో యాలోచించి యిట్లనియె. విభీషణా! నీవిపుడు సవిస్తరముగఁ జెప్పిన దుష్టుఁ డగు రావణుని నడవడి సర్వము నేకాగ్ర చిత్తముతో గ్రహించితిని.

మ. వినుమా రావణుఁ బుత్రమిత్రసచివాన్వితు న్మహాస్కందనం
బున ద్రుంచెదను, రసాతలంబును నధోభూమిం జొరంబాఱినన్
వనజాతాసను దాపు చేరినను బ్రాగ్దాన న్వీడం జుమ్మీ, ని
న్ననఘా కట్టెదఁ బట్ట మయ్యసుర రాజ్యశ్రీకి సత్యంబుగన్. ౪౧

అర్థములు. సచివ + అన్వితున్ = మంత్రులతోఁ గూడినవానిని, మహా

స్కంధమునన్ = గొప్ప యుద్ధమందు, ప్రమందింతున్ = చంపుదును, రసాతలమున్=గొప్ప పల్లములందు, అధోభూమిన్=పాతాళమందు, వనజాతాసను = బ్రహ్మయొక్క, అసురరాజశ్రీకి=రాక్షస రాజ్యలక్ష్మికి.

తాత్పర్యము

విభీషణా! నేనుజెప్పెడుమాట వినుము. రావణుని కొడుకులతో మిత్రులతో మంత్రులతో యుద్ధమందు వధింతును. వాఁడు క్రిందిలోకములందు, పాతాళలోకములో నడుగుభాగమున గుంతలలో దాఁగినను పైలోకములందు సత్యలోకమునకుఁబోయి బ్రహ్మయొద్ద నుండినను ప్రాణముతో వదలిపెట్టను. అంతమాత్రమే కాదు రాక్షస రాజ్యలక్ష్మికి నిన్నుఁ బట్టము గట్టెదను.

ఇచ్చట నీ శ్లోకము లనుసంధింపఁదగును.

> అన్నం పానం ధనం వస్త్ర మాయు రారోగ్య మాస్పదమ్
> ఆపద్యపి న యాచేత పూజకః పురుషోత్తమమ్
> నాప్రపన్నే దదామ్యేత ద్యాచితోపి దినేదినే
> అయాచితోపి తత్సర్వం ప్రపన్నే విదధా మ్యహమ్.

అన్నము, పానము, ధనము, వస్త్రము, ఆయువు, ఆరోగ్యము, ఇల్లు, భూములు, జీవనోపాయము ప్రపన్నుఁడు భగవంతుని యాచింపరాదు. దినదినము వీనిని యాచించినను భగవంతుఁడు వీనిని వానికీయఁడు. వాఁడు పూర్వజన్మకృతానుసారముగ నవి లభింపవలసినవే. యాచింపని ప్రపన్నునకు నేను సర్వము నిచ్చెదను. వాని పూర్వకర్మ విచారముతో నాకుఁ బనిలేదు.

కర్మముపై నాధారపడినవానికిఁ గర్మ మెంత యియ్యవలయునో యంతయే యిచ్చును. నామీఁద నాధారపడినవానికి నేనీయఁగలదంతయు నిచ్చెదను. నేను యాచింపకుండిన నన్ని యిచ్చుననెనే యని మనస్సులో నింకను నీయలేదే యనుకొనుచుండరాదు. ప్రపన్నున కా విచారమే నిషిద్ధము.

ఈ కారణముచే విభీషణుఁ డడుగకుండినను రాజ్యమును శ్రీరామచంద్రమూర్తి యనుగ్రహించెను. విభీషణునకే యనుభవ మిప్పుడే కాదు. బాల్యమున బ్రహ్మనుగూర్చి తపస్సు చేసినపుడు బ్రహ్మదేవుఁడు అమరత్వమును అడిగిన రావణునకీయక యడుగని విభీషణున కిచ్చెను. దీనివలన మనము నిష్కామ ప్రవర్తనము భక్తి కలిగి సర్వభారము భగవంతునిపై వైచితిమేని మన యోగక్షేమము లాయనయే విచారించుకొనునని యేర్పడుచున్నది.

> అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
> తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ భ. గీ.

రాజ్యకాంక్షచే విభీషణుఁడు వచ్చినాఁడనుట యితరుల యభిప్రాయమే కాని యతని యభిప్రాయము గాదు.

క. ఒట్టిడుకొందును నా తోఁ, బుట్టులపై రావణుని స♦పుత్రహితబలున్
మట్టిడక నే నయోధ్యా, పట్టనముం జొరఁగఁ బోను ♦ బరమచరిత్రా! ౭౦౨

అర్థములు. ఒట్టిడుకొందును=ప్రమాణముచేసి చెప్పెదను, మట్టిడక=చంపక.

తాత్పర్యము

గొప్పనడవడికగల విభీషణా! రావణుని కొడుకులతో, మిత్రులతో, సేనలతోఁ జంపక యయోధ్యను బ్రవేశింపనని ప్రమాణము చేసి చెప్పెదను.

తరలము. అనుడు భక్తి విభీషణుండును ♦ నంజలిన్ ఘటియించి యో
యనఘశీల! మదీయ దేహము♦నందుఁ బ్రాణము లుండునం
దనుకఁ జొచ్చెద శత్రుసేన ని♦తాంతసాహ్య మొనర్తు లం
కను వినాశ మొనర్ప రాక్షస♦కాండముం బరిమార్పఁగన్. ౭౦౩

తాత్పర్యము

ఈ ప్రకారము రామచంద్రమూర్తి చెప్పఁగా విభీషణుఁడు రెండు చేతులు జోడించి పుణ్యచరిత్రా! నా దేహమునందుఁ బ్రాణములుండు వఱకు శత్రుసేనయందుఁ దూఱి లంకను రాక్షసులను చంపుటయందు మిగుల సాహాయ్యము చేసెదను.

ఇది కాయిక కైంకర్యము. ఇంతవఱకు విభీషణుఁడు రాజ్యమును దాను వేఁడనులేదు. రాక్షసవధయందు సాహాయ్యము చేసెదనని చెప్పనులేదు. రామచంద్రమూర్తి రాక్షసుల వధించెదనని చెప్పిన కారణముచే నేది స్వామికార్యమో యది భృత్యునికార్యమే. తన కది యిష్టమైనను అనిష్టమైనను కైంకర్యబుద్ధి నెఱవేర్పవలసినదే. కావున నీ విషయమున నాకుఁ గృత్యమైన కైంకర్యము నేను జేసెదననెను. దీనివలన స్వామి యొకకార్యము చేయఁబూనినపుడు భృత్యుఁడు తటస్థుఁడై యూరక చూచుచుండరాదు. అది తనకార్యముగ నెంచి దానిని జక్కఁజేయవలయునని సూచన. కామ్యకాంక్ష యీ మాట చెప్పెననరాదు. అనుకూల సంకల్పము.

—♦ శ్రీరాముఁడు విభీషణునకుఁ బట్టాభిషేక మొనరించుట ♦—

సీ. అను విభీషణుని దాఁ♦నంకపాళిని గ్రుచ్చి, సౌమిత్రితో రఘుచంద్రుఁ డనియెఁ
దెమ్ము మానద! సాగ♦రమ్ముజలమ్ముల, నా ప్రసాదమ్మున♦క్షిప్రముగను
నభిషిక్తుఁజేయుమా♦యసుర రాజ్యశ్రీకి, నివ్విభీషణు♦నన నింపుమీఱ
మర్కటవాహినీ♦మధ్యంబునను నతఁ డట్లు గావించె రా♦జాజ్ఞ కలిమి
తే. శ్రీరఘూత్తము కరుణాభి♦షేకమునకు, మేలు మేలని కపులెల్ల♦మెచ్చుకొనుచుఁ
గేక లెసఁగించిరంత సుగ్రీవపవన,సంభవులు పల్కిరిటు విభీ♦షణునితోడ. ౭౦౪

అర్థములు. అంకపాళిని = కౌఁగిట, "ఆలింగన ముపగూహన మాహుః పరిరంభణం పరిష్వంగం ఆశ్లేషమంకపాళిం క్రోడీకరణంచతుల్యార్థమ్-రత్నమాల. గ్రుచ్చి = ఒత్తి, మానద = ఆశ్రితుల గౌరవము రక్షించువాఁడా, నేననుగ్ర

హించినను ఫలమీయవలసిన వాఁడవు నీవేయని భావము. (ననుఁబ్రసాదించిన యనఘచరితున్=అనుషంగికఫలముగా నే నిచ్చెద ననిన రాజ్యమును నిరాకరింపక యంగీకరించి నా మనస్సు సంతోషింపఁ జేసిన వానిని.) దీనివలన విభీషణుఁడు రాజ్యము గోరలేదనియు, రాజాజ్ఞ కావున నంగీకరించె ననియు గ్రాహ్యము, మర్కట వాహినీ మధ్యంబునం దనుటచేఁ బదుగురిలోఁ జెప్పినది యనుల్లంఘ నీయ మని భావము, క్షిప్రముగను=త్వరగా.

తాత్పర్యము

రామచంద్రా! నేను నీ సేవఁగోరి వచ్చితినిగాని రాజ్య మాశించి వచ్చిన వాఁడగాను. నేను బరతంత్రుఁడను, కావున నీ వనుగ్రహించు రాజ్యము నాకక్కఱ లేదనుటయుఁ బారతంత్ర్యమునకు హాని కలిగించును గావున నీయాజ్ఞాబద్ధుడనై యంగీకరించెదను. (భరతుఁడు పరతంత్రుఁడై కదా లక్ష్మణుఁడు నిరాకరించిన యౌవరాజ్య మంగీకరించెను.) అని చెప్పఁగా నతని మాటలకు మెచ్చి రామచంద్ర మూర్తి యతనిని గౌఁగిట నొత్తి వశపఱచుకొని లక్ష్మణునితో నిట్లనియె. లక్ష్మణా! వేగముగ సముద్రజలము దెచ్చి )నాయం దనుగ్రహించిన) యీయనను రాక్షస రాజ్యమునకు రాజుగాఁ బట్టాభిషేకము చేయుము అని చెప్పఁగా లక్ష్మణుఁడు వానరసేనామధ్యమందు రాజాజ్ఞ ప్రకారము గావించెను. వానరు లందఱు ఔరా రామచంద్రమూర్తి యెంతటి దయాశాలి యని మెచ్చి కేకలు వేసిరి. అవల నవ్విభీషణునితో సుగ్రీవ హనుమంతు లిట్లనిరి.

ఉ. ఈ వరుణాలయంబుఁ దరి•యింపఁగ నెట్టు లగున్ వనాట సే
నావళితోడఁ, జెప్పుమ యు•పాయ మొకం, డన నవ్విభీషణుం
డో,వనజాప్తనందన! మ•హోదధి సాగరఖానితంబు మ
న్గావున రాఘవుండు శర•ణం బనఁ బ్రాజ్ఞుఁ డొనర్చుఁ గార్యమున్. ౮౦౫

అర్థములు. వరుణాలయంబు = సముద్రము - వనాటసేనావళితోడన్ = వానరసేనతో-సాగరఖానితంబు=సగర కుమారులచేఁ ద్రవ్వఁబడినది, ప్రాజ్ఞుఁడు= కృతజ్ఞతాబుద్ధి గలవాఁడు.

తాత్పర్యము

వానరసేనతోడ నీసముద్రము దాటు నుపాయము చెప్పుమనిన విభీషణుఁ డిట్లనియె. ఈ సముద్రమును రామచంద్రమూర్తి పూర్వ వంశజులైన సగర కుమారులు త్రవ్విరి. వారి వలన నితనికి రూపము నామ మేర్పడెను. ఇతఁడు కృతజ్ఞుఁడు కావున రామచంద్రమూర్తి ప్రార్థించెనేని తగిన కార్య మితఁడు చేయును. ఇది ఫాల్గున శుద్ధ ద్వితీయనాఁటి చరిత్రము.

సీ. అనవుడు సుగ్రీవుఁ•డరిగి సీతేశున కవ్వార్త దెలుపఁగ • నాతఁ డలరి
కార్యదక్షుం డయ్యుఁ•గడఁకఁ సమ్మాననార్థంబు తమ్మునిఁ గపి•రాజుఁ బలుకు

మత్సమ్మతం బది ◆ మర్కటపతికి నీ, కవ్విభీషణు వాక్య ◆ మాదరింపఁ
దగు నని తోఁచిన ◆ దలపోసి చెప్పఁడు, మర్కటేంద్రుఁడు సూరి ◆ మంత్రవిదుఁడ
తే. నీవు యోజింపుఁ డన రాఘ ◆ వేంద్రునకును
వార లని రయ్యా! కాలార్హ ◆ వాక్య మతఁడు
చెప్ప మా కేల యది యరు ◆ చించు? లంక
సేతువును గట్టకే భంగిఁ ◆ జేరఁ గలము? ౪౧

అర్థములు. అలరి = సంతోషించి - కార్యదక్షుఁడు = పని నెరవేర్చుట యందు సమర్థుఁడు-దీనిచే సముద్రుని యాచింపకయే దాని దాఁట సామర్థ్యము గలవాఁడని సూచితము. సమ్మానార్థంబు = వారిని గౌరవించుకొఱకు, అరిగి యనుటచే విభీషణుఁడు వానరులతో స్థలాంతరమున నుండె నని యేర్పడుచున్నది.

తాత్పర్యము

ఈ ప్రకారము విభీషణుఁడు చెప్పగాఁ సుగ్రీవుఁడు రామచంద్రమూర్తి యుండుచోటికిఁబోయి విభీషణుఁ డిట్లు చెప్పుచున్నాఁడని యతని యభిప్రాయము దెలిపెను. దానికి రామచంద్రమూర్తి సంతోషించి వారి యాలోచన లేకయే కార్యము నెఱవేర్ప సమర్థుఁడయ్యు పరత్వ ప్రకటనము లేకయే కార్యమగునెడల పరత్వ ప్రకటన మేల చేయవలయు నని తలఁచి వారిని గౌరవింపఁగోరి వినయము విశిష్టమైన లక్ష్మణ సుగ్రీవ లోకాభిప్రాయము గలవారు కావున లక్ష్మణునితో నిట్లనుచున్నాఁడు. సుగ్రీవుఁడు పండితుఁడు, నీ వాలోచనపరుఁడవు. (ఇది సౌమిత్రి పొసగు మాట యని తోఁచుచున్నది) కావున మీ రిరువురు నాలోచించి విభీషణు మాట గౌరవింపఁదగునని మీకుఁ దోఁచెనేని చెప్పుఁడు. మీరు చెప్పినదియే నాకు సమ్మతము, అట్లులే చేసెదను. కావున మీరాలోచించి చెప్పవలసినదని చెప్పఁగా వారు సముచితముగ విభీషణుఁడు చెప్పెను కావున నది మాకేల సమ్మతము గాకపోవును. సేతువు కట్టక లంకఁ జేరలేముగదా.

క. అల మిఁకేలా నీవా, జాలముతో దాఁట నుపమ ◆ నల్పు డనన్ నీ
తాలోలుఁడు వేదిపయిన్, జ్వాలవలెన్ వేగ దర్భ ◆ శయమునఁ బండెన్. ౪౨

అర్థములు. ఆలము = ఉపేక్ష, ఉపమ = ఉపాయము. దర్భశయము = దర్భలపడుక. పడుకవలెఁ బఱచిన దర్భలమీఁద, జ్వాలవలె రామచంద్రమూర్తి యుండెనని చెప్పుటచే; వీరు చెప్పుచున్నా రని నీమాట ద్రోదివేయలేక చేయవలసిన కార్యమే, ఈ సముద్ర తరణము పరాక్రమముచేఁ గాని సాధ్యపడదని యాలోచించి దైన్యము మాని తేజోవంతుఁడై యుండెనని సూచించుచున్నది. పండెననఁగా పండుకొనుటకు యత్నించె నని భావము.

తాత్పర్యము

ఇంక నేల నిష్కారణముగ నాలస్యము చేయవలె. నేనలతో సముద్రము

దాఁటు నాలోచన సేయుఁ డనఁగా రామచంద్రమూర్తి వేదియందలి యగ్నిహోత్రునివలె దర్భశయనంబునఁ బండుటకు యత్నించెను. పండుకొనుట ౪౦౩వ పద్యంబునఁ జెప్పఁబడెను.

## —• ౨౦-వ సర్గము. శార్దూలుఁడు రావణునితో శ్రీరాముఁడు కపులతో సముద్రము నొడ్డున దిగియుండువార్తఁ జెప్పుట. •—

సీ. అక్కడ శార్దూలుఁ • డను రావణాసురు, చారుండు సుగ్రీవ•సైన్యవిధము
  నంతయుఁ బరికించి • యతిరయంబున నేగి, రావణుఁ గనుఁగొని•రాక్షసేంద్ర!
  యిదిగో శాఖామృగ•ఋక్షవాహిని మన, పురముపై బడ వేగ•పొర్లి వచ్చె
  నప్రమేయం బయి•యధికగంభీర మై, మాఱట జలధి యై • మహిమ నెసఁగెఁ
తే. బంక్తిరథపుత్రులిరువురు•భ్రాతలుత్త, మాయుధులు రామలక్ష్మణా•హ్వయులు
  జేరఁ జనుదెంచి నిలిచిరి • సింధుతటిని, బ్రబలదశయోజనావృత • [సీతఁ
  బలముతోడ.

అర్థములు. చారుఁడు = వేగులవాఁడు, అప్రమేయము = ప్రమాణము చెప్పరానిది, గంభీరము=దురవగాహము (సేన) లోతుఁ (సముద్రము) మాఱట జలధి=రెండవ సముద్రము, ప్రబల = బలిష్ఠమైన, దశయోజనావృత = పదియోజనముల నేల యావరించినంత. బలముతో=సేనతో, ఇది వేంకటగిరిరాజ కుమారుల లెక్కవంటిది, మూపాయకు డబ్బు లెన్నియనిన రెండుచేతులు జోడించి యున్ని యని చూపుదురు.

### తాత్పర్యము

రావణుఁడు నియమించిన శార్దూలుఁడను వేగులవాఁడు సుగ్రీవుని సేన యున్నవిధము నంతయుఁజూచి మిగుల వేగముగఁబోయి రావణుని జూచి రాక్షస రాజా! వానరులయు, ఎలుఁగులయు సేన మన పట్టణముమీఁదఁ బడుటకు నిదిగోఁ బొర్లివచ్చెను. ఆసేన పరిమాణ మింత యని చెప్పలేను. మిగుల గంభీరమై రెండవ సముద్రమువలె నున్నది. పదియోజనముల నేల యాక్రమించి యున్నది. దశరథకుమారు లిరువురు నన్నదమ్ములు రామలక్ష్మణు లనువారు శ్రేష్ఠములైన యాయుధములు ధరించి సీతాదేవియొద్దకు వచ్చుటకై సమీపమందే సముద్ర తీరమున నున్నవారు.

ఉ. వైశస దేవరా! తగిన•వారిని దూతల నంపు సర్వముం
  బోలఁగ మూలముట్టుఁగఁ • బుచ్చుము వేగమ, నాకుఁ జూడ నీ
  వేళను సామదానములలో•భేదమె యర్హవిధం బటన్న శా
  ర్దూలునివాక్యముల్ విని ని•రూపిత కార్యవిదుండు వ్యగ్రుఁడై. ౪౦౪

అర్థములు. వైశస=వేగమే, దేవరా=ప్రభూ, దేవశబ్దభవము, నిరూపిత కార్యవిదుండు=చేయవలసిన కార్యమును చక్కఁగ నిరూపింపఁ దెలిసినవాఁడు, వ్యగ్రుఁడు=హెచ్చరిక గలవాఁడు.

తాత్పర్యము

ప్రభూ! వారి సమాచారము సర్వము తెలిసికొనుటకై త్వరగా వారు వచ్చి యూరిపై పడకముందే దూతలను బంపుము. నా యభిప్రాయ మీ సమయమున సామమో దానమో భేదమో తగియున్నది. (దండోపాయము వ్యర్థమని భావము) అని చెప్పఁగా శార్దూలుని మాటలు విని యా తరువాత నెట్లు కార్యము చేయవలసినది తెలిసిన రావణుఁడు హెచ్చరిక గలవాఁడై.

వానరులు సముద్రతీరము చేరిన వెంటనే యా శార్దూలుఁడుపోయి రావణునకుఁ దెలిపెను. ఈ కారణముచేతనే మఱునటినాఁటి యుదయమున రావణుఁడు సభ చేసి విభీషణు వెడలఁ గొట్టెను.

—• రావణుఁడు శుకుని సుగ్రీవునొద్దకు రాయబార మంపుట •—

క. శుకనామకు నర్థవిదు, న్నికటమునకుఁ బిలిచి యనియె • నీ వరిగి వెసన్
వికలుఁడవుగాక మద్వా,చికముగ సుగ్రీవుతో వ•చింపుము సూక్తిన్. ౨౧౦

అర్థములు. శుకనామకున్ = శుకుఁడను పేరుగలవానిని - అర్థవిదున్ = చేయవలసిన పని తెలిసినవానిని - నికటమునకు = సమీపమునకు - రహస్యముగఁ జెప్పుటకై - వికలుఁడవు = భయముచే గుండె చెదరినవాఁడవు - మద్వాచికముగన్ నేను జెప్పినట్లు నామాటగ - మారీచుఁడు జింకవలె నగునట్లు వీఁడు చిలుక వలె రూపము ధరింప నేర్చినవాఁడు.

తాత్పర్యము

చేయవలసిన కార్యము విధానము తెలిసినవాఁడునగు శుకుఁడను పేరు గల వానిని రహస్యముగఁ జెప్పుటకై దగ్గఱకుఁ బిలిచి నీవు త్వరగాఁ బోయి సుగ్రీవాదులఁజూచి భయపడక నేను జెప్పినా నని సుగ్రీవుతో నీ మాట చెప్పుము.

ఉ. ఈవు మహాబలాఢ్యుఁడవు • ఋక్షరజస్తనయుండవున్ మహా
క్ష్మావరవంశజాతుఁడవు • కాఁగల లాభ మదెద్ది నీకు నీ
రావిభుతోడి చెల్మిఁ? గల•దా యొకనష్టము నీడిపోవ? సు
గ్రీవ! మదీయభ్రాతవు స్మ • రింపుము పూర్వపునెయ్య మియ్యెడన్. ౨౧౧

అర్థములు. ఈవు = నీవు అనుటకు మొదటి రూపము, మహాక్ష్మావర = గొప్పరాజుల, వంశజాతుఁడవు = వంశమునఁ బుట్టినవాఁడవు. నీవు సూర్యపుత్రుఁడ వగుట గొప్ప వంశము వాఁడవు.

తాత్పర్యము

సుగ్రీవా! నీవు మహాబల సంపత్తి గలవాఁడవు కావున నల్పబలుఁడగు రాముని వలన నీకుఁ గావలసిన కార్యము లేదు. ఋక్షరజస్సుకుమారుఁడవు. కావున గొప్ప రాజవంశమునఁ బుట్టినవాఁడవు. కావున నిష్కారణ కలహము నీకు ధర్మము

కాదు. అదియునుగాక నీవు బ్రహ్మ మనుమఁడవు, నేను బ్రహ్మ మనుమఁడను కావున మనకు బంధుత్వమును గలదని భావము. కావున నల్పుఁడైన రామునితో నీకేమిపని? రామునితో స్నేహము చేయుటచే నీకు రాఁగల లాభములేదు. వదలి పోయిన నీకుఁగలుగు నష్టియులేదు. ఇఁక మన విషయ మాలోచించిన నీవు నాకు సోదరుఁడవు. పూర్వపు మన స్నేహము తలఁపుము (వాలినిబట్టి యీ సంబంధము.)

క. రాముఁ డను రాజపుత్రుని, భామిని నే నపహరింపఁ ♦ బ్రాజ్ఞవరా! నీ
కేమగు నష్టము? సుగ్రీవా! మరలుము నిదు పురికిఁ ♦ బగ మన కేలా? ౪౧౨

అర్థములు. ప్రాజ్ఞవరా=బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా.

తా త్ప ర్య ము

రాముఁడను రాచవాని భార్యను నే నపహరించిన నీకుఁ గలిగిన నష్టమేమి. రాముఁడు నీ జాతివాఁడును గాఁడుగదా, వానికి నీకు నెట్టిసంబంధము లేదుగదా? బుద్ధిమంతుఁడవు, దీని నాలోచించి నీ యూరికి నీవు పొమ్ము. మిత్రులుగను భ్రాతల వలె నింతవఱకున్న మనకు నిష్కారణ విరోధమేల ?

క. వానరవరు లెమ్మెయినే, నీ నగరముఁ జేరలేరు ♦ దృఢ మిది గంధ
ర్వానీకము నేరద నర, వానరులా వచ్చువారు ♦ వనచరనాథా ? ౪౧౩

తా త్ప ర్య ము

. నీవు పోకపోయితివిపో, ఏ విధముగ యత్నించినను వానరులు సముద్రము దాటి యచ్చటికి రాఁజాలరు ఇది నిశ్చయము. ఆకాశమున నెగిరివచ్చు గంధర్వులే రాఁజాలనప్పుడు క్రోఁతు లెట్లు రాఁగలవు. ఇదియు నీ వాలోచింపుము.

చ. అను విభు నానతిం గొని వి♦హంగమ మై శుకుఁ డంబరంబునన్
జని చని ఖస్థితుం డగుచు ♦ సారసబాంధవసూనుతోడ న
ద్దనుజకులేంద్రువాక్యములు య♦థాక్రమ మంతయుఁ జెప్పఁ, గినుకఁ జి
వ్వున వినువీదికి న్నెగసి♦పోయి కపుల్ శుకు నేలఁ దాఁచుచున్. ౪౧౪

అర్థములు. ఆనతి=ఆజ్ఞ, విహంగమ మై=పక్షివలెనై, అంబరంబునన్ = ఆకాశమార్గమున, ఖస్థితుండు = ఆకాశమందున్నవాఁడు, సారసబాంధవ సూను తోడన్ = సూర్యపుత్రుఁడగు సుగ్రీవునితో, యథాక్రమము=క్రమముదప్పక, రావణుఁడు చెప్పిన వరుసన, కినుకన్=కోపముతో, వినువీదికిన్ = ఆకాశమార్గమునకు, తాఁచుచున్=కొట్టుచు.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము చెప్పు రాజు నాజ్ఞ గ్రహించి యీ రాక్షసుఁడు చిలుకవలెనై యాకాశ మార్గమునబోయి నేల దిగక యందే యుండి సుగ్రీవునితో రావణుఁడు చెప్పినమాటలు క్రమము దప్పక చెప్పఁగా నామాటలు విని వానరులు కోపించి చివ్వున నాకాశమున కెగసిపోయి వానిని బట్టుకొని విసరి నేలపైఁ గొట్టి.

—• వానరులు శుకుని మర్దించుట •—

క. పిడికిళ్ళ నొకరి నొక్కరు, కడవఁగ మర్దించుటయును • గలవరపడుచున్
మడియింప రాదు దూతలఁ, గడుపడి వారింపు కపులఁ•గాకుత్స్థవరా! ౮౧౫

అర్థములు. కడవఁగన్ = అతిక్రమించి, ఒకరిని మించి మఱియొకరు, కడుపడిన్ = మిగుల వేగముగ.

తాత్పర్యము

నేలఁ బడవైచి యొక క్రోఁతిని మించి మఱియొక క్రోఁతి పిడికిళ్ళతోఁ జక్కఁగ మర్దింపఁగా వాఁడు కలవరపడి దిక్కు తెలియక యేమి చేయుటకుఁ దోఁపక రామచంద్రా నేను దూతను, దూతలఁ జంపరాదు, వీరు నన్నుఁ జంపుటకు ముందే వీరిని నివారింపుము.

చం. పతి విధియించు మార్గమునఁ • బల్కక యాత్మమతంబుఁ జాటుచుం
బతినుడులన్ వచింపని కు • మార్గపుదూతలు వధ్యు లంద్రు, నేఁ
బతి వధియించినట్టి విధిఁ • బల్కితి, దోసమె రామ? యన్న నా
దృతి నలదూత చేయు పరి•దేవనమున్ విని రామభద్రుఁడున్. ౮౧౬

అర్థములు. ఆత్మమతంబు = తన యభిప్రాయము, చాటుచున్ = ప్రకటించుచు, పతినుడులన్ = ప్రభువుచెప్పిన మాటలను, కుమార్గపుదూతలు = వక్రమార్గమునఁబోవు దూతలు, వధ్యులు = చంపఁబడఁదగినవారు, ఆదృతిన్ = ఆదరముతో, పరిదేవనము = యేడ్పు మొఱ.

తాత్పర్యము

ప్రభువు చెప్పినట్లు చెప్పక తన యిష్టప్రకారము చెప్పుచు పతనిమాటలు చెప్పని దుష్టదూతలు కదా చంపఁబడ నర్హులు, నేను నా ప్రభువుచెప్పిన మాటలఁ జెప్పితిని. ఇది దోషమా యనఁగా రామచంద్రమూర్తి యా దూత మొఱ విని యాదరముతో.

కం. వానిని జంపఁగవల దన, వానరు లవ్వాని గటులు • పాచి విడిచినన్
దీనత మింటికిఁ జని యా, వానరవిభుతోడ ననియె • వదలని భీతిన్. ౮౧౭

గటులు పాచి = ఱెక్కలు పెఱికి.

తాత్పర్యము

వానిని జంపవల దని చెప్పఁగా వాని ఱెక్కలూడఁ బెఱికి వదలిపెట్టఁగా వాఁ డాకాశమునకుఁ బోయి భయపడుచు సుగ్రీవుతోడ నిట్లనియె.

కం. శ్రీమతి బలసంపన్నా! భీమపరాక్రమ! కపీంద్ర! • వీటికిఁ జని నే
నేమని వచింతు నయ్యా, నీమాటగ స్వామి! యూమి•నీచరపతితోన్. ౮౧౮

అర్థములు. శ్రీమతి బలసంపన్నా = ఐశ్వర్యము బుద్ధి బలముగలవాఁడా!

భీమపరాక్రమ = భయంకరమైన శౌర్యముగలవాఁడా! వీటికిన్ = లంకాపురము నకు, యామినీచరపతితోన్ = రాక్షసరాజుతో.

తాత్పర్యము

విశ్వైర్యము బుద్ధిబలము విశేషముగఁ గలవాఁడా-భయంకరమైన పరాక్రమముగలవాఁడా! వానరరాజా! నేను లంకకుఁబోగానే రాక్షసరాజు సుగ్రీవుఁ డేమి చెప్పెనని యడుగునే? నీ మాటగ నే నేమి చెప్పుదును?

—• సుగ్రీవుఁడు రావణునకుఁ బ్రత్యుత్తర మంపుట •—

ఉ. నావుడు దూతఁ జూచి కపి • నాయకుఁ డిట్లను నోరి చారుఁడా
యీ విధిఁ బల్కు రావణున • కీ వెటుచూచిన నాకు మిత్రుఁడున్
గావు, ప్రియుండ వేనియును • గా, వుపకర్తవు గావు, గావునన్
నీవు పలాశినాథ! దయ • నీయుఁడ వైనను గావు నమ్ముమీ. ౩౮

అర్థములు. దూతన్ = దూత నని చెప్పుకొనుచున్నవానిని, చారుఁడా= వేగులవాఁడా, ఇట్లు చెప్పుటచే వీఁడు దూతనని చెప్పుకొన్నను వీఁడు దూతగా వచ్చినవాఁడుకాఁడు, దూత నను పేరితో మర్మము లెఱఁగిపోవుటకై వచ్చిన వేఁగు వాఁడని భావము. వాస్తవదూత యగునేని దూరముననుండి సేన నంతయు దొంగ చూపులఁ జూడఁబనిలేదు. చక్కఁగా సుగ్రీవు నొద్దకువచ్చి నేను దూతనువచ్చితి నని చెప్పి ప్రత్యుత్తరము తీసికొనిపోయి యుండవలెను. వీఁ డట్లు చేయకపోవు టచే వేగులవాఁడని తలఁపఁబడెను. ఈ విధిన్ = ఈ ప్రకారము, ఎటుచూచినన్ = ఏ విధముగ నాలోచించినను, ఉపకర్తవు = ఉపకారము చేసినవాఁడవు, పలాశి నాథ=రాక్షసరాజా, దయనీయుఁడవు=దయదలఁపవలసిన వాఁడవు.

తాత్పర్యము

అని వాఁడు చెప్పఁగా సుగ్రీవుఁ డా దూతను జూచి యిట్లనియె. ఓరీ! నీవు చారుఁడవేకాని దూతవుగావు. అయినను నీవు దూతనని ప్రత్యుత్తర మిమ్మని కోరుచున్నావు. కావున రావణునితో నిట్లు చెప్పుము. నే నెన్నివిధముల నాలోచించి నను నీవు నాకు మిత్రుఁడవుగావు. ఏలన నిదివఱకు నాయందు నీకుఁగాని నీయందు నాకుఁగాని స్నేహభావములేదు. ఉపకారముచేసిన వాఁడుకదా మిత్రుఁడు. నీవు నాకుఁజేసిన యుపకారమేదియు లేదు. ప్రియుండవుకావు, ఉపకారముచేసినవాఁడవు కావు. ఈ కారణములచే రాక్షసనాథా! నీవు దయతలఁపబడవలసిన వాఁడవుకావు.

రామచంద్రమూర్తి నా యందు స్నేహభావము గలవాఁడు, అగ్నిసాక్షిక ముగా మైత్రిచేసినవాఁడు, నా మేలుకోరువాఁడు, వాలినిజంపి నాకుపకారముచేసిన వాఁడు, కావున ఆయనయందు నేను దయ తలఁపవలయునుగాని యెట్టి సంబంధము లేని నీ విషయమున నెట్లు దయ తలఁపఁగలను.

కం. రామునకు నీవు వైరివి, రామునకును నేను హితుఁడ • రాక్షసరాజా!
రామునిచే నీవును సంగ్రామంబున వాలిఁ బోలఁ•గల వో వధ్యా ౩౨౦

అర్థములు. వధ్యా = వధకర్హుఁడైనవాఁడా.

తాత్పర్యము

రామచంద్రమూర్తికి నీవు పగవాఁడవు, రామచంద్రమూర్తికి నేను మేలు గోరువాఁడను కావున నీవు నాకును బగవాఁడవే. వాలివరుసనుబట్టి నీవు నాకు భ్రాతవంటివి. వాలి నాకుఁ బగవాఁడు కావునఁ జంపించితిని. నిన్ను నట్లే చంపించెదను.

చం. వదలక నిన్ను జ్ఞాతిహిత • బాంధవపుత్రసమూహయుక్తుఁ గాఁ
గదనములో వధించెద, ని • కారము గాదిది లంక సర్వముం
బదడొనరించెదన్ నిమిష • మాత్రమునన్ హరిసేనఁ బంచి, నీ
యుదుటిలఁ జెల్లదింకఁ, జెడు • గొప్పనే పొందు నిశాచరేశ్వరా! ౪౨౧

అర్థములు. కదనములో = యుద్ధమందు, నికారము = మోసము, పదడు = ధ్వంసము, ఉదుటు = గర్వము.

తాత్పర్యము

నిన్ను నీ జ్ఞాతులతోఁ హితులతోఁ జుట్టములతోఁ గొడుకులతో నొకనినైన వదలక యందఱతో యుద్ధమునఁ జంపెదను. ఇది మోసపుమాటగాదు సత్యము. వానరసేనను బంపి నిమిషములో నీ లంక ధ్వంసము చేసెదను. నీ గర్వ మింకఁ బనికిరాదు. మత్తత్వము కలకాలము చెల్లునా? నీవు రాక్షసులకు రాజగుటచే నీ దోషమున నీవే కాక వారందఱు చావఁగలరు. వానరులు లంకకు రాలేరనుటకిది సమాధానము.

శా. పాతాళంబున దాఁగినన్ సురపతిం • బ్రార్థించి తోడ్తెచ్చినన్
ద్యోతస్ఫీతు పథంబులో మఱిఁగినన్ • దుర్మార్గశీలా! యథా
జాతా! రావణ! నిన్నుఁ బ్రాణములతో • సంగ్రామరంగంబునన్
సీతానేత విడండు, నేలకు బలిన్ • నీ కంఠముల్ గూర్చెడిన్. ౪౨౨

అర్థములు. ద్యోతస్ఫీతు = సూర్యునియొక్క, 'ప్రకాశోద్యోత ఆతప' యని యమరము-ఎండచే నతిశయించినవాఁడు, సూర్యుఁడు-అయనపథము ఆకాశము, మఱిఁగినన్ = దాఁగుకొన్నను, యథాజాతా = మూఢుఁడా, సీతానేత = రామచంద్రమూర్తి, రాముని భార్యను నేఁదెచ్చిన నీ కేమి నష్టియంటివి. ఆ రాముఁడే నా సాహాయ్యమున్నను లేకున్నను నిన్నుఁ జంపఁగలఁడని భావము.

తాత్పర్యము

నేను లంకలోనుండినఁగదా మీరు లంకపై వచ్చెదరు. నేను దేశాంతరము పోయిన నన్నేమి చేయఁగలరందువేమో? దుష్టుఁడా! నీవు పాతాళములో దాఁగుకొన్నను ఆకాశములో దాఁగుకొన్నను ఇంద్రుని బ్రార్థించి తోడి తెచ్చినను నీవేమి

చేసినను మూఢుఁడా! రావణా! సీతాపతి యుద్ధమందు నీ తలలను నేలకు బలి పెట్టక మానఁడు.

కం. సీతాపతి కినిసిన యా, పాతకి రక్షించువాని • బ్రహ్మాండములో
దైతేయపిశాచామర, జాతంబుల నే నెఱుంగ • క్షణదాటవరా. ౮ ౨౩

అర్థములు. క్షణదాటవరా=రాక్షసశ్రేష్ఠుఁడా - కినిసినన్ = కోపించిన, పాతకి=పాపి; జాతంబులన్=సమూహములందు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యెవనిపైఁ గోపించునో యట్టి పాపాత్ముని రక్షింపఁ గలవాఁడు బ్రహ్మాండములోపల రాక్షస పిశాచ దేవతల సమూహములందు రాక్షసుఁడా! నే నెఱిఁగినవాఁడు లేఁడు, కావున నీ చావు సిద్ధము.

కం. బడుగును ముదుకని దుర్బలుఁ, బొడిచితివి జటాయు నంతఁ • బోటు మిగిలెనే
చెడుతనమె కాక నీయెడఁ, బొడగానఁగఁ గలదె బీర • మును బలలాశీ. ౮ ౨౪

అర్థములు. బడుగున్=అశక్తుని, ముదుకని=ముసలివానిని, దుర్బలున్ = ఆ కారణమున బలము లేనివానిని, పొడిచితివి=చంపితివి, పోటుమిగిలెనే=శూరుఁడ వైతివా, బీరము=వీర్యము, పలలాశీ=మాంసభక్షకుఁడా.

తాత్పర్యము

రామచంద్రమూర్తికి సహాయుఁడుగా వచ్చిన జటాయువుగతియే నీకు వచ్చునందువా? అశక్తుఁడు ముసలివాఁడు బలహీనుఁడు నొంటరివాఁడు నగు జటాయువును జంపినంతమాత్రముననే నీవు శూరుఁడవైతివా? నీయందు దుర్మార్గము కానవచ్చుచున్నదిగాని వీర్యమేదీ లేదుగదా.

చం. అవనివిభుండు చూచునెడ • నా మఱి లక్ష్మణు ప్రోలనైన నా
యవనిజ నీ హరించుట? క • టా తలపోయఁగ లేవ యట్టి నీ
యవగడపుం బనిం గలుగు • హాని, మహాత్ము మహాబలున్ శచీ
ధవముఖదుర్జయున్ రఘువ • తంసము నేమిగ నెంచినాఁడవో. ౮ ౨౫

అర్థములు. అవగడపుంబనిన్ = చెడుకార్యము-శచీధవముఖదుర్జయున్ = ఇంద్రాదులకును జయింపరాని వానిని- రఘువతంసము = రఘువంశమునఁ బుట్టిన వారిలో శ్రేష్ఠుని.

తాత్పర్యము

తనభార్యను హరించినపుడు నన్నేమి చేయలేని రాముఁడు నేఁ డేమి చేయఁ గలఁడందువా? నీవు బల పౌరుషములు గలుగువాఁడవైతివేని నీవు సీతను దెచ్చిన దెపుడు? రామచంద్రమూర్తి చూచుచుండఁగా దెచ్చితివా? ఆయన గాకున్న నాయన తమ్ముఁడు లక్ష్మణుఁడైన నెదుట నుండఁగా దెచ్చితివా? వారు చూచినఁ జంపుదురనిభయపడి దొంగతనముగాఁ గదా తెచ్చితివి. ఇట్టియకార్యముచేతఁ గలుగు

హాని యెట్టిదో యాలోచించితివా? గొప్ప ధైర్యము గొప్పబలము గలవాఁడును నింద్రాదులకు జయింపరాని వాఁడును, రఘువంశపు రాజులలో శ్రేష్ఠుఁడును నగు రామచంద్రమూర్తి సామాన్యుఁడని తలఁచితివా? రెండవపాదంబునఁ బ్లుతయతి.

కం. నీ పాలిటి కాలునిఁగా, క్ష్మాపాలకుఁ దలఁపు మనిన ♦ సత్వరుఁడై తా
రాపుత్రుఁడు కపిపతిపైఁ, జూపుంచి వచించె శుకునిఁ ♦ జూపుచు మింటన్.

అర్థములు. కాలునిఁగా = యమునిఁగా - క్ష్మాపాలుకున్ = రామచంద్ర భూపాలుని - సత్వరుఁడై = త్వరతోఁ గూడినవాఁడై.

తాత్పర్యము

రామచంద్రమూర్తి నీ పాలిటి మృత్యువుగాఁ దలంపు మని చెప్పుచుండ నా మాటలు విని వాఁడు మరలిపోవునేమో యని యంగదుఁడు త్వరపడి సుగ్రీవునిఁ జూచి యాకాశంబున నున్న శుకుని జూపించి యిట్లనెను.

కం. చావందు గాని ప్లవగమ, హో రాజా! రాయబారి ♦ యనరా దితనిన్
జోరవిలోకనముల బల, మారయు చున్నాఁడు తూఁచి♦నటు లుండి యటన్.

తాత్పర్యము

వానరరాజేంద్రా! వీఁడు రాజకార్యముమీఁద దూతయై వచ్చినవాఁడు కాఁడు. నీతోఁ బనియుండి వచ్చినవాఁడు నిన్నుఁ జూచి మాటలాడవలెను. అట్లు చేయక వీఁడు సేనయంతయు గానవచ్చుచోట నాకాశమున సరిగానుండి దొంగ చూపులచే సేననంతయు లెక్కించుచున్నాఁడు. కావున వీఁడు వేగులవాఁడే కాని దూతగాఁడు. దూతను జంపరాదు గాని వేగుల వానిని జంపవచ్చునుగదా.

కం. పోనీయరాదు లంకకు, వీని నవన్ రాజునాజ్ఞ ♦ వృక్షాటులు న
వ్వానిని గట్టియుఁ గొట్ట ను, హానిష్ఠురవృత్తిఁ బఱప♦నదయుఁ బోలెన్. ౩౨

తాత్పర్యము

వీనిని మరల లంకకుఁ బోనీయరాదని యంగదుఁడు చెప్పఁగానే సుగ్రీవు నాజ్ఞ ప్రకారము వానరులు వానిని బట్టుకొని కట్టి దయలేక కొట్టి బాధపెట్టఁగా దిక్కులేని వానివలె.

కం. దేవుర్వ్రఁ బడుచు వికటా, రావంబున మొఱలు వెట్టె ♦ రామా! రామా!
నీవేగతి, చంపెదరయా, యీ వానరవరులు కావ♦వే ననుఁ గరుణన్. ౩౩

అర్థములు. దేవుర్వ్రఁబడుచు = దీనత్వము పడుచు, ఇది దేవురు శబ్దబహు వచనము' 'ఈవఱదను గనురోఁతల దేవుర్వ్రంబడితి. పం. తం. వేం. వికటారావంబు నన్ = పెద్దధ్వనితో, రామునకు వినవచ్చునట్లు, నాలుగవపాదంబునఁ బ్లుతయతి.

తాత్పర్యము

దీనుఁడై పెద్దగొంతుతో రామా! రామా! నీవేగతి. రామా! వీరు నన్నుఁ దెరకుఁ జంపుచున్నారయా! దయయుంచి కావుము అని మొఱపెట్టెను.

చ. పెఱికిరి కంటిగ్రుడ్లు పృథు•వీవరసత్తమ! నాదు ఱెక్కలన్
నఱికిరి, యీ మహార్తి నిధ•నంబును గంటినయేని చెప్పెదన్
దఱచుగ నాదు పుట్టువు మొ•దల్గొని రేపగ లింతదాఁక నేఁ
గఱకువఁ జేసినట్టి కొఱ•గాముల పాపము నిన్ను ముట్టెడిన్. ౪౩౦

అర్థములు. వానరులు చేసినపనులు చెప్పుచున్నాఁడు. నిధనంబును = మరణమును, రేపగలు = రే+పగలు సమాహార ద్వంద్వము కావున, ఏకవచనము కఱకువ=కఠిన బుద్ధిచే, కొఱఁగాముల=పాపకార్యముల.

తాత్పర్యము

అయ్యో! రామచంద్రా! నా కంటిగ్రుడ్లు పెఱికిరయ్యా! నా ఱెక్కలు నఱకిరి. ఈ బాధచే నేను జచ్చితినా, ఫలము చెప్పెదను విను నేను బుట్టినది మొదలు కఠినచిత్తుఁడనై యెన్నియో చేయరాని పనులు రాత్రి యనిలేక పగలని లేక యెల్ల వేళల చేసినవాఁడను. ఆ పాప మంతయు నిన్నంటును.

ఉత్సాహము. ఆ విలాప మాలకించి • యంబుజాక్షుఁ డాతనిన్
గావుఁ డతఁడు దూతగాన • ఘాత మర్హ మౌనె? నా
నా వనాటు లతనిఁ జంప • రైరి; యంత భూమిక
న్యావిభుండు జలధివేల•యందు దర్భశయనుఁడై. ౪౩౧

అర్థములు. విలాపము=ఏడుపు, ఘాతము=చంపుట, వనాటులు = వానరులు, దర్భశయనుఁడై = దర్భలయందుఁ బండుకొనఁదలఁచి కూర్చుండినవాఁడై, ఇంతవఱకుఁ బండుకొనలేదు. పంపుకొని యుండిన మౌనవ్రతమునకు హాని, కావున మాటలాడి యుండఁడు. చూ. ప. ౪౩౬.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యీ యేడుపు విని వాఁడు దూతగావున వానిని జంపరాదు రక్షింపుఁ డని చెప్పఁగా వానరు లతనిఁ జంపరైరిగాని పట్టికట్టి చెఱయం దుంచిరి గాని విడిచినవారుగారు. సేతువు కట్టి వానరులు దాఁటి యావలియొడ్డు చేరిన పిమ్మట వదలిరి. (చూ. ప. ౫౦౬) అంత రామచంద్రమూర్తి సముద్రపు టొడ్డున దర్భశయనముందున్నవాఁడై.

ఈ శుకుని చరిత్రము విభీషణుఁడు రామునొద్దఁ జేరిన పిమ్మట జరిగినదనియే తోఁచుచున్నది.

**—• ౨౧-వ సర్గము. శ్రీరాముఁడు దర్భశయనంబునఁ బరుండుట. •—**

సీ. మునుహారంగు లెసంగ•నునురంగుజాళువా, బంగారుతొడవుల•వలలుదానిఁ
గాంచనకేయూర•క్రమముక్తావర, భూషణాంచిత మయి • పొలుచుదానిఁ
బరమనారీజన•కరములచేఁ బెక్కు, బకులను నల్గిడఁ•బడినదానిఁ
జందనాగరుపూత•సౌరభోపేతమై, రక్తచందనమునఁ • గ్రాలుదాని

తే. శయనతలమున జానకీ • చంద్రవదన, యుత్తమాంగంబుచే శోభ • నొందుదాని
గాంగజలములఁ దక్షకు • కాయమునకుఁ, దుల్యమగుదానిదీనార్తిఁ • దోలఁచుదాని.

అర్థములు. మును=(౧)అయోధ్యలోనున్నప్పుడు,(౨)రామావతారపూర్వమున వైకుంఠముననున్నప్పుడు,హొరంగులు=సింగారములు,ననురంగు=ననుపైన రంగుకల, జాళువా=అపరంజి,తొడగులు=సొమ్ములు, ఇది మొదలు మూఁడు పద్యములు రామభుజవర్ణనము,కాన నిందలి ద్వితీయాంతము లన్నియు రామభుజవిశేషణములు, కేయూరము=బాహుపురి, పరమనారీజనకరములచేన్=గొప్పవంశమున జనించిన స్త్రీల చేతులచేత, పెక్కుబడులు = పెక్కుతడవలు, ఇచ్చట నలుగుపెట్టి యలంకరించినట్లు చెప్పియున్న వీరలు రాముని సైరంధ్రీపరిచారికలు,సైరంధ్రులు= వీరుత్తమజాతిస్త్రీలు,కం.ఆరయ నెందును గారవ,భారం బెడలంగనీక పాతివ్రత్యాచారము పై వర్తింతురు, సైరంధ్రీజాతివారు,సౌజన్యముననన్. కం.కావున నుచితము లగు నా,కావెంటన్ గొలిచి తిరుగునప్పుడు మితభా,షావిరచనమును వ్రతిసం,భావనము గారవంబు పాపభయంబున్, భార. విరా. ౧. ౧౧౧-౧౧౨.ఇవి ద్రౌపదీ వాక్యములు. ఈ జాతివారు ఎంగిలిన్ని దినరు కుచ్చితపుఁబనులు సేయరు. ఇట్టివారు పరమవారు లని చెప్పఁబడిరి. పరమనారీశబ్దము భార్యార్థమున యోగముగాదు, రూఢిగాదు, యోగరూఢికాదు. పతివియోగకాలంబున దమయంతియు నిట్టి వ్రతమవలంబించి యుండెను. పూర్వము రాజులకు స్త్రీలే యలంకారాదులను జేయువాడుక; కాఁబట్టియే యయోధ్యాకాండమునందును "హాయి నలంది గంధము మహోర్వులు చేడెలు వీచుచుండ" నని స్త్రీ పరిచారిక లున్నట్లు చెప్పఁబడెను. కాదంబరియందును జంద్రాపీడునికి నొక యంతరంగ పరిచారిక యున్నట్లు చెప్పఁబడినది. కొందఱు-ఇట్టి సందర్భములనుబట్టి రాముని కనేక భార్యలుండి రని చెప్పుదురు. వీరికి సాధకము లైనవి యీ రామాయణముననే కలవనియుఁ జెప్పుదురు. ఈ పద్యములు వీరి యభిప్రాయము నెంతమాత్రము సాధింపనేరవు. కాన వీరి యభిప్రాయ మెంతయుఁ దప్పు. అదెట్లనఁగా సంక్షేప రామాయణమందు 'రామస్య దయితా భార్యా-రాముని యిల్లాలు.—నాథునకు సతము ప్రాణతుల్య" యని చెప్పఁబడెను. ఇందు రాముని భార్యకు ప్రాణతుల్య యని విశేషముండుటచేతఁ బ్రాణతుల్యలు కాని కొందఱు భార్యలును రామునికుందు రనియు వారందఱికంటెను సీతయే ప్రియురాలనియుఁ దెలియవచ్చుచున్నది. ఇంతియకాక యీ ప్రకరణముననే పై పద్యమునందు 'శశి రోహిణీరీతి స్వేచ్ఛనంటె చనె' నని చెప్పఁబడెను, చంద్రునకుఁగల నక్షత్రరూపలైన యనేక భార్యలలో నొక్కతెయై చంద్రున కత్యంత ప్రియురాలైన రోహిణిని సీతకు దృష్టాంతముగాఁ జెప్పియుండుట చేతను, చంద్రునికి వలె రామునికిఁ బెక్కుండ్రు భార్యలు కలరనియు వారిలో సీత ప్రియయుఁ దక్కినవా రప్రియు లనియుఁ దోఁచుచున్న

దని పూర్వపక్షుల యభిప్రాయము. ఇది సరికాదు. ఈ పద్యమునందే "అన్నకుఁ బ్రీతిపాత్రుండు...లక్ష్మణుఁడు" అని యున్నది. దీనినిబట్టి రాముని కొక్క లక్ష్మణునియందే ప్రీతి, తక్కినవారియందు సంతప్రీతి లేదు. కాన రామునికిఁ బ్రీతిపాత్రులైన తమ్ములు కొందఱును ప్రీతిపాత్రులుకాని తమ్ములు కొందఱును గలరని చెప్ప వచ్చునా? ఇట్లు చెప్పుట సాహసముకదా. "రాఘవ వంశనాథు తత్తనయు చరిత్ర చెప్పుము ముదంబగు (అయోధ్య ౨౭౯ప) అనియు 'భ్రాతలందఱు భరతునిసాటి గారు. అను రామాయణవాక్యములు యిపుడు విరోధింపవా? కాఁబట్టి యాపదము లకుఁ దాత్పర్యము మీరు చెప్పినట్లుకాదు. మిక్కిలి గారాబముగా పెరుఁగుటచేతను సౌకుమార్యమునుబట్టి రాజమందిరములలోనే యుండఁదగిన యీ సీతా లక్ష్మణు లునుగూడ రాముని వెంబడి యరణ్యమునకుఁ బోయిరికదాయని కవి తాత్పర్యము. సీతకు దృష్టాంతముగాఁ జెప్పిన రోహిణి చంద్రునికిఁ బ్రియభార్యగాఁ బ్రసిద్ధురాలై నక్షత్రరూపమైయున్న రోహిణికాదు, ఈమె విషువక సదా చంద్రు ననుసరించుట లేదు. భర్తను విడనాడక సదా వెంబడించు సీతకు నిట్టి రోహిణీ దృష్టాంతము సరిపడదు, కాన సదా భర్త ననుసరించెడి మఱొక రోహిణియే యిట వివక్షిత. ఈమె దక్షుని కూఁతురుగాదు. రుద్రసర్గములోఁ జేరినది. (చూడు.వి.పు.౧౮-౭) కాఁబట్టి యీ దృష్టాంతమునుబట్టి రామునికి కొందఱు భార్యలప్రియులుగా నున్నా రనుట యెట్లు యుక్తము? "హృష్టాః ఖలు భవిష్యంతి రామస్య పరమాః స్త్రియః అప్రహృష్టా భవిష్యంతి స్నుషాస్తే భరతక్షయే" "సంతసమున రామ స్త్రీసంతతి త్రుళ్ళంగ భరతుక్షయమున మదిలోసంతాపింతురు. నీస్నుష లెంతో చింతింపు దీని కెయ్యది తెరువో" అని అయోధ్యాకాండమునందు మంథర కైకేయితోఁ జెప్పినట్లున్నది. ఇందు నీ స్నుష లనుటచేత భరతున కనేక భార్యలు కలరనియు దీని సాహచర్యమునుబట్టి రామ స్త్రీసంతతి యనఁగా రామ భార్యలని యర్థము కాన రామునికి ననేక భార్యలు కలరనియు స్పష్టముగా నేర్పడుచున్నదని మఱొక పూర్వ పక్షము చేయుదురు. ఇదియుసరికాదు.కులగురువసిష్ఠులనిన నెందరువసిష్ఠులుగలరు? రఘూణా మన్వయం వక్ష్యే యన్నప్పు డెందఱు రఘువులుగలరు? యదూనాంపతిరే వమ" యన్నప్పు డెందఱు యదువులుగలరు? రావణులు వచ్చుచున్నారనిన నొంట రిగా వచ్చుచున్నారని యర్థమా? బాలకాండమున సీతాకల్యాణఘట్టమునందుఁదప్ప వేఱొకచోట రామాదులకు వివాహమయినట్లు రామాయణమందుఁ జెప్పలేదు కాన వీరికిఁ జెక్కురు భార్యలెట్లు సంభవింతురు. మఱొక గ్రంథమునఁ జెప్పి యున్నను నది వీరివిషయమని చెప్పరాదు.రామాదుల చరిత్రమును వాస్తవముగాఁ జెప్పునది యొక వాల్మీకి రామాయణమే తప్ప మఱొక గ్రంథముకాదు. ప్రధానమైన రామాయణమున విరుద్ధములుగా నున్న గ్రంథముల కర్థాంతరమే చెప్పవలెను. ఇంతియకాక, భరతునికి మిథిలలో వివాహమైన వెంటనే వాని మేన

మామ తన పట్టనమునకు వానిని బిలుచుకొని పోయెనుగదా ! ఇఁక వివాహము కావలసియున్నను మేనమామయింటనేకదా కావలెను. అది తండ్రికిఁ దెలియ వలదా! రామాదులు తమతండ్రికిఁ దెలుపక సీతావివాహమునే చేసికొనలేదుగదా! అట్లుండ భరతుఁడుమాత్రము తండ్రికి దెలుపక యెట్లు పెండ్లి చేసికొని యుండును. అట్లయియున్నను దశరథునికిఁ దెలియక మంథరకుమాత్ర మెట్లు తెలిసినది? ఇంతేకాక రాముఁడు సీతయొక్కతె యందు దప్పనింకెవ్వరియందును మనస్సుంచ లేదనుట రామాయణమున స్పష్టపడుచున్నది. 'శ్రీరఘురామచంద్రుఁడును సీతను గూడి యనేకముల్ ఋతుల్, హారివిహారలీలలఁ బ్రియంబుగఁ బుచ్చెను నిచ్చలు న్మనం, బా రమణీలలామపయి నాటని కూరిమి నిల్పి యా మెయిం, గూరిమి పేరిమిం జెలఁగఁ గూర్చె మనంబు సదా హృదీశుపై" నను బాలకాండాంత పద్యమునుబట్టి రాముఁడు సీతయొక్కతెతోనే సదా సుఖించుచుండెనని స్పష్టమగుచున్నది. 'సర్వ కామ సమృద్ధ జనసుఖముల పదియు రెండేడు లిక్ష్వాకులయింటను గడపితి నేదియుఁ గడమ లేక' యని యారణ్యకాండ పద్యమునందు అత్యంత సంయోగార్థకమైన పదియు రెండేడులను బట్టిచూడ నన్ని సంవత్సరములును సీతకు రామునితో నిరంతర సౌఖ్యము స్పష్టమగుచున్నది. ఇతర భార్యలున్నచో నిది యెట్లుసాధ్యము. కాఁబట్టి రామునికి సీత యొక్కతే భార్యయనుటయే సరి. అట్లయినచో పూర్వపక్షు లుదహరించిన పద్యమున కర్థ మేమనఁగా రామ స్త్రీసంతతి = రామునికిఁ జేరిన యాఁడువారు. తల్లి భార్య మున్నగువారు. (2) రాముని పరిచారికలు అని రెండు విధములుగా నర్థము చెప్పవచ్చును. రాజుల కుత్తమజాతి స్త్రీలే పరిచారికలుగా నుండుట కాదంబర్యాదులందు స్పష్టము. నీ స్నుషలు = నీకోడండ్రు, భరత శత్రుఘ్ను లొక్క యుద్దిగాన భరతుఁడు కష్టపడునప్పుడు వాని తమ్ముఁడును గష్టపడును. అపుడు వారిద్దఱి భార్యలును గష్టపడుదురు. వారిద్దరు నీ కోడండ్రనియేగదా మన మనుకొనుటయని భావము. లేదా యిచ్చటి బహువచనము పూజార్థకమని యైనను జెప్పవచ్చును. ఇట్టి పద్యమును సమన్వయించుట సాధ్యమగుచుండఁగా పూర్వపక్షాభిప్రాయ మెంతయు యుక్తము కాదు.

"పితుర్నిదేశం నియమేన కృత్వా వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ, స్త్రీభిస్తు మన్యే విపులేక్షణాభిస్త్వం రంస్యసే వీతభయః కృతార్థః" జనకునియాజ్ఞచొప్పునఁ బ్రతిజ్ఞాగతి వ్రతవనవాసదీక్ష దీర్చి, నగరమేగి ధాత్రి కభిషేకము గైకొనుచుం గృతార్థతం, జనవున వారిజాత దళచారు విశాల విలోచనాళితో, నెనయుక భీతిలేక రమియించెద వంచుఁ దలంతు సువ్రతా" యని సుందరకాండమునందు సీత రాముఁడు తన్నుపేక్షించు నని దుఃఖించుచుఁ దానిట్లే చావవలసినదే యనియు, రాముఁడు వనవాసమైన పిదపఁ బెక్కండ్రు స్త్రీలతో రమించుననియు దుఃఖించియున్నది. దీనిని జూడఁగా రామునికి ననేక భార్యలు కలరని స్పష్టమగుచున్నదని పూర్వపక్షము. ఇది యుక్తము కాదు. తన యనంతరము రాముఁడు వివాహము చేసికొనును అనెడి యభిప్రాయముచేత

జెప్పినదియే కాని యతని కింతకుముందే యనేక భార్యలున్నా రనియు వారితోడ రమించు ననియు నభిప్రాయముతోఁ జెప్పినది కాదు. అట్లయినచో నంతకుముం దెచ్చటను నామె ప్రస్తావనయే చేయలేదేల? మహాపద్దశలో నున్న స్త్రీలు తమ యనంతరము తమభర్తలు యితర స్త్రీలను బెండ్లియాడుదురనియుఁ దమ భూషణాదులను వారికిత్తురనియు ననుకొనుట లోక సహజము. అట్టి స్త్రీ స్వభావమునుబట్టి సీత యన్నదే కాని వేఱు కాదు. ఇట్లు కాక యింతకుముందే రామునికనేక భార్యలున్నారని సీత యభిప్రాయమైయున్నచోఁ బట్టాభిషేకానంతరము తన్ను లక్ష్మణుఁడు రామాజ్ఞ ప్రకారము అరణ్యమునకు బిలుచుకొనిపోయి గంగాతీరమున విడుచునపుడు "నా భర్త యిట్లు నన్నుఁ జేసినదానికి నే నిపుడే నా ప్రాణము విడువవలసినదే. అయినను ప్రకృతము నా కడుపులో నున్న గర్భము నేను జచ్చినచోఁ జెడును. నా భర్త వంశము నాశన మగును. కావన నే నిపుడు ప్రాణము వదల" నని చెప్పి యుండుట యెట్లు యుక్తమగును? సీతాగర్భము నాశన మయ్యెనేని నితర భార్యలకుఁ బుత్రు లుండరాదా? దానిచే సంతతి చెడకుండరాదా? కాఁబట్టి యిప్పుడు భార్యలనేకులు శ్రీరామునికున్నారని కాదు. ఏకపత్నీవ్రతస్థుఁడు రాముఁడు తన్ను విడిచి వేఱొక స్త్రీతోఁ గలియుఁడని సీత యెఱుఁగును ముందు పద్యములోని సీతాభిప్రాయము తన యనంతరము రాముఁడు పెండ్లియాడుననియే యామె యభిప్రాయము. "నామగని రాజవంశము, భూమిపయిన్ ఛిన్నమగుచుఁ బోదదయేనిన్, సౌమిత్రీ జాహ్నవిలో, నా మేను త్యజింపకుందునా యీ త్రుటిలో" నని యుత్తరకాండ పద్యము.

'పరమ నారీజనకరములచే' నను నీ పద్యమును బూర్వపక్షులు తమ పక్షమునకు సాధకముగాఁ జెప్పుకొందురు. ఇందుఁ జెప్పఁబడిన పరమనారీజనులు పరిచారికలైన యుత్తమస్త్రీ లని పూర్వమే వివరింపఁబడెను. లేదా పరమనారీజనకరములచే నల్గిడఁబడిన దానిని-ఇంతకుముందు నల్గిడఁబడినదాని నని యర్థము కాదు. నల్గిడఁబడుటకు దగిన దానిని-ఆశంసార్థక క్త ప్రత్యయాంతము. రాముని భుజసౌందర్యమును జూడఁగా సీతనికనేక భార్యలుండి వారలు ఈభుజమునకు నలుగుపెట్టినచో బాగుగా నుండు నని తోఁచుచున్నదని భావము. లేదా, పరమనారులు శ్రీ భూనీళాదేవులు 'ఆత్మానం మానుషం మన్యే' యన్నట్లు శ్రీ రాముఁడు తన్ను మనుష్యునిగాఁదలఁచుకొని యున్నను వారి స్వరూపమును వర్ణించెడి యీకవిమాత్రము వారిని శ్రీమన్నారాయణునిగానే యచ్చటచ్చట స్పష్టపఱచుచున్నాఁడు. "విష్ణువుపుట్టె ధర నన్నరాకృతిన్" అని యయోధ్యాకాండాది భాగమందలి పద్యము. ఇట్లే యనేక స్థలములం దున్నది. అట్లుగనే యిచ్చటను శ్రీభూనీళలను స్పష్టపఱిచెను. ఈకవి యనుట తప్పుగాదు. కాఁబట్టి పూర్వపక్షుల యుక్తులేమాత్రమును సమంజసములు గావు.

రాముఁడు రాజ్యమేలునపుడు సీతను వదలిన పిమ్మట ననేక రాజసూయాశ్వమేధాదియాగంబులను జేసినట్లుత్తర కాండమునఁ జెప్పఁబడెనుగదా. భార్య లేనపుడు

యజ్ఞములు చేయరాదు. కాన నపుడితర భార్యలను బెండ్లియాడియే రాముఁడా యజ్ఞములను జేసియుండవలెను. కాన నన్యథానుపపత్తిచేత రామునికనేక భార్యలుండిన ట్లేర్పడుచున్నదని పూర్వపక్షులు మఱొక యుక్తి చెప్పుదురు. ఇదియు సరికాదు. యజ్ఞార్థమై వరింపఁబడినట్లు నీవు చెప్పెడి భార్యలు రామున కేమాత్రము భోగార్థముపయోగపడరాదు. ఇట్లుండ వీరినిబట్టి పూర్వపద్యములను సమర్థపఱచుట 'అసిద్ధ మసిద్ధేన'యన్నట్లున్నది. ఇంతియకాక శ్రీరాముఁడు సీతాపరిత్యాగానంతరము సీతకుఁ బ్రతినిధిగా సీతాప్రతిమను బెట్టుకొని యజ్ఞములు చేసిన ట్లుత్తరకాండమునఁ జెప్పఁబడెను. దీనిని బట్టి చూడఁగా యజ్ఞార్థము శ్రీరాముఁడు వేఱే స్త్రీలను బెండ్లియాడియే యుండఁడని తోఁచుచున్నది. కుమారిలభట్టుఁడు కొదువఁబడినవానికెల్లఁ బ్రతినిధులఁ జెప్పుచు భార్యకుమాత్రము ప్రతినిధిని చెప్పమని భార్యకు ప్రతినిధి లేదని పూర్వమీమాంసాన్యాయమునుబట్టి యేర్పడుచుండఁగా నుత్తరరామాయణమున భార్యాప్రతినిధి నెట్లు చెప్పవచ్చు నని కొందఱాక్షేపింతురు. అది సరిగాదు. "యది దుష్టభార్యో మారభార్యో వా స్యాత్తదా దర్భపుంజిలం తత్స్థానే నిధాయాగ్నిమాధాయ కుర్యా' త్తని హేమాద్రి నిబంధన గ్రంథమునఁ బ్రత్యక్షవచనముదహరింపఁబడి యుండఁగా దీనికి విరుద్ధముగ నున్న పూర్వమీమాంసాన్యాయమంతగాగ్రాహ్యము కాదు. ఇంతియ కాక ధర్మసంస్థాపనార్థమై యవతరించిన శ్రీరాముని యాచారముకన్నను నీ విషయంబున వేఱు ప్రమాణము కావలయునా? వీరియాచారమునకు విరుద్ధమై యెన్నియున్నను నవి యెల్ల నప్రమాణంబులే యని యెఱుంగనగు. వేదంబులుకూడఁ బూర్వుల యాచారంబుల ననుసరించియే నిత్యనైమిత్తికకర్మములను విధించినవి గాని వేఱుగాను. కాఁబట్టి వేదములకన్నను బ్రథమ ప్రమాణంబు లాచారము లనియే చెప్పవలెను. ఈ యభిప్రాయమును బట్టియే కదా యాపస్తంబులును బ్రమాణములను జెప్పెడిసందర్భమున "ధర్మజ్ఞసమయః ప్రమాణం వేదాశ్చ" యని వేదముకన్నను నుత్కృష్టప్రమాణ మాచారమని సూచించుటకై యాచారమునే ప్రప్రథమునఁ జెప్పియున్నారు. ఇందుచేతనే కదా స్మృతికారులును దమస్మృతులందు "శ్రుతిర్విభిన్నా స్మృతయో విభిన్నాః నచాన్యృషే ర్దర్శన మస్తికించిత్, ధర్మస్యతత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గతస్సపంథా" యని యాచారమునే సకలప్రమాణోత్కృష్టప్రమాణముగాఁ జెప్పియున్నారు. కాఁబట్టి 'చాతుర్వర్ణ్యంచ లోకేఽస్మిన్ స్వేస్వే ధర్మే నియోక్ష్యతి" యన్నట్లు ధర్మసంస్థాపనార్థమై యవతరించిన శ్రీరాముని యాచారమే ప్రబలప్రమాణము. దీనికి విరుద్ధముగా నెన్ని యుపన్యాయము లున్నను నవి మనకుఁ బ్రమాణములే కావు.

రాజు లశ్వమేధాదులు చేయునపుడు మహిషీవావాతాపరివృక్తి పాలాకలు లని నలుగురుభార్య లుండవలెను. దీని ప్రకారము శ్రీరామునికి సీతమహిషీస్థానమున నున్నను వావాతాదులకై యితర భార్యలుకూడ నుండిరని మఱికొంద ఱాక్షేపిం

తురు. ఇదియు ననాలోచితము. ఏ యంగము లేకున్నను యజ్ఞము పూర్తి యగునో యట్టి యంగములు లేనప్పుడు వానికై యేర్పడిన మంత్రములను మాత్ర మాయజ్ఞ కాలమునఁ బఠించినను జాలును. ఇందులకై యా వస్తువులను దప్పక సంపాదించియే తేవలె నని నిర్బంధ మక్కఱలేదు. కాన వావాతాదులు లేకున్నను ప్రధాన మహిషి మాత్రముననే యజ్ఞపూర్తి కావచ్చునుగాన వారికై యేర్పడిన మంత్ర మపుడు పఠించియుండురు.

కాఁబట్టియేగదా కుంటివాఁడు యజ్ఞము చేయునపుడు విష్ణుపద క్రమణము సాధ్యపడమిని దానికై యేర్పడిన మంత్రమును మాత్రము పఠించుచున్నారు. ఇట్లే గ్రుడ్డివాఁడు యజ్ఞము చేయునపుడు ఆజ్యావేక్షణము క్రియారూపముగ లేక మంత్రపఠనముచేతనే యగుచున్నది. కాఁబట్టి యే శాస్త్రము విరోధించినను శ్రీరాముని యాచారమే ప్రబలప్రమాణము. దీని కవిరోధముగనే సమస్త శాస్త్రములను సమంజస పఱుచుకొనునది.

పూతసౌరభము = వస్త్వంతర వాసనామిశ్రము కాక కేవల చందనాగురు సువాసన, రక్తచందనమునఁ గ్రాలుదానిన్=రక్తచందనము మేదించిన కుంకుమ పూవు, మొదట చందనాగురు గంధముఁబూసి ఆపై మేదించిన కుంకుమపూవును బూసియున్న దని భావము. శయనతలమునన్ = హంసతూలికాతల్పమునందు, ఉత్తమాంగము = శిరము, గాంగజలములన్=గంగానదిజలములందు, ఉన్నయని శేషము.

స్వతఃప్రమాణమైన వాల్మీకి రామాయణమందలి విషయములకు నితర ప్రమాణము లాశించువాఁడు సూర్యునిజూచుటకు దీపములు దెమ్మనువాఁడే. ఈ విషయము పీఠికయందుఁ జర్చింపఁబడెను. ఉత్తరకాండమును జూచునది.

తా త్ప ర్య ము

వనములకు రాకముందు తళుకు బంగారు సొమ్ములచేఁ బ్రకాశించుదానిని బంగారు భుజపురులచేతను, మనోహరములైన ముత్యముల సొమ్ములచేతను, నలంక రింపఁబడినదానిని ఉత్తమస్త్రీలగు పరిచారికలచేత ననేకవిధముల నలుగు పెట్ట బడిన దానిని, చందనము అగురు, వీనియొక్క పవిత్రమైన సువాసనలు గలదై యొప్పుని చందనమున శోభించుదానిని, పానుపునందు చంద్రునివంటి ముఖముగల సీతాదేవియొక్క శిరస్సుచేఁ బ్రకాశించు దానిని, గంగానదియందలి తక్షకుని శరీరమునకు నమాన మగు దానిని, దీనులబాధ తొలఁగించుదానిని.

తరలము. కలన శాత్రవశోకదంబు యు • గప్రదీపము దీర్ఘమున్
నలలితాప్తముదాకరంబును • సాగరాంత సమాశ్రయం
బలఘుసవ్యశరప్రయోగన • మర్థమున్ దృఢశింజినీ
కలిత మాటను జర్మ మూడుటఁ • గాయ కాచినదానినిన్. ౪౩౩

అర్థములు. కలనన్ = యుద్ధమందు. శాత్రవశోకదంబు = శత్రువులకు శోకము గలిగించునది. యుగ ప్రతీపము = గడియ మ్రాఁకునకు నెదురుద్ది యగు దానిని, ఇచ్చటఁ బ్రతీపమనునది యుపమావాచకముగా గ్రహింపవలెను. "స్పర్థతే జయతి ద్వేష్టి ద్రుహ్యతి ప్రతిగర్జతి ఆక్రోశ త్యవజానాతి కదర్థయతి నిందతి తస్యచానుకరోతీతి శబ్దాః సాదృశ్యవాచకాః ఉపమాయామిమే ప్రోక్తాః కవీనాం బుద్ధిసంపదామ్" అండి. దీర్ఘమున్ = మోఁకాళ్లనంటునట్లు నిడివియైనదానిని, సలిలత=మంచి మనస్సుగల, ఆప్త=స్నేహితులకు, ముత్+ఆకరంబును=సంతోష స్థానమైనదియు, సాగరాంత=సాగరము కడపటగాఁ గలది భూమి, ఆ భూమండలమునకు ఆశ్రయమైనది సాగరాంత సమాశ్రయము, భూరక్షాభారము వహించునది. అలఘు=గొప్పదై, సవ్య=ఎడమప్రక్కనుండియు, శరప్రయోగసమర్థము = బాణముల ప్రయోగించు సామర్థ్యముగలది. దృఢశింజినీ కలితము = గట్టి యల్లె త్రాటి రాపు గలది.

## తాత్పర్యము

కాఁడిమ్రాఁకుతో సమానమై యుద్ధమునందు పగవారికి శోకము కలిగించుదానిని, నిడివియైనదానిని, మంచిమనస్సుగల మిత్రుల సంతోషమునకు స్థానమైనదానిని, భూమండలమునకు నాశ్రయమైనదానిని, సవ్యాపసవ్యముగ బాణములు ప్రయోగింప సామర్థ్యము గలదానిని, గట్టియల్లెత్రాటిరాపిడిచేఁ జర్మము కాయ కాచినదానిని.

మత్తకోకిలము. వేలువేలుగ నాలమందల • విశ్రుతంబుగ దానముం
బోలఁ జేసినదానిఁ, బన్నగ • భోగసన్నిభమై మహా
భీల మౌ పరిఘాతనం బనఁ • బేర్మిమించినదాని, నా
వేల దక్షిణబాహువుం బర • వీరకాలుఁడు దిండుగన్. ౨౭౮

అర్థములు. ఆలమందలన్=ఆవుల గుంపులను, పన్నగభోగ సన్నిభమై=పాముయొక్క పడగతో సమానమై, మహాభీలమౌ = మిగుల భయంకరమైన, పరిఘాతనంబు=గడియమ్రాఁకు, వేలన్=సముద్రతీరమునందు, దక్షిణబాహువు=కుడిభుజమును, పరవీరకాలుఁడు=వీరులగు శత్రువులకు యముఁడైనవాఁడు.

## తాత్పర్యము

వేలువేలావుల మందలను సుప్రసిద్ధముగ దానము చేసినదానిని, పాఁపపడగ వంటిదై మిగుల భయంకరమైన గడియమ్రాఁకువలె గొప్పదగు దానిని కుడి భుజమును దిండుగాఁ జేసికొని సముద్రతీరమున.

భుజముయొక్క వర్ణన నిప్పుడు సేయుట యప్రస్తుతముగాదా? కాదు. ఎంతో సుకుమారమై యెన్నివిధములనో యుపచారము చేయించుకొనునదియై యధికాభరణములచే నలంకరింపఁ బడినదై శత్రువులకు భయంకరమై మిత్రులకు

నానందకరమై యనేక దానములు చేసిన హస్తము నేఁడిట్టు లోరుగాలిలో నిసుక దిబ్బమీఁదఁ గఱకు దర్భలమీఁద బడియుండవలసి వచ్చెఁగదా యని తన విషాదము తెలుపఁ గవి దీని వర్ణించెను.

క. తూరుపు మొగమై కైకొని, పారావారంబు తరణ•భంగియొ మరణం
బో రెంట నొకటి నిజ మని, వీరుఁడు మది నిశ్చయించి • విధిహితనియతిన్.

అర్థములు. పారావారంబు = సముద్రము యొక్క, తరణ భంగియో = దాఁటుటయో, పారావారము యొక్క మరణభంగియో, విధిహితనియతిన్ = శాస్త్రమందుఁ జెప్పబడిన నియమప్రకారము. ఇది కాయిక వాచక నియతి చెప్పెను.

తాత్పర్యము

తూరుపుముఖ మగునట్లు పండుకొని సముద్రమును నేను దాఁటనైన దాఁటవలెను. లేదా సముద్రుఁడు చావనైనఁ జావవలె, రెంటిలో నొకటి కాఁగలదని నిశ్చయించుకొని శాస్త్రమందుఁ జెప్పఁబడిన ప్రకారము, పారావారముయొక్క మరణ భంగి యని యన్వయించిన సముద్రము నెండించి దాఁటెద నని యర్థము.

క. మునియై శయనించెను న,న్వననిధిఁ బ్రార్థించికొనుచుఁ • బన్నుండ నిటుల్
చని మూఁడుయామినులుద,ర్శన మొసఁగఁడు మందుఁడగుట•సరిదధిపతియున్.

అర్థములు. మునియై = మౌనవ్రతముఁ బూనినవాఁడై, ఇది మానసిక నియతి, 'పన్నుండన్ = పరుండఁగా, యామినులు = రాత్రులు, మందుఁడు = బుద్ధిమాంద్యముగలవాఁడు, సరిదధిపతియున్ = సముద్రుఁడును, 'సీతాయాః పతయేనమః' యన్నట్లు లక్ష్మీపురుషకారము పూర్వకముగఁ గదా శరణాగతి. అట్లే సరి తత్పూర్వకముగా రాముఁడు చేసెను.

తాత్పర్యము

మౌనవ్రతముఁబూని సముద్రమును బ్రార్థించుచు మూఁడురాత్రులు (పాడ్యమి విదియ తదియ) పండుకొనెనుగాని బుద్ధిమాలిన సముద్రుఁడు కాన వచ్చినవాఁడు గాఁడు. సముద్రుఁ డనగా సముద్రాధిష్ఠానదేవత యని యర్థము. రామచంద్రమూర్తి యడుగకున్నను దానై యాయనకార్యము చేయవలసిన వాఁడు ఆయన ప్రార్థించినను దనకు నాయనకుఁగల వాసిగాని కృతజ్ఞతగాని యాలోచింపక పోవుటచే వానిని గవి మందుఁడనెను.

రామునంతటివాఁడు చేసిన శరణాగతి వ్యర్థము కానేల? శరణాగతి దీనులకు నకించనులకే కాని శక్తిమంతుల కుపయోగపడదు. రాముఁడు దీనుఁడు కాఁడు. అకించనుఁడు కాఁడు. కావున ఫలింపలేదు. కావున నధికు లల్పుల నుద్దేశించి శరణాగతి చేయరాదు. బ్రాహ్మణుఁ డశ్వమేధమున కధికారి కానట్లు రాముఁడు శరణాగతి కర్హుఁడు కాఁడు.

రామచంద్రమూర్తి తూర్పుముఖమై పండుకొనుట మౌనము వహించుట దర్భలపైఁ బరుండుట లోనగు నియమములఁ బాటించెఁగదా! ప్రపత్తి కివి నియతములా? ఆర్తప్రపన్నునకు నియమములు లేవుకాని దృప్తుఁడు నియమములఁ బాటింప వలయునని రామచర్య సూచించుచున్నది. రామచంద్రమూర్తి దృప్తుఁడే కాని యార్తుఁడుకాఁడు. ఆర్తుఁడై యుండినచో సముద్రము దాటుటలో మరణమో యని పండుకొనినవాఁడు మరల లేచునా? రాముని బంటైన హనుమంతునకు సాహాయ్యము చేసిన సముద్రుఁడు ప్రత్యక్ష రామున కేల చేయలేదు?

రామనామ మందున్న బలము రామునందు లేదు. హనుమంతుఁడు రామ ముద్రిక ధరించి జయము జయంబు రామున కని కేక వేయఁగానే యందఱు గౌర వింతురు. రామదాసుఁడుగాక యూరక సముద్రము దాఁట నెంచియుండిన నా గౌరవ మాయనకుఁ గలిగియుండదు. గోవిందా యను కేకగదా ద్రౌపదిని గాచినది. రావే వరదా యను కేకకదా గజేంద్రుని గాచినది. హా నాథా యను సీతమాట గదా రామచంద్రుని విశేష పరితాపపడఁ జేసినది. సంసారమునుండి తరింపఁజేయునది రామ నామమే కదా. రామనామ మహాత్మ్యము దెలియక యా పార్వతీ పరమేశ్వరులు శ్రీరామనామము సర్వదా జపించుచున్నారు? అధికారుల భటుల మెడలోని బిళ్ళలకు బను లయినట్లు లధికారులు స్వయముగఁ బోయిన కావు. అనుభవవిదితము. కావుననే శ్రీరామ నామము స్వాధీనపడినా తరువాత రామమూర్తి దర్శనమిచ్చినను ఈయకున్నను భక్తులు పరితాపపడరు.

### —• శ్రీరాముఁడు సముద్రుపై నాగ్రహపడుట •—

ఉ. అంతట రాఘవుండు కన • లార మహోదధివర్యుమీఁద ర
క్తాంతవిలోచనుం డయి ని • జాంతికసీమన యున్నలక్ష్మణున్
గాంతసులక్షణుం బలుకుఁ • గంటివె దర్శన మీఁడు సాగరుం
డెంతటి గర్వియో? బరువు • హీనత పో మలినాత్ము వేఁడుటల్.

అర్థములు. కనలారన్ = కోప మతిశయింపఁగా, రక్తాంత విలోచనుండయి = ఎఱ్ఱని కొనలుగల కన్నులుగలవాఁడై. నిజాంతికసీమన = తన సమీప ప్రదేశమందే, దీనిచే లక్ష్మణుఁడు రామచంద్రుని ప్రక్కనే నిలచియుండె నని భావము. కాంత సులక్షణున్ = మనోహరమైన శుభచిహ్నములు గలవానిని, రామునికోపము పరిశీలించి యిఁక భయములేదు. కార్యమైనదే యని వికాసము నొందిన ముఖము గలవానిని మలినాత్మున్ = నిర్మలచిత్తుఁడు కానివానిని, నిర్మల దేహము లేనివానిని- సముద్రము నిర్మలము కాదుగదా!

### తాత్పర్యము

మూఁడు రాత్రులు దర్భశయనమం దుండి సముద్రుఁడు ప్రసన్నుఁడై దర్శన మీయకుండుటచూచి సముద్రముమీఁదఁ గన్నులెఱ్ఱజేసి తన సమీపమం దేయుండు

ముఖవికాసాది శుభచిహ్నములు గల లక్ష్మణుఁజూచి యిట్లనియె. లక్ష్మణా! చూచితివా సముద్రుఁ డెంత పొగరుబోతో కాన వచ్చినవాఁడు కాఁడుగదా – మలినచిత్తులఁ బ్రార్థించుటవలన గౌరవహానియే కాని లాభములేదు.

క. ఓరుపు శమ మార్జవమును, జారుప్రియవాదితయు న॥సాధులయందున్
గారియము సేయ దా స,చ్చారిత్రు నశక్తుఁ డనుచు॥జడుఁ డెంచు మదిన్. ౭౩౫

అర్థములు. శమము = కోపము లేకుండుట, ఆర్జవము=చక్కని నడవడి, చారుప్రియవాదితయు–మనోహరముగ నింపుగ మాటలాడుట, అసాధులయందున్=సాధువులు కానివారియందు, కారియము సేయదు=ప్రయోజనపడదు, ఆ సచ్చారిత్రున్=అటువంటి శమదమాదులు గలవానిని, అశక్తుఁడు = సామర్థ్యము లేనివాఁడు. జడుఁడు=యోగ్యత తెలిసికొనలేని మందబుద్ధి.

తాత్పర్యము

పరులు చేసినదాని సహించుట కోపములేమి. చక్కని నడవడి మంచిమాట లాడుట యివి దుర్జనులందుఁ బనిసేయవు. అటువంటి నడవడిగలవానిని బుద్ధిలేని వాఁడు సామర్థ్యములేక యిట్లు చేయుచున్నాఁడని తలఁచును.

క. తనుఁ దాన పొగడుకొనువా,నిని సర్వోత్సృష్టదండు ॥ నిర్దయుఁ గుటిలా
త్ముని విపరిధావకుం గని, జనములు వినియించు చుండు॥సత్కారములన్. ౭౩౬

అర్థములు. సర్వోత్సృష్టదండున్ = వీనిని దండింపవచ్చునా కూడదా యను విచారములేక యెవరినైనను దండించువానిని, నిర్దయున్=దయలేనివానిని, కుటిలాత్ముని=కుత్సిత బుద్ధిగలవానిని, విపరిధావకున్ = అందఱఁ దఱుమఁగొట్టు వానిని, వినియించుచుండు=వాఁడు కోరిన విచ్చి తృప్తిపఱుచుచుండును, సత్కారములన్ = బహుమానములచే,

తాత్పర్యము

తన్నుఁ దాను బొగడుకొనువానిని విమర్శ లేక దండించువానిని దయలేని క్రూరుని వక్రబుద్ధిని ఎవరిని దగ్గఱరానీయక తఱుముచుండువానిని జూచి లోకులు గౌరవించి వానికిఁ గావలసిన విచ్చి సంతోషపఱుచుచుందురు.

సాధువులను సాధువులు మాత్రమే పూజింతురు. దుష్టుల నందఱు పూజింతురు. 'దుష్టస్సర్వత్రపూజ్యతే' యని కలదుగదా.

క. సామమునఁ గీర్తి గలుగదు, సామంబున యశము లేదు ॥ సౌమిత్రీ! సం
గ్రామముఖంబున జయమేన్, సామమున లభింప దయ్య ॥ జగముల నెందున్.

అర్థములు. సామమునన్ = మంచితనముచేత, కీర్తి = బలమువలని ప్రఖ్యాతి, యశము=దానాదులవలన ఖ్యాతి.

తాత్పర్యము

సామముచే యశము లేదు-కీర్తి లేదు-యుద్ధమందు జయము లేదు.

ఉ. ఏను క్షమాగుణంబు వహియించుట నీ జలరాశి నన్ను శా
లీనునిఁబోలెఁ జూచెడిఁబలే క్షమ చూపఁగఁ గూడ దిట్టిఁదా
వానియెడన్, మదీయశరవారవిదారితనక్రకూర్మ సం
తాను నిరుద్ధతోయు గత దర్పు విలోలుని జూడు లక్ష్మణా! ౮౮౧

అర్థములు. క్షమాగుణంబు = ఓర్పు, ఆకృష్టోపి హతోవాపి, నాక్రోశే న్నైవ తాడయేత్, అదుష్టో వాఙ్మనఃకాయై స్సాక్షమా పరికీర్తితా। ఈడ్వఁబడినను గొట్టఁబడినను దూషింపఁడు-కొట్టఁడు-మనో వాక్కా-యముల దోషములేనివాఁడో యట్టి సహనము క్షమ యనఁబడును. శాలీనునిబోలె = అసమర్థునివలె, నన్ను=ఇతరులఁ బ్రార్థింపక యే కార్యమైనఁ జేయఁగల నన్ను, మదీయశరవార= నా బాణసమూహములచే, విదారిత = చీల్చఁబడిన, నక్రకూర్మ సంతానున్= మొసళ్ళు తాఁబేళ్ళు గలవానిని, నిరుద్ధతోయున్=అడ్డగింపఁబడిన నీళ్ళుగలవానిని, గతదర్పున్=గర్వముడిగినవానిని, విలోలుని=అల్లకల్లోలమైనవానిని.

తాత్పర్యము

నేను దొలుతనే సముద్రము నెండించి కాలహరణములేక వానరసేన దాఁటింపఁ దలఁచితిని. అయినను మీరు సౌమ్యమార్గము నుపదేశించుటచేత మీమాట నేల త్రోసివేయవలయు నని కాలహరణమైనను సహించుటచేఁ దాను నీటికుప్పగదా యని తన్నెక్కు-గొప్పగా నెంచుకొని నన్ను దేనికిఁ జేతగాని వానివలె వీఁడు తలఁచెను. ఔరా! యేమి వీని దుర్నయము!! ఇట్టివానియం దోర్పు పనికిరాదు. అటయిన నిప్పుడేమి చేయఁగలఁచి నందువా నా బాణ పరంపరలచే దీనిలోని మొసళ్ళను దాఁబేళ్ళను జీల్చి తేలునట్లు చేసి నీరు కదలకుండ స్తంభించి వీని గర్వ మణఁచి యల్లకల్లోల మగునట్లు చేయుదును.

క. కరులకరంబులు దర్వీకరముల భోగములు మీలకాయంబులు సా
గరమున మచ్ఛిన్నంబులు, కరముం దేలాడఁ జూడఁగల వనుజాతా! ౮౮౨

అర్థములు. అనుజాతా=తమ్ముఁడా! కరులకరంబులు = నీటియేనుఁగుల వంటి చేఁపల తొండంబులు, దర్వీకరముల భోగములు = పాముల శరీరములు, మీల=చేఁపలయొక్క-, కాయంబులు=దేహములు, మత్+ఛిన్నంబులు = నాచేఁ జీల్చఁబడినవి, కరమున్=మిక్కి-లి.

తాత్పర్యము

ఏనుఁగుల యాకారములుగల చేఁపల తొండములు-పాముల దేహములు-చేఁపల శరీరములు-ఇవి నా బాణములచేఁ జీల్చఁబడినవై నీటిపైఁ దేలుచుండఁగా నీవు చూచెదవు.

క. కరవాఁడిశరంబుల సా,గరమును సవిసారశుక్తి•కాశంఖసము
త్కరముగ నింకించెద సం,గరమున; మొత్తందనానఁ•గనఁబడఁ డితఁడున్. ౪౪౩

అర్థములు. కరవాఁడి = కరము+వాఁడి=మిగుల పదునైన, సవిసార= చేపలయు, శుక్తికా=ముత్తెపుఁ జిప్పలయు, శంఖ = శంఖములయు, ఉత్కర = సమూహములతోఁ గూడిన దానిఁగ, ఇంకించెదను=ఎండించెదను.

తాత్పర్యము

మిగులఁ బదునైన బాణములచే సాగరమును చేపలతో, ముత్తెపుఁ జిప్పలతో శంఖములతో నెండించెదను. మంచితనమున వీఁడు కానరాఁడు-చెఱుకా బెల్లము పెట్టవే యనినఁ బెట్టునా ?

శా. సౌమిత్రీ! యిటు దెమ్ము చాపము మహా•సర్పోపమానాశుగ
స్తోమంబున్ వెస సాగరంబు నిదె సం•శోషిల్లఁ గావించెదన్
భూమీధ్రాటచయంబు కాలినడకం • బోఁ జేసెదం గిన్క వే
లామర్యాద యణంగి పొంగి ధరఁ బో•ర్లన్ క్షుబ్ధముం జేసెదన్. ౪౪౪

ఈ సముద్రమును మాటలచేత బెదరించితిమేని భయపడి మనకుఁ గనఁబడ వచ్చునని యెంచి దయాళువైన శ్రీరాముఁడు ఇంతవఱకు మాటలచే బెదరించి చూచెను. అదియు వ్యర్థమగుటచే నిఁకఁ గార్యము మూలమున బెదరించి చూతమని దానికై ప్రయత్నించుచున్నాఁడు. సౌమిత్రి=లక్ష్మణుఁ డాదిశేషావతారము గదా! శేషునికి సముద్రము పడుకగదా! ఆ ప్రత్యాసత్తిని బట్టి వీఁడు నేను సముద్రముపైఁ గోపగించి ధనుర్బాణములను దెమ్మన్నప్పుడు కొంత యాలస్యము చేయునేమో యట్లు చేయరాదనుటకై తగినట్లు లక్ష్మణుని రాముఁడు సంబోధించుచున్నాఁడు. సౌమిత్రీ, (1) నీవు తల్లిమాటయే వినవలసినది, అన్నమాటను వినరాదని నియమము పెట్టుకొని యున్నావా? (2) రామే ప్రమాదం మా కార్షీః" యని నీ తల్లి యాజ్ఞను మఱచితివా? ఆ సంబోధనము విని లక్ష్మణుఁడు ఏమి పని యాజ్ఞాపించెదరో యని రాము నొద్దకు రాఁగా రాముఁ డనుచున్నాఁడు. చాపము నిటు తెమ్ము. (1) నిర్గుణుఁడైన యీ సముద్రుని సగుణమైన వింటిచేతనే వశపఱచుకొనవలెను. గాన సగుణమైనధనస్సును దెమ్ము. (2) సముద్రము పుల్లు నోటఁ గఱచుకొనునట్లు చేయవలెను. అందులకై విల్లు తెమ్ము. ఈ మాట విని లక్ష్మణుఁడు భయపడి వింటిని మాత్రము తెచ్చియిచ్చెను. రాముఁడది చూచి 'ఇదేమి వింటిని మాత్రము తెచ్చితివి. బాణములు లేక దీనితో నేమిచేయవచ్చును? కాన బాణములను గూడఁ దెమ్మని చెప్పనెంచి మరలఁ గొంచె మాలోచించి యితఁడు చెప్పినంతే చేయుచున్నాఁడు, బాణములు తెమ్మన్న గఱుకైన వానిని లేక యుపయోగము లేనివానిని దెచ్చునేమో యని యెంచి కఱుకు బాణములను దెచ్చున ట్లాజ్ఞాపించుచున్నాఁడు. మహా సర్పోప మాశుగస్తోమంబుల్ = సర్పము నకు మహాత్త్వము విషముచేతనే గదా! అనఁగా కఱువవలసినది లేకయే చూపు

మాత్రముననే విషముఁగ్రక్కి మనుష్యులను జంపునట్టివే యిచ్చట సర్పసమాన ములుగాఁ జెప్పఁబడినవి. అట్లు యీ బాణములును దేహమున గ్రుచ్చుకొన నక్కఱలేకయే దృష్టిగోచరములు కాఁగానే శత్రులు చత్తురు. అట్టి బాణములను దెమ్మని భావము. సముద్రమును శోషిల్ల జేయుటకు నొక్కబాణమే చాలదా? అట్లుండ రాముఁడు అనేక బాణములను దెచ్చుట కాజ్ఞాపించుట యీ యొక్క సముద్రుని దోషమును బట్టి వీని సంబంధము గల సప్త సముద్రములను నెండఁ గొట్టవలె నని యుద్దేశముతో నని గాని, కోపాతిశయముచేఁ దన సామర్థ్యము తెలియకయే గాని చెప్పినాఁడనిగాని యెఱుఁగునది. సముద్రము శోషిల్లఁ జేయు టకు బాణము లేల యని సందేహింపరాదు. భిన్నం భిన్నం శరైర్దగ్ధ మ్మని గదా రావణబాణ ప్రభావము, ఆపై లక్ష్మణుఁడు కొంచెము శాసించి యిట్టి బాణము లను నీవు తెమ్మనుటకుఁ గారణమేమని యడుగఁగా రాముఁడు చెప్పుచున్నాఁడు. సాగరంబు నిదె సంశోషిల్లఁ గావించెదన్ (1) త్రవ్వునప్పు డున్నంత శ్రమ యిప్పు డక్కఱలేదు. సులభముగా దీనిని శోషింపవచ్చును. (2) "ఏకస్త్వమసి లోకస్య స్రష్టా సంహారకస్తథా" అన్నట్లు సృష్టిసంహారములు రెండును నాయొక్కనిపనియే కదా. (3) "అప ఏవ ససర్జాదౌ" యన్నట్లు సృష్టి కాలమున ఈ జలము సమస్త సృష్టికిని మొదటిదైనట్లు ఇప్పుడు రావణాది సంహారకాలము కాన నందఱకును ముందుగ దీనినే సంహరింపవలెనని భావము. (4) మా వలన వృద్ధికి వచ్చిన యీ సముద్రము మాకే సహాయపడుట లేదు. ఇట్టి కృతఘ్నమైన దీని నడుగంటునట్లు చేసెద నని భావము. (5) ఈ సముద్రము మాయెడ జ్ఞాతి కార్యమును జూపు చున్నది. అట్లైనచో మేముమాత్ర మూరక యుందుమా? (6) అఱువది నాలుగు వేలమంది చేరి త్రవ్విన దీనిని నే నొక్కఁడనే శోషిల్లఁ జేసెదను. "విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తు మసాంప్రతం" మ్మన్నట్లు మేమె వృద్ధిఁ దెచ్చిన యీ సముద్రమును మేమె మొదలంట చెడఁగొట్టుట యుక్తముకాదు. కాన నీరు మాత్రము వట్టిపోవునట్లు చేసెదను. ఇట్లు చేయుటవలనఁ బ్రయోజన మేమనఁగా జెప్పుచున్నాఁడు. భూమిధ్రాటచయంబులు = వానర సమూహములు, భూమి ధ్రములు=పర్వతములు - వీనియందుఁ దిరుగునవి భూమిధ్రాటములు, భూమి ధ్రేత్యాది (1) సముద్రము దాఁటుటకై వానరులకు నీఁదవలసిన శ్రమముగాని, యోడల సంపాదింపవలసిన శ్రమముగాని లేకుండ సుఖముగాఁ గాలితోనే నడచి పోవుటకై యిందలి నీటి నింకించెదనని భావము. (2) నాయెడ నీ సముద్రము చేసిన యపరాధమునకు వీనిని క్రోఁతుల కాలిక్రిందఁ ద్రొక్కించి కసి తీర్చుకొనెద నని భావము. పక్షాంతరమును జెప్పుచున్నాఁడు. వేలేత్యాది. వేలామర్యాద=గట్టును దాఁటరాదను వ్యవస్థ - అణఁగి = చెడి, పొంగి సముద్రముకర్త, క్షుబ్ధము జేసెదన్ = కలఁతపెట్టెదను.

## తాత్పర్యము

సౌమిత్రీ! వింటిని గొప్ప పాములను బోలు బాణముల సమూహమును దెచ్చి

యిమ్ము. ఏలందువా, ఈ సముద్రమును నిండించి దుమ్ము రేఁగఁ జేసెదను. అంతపని యేల చేసెదవందువా వానరులు కాల్నడ సముద్రమునఁ బోవఁజేసెదను. ఇన్ని నీళ్ళున్నవే యందువా చెలియలికట్ట దాఁటి రారాదను మర్యాదను బోఁగొట్టి పొంగి పొరలి క్షోభపడఁజేసెదను.

**—• శ్రీరాముఁడు సముద్రునిపై బాణంబులు వైచి క్షోభిల్లఁ జేయుట •—**

ఉ. ఏగతిఁ బట్టునో కనుమ • యీ వరుణాలయ మిప్పు డంచుఁ దా
  జేగుఱుఁగన్నులన్ ధనువుఁ • జేకొని కల్పకృశానుతుల్యు నా
  లాగున మండుచుం గరత • లంబునఁ జాపము బిగ్గఁబట్టి వే
  లాగి శరోచ్చయంబుఁ బవు • లన్ బలవైరియుఁబోలె వైచినన్. ౭౮౫

అర్థములు. వరుణాలయము=సముద్రము, జేగుఱుఁగన్నులన్=ఎఱ్ఱని కన్నులతో, కల్ప=ప్రలయకాలమందలి, కృశానుతుల్యు నాలాగున=అగ్నిహోత్రునివలె, శరోచ్చయంబు=బాణసమూహము, పవులన్=పిడుగులను, బలవైరియు=ఇంద్రుఁడే.

తాత్పర్యము

ఇప్పుడీ సముద్ర మేగతిఁ బట్టునో చూడుమని కన్నులెఱ్ఱచేసి విల్లందికొని ప్రలయకాలాగ్నివలె మండుచు విల్లు గట్టిగఁబట్టుకొని నారి లాగి యింద్రుఁడు పిడుగులను వలె బాణసమూహము విడిచెను.

స్రగ్ధర. జ్వాలాభీలాశుగంబుల్ • చర చర చనుచున్ • సాగరం బుత్తలింపన్
  వే లోనం జొచ్చినంతన్ • విషధరచయముల్ • బెగ్గిలెన్ దిగ్గనన్ గ్రా
  హాళీకుంభీరయుక్తం • బగు సలిలము వాతాతి • నిర్హ్రాదయుక్తిన్
  జాలన్ ఘోరత్వమందెన్ • సరఁగఁ బొంగలతో • సంభ్రమద్భంగపాళిన్.

అర్థములు. జ్వాలాభీలాశుగంబుల్=అగ్నిశిఖలచే భయంకరములైన బాణములు, ఉత్తలింపన్=కలవరపడఁగా, విషధరచయముల్=సర్పములు, బెగ్గిలెన్=భయపడెను, దిగ్గనన్ = తటాలున, ఉన్నట్లుండి వచ్చిన యుపద్రవంబుచేత, గ్రాహాళీ = గ్రాహములను చేపల వరుసలతోను, కుంభీర = మొసళ్ళతోను, యుక్తంబు = కూడినది, సలిలము = నీరు, వాత = గాలివీచుటవలనఁ గలిగిన, అతినిర్హ్రాద = పెద్దధ్వనితో, యుక్తిన్ = కూడికతో, సంభ్రమత్=తిరుగుచుపడుచున్న, భంగపాళిన్ = అలల సమూహములచే.

స్రగ్ధర. దీనిలక్షణ మప్పకవి చెప్పలేదు. మ-ర-భ-న-య-య-య గణంబులు ఎనిమిదింట నెనిమిదింట యతులు.

తాత్పర్యము

అగ్నిశిఖలవంటి బాణములు చరచరపోయి సముద్రమును నల్లకల్లోల మగునట్లు లోలోపలఁ బ్రవేశింపఁగానే యున్నట్టుండి వచ్చిన యీ యుత్పాతమునకుఁ బాములు భయపడెను. గ్రాహములతోను మొసళ్ళతోఁ గూడిన నీరు పెనుగాలి

విసరుటచేఁ గలిగిన ధ్వనితో మిగుల భయప్రదమై పొగలతోను నుడిపడుచున్న యలలతోను గానవచ్చెను.

క. గుడి తిరుగుచుఁ దిరుగుడువడి, బుడబుడ శుక్తులను శంఖ ॥ ములఁ గ్రక్కుచు లోఁ
దోడిఁబడుచును వెడరూపునఁ, గడలి కడుం గోడువ గుడిచి ॥ కళవళ పడియెన్.

అర్థములు. గుడి తిరుగుచున్=గుండ్రముగాఁ దిరుగుచు, తిరుగుడువడిన్= తిరిగెడు వేగముచే, శుక్తులను=ముత్తెపుఁ జిప్పలను, తోడిబడుచున్ = చెదరుచు, వెడరూపునన్ = వికారస్వరూపమున, కడలి = సముద్రము, కడున్=మిక్కిలి, గోడువ=కీడు, ఇందు డకారము వృత్త్యనుప్రాసము, ఒక్క యక్షరమే పలుమాఱు వచ్చిన వృత్త్యనుప్రాస మగును.

తాత్పర్యము

నీళ్ళు గుండ్రముగాఁ దిరుగుచు నా తిరుగువడిచే బుడబుడ మని ముత్తెపుఁ జిప్పలను గ్రక్కుచు లోపల చెదరుచు వికారరూపమున సముద్రము మిగుల బాధపడి కళవళ మందెను.

క. అడలిరి పాతాళంబును, విడిమ ట్టగు పన్నగులును ॥ విడివడి తోడిపై
నడరెడి శరములన్ వడి మం, డెడుకన్నులు మోము లొప్ప ॥ డీలుం గొనుచున్.

అర్థములు. విడిమట్టు = విడియుమట్టు = ఉండుస్థలము, అడలిరి=శోకించిరి, విడివడి=నిర్బంధమునుండి తొలఁగి, తోడి=వేగముతో, అడరెడి = వ్యాపించెడి, డీలుంగొనుచున్ = డిల్లపడుచు.

తాత్పర్యము

పాతాళ మునికిపట్టుగాఁగల పన్నగులు విచ్చలవిడి మీఁద వ్యాపించి వచ్చు బాణముల వేగమునకు ముఖములు కన్నులు మండుచుండ డిల్లపడి శోకించిరి.

ఆ. నక్రమకరకమఠ ॥ చక్రవాళాన్వీత, వింధ్యమందరాభ ॥ వీచితతులు
వేలకోలఁదు లెగసె ॥ విన్నంట నల్లకల్లోల మయ్యె జలధి ॥ మూలముట్టు. ౨౮౯

అర్థములు. నక్రమకరకమఠచక్రవాళాన్వీత = మొసళ్ళయొక్కయు, పెద్ద చేఁపలయొక్కయు తాఁబేళ్ళయొక్కయు సమూహముతోఁ గూడిన (చక్రవాళము = మండలము) వింధ్య మందరాభవీచితతులు = వింధ్యపర్వతముతోను మందరపర్వతముతోను సమానమైన యలలగుంపులు, విన్నంటు=అంటు = ఆకాశము తగులునట్లు, మూలముట్టు=పాదు మొదలుకొని.

తాత్పర్యము

మొసళ్ళయు పెద్దచేఁపలయు తాఁబేళ్ళయు సమూహములతోఁ గూడిన వింధ్యమందరపర్వతములతో సమానమైన యెత్తుగల యలల సమూహములు వేలకోలఁదు లాకాశముఁ దాఁకున ట్లెగసెను. సముద్ర మడుగునుండి కలఁతపడెను.

శా. ఎన్నం దూనని యుగ్రవేగమున నీ॰తేశుండు కోదండమున్
సన్నాహంబునఁ బట్టి దీర్ఘతరని॰శ్వాసంబులం బుచ్చఁగా
నన్నా! మానుము మాను మంచు నెప డా॰యుం బోయి సౌమిత్రి యా
పన్నార్తావనదక్షుచాపమును సం॰భ్రాంతాత్ముఁ డై పట్టినన్. ౮౫౦

అర్థములు. ఎన్నం దూనని=ఏకాలమందైనను పొందని, సన్నాహంబునన్=పూనికతో, దీర్ఘతర నిశ్వాసంబులన్ = మిగుల నిడివి యగు నూర్పులను, రోషముచే నని భావము. ఆపన్న=ఆపదనొందిన కారణముచే, ఆర్త=దుఃఖించువారిని, అవన=రక్షించుటయందు, దక్షు = సమర్థుఁడైన వానియొక్క, చాపము = విల్లు, సంభ్రాంతాత్ముఁడై=వేగముతోఁ గూడినవాఁడై, భయముతోఁగూడిన మనస్సు గలవాఁడై.

## తాత్పర్యము

ఏదశయందును - ఏకాలమందును లేని వేగాతిశయముచే శ్రీరామచంద్ర మూర్తి వింటిని బూనికతోఁబట్టి రోషముచేత మిగుల నిట్టూర్పులు పుచ్చఁగా నెన్నఁడు నీయన యిట్లు కోపించినవాఁడు కాఁడు - ఇట్టి బాణము లింత వేగముగఁ బ్రయోగించినవాఁడును గాఁడు-నేఁ డిదేమి యని భయపడినవాఁడై లక్ష్మణుఁడు అన్నా! అన్నా! బాణములు ప్రయోగింపవలదు వలదని చెప్పఁబోయి బాధచే దుఃఖించువారిని రక్షించు సామర్థ్యముగలవాఁడై యా నిమిత్తముగా బాణములు విడుచువాఁడే కాని నిష్కారణముగ నొకరిని బాధింప బాణములు విడువని యా రామచంద్రు వింటిని బట్టుకొనెను.

ఇంత కోపమున కేమి కారణము? కిష్కింధ విడిచినవాఁ డాలస్యము లేక యొక నెట్టునపోయి రావణుఁడు హెచ్చరిక పడకముందే లంక నెత్తిన పడవలయు నని యెంతో యాత్రముగలవాఁడై వచ్చెను. సముద్ర మడ్డము వచ్చెను. దాని నొక యత్నముతో నెండకట్టి దాఁటిపోవ నాలోచించెను. అట్టిదానికి మూఁడు దినములు సముద్రునివలన జాగయ్యెను. అది సహింపరానిదయ్యెన. మూఁడుదినములు శత్రువులకు సన్నద్ధపడ విరామ మిచ్చినట్లయ్యెను. సీతను జూచుటయందుఁ దడవాయెను. కావున కోపగించెను. సైంధవునివలె ధాటి నడ్డగించువారు శత్రు లేకదా. శత్రువు పురమునకు నగడ్తయైనవానికి సాహాయ్యపడువాఁడై తనకాలము వ్యర్థపుచ్చెనుగదా.

## —॰ ౨౨-వ సర్గము. శ్రీరాముఁడు సముద్రుపై బ్రహ్మాస్త్రంబు వేయఁ బూనుట ॰—

చ. జనకసుతామనోహరుఁడు ॰ సాగరు నిట్లను దారుణోక్తి మ
ద్ఘనతరశాతతీవ్రశర॰కాండసుదగ్ధుఁ బ్రశుష్కుఁ జేసి నిన్
గనుము రసాతలంబు దను॰కం ద్రుటిలోపల దుమ్ము రేఁపెదన్
మనిమెద! నీదు రూపమును ॰ మాపెదఁ జూడుము రోరి సాగరా! ౮౫౧

అర్థములు. శ్రీరాముఁడు తనసేన సముద్రమును దాటుట యెట్లని యాలోచించి నాఘుమార్గమున సముద్రు నుద్దేశించి శరణాగతి చేసెను. దాని కతఁడు వశుఁడు కాలేదు. ఆపై నోటిమాటల బెదరించెను. దానికిని లోబడిన వాఁడు గాఁడు. ఆపైఁ గొన్ని బాణములచేఁ గలఁతపడఁజేసెను. దానికిని గానవచ్చిన వాఁడుకాఁడు. కావున బ్రహ్మాస్త్రముచే సముద్ర మెండఁగట్టఁ దలఁచి బ్రహ్మాస్త్రము సంధించి సముద్రునితో నిట్లు చెప్పుచున్నాఁడు.

జనకసుతా మనోహరుఁడు=సీతాదేవి మనస్సును హరించువాఁడు, సీతచే హరింపఁబడిన మనస్సుగలవాఁడు, మనస్సు పోయినంత వేగమున సీతయొద్దకుఁ బోవఁదలఁచినవాఁడు, మత్=నాయొక్క, ఘనతర=మిగుల గొప్పదగు, శాత= పదునైన, తీవ్ర=వేగముగల, శరకాండ = బాణసమూహములచే, సుదగ్ధుఁజేసి = నీరువట్టి పోవునట్లుచేసి, ప్ర + శుష్యన్ = ఊటలుకూడ మరలఁబుట్టకుండునట్టు లెండించెదను, మనియె దెఱ్ఱబదికెదవా,

తాత్పర్యము

సీతాదేవిచే హరింపఁబడిన మనస్సుగల రామచంద్రమూర్తి భయంకరమైన మాటలతో సముద్రునితో నిట్లనియె. ఓరీ సముద్రుఁడా! నిన్ను పదునైన వేగము గల నా గొప్ప బాణముల సమూహముచే నీరిగిరించి యంతతో విడువక మరల నూటయైనఁ బుట్టకుండునట్టులు పాతాళ లోకమువఱకు నెండించి యల్పకాలములో దుమ్ము రేఁపెదను. నీ స్వరూపమే లేకుండఁ జేసెదను. చూడుము. నాకుఁ గోపము వచ్చునట్లు చేసి నీవు బ్రదికెదవా ?

ఉ. మామకచాపముక్తశిత • మార్గణవర్షముచేత సర్వశా
 ఖామృగపాళి యీ క్షణము • కాల్నడ నావలినొడ్డు చేరఁగా
 నో మనుజాశనాలయుఁడ ! • యుద్ధతిఁ జూపెద నిప్డు చూడరా,
 నీ మది నెట్లెఱింగెదవు • నిస్తులమద్బలవిక్రమంబులన్. ౭౫.౨

అర్థములు. నాలోని నీరంతయు శోషిల్లఁజేసితి వేని యుదకము పాతాళము మాత్రమే మిగులును. అప్పుడు నీ సేన నడచిపోవలయు ననిన పాతాళమునకుఁ బోవునేకాని లంకకుఁ బోఁజాలదు. కావున నాకాశమార్గముననే నీ సేన పోవలసి యుండును. కావున నీవు నన్ను బాధపెట్టి యావల నాకాశమార్గమునఁ బోవుటకు మాఱుగ నిప్పుడే నన్ను బాధింపక యే యాకాశమునఁ బోవచ్చునుగదా యని సముద్రుఁడు చెప్పిన నెంచుకొని తన యభిప్రాయము చెప్పుచున్నాఁడు.

మామక = నాయొక్క, చాపముక్త = వింటినుండి విడువఁబడిన, శిత = పదునైన బాణ = బాణముల, వర్షముచేత = వానచే, సర్వశాఖామృగపాళి = వానర సమూహమంతయు, ఓమనుజాశనాలయుఁడ=రాక్షసులకు స్థానమైనవాఁడా? నీవునన్ను ధిక్కరించుటకు నాకు విరోధులగు రాక్షసుల కునికిపట్టగుటచే వారిగుణమే కలవాఁడవై వారిపక్షమే వహించితివి కావున వారి నెట్లు చేయఁదలఁచితినో నిన్ను

నష్టీ చేసెదను అని భావము. ఉద్ధతి = పరాక్రమము, నిస్తుల = అసమానమైన, మత్ = నాయొక్క, బలవిక్రమంబులన్ = బలపరాక్రమములను.

తాత్పర్యము

ఓరీ రాక్షసుల కునికిపట్టయినవాఁడా? నా పదునైన బాణముల వర్షము చేత సేతువుకట్టి వానరసేనను గాలినడకతో నీ క్షణమందె యావలియొడ్డు చేరఁజేసెదను జూడుము. అట్లు నా పరాక్రమముఁ జూపనైతినేని నీ వసమానమైన నా బల పరాక్రమముల నెట్లెఱుఁగఁగలవు?

లోకమునఁ గొందఱు సహజముగ బుద్ధిమంతులు, కొందఱు బోధముచే బుద్ధిమంతు లగుదురు. కొందఱు బాగుగఁ గొట్టినఁగాని బుద్ధిమంతులు కాఁజాలరు. నీ వీ మూఁడవతరగతిలోఁ జేరినవాఁడవు.

శా. కానీ రా యని బ్రహ్మదండనిభ మా • కాండంబు కోదండమం
దా నీరేజవిలోచనుండు దొడి బ్ర • హ్మాస్త్రంబు మంత్రించి, వే
గానన్ జ్యాలత రోషతీవ్రుఁ డయి యా • కర్ణాంతముఁన్ లాగ, గ్రా
వానీకంబులు సంచలించె దిశ ల • ల్లాడెఁ జెంజీకటిన్. ౪౫౩

అర్థములు. బ్రహ్మదండనిభము = బ్రహ్మదండముతో సమానమైనది, బ్రహ్మదండము = బ్రాహ్మణశాపము అప్రతిహతమైనదని భావము. కేతువిశేష మని మఱికొందఱు. 'పితామహాత్మజః క్రూరః త్రివర్ణ శ్శిఖరాన్వితః, బ్రహ్మ దండాహ్వయః వేదః సర్వభూతవినాశనః' యను నారద సంహితావచనము ప్రమాణము. కాండంబు = బాణము, తొడి = సంధించి, జ్యాలత = తీఁగవంటి యల్లెత్రాడు, ఆకర్ణాంతమున్ = చెవికొనవఱకు, గ్రావానీకంబులు = పర్వతముల సమూహములు, జెంజీకటిన్ = గాఢాంధకారంబువందు.

తాత్పర్యము

కానీ రా యని బ్రహ్మదండముతో సమానమైన బాణము నొక దానిని వింట సంధించి రామచంద్రమూర్తి బ్రహ్మాస్త్రంబుచే దాని నభిమంత్రించి మిక్కిలి వేగముతో నల్లెత్రాటిని తన చెవికొనవఱకు లాఁగఁగా కొండలు గడగడ లాడెను. దిక్కులు గాఢాంధకారమున మునిఁగి వడఁకెను.

శా. వ్రక్కల్ వాఱెను రోదసీబిలము, మా • ర్తాండక్షపానాయకుల్
చక్కల్ త్రోవలు తప్పె, నేళ్ళుఁ గొలఁకుల్ • క్షోభించె, నల్గాలితతుల్
లెక్కల్ మీఱి మహారవంబునను వ్రా • లెన్ మేదినిన్, మింట వా
ర్దుక్కుల్ మారుతపంక్తులున్ బలిసెఁ జె • న్నాఱ్ఱం గొనెన్ జంతువుల్.

అర్థములు. రోదసీబిలము = బిలమువలె భూమికి నాకాశమునకు నడుమ నుండు ప్రదేశము, అనఁగా దాని యందలి పదార్థములు, వ్రక్కల్ = బ్రద్దలు, మార్తాండక్షపానాయకుల్ = సూర్యచంద్రబింబములు, త్రోవల్దప్పెను = తమ

మార్గము విడిచి వేఱొకమార్గమునఁ బోయెను. కర్తలనేకంబు లున్నచోఁ గ్రియకు సమీపకర్తయొక్క లింగవచనంబు లగు సు. వ్యా. వాక్య. ౩౭వ సూ. తప్పినను క్రియకు చుక్కల్ అనుపదము సమీపమున నుండుటచే దాని కనుగుణముగఁ గ్రియయుఁ బ్రయోగింపబడెను. ఉల్కాతతుల్=కొఱవులవంటి నక్షత్రసమూహములు, "ఉల్కాశిరసి విశాలా నిపతంతీ వర్ధతేచ తనుపుచ్ఛా"యని వరాహమిహిరుఁడు. మహారవంబునను=పెద్ద ధ్వనితో, మేదినిన్=భూమిమీఁద, వార్ముక్కుల్, వాః + ముక్కుల్ = మేఘములు.

భూమికి నాకాశమునకు నడిమిప్రదేశమునం గల గ్రహములు లోనైనవి బ్రద్దలయ్యెను. సూర్యచంద్ర నక్షత్రములు పెడత్రోవఁబోయెను. నదులు సరస్సులందలి నీ ళ్ళింకెను. లెక్కలేని కొఱవులవంటి నక్షత్రములు పెద్ద ధ్వనితో నేలపైఁబడెను. ఆ కారణమున మేఘములు మహావాయువులు నధికము లయ్యెను. జంతువులు మూర్ఛపోయెను.

క. సంతమససమావృతదిన, కాంతమయూఖములతోడ • గగనతలం బు
ద్భ్రాంతిం గూర్చుచుఁ గొఱవుల, సంతతి వెలుఁగొందునట్లు • జ్వలితం బయ్యెన్.

అర్థములు. సంతమస=సర్వత్రవ్యాపించు చీఁకటి సంతమస మనఁబడును "విష్వక్సంతమస" మ్మని యమరము. సమావృత = బాగుగ నావరింపఁ బడిన - దినకాంత = సూర్యుని - మయూఖముల తోడ = కిరణములతో - ఉద్భ్రాంతిన్ = మిగుల భ్రాంతిని - ఎక్కువ కలఁతను - జ్వలితంబు=మండినది.

తాత్పర్యము

అన్నిచోటులఁ గ్రమ్ముకొను చీఁకటిచే నావరింపఁబడిన సూర్యకిరణములతో నాకాశము చూచువారికిఁ గలఁత గలిగించుచు కొఱవులవలె మండుచుండెను.

క. అంజలి గుంజలిగా నెగయుం జిమ్ముచు మేఘవితతి • వనిజములన్
భంజించె సశైలశిఖర, పుంజముగఁ బ్రభంజనుండు • పురుభీతిదుఁడై. ౮౧౬

అర్థములు. అంజలిగుంజలిగాన్=గాసిపడునట్లు-చిందఱవందఱగా-సశైలశిఖరపుంజముగన్ = కొండలశిఖరముల సమూహముతోడ - ప్రభంజనుండు = సుడిగాలి - పురుభీతిదుఁడై = మిగుల భయము గలిగించువాఁడై.

తాత్పర్యము

సుడిగాలి మిగుల భయంకరముగ మేఘముల చిందఱవందఱగా నెగురఁ జిమ్ముచుఁ గొండల శిఖరముల సమూహములతోడ వృక్షములను విఱిచెను.

క. భైరవరవపూరితములు, ఘోరంబులు నైన మేఘ•కోటులు గురిసెన్
ధారిణిఁ జిచ్చులవిసుగుల, ధారలు శైకొట్టె భూత•తతి దీనదశన్. ౮౧౭

అర్థములు. భైరవరవపూరితములు=భయంకరధ్వనిచే నిండినవి, చిచ్చులవి

పిడుగులధారలు=నిప్పులవంటి పిడుగుల సమూహములను, చిచ్చుఱ రూ. చిచ్చఱ. "చిచ్చుఱ పిడుగొట్టు లట్టడరి శూరుల మొత్తము నుగ్గుసేసెదన్" అనియు చిచ్చఱ పిడుగుల్ పడిం దోఁచఁగు చాడ్పున" ననియు తిక్కన ప్రయోగములు, చిచ్చు+ ఉఱ = అగ్నిని లక్ష్యముసేయని - చిచ్చు + అఱ = చిచ్చఱ, బెకొట్టెన్ = బెంగకొట్టు, బెకొట్టు=వచ్చెను.

### తాత్పర్యము

భయంకరధ్వనులు భయంకరాకారములుగల మేఘసమూహములు భూమి మీఁద నిప్పులు గ్రక్కు పిడుగులను వర్షించెను. భూతముల సమూహములు దుఃఖముచే నేడ్చెను.

క. ఎదపడి జంతులు ధరఁబడి, కదలక మెదలకయు యుండెఁ • గడు నెసఁగించెన్
రొదల నదృశ్యపుభూతన, ముదయము కడలియు ససత్త్వ•ముగ వెతఁజెందెన్,

అర్థములు. ఎదపడి=గుండెలు పగులునట్లు భయపడి, రొదలన్ = ధ్వనులను, అదృశ్యపు=కానరాని, కడలియు=సముద్రము, ససత్త్వముగ=తనలోనుండు జంతువులతో.

### తాత్పర్యము

జంతువులు భయపడి కదలక మెదలక యెక్కడనున్నవి యెట్లున్నవి యట్టులే యుండెను. కానరాని భూతముల గుంపులు ధ్వనులు సేసెను. సముద్రము తనలోనున్న జంతువులతో బాధపడెను.

### —• శ్రీరామునకు సముద్రుఁడు ప్రత్యక్షమగుట •—

చ. చెలియలికట్ట వాసి యల • సింధువు రోజన మేగ లోనికిన్,
లలితదయాబ్ధి రాముఁడు క • లంబకమున్ విడఁ డయ్యె, నయ్యెడన్
జలముల నుండి మేరుగిరి • సప్తతురంగుఁడువోలెఁ దోఁచె ను
జ్జ్వలితముఖాహిసంవృతుఁడు • జాంబవభూష.ణభూషితాంగుఁడున్. ౨౯

అర్థములు. లలితదయాబ్ధి=జనమనోహరమైన దయారసమునకు సముద్రమైనవాఁడు, ఆ సముద్రుఁడు నీళ్ళచే నిండినవాఁడు. రామసముద్రుఁడు దయారసముచే నిండినవాఁడు. ఇంత కోపముగలవాఁడైనను దయవదలినవాఁడు కాఁడని భావము. కావుననే, కలంబకమున్=బాణమును, విడువఁడయ్యెను=వదలినవాఁడు కాఁడు. సముద్రమును కానవచ్చి దోవయిచ్చెదవా చంపుదునా యని బెదరించుటకై బాణము సంధించినవాఁ డగుటచే విడఁడయ్యె. సప్తతురంగుఁడు = ఏడు గుఱ్ఱాలవాఁడు. సూర్యుఁడు, ఉజ్జ్వలిత=విషముచే మండుచున్న (౨) పడగల యందలి మణులచేఁ బ్రకాశించుచున్న, ముఖ=మొగములుగల, అహి=పాములచే, సంవృతుఁడు=చుట్టుకొనఁబడినవాఁడు, జాంబవభూషణ = బంగారు సొమ్ములచే, భూషిత=అలంకరింపఁబడిన, అంగుఁడు=దేహముగలవాఁడు.

### తాత్పర్యము

సముద్రమున నొక యోజనము దూరము నీళ్ళు చెలియలికట్ట విడిచి లోపలి కీడ్చుకొనిపోయెను. దయాసముద్రుఁ డగు రామచంద్రమూర్తి భూత సంహారమం దిష్టము లేనివాఁడగుటచే బాణము వదలఁడయ్యెను. అప్పుడు మేరుగిరి విడిచి లోకమునకుఁ గానవచ్చు సూర్యునివలె మండుచున్న ముఖములు గల సర్పము లతోఁ జుట్టఁబడినవాఁడును బంగారు సొమ్ములు ధరించినవాఁడును నగు సముద్రుఁడు నీళ్ళలో నుండి వెలుపలవచ్చెను.

ఆ. సాటిమీఱు నొంటి• పేటహారంబుమ,ధ్యమునఁ బాటలప్ర• భాంచిత మయి
 కౌస్తుభానుజ మయి• సిస్తగు మణిపత,కం బురంబునందుఁ• గ్రాలువాఁడు. ౮౬౦

అర్థములు. పాటల ప్రభా + అంచితము = ఎఱ్ఱని కాంతిచే నొప్పినది, కౌస్తుభానుజము = సముద్రమున కౌస్తుభము పుట్టిన తరువాతఁ బుట్టినది. అనఁగా దానితో సమానమైనది, సిస్తు=అందము.

### తాత్పర్యము

అసమానమైన యొంటిపేట ముత్యాలసరము నడుమ నెఱ్ఱని కాంతిగలదై కౌస్తుభమువలెఁ బ్రకాశించు మణిపతకమును వక్షమున ధరించినవాఁడు.

సీ. స్నిగ్ధవై దూర్యస• న్నిభుఁడు లోహితమాల్య, వస్త్రధరుండును • వారిజాత
 పత్రనేత్రుఁడు దివ్య• పౌష్పమాలాంచిత,మస్తుఁ డాత్మజరత్న • మండితుండు
 ప్రాలేయశైలంబు• లీల నానాధాతు,యుక్తుఁ డాఘూర్ణభం• గౌఘుఁ డతుల
 కాలికానికర వా• తూలసంకులుఁడు ను,ద్వర్తితనక్రుఁడు • భ్రాంతరాక్ష
తే. సావళీలేలిహానుండు • నైన వీర
 వరుఁడు సాగరుఁ డా యస్త్ర• పాణిఁ జేరి
 యంజలి ఘటించి రామచం• ద్రా! యటంచు
 సాదరంబుగఁ బిలిచి యి • ట్లనియె నపుడు. ౮౬౧

అర్థములు. స్నిగ్ధ=నునుపైన వైదూర్య సన్నిభుఁడు = వైదూర్యకాంతి గలవాఁడు, లోహితమాల్య వస్త్రధరుండును=ఎఱ్ఱని పూలహారములు వస్త్రములు ధరించినవాఁడు, వారిజాతపత్ర నేత్రుఁడు= తామర రేకులవంటి కన్నులుగలవాఁడు, దివ్య=దేవతాసంబంధమైన, పౌష్పమాలా = పూలదండలచే, అంచిత = ప్రకాశించు, మస్తుఁడు = శిరస్సుగలవాఁడు, ఆత్మజ = తనయందుఁ బుట్టిన, రత్న= మణులచే మండితుఁడు = అలంకరింపఁబడినవాఁడు, ప్రాలేయశైలంబులీల = మంచుఁ గొండవలె, నానాధాతు యుక్తుఁడు=అనేకములైన ధాతువులతోఁ గూడిన వాఁడు, ఆఘూర్ణుఁడు=తిరుగుచునుండుచున్న, భంగౌఘుఁడు=అలలసమూహములు గలవాఁడు, అతుల=అసమానమైన, కాలికానికర = మేఘపంక్తిచేత, వాతూల= గొప్పవాయువుచేత, సంకులుఁడు = కలఁతపడినవాఁడు, ఉద్వర్తిత నక్రుఁడు=తేల

క్రిందు లగుచున్న మొసళ్ళుగలవాఁడు, భ్రాంత=దిగ్భ్రమఁగొనిన, రాక్షసావళీ= రాక్షససమూహములను, లేలిహానుండు = పాములను గలవాఁడు, అస్త్రపాణిన్= అస్త్రములు చేత ధరించిన వానిని.

## తాత్పర్యము

నునుపైన వైడూర్యమువంటి కాంతిగలవాఁడును, ఎఱ్ఱని పూలదండలు, ఎఱ్ఱని వస్త్రములు ధరించినవాఁడును, తామర రేకులవంటి కన్నులు గలవాఁడును, దేవతా పుష్పముల మాలికలచేఁ బ్రకాశించు శిరస్సుగలవాఁడును, తనయందుఁ బుట్టిన మణులచే నలంకరింపఁబడినవాఁడును, మంచుగొండవలె నానాధాతువులు గలవాఁడును, తిరుగుడుపడుచున్న యలల సమూహములు గలవాఁడును, మేఘములతోను, గాలితోను కలఁతపడినవాఁడును, తలక్రిందు లగుచున్న మొసళ్ళు లోనగు జంతువులు గలవాఁడును, దిగ్భ్రమఁగొన్న తనయందలి రాక్షసులు పాములు గలవాఁడును నైన వీరవర్యుఁడు సముద్రుఁడా యస్త్రపాణిని జేరి నమస్కరించి రామచంద్రా యని యాదరముతోఁ బిలిచి యిట్లనియె.

ప్రశ్న—ఇంత యాదరము భక్తిగలవాఁ డేల యింతకాల మాలసించెను !

సమాధానము- ప్రార్థించినంత మాత్రముననే ప్రసన్నుఁడై దర్శన మిచ్చి మార్గమిచ్చిన యెడల నందఱు నీ మార్గమునే యనుసరింతురు. నీవు త్రోవయిచ్చె దవా చత్తువూ యని ప్రాయోపవేశము చేయ నారంభింతురు. అట్టిదానికి దోవ చూపరాదు. ఇప్పుడో యింకేటి రామచంద్రమూర్తికి సాధ్యముగానిది మన కగునా యని విరమింతురు. - ఈయనచే దనకు శత్రువులగు నాభీరులఁ జంపింప వలయును. అది రామచంద్రునకుఁ దప్పఁ దక్కినవారికి సాధ్యమగునదికాదు. ఊరక చంపుమనినఁ జంపఁడు. కావున స్వామికార్యము స్వకార్యము రెండు చక్కఁబడుటకై యింతవఱకాలసించెను. గాని రామచంద్రమూర్తి మహిమ యెఱుఁగకకాదు. రామచంద్రమూర్తి యెంత కోపించినను నమస్కరించె నేని క్షమించునని సముద్రుఁ డెఱుఁగును.

చ. అవనినభోనిలానలప•యస్సులు శాశ్వతమైన మార్గమున్
దవిలి స్వభావ మేమియును • దప్పవ, యట్టుల నే నగాధ మ
ప్లవమును నౌట నా సహజ•భావము, దీనిని దప్పరాదు, రా
ఘువవర! సౌమ్య! యియ్యది య•కార్యము, నీకు నెఱుంగఁ దెల్పితిన్. ౮౬-౨

అర్థములు. అవని - నభస్ - అనిల - అనల - పయస్సులు = భూమి - ఆకాశము - వాయువు - అగ్ని - జలము - అను పంచభూతములు, పయః ప్రభృతుల సకారంబునకు సగాగమద్విత్వంబులు నిత్యంబులు. సు-వ్యా-తత్స-సూ, ౯౨. కావున పయస్సు అనియే రూపము; పయసు-పయము అపశబ్దంబులు. అట్టుల=అట్టులే-ఇది కళయే కాని ద్రుతాంతముకాదు. అట్టులు+అ=అట్టుల, అగాధము=లోఁతైనది, అప్లవము=దాఁటరానిది.

### తాత్పర్యము

పంచమహాభూతము లగు భూమి ఆకాశము అగ్ని జలము వాయువులు శాశ్వతమైన తమమార్గమును వదలి వానిస్వభావము విడువవు. ఆ విధముగానే జలరూప మగు నేను లోఁతు తెలియనీయను. కాలినడక దాఁటనీయను. ఇది నా స్వభావము. దీనిని నేను దప్పరాదు. రామచంద్రా! సౌమ్యుఁడా! నేను నా స్వభావమునకు విరుద్ధముగ వర్తించుట సరియైన కార్యముగాదు.

తే. కామముననైన లోభాది • కారణముల, నైన భయముననైనఁ ధ • రాధినాథ!
గ్రాహనక్రాకులం బుద • కంబు నేను, స్తంభనముఁ జేయరాదయే • సమయమునను.

### తాత్పర్యము

కామముచేనైనను లోభములోనగు కారణములచేనైనను భయముచేనైనను మొసళ్లులోనగు జలజంతువులు గల నానీటిని నేను గట్టిపడఁజేయరాదు. అట్లు చేసితినేని యీ జీవజంతువులు బాధపడును, చచ్చును, కావున నే నెప్పుడట్టి పని చేయరాదు. నన్నాశ్రయించిన వాని నేనెట్లు బాధపఱతును.

ఉ. ఐనను నీదు కీశబల • మంతయు దాఁటుసిదాఁక గ్రాహసం
తానము సేన కెట్టిబెడ • దల్ సమకూర్పక యుండఁ గాచెదన్
జే నయినంత, నీ ప్లవగ • సేన ధరింప స్థలం బొసంగెదన్
మానుము కోప మన్న రఘు • మండనుఁ డిట్లను నమ్మహాబ్ధికిన్. ౨౮
అర్థములు. కీశబలము=వానరసేన, బెడదల్=అపాయములు.

### తాత్పర్యము

అయినప్పటికిని నీ వానరసేన యంతయు దాఁటువఱకు వారి కేయపాయము నాలోని మొసళ్ళలోనైనవి కలిగింపకుండ నాచేనైనంత వఱకు రక్షించెదను. నీ సేన దాఁటుటకు మిట్టప్రదేశము నిచ్చెదను. కోపము విడుపుమని చెప్పఁగా రామచంద్రమూర్తి యిట్లనెను.

## —• శ్రీరాముఁడు బ్రహ్మాస్త్రమును ద్రుమకుల్యముపైఁ బ్రయోగించుట •—

ఉ. ఇయ్య దమోఘమైన శర • మెచ్చట వైతు నటన్న సాగరుం
డయ్యతులాస్త్రముం గని ధ • రానిపుణో ద్రుమకుల్యమంచు నో
యయ్య! భవద్విధంబున మ • హాఖ్యను గన్న తలంబు గల్గు నొం
డయ్యెడ నుగ్రదర్శులు మ • హాకలుషాత్ములు దస్యు లుగ్ధతిన్, ౨౯
అర్థములు. అమోఘము = వ్యర్థముగానిది, మహాఖ్యను = పెద్దకీర్తిని, ఉగ్రదర్శులు=భయంకరములైన చూపులు గలవారు, దస్యులు=దస్యుజాతివారు, దొంగలు.

### తాత్పర్యము

ఈ బాణము వ్యర్థము పోరాదు - దీని నెచ్చట వేయుదు నని యుమ

గాఁగా సముద్రుఁ డిట్లనియె. ఈ మహాస్త్రమును నీవలెఁ బవిత్రమై ప్రసిద్ధిగన్న ద్రుమకుల్య మను ప్రదేశంబుగలదు. అందు దస్యుజాతులవారు భయంకరములైన చూపులు గలవారు మహాపాపాత్ములుగలరు. ద్రుమకుల్య = చెట్లయొద్ద నీటికాలువలు గలది.

క. వాలాయము నా జలములఁ, గ్రోలుదు రాభీరు లట్టి • కుటిలుల స్పర్శన్.
దాళఁగఁ జాలను దన్ని, ర్మూలముఁ గావింపు నీ య • మోఘశరమునన్. ౨౬౬

అర్థములు. ఆభీరులు = శూద్రజాతియందొక తెగవారు, ఈ యాభీర శబ్దమే వర్ణవ్యత్యయముచే అరాబియా యయ్యెను.

తాత్పర్యము

ఆ పుణ్యప్రదేశమునందు ఆభీరులు చేరినారు. వారు కుటిలవృత్తి గలవారు, వారిస్పర్శ నేను సహింపఁజాలకున్నాను. వారు నిర్బంధముగ నా జలము పానము చేయుదురు. నీ యమోఘబాణముచే వారిని నాశముచేయుము.

సీ. అనవుడు రామవుం • డబ్ధి చూపినచాయ, జ్వలదగ్నిశరమును • వైచుటయును
శరపతనం బైన • స్థలము గాంచెను మరు, కాంతార మనఁ బేరు • కాండకలిత
రంధ్రంబునుండి నీ • రంబు పైకెగసె ర, సాతలంబున నుండి • సరభసముగఁ
గూపంబునకు వ్రణ • కూప మన్ బేరచ్చె, నందుండి పొంగెడి • యంబురాశి
తే. కడలికుద్దిగఁ దోఁచుఁ ద • త్కాండవరము, భయదనినదసమేతంబు • వసుధ వ్రచ్చు
కతన నచ్చటిగుంటలఁ • గలజలంబు, శోషగిలె నంత రఘువంశ • భూషణుండు.

అర్థములు. జ్వలత్ + అగ్ని + శరమును = మండుచున్న యగ్నివంటి బాణమును, శరపతనంబు = బాణము పడిన, మరుకాంతారము = చెట్లుచేమలులేని యెడారి, కాండకలితరంధ్రంబు = బాణముచేఁ జేయఁబడిన రంధ్రము, కూపంబునకు = బావికి, కడలికి = సముద్రమునకు, తత్కాండవరము = ఆ శ్రేష్ఠమైన బాణము, భయదనినదసమేతంబు = భయంకరమైన ధ్వనితోఁ గూడినది, వ్రచ్చుకతన = ఛేదించిన కారణమున, శోషగిలెన్ = ఎండెను.

తాత్పర్యము

సముద్రుఁ డిట్లు చెప్పఁగా నాయన చూపించిన దిక్కుగా నిప్పువలె మండుచున్న యా బాణమును వేయఁగా నా బాణము పడినచోట ఎడారి యను పేరు గాంచెను. ఆ బాణము భూమిలోఁ బ్రవేశించుటచేఁ గలిగిన రంధ్రమునుండి పాతాళ జలము పైకెగసెను. ఆ కూపమునకు వ్రణకూప మనిపేరు. అందుండి వచ్చు నీరు సముద్రమువలెఁ దోఁచెను. ఆ బాణము భూమిని ఛేదించుటచే నా వేఁడిమికి నచ్చట వారు త్రాగుచుండిన గుంటలలోఁ గల జలముకూడ నెండిపోయెను.

కం. ఆ మరుకాంతారమునకుఁ, క్షేమంబున వర మొసంగెఁ • బ్రియయవసము పీ
తామయమున్ ఫలమూలర, సామలమున్ సురభితౌష • ధాన్వితమును గాన్. ౨౬౮

అర్థములు. ప్రియయవసము=ఇంపైన పచ్చిక, వీతామయము=రోగము లేనిది, ఫలమూల రసామలమున్=ఫలములచేతను, గడ్డలచేతను, జలములచేతను నిర్మలమైనది. సురభిత=పరిమళించు, ఓషధ = మూలికలసమూహముచే, అన్వితము=కూడినది, కాన్=అగునట్లుగా.

తాత్పర్యము

ఆ జలములేని యడవికి నింపైన పచ్చిక గలదిగాను ఆరోగ్యకరముగ నుండునదిగను కందమూల ఫలాదులు గలదై యుండునట్లును సువాసన గల మూలికలు గలదిగా నగునట్లు ప్రేమముతో వరమిచ్చెను.

క. ఆ వరముబలము పెంపున, నా వసుధ శుభప్రదేశ ♦ మయ్యెను; నిటు పా
తావారము దనకుక్షి ధ, రావల్లభ తీవ్రతరశ ♦ రంబునఁ గ్రాఁగన్. ౪౨

అర్థములు. వసుధ=భూమి, క్రాఁగన్=తపింపఁగా.

తాత్పర్యము

ఆ వరము బలముచే నాభూమి శుభస్థలమయ్యెను. ఈ ప్రకారము సముద్రము తనలోని భాగము రామచంద్రమూర్తి తీక్ష్ణమైన బాణముచేఁ గాలిపోఁగా, సేతువు కట్టుటకుఁ దనలో స్థలము చూపించెద నని మాత్రము తొలుత సముద్రుఁడు చెప్పెను. ఇప్పుడు చేసిన సాహాయ్యమువలన మఱియొక వాక్యరూప సాహాయ్యము చేయుచున్నాఁడు. అది యేమన.

చ. సకలకళావిశారదుని ♦ త్వాష్ట్రనవు వెండియుఁ బల్కు విశ్వక
ర్మకుఁ దనయుండు, తండ్రికి స ♦ మానుఁడు, తద్వరశక్తి విద్యలన్
బ్రకటితదర్పుఁ డీ నలుఁడు ♦ రాఘవ! సేతువుఁ గట్టఁగా సము
త్సుకుఁ డగుఁగాక, తద్భరముఁ ♦ దోయజలోచన! యేన తాల్చెదన్. ౪౩

అర్థములు. సకలకలావిశారదుని=సమస్తవిద్యలయందుఁ బండితుని - దీని వలన రామచంద్రమూర్తికి శిల్పవిద్యయుఁ దెలియునని భావము. త్వాష్ట్రనవున్=రాపై యుండియు నివి యన్నియు నేర్చిన వానిని, సముత్సుకుఁడగుఁగాక=నిండుమనస్సుతోఁ=ప్రయత్నించువాఁడగును గాక, తద్భరము=ఆ భారము.

తాత్పర్యము

భూమికంతయుఁ బ్రభువయ్యు సకలవిద్యలయందుఁ బాండిత్యముగల రామచంద్ర మూర్తిని జూచి సముద్రుఁడు మఱియు నిట్లనియె. మీసైన్యమందు నీ నలుఁడు విశ్వకర్మకుమారుఁడు, శిల్ప విద్యయందుఁ దండ్రితో సమానుఁడు, తండ్రివరముచే నావిద్యలందుఁ బ్రసిద్ధిశక్తి గలవాఁడు. వీఁడు సేతువునిర్మించుటయందుఁ బ్రయత్నించు వాఁ డగునుగాక - ఆ సేతువు భారమును నేను వహించెదను. కొండలు చెట్లు మన్ను నీళ్ళలో వేసినపుడు మునిఁగిపోవఁబోవును. అలల దెబ్బకునీవలావలఁ దొలఁగి పోవఁబోవును. అట్లుగాకుండ నేను రక్షించెదను. ఇది నీళ్ళమీఁద దూలు తేలునట్లు

చేసెద నని సూచన-ఇట్టి వరశక్తి నలునకుఁ గలదని యిచ్చట చెప్పఁబడెను. అట్లు నలుఁడు వేసిన ఱాలు నీళ్ళమీఁదఁ దేలునప్పుడు అలల వేగమునకు నవి నిలకడలేక చెదరిపోవుట సిద్ధము. కావున నట్లు పోకుండ రక్షించెదనని భావము.

—• నలుఁడు సేతువు నిర్మించుట •—

సీ. అని తిరోహితుఁడైన • నను నలుం డవనీశ ! వారిధి సత్యంబుఁ • బలికె దేవ!
 యీ మహోదధియందు • నేను సేతువుఁ గట్టు, వాఁడ మజ్జనకుని • వరము పేర్మి
 దండ మొక్కటియె యు • త్తమము లోకంబున, బురుషున కించు నే • బుద్ధిదలఁతు
 నకృతజ్ఞు లగువారి • యందు శమం బేని, దాన మేనియు సాంత్వ • మైనఁ గాని
ఆ. నిష్ప్రయోజనంబు • నీరజలోచన!, దండభీతిఁ గాదె • తనదు లోఁతు
 చూపఁ గలిగె జలధి • చూడఁగఁ గోరి నా, సేతుబంధనంబు • భీతిదంబు. ౪౭౧

అర్థములు. తిరోహితుఁడు=కానరాకపోయినవాఁడు, దండము = శిక్ష, అకృతజ్ఞులు=చేసినమేలు మఱచువారు, భీతిదంబు=భయంకరమైనది.

తాత్పర్యము

ఇట్లు చెప్పి సముద్రుఁడు కానరాకపోఁగా నప్పుడు నలుఁ డిట్లనియె. రామచంద్ర దేవా! సముద్రుఁడు నిజము చెప్పెను. నా తండ్రి వరము బలమున నేను సముద్రమునందు సేతువు కట్టెదను. లోకమున చేసినమేలు తలఁపనివారియందు శాంతి మంచిమాట దానము పనికిరాదు. మర్దించుట యొక్కటియే పనికివచ్చును. సాగరుఁడు నీయెడఁ గృతజ్ఞుఁడు కాని కారణమునఁ గదా నీవు మంచితనమునఁ బ్రార్థించినపుడు బిఱ్ఱబిగుసుకొని పలుకక యుండెను. తన్నిన కారణముచే వచ్చి నా సేతుబంధనంబు చూడఁగోరి తనలోఁతు మనకు సాధ్యమగునట్లు చేసెద ననెను.

చం. మును పల విశ్వకర్మ వర • ముం దయచేసెను మందరాద్రి మ
 జ్జననికి, విశ్వకర్మకును • సంభవ మందితి నౌరసాత్మజుం
 డను నయి, శిల్పపుంబనుల • నైపుణిఁ దండ్రికి నీడు వత్తు, నీ
 వననిధిమాటనన్ స్మృతికి • వచ్చెను మద్వరశక్తి రాఘవా! ౪౭౨

అర్థములు. ఔరసాత్మజుఁడను=సొంతకొడుకను, నైపుణిన్=నేర్పునందు.

తాత్పర్యము

నేను విశ్వకర్మకు నౌరసపుత్రుఁడను, పూర్వము నా తల్లికి విశ్వకర్మ నీ కుమారునకు సమస్త శిల్ప విద్యలు వచ్చునని వరమిచ్చెను. ఆ వరము బలమున నేను శిల్పవిద్యయందుఁ దండ్రితో సమానుఁడను. ఈ సముద్రుఁడు చెప్పుటచే నా వరశక్తి జ్ఞప్తికి వచ్చెను.

క. ఈ సాగరుండు దీనిన్, మీ సన్నిధిఁ జెప్ప కున్న • మిన్నక యుందున్
 నా సామర్థ్యము నేనే, వాసి చెలఁగఁ జెప్పుకొనఁగ • భావ్యము గామిన్. ౪౭౩

తాత్పర్యము

నీయం దిట్టి శక్తిగలవాఁడవు సేతు వెట్లు కట్టవలెను? సముద్రమెట్లు దాఁటవలెను? అని మీ మాలోచించుచుండ వినియు నీవేల యూరకుంటివి అనెదరేమో నా సామర్థ్యము నేను చెప్పుకోరాదు. ఇంత గొప్పకార్యము నేనే పూనితి నేని యెట్లుండి యెట్లు వచ్చునో నామాట నమ్ము వారెవ్వరు? ఇప్పుడు సముద్రుఁడు చెప్పుటచే నా మాట నందఱు నమ్మెదరు.

దీనివలనఁ దన పాండిత్యము సామర్థ్యము తాను చెప్పుకోరాదని సూచన. రంభయైనను దన స్తనమును దాను పిసికికొనినను సుఖము లేదని చాటూక్తి గలదు.

ఉ. కట్టుదు నేను సేతువును • గంధిజలంబుల వానరావళుల్
పట్టుగఁ దోడ్పడన్ వలయుఁ • బార్థివవర్య! యటన్న భూమిపా
లేట్టుని యాజ్ఞ నైనగచ • రేశ్వరు లెల్లరు నేగి కానలన్
చెట్టులు పెళ్ళగించికొని • చెచ్చెరఁ దెచ్చిరి వార్ధివేలకున్. ౪౭౪

అర్థములు. కంధిజలంబులన్ = సముద్రము నీళ్ళయందు, భూమిపాలేట్టు= రాజశ్రేష్ఠుఁడు, వార్ధివేలకున్ = సముద్రతీరమునకు.

తాత్పర్యము

రామచంద్రదేవా! నేను సేతువు కట్టెదను. దానికిఁ గావలసిన పదార్థములు తెచ్చుటయందు వానరులు నాకు సహాయపడవలయును. నేనే వస్తువులు తెచ్చుకొని కట్టవలయు ననిన అపని కానేరదు. అని చెప్పఁగా రామచంద్రమూర్తి వానరుల కందఱకు చెట్లగుట్టలు తెచ్చి నలునొద్ద నిండని యాజ్ఞాపింపఁగాఁ వారట్లే యడవులకుఁబోయి చెట్లు పెళ్ళగించుకొని సముద్రతీరమునకు వచ్చిరి.

సీ. సాలాశ్వకర్ణముల్ • సప్తపర్ణంబులు, ధవవంశకుటజముల్ • తాలములును
తిలకార్జునంబులు • తినిశబిల్వంబులు సుమయుతకర్ణికా • రము లశోక
వారముల్ మామిళ్ళు • వకుళముల్ చండ్రలు, తాలదాడిమగుల్మ • జాలములును
వేములు కుంకాయ • వృక్షముల్ పారులున, మూలముల్ గాను వి • మూలములుగఁ
ఆ. దెచ్చి రింద్రమధ్వజముఁ • దెచ్చెడి భంగిని, నందుఁ గపులు కొంద • ఱలవుమీఱ
కొండగములఁ జెకి • దండియంత్రంబుల, నునిచి తెచ్చి రప్పు • డుదధికడకు.

అర్థములు. సాలముల్=మద్దులు, అశ్వకర్ణముల్ = ఇనుమద్దులు, సప్తపర్ణంబులు=ఏడాకుల యరఁటులు, ధవ = చండ్రలు, వంశ=వెదుళ్ళు, కుటజ= కొండమల్లె, తాలముల్ = తాటిచెట్లు, తిలక = బొట్టుగు చెట్లు, అర్జునములు= ఏఱుమద్దులు; తినిశ = నెమ్మిచెట్లు, బిల్వములు = మారేడులు, కర్ణికారము = కొండగోఁగు, వకుళముల్=పొగడలు, కుంకాయలు = కుంకాయచెట్లు, దీని కరవమున తెంగాయ యందురు. దానికి దక్షిణదేశమున లంకనుండి వచ్చినదందురు. పైపెమ్ప భరతఖండమున లేదందురు. ఆర్యావర్తమందు అంతకు ఉత్తరమున

నున్నట్లు రామాయణమునఁ గలదు. టెంకాయ తెంకాయ యని రూపాంతరము గలదు. టెంక, తెంక శబ్దములకుఁ గొబ్బెరమీఁది చిప్పయని యర్థము. అది కల కాయ టెంకాయ తెంకాయ, తెంకాయయే ద్రావిడభాషయందు తేంగాయ యయ్యెను. కావున వారు చెప్పెడి యుత్పత్తి సరికాదు. సమూలముల్ = వేళ్ళ తోడను, విమూలముల్ = వేళ్ళులేకయు, అలవు=బలము, ఇందు కొండలను యంత్ర ములపైఁదెచ్చిరని చెప్పఁబడెను. కావున సుగ్రీవుఁడు వచ్చునపుడే సేతువు కట్టు టకుఁ గావలసిన పరికరములు తెచ్చెనని భావము. ఇట్టి యంత్రములు వానరుల యొద్దనే యున్నప్పుడు ఆ నాఁటి నాగరకత యెట్టిదో యూహింపవగు. సముద్ర ములోఁ బాఱవైచుట కే చెట్లనేమి? అడవిచెట్టు లన్నియుఁ దీఁకి తెచ్చిరని చెప్పినఁ జాలునే యీ వివరణమేల? ఉద్భిజ్జ జాతులలోఁ బుట్టినను ఈ యాజాతి వృక్షములు రాము కార్యమునకుఁ దోడుపడి తమ జన్మములు సార్థకము చేసికొనె ననియు దక్కినవి వ్యర్థజన్మము లయ్యెననియుఁ దెలుపుటకే.

దీనివలన రామసేవకై వినియోగపడని జీవి వ్యర్థజీవి యని వాల్మీకి మహర్షి యభిప్రాయము.

పంచచామరము. గుభీల్ గుభీ ల్మనంగఁ ♦ గొండ లెల్ల దండిగా
దభాలునం బడంగ వైవఁ ♦ దల్లడిల్లి సత్త్వముల్
గభీ ల్మనంగ గుండియల్ ది ♦ గా ల్పడంగ, బిందువుల్.
నభంబునం జివాలునన్ ఘు ♦ ణంబుగన్ నటింపఁగన్. ౬౬

అర్థములు. సత్త్వముల్ = సముద్రమునం దుండు జంతువులు, దిగా ల్పడంగన్ = దిగులుపడఁగా.

## తాత్పర్యము

స్పష్టము.

సీ. ఆమడల్ నూఱు వ్యా ♦ యత మైనసూత్రముల్, పట్టిరి కొందఱు ♦ ప్లవగవరులు
దండంబులను గేల ♦ ధరియింత్రు కొందఱు, సమముగ నెఱపిరి ♦ శైలములను
తృణకాష్ఠపర్వత ♦ గణముల బిగియింత్రు, సందులు శ్రీరామ ♦ చంద్రునాజ్ఞఁ
బరుగిడువారును ♦ బర్వతంబులఁ బట్టి, పెకలించువారును ♦ భీమముగను
ఆ. మోసి తెచ్చువారు ♦ మున్నె నే నే మున్న, టంచు వచ్చువారు ♦ నబ్ధిలోన
వైచువారు నైరి ♦ వానరు లమ్మహా, రవము తుములమయ్యెఁ ♦ బ్రకటభంగి.

అర్థములు. వ్యాయతములు = దీర్ఘములు, సూత్రముల్ = పగ్గములు, తృణకాష్ఠ పర్వతగణముల=గడ్డి, కట్టెలు, కొండలు వీని సమూహములు, తుము లము=సంకులము.

## తాత్పర్యము

సేతువు వంకరలు పోకుండుటకై నూఱామడ పగ్గముల నీకొననుండి యా

కొనవలకు నీ ప్రక్క నా ప్రక్క కొందరు స్తంభములు నాటివచ్చిన వైరులు వీరికి వైతు రని పట్టుకొనిరి. కొందరు చేతులందు మట్టపు పలకలను దీవరపజచుటకును దండములఁ బట్టుకొనిరి. కొందరు శవు లక్షము దిడ్డముగా వైచిన పర్వతములను చదరముగా నెఅపిరి. కొందరు సందులందు గడ్డి, కట్టెలు, కొండలు వేసి బిగించిరి. కొందరు పర్వతాదులఁ దెచ్చుటకై పరువెత్తిరి. పోయినవారు కొందరు పెల్లగించు చుండిరి. పెకలించినవానిని గొందరు మోచి తెచ్చిరి. ఆ తెచ్చువారిలో నేను ముందు పోదు ననిన నేను ముందని వచ్చిరి. తెచ్చిన వానిని గొంద అందుకొని సముద్రములో వైచిరి. ఈ శబ్దము విస్తారమై సంకుల మయ్యెను.

క. రామాజ్ఞఁ దోడుపడ శా, ఖామృగముల్ సేతు వొనరఁ • గట్టె న్నలుఁడున్
ధీమంతుఁడు తొలిదినమున, నామడ లోకపదియునాలు•గంబుధిలోనన్. ౪౭౮

తాత్పర్యము

ఎట్లెట్లు చేయవలసినది రామచంద్రమూర్తి చెప్పుచుండఁగా వానరులు సహాయపడుచుండ నలుఁడు మొదటిదినమున సముద్రములోఁ బదునాలు గామడ పొడవున సేతువు కట్టెను.

ఉ. పుట్టిన సంతసంబునను • భూరిజవంబునఁ జేసి క్రోఁతి పెన్
దెట్టువ లిర్వదామడ ద్వి • తీయ దినంబునఁ గట్టె వీఁకమై
నట్టె తృతీయఘస్రమున • నామడ లిర్వది యొండు నబ్రమా
నట్టులు నా చతుర్థదిన • మం దొక యిర్వది రెండు విమ్మటన్. ౪౭౯

అర్థములు. తెట్టువలు=సమూహములు, ఘస్రము=దినము.

తాత్పర్యము

ఉత్సాహ మతిశయించుటచే వానరులు రెండవ దినమందు నిరువది యామడ, మూఁడవ దినంబున నిరువది రెండు, నాలుగవ దినంబున నిరువది రెండామడలు మిగుల వేగముగఁ గట్టిరి.

క. పంచమదివసంబున బంధించెను నిరువదియు మూఁడు • నెఱియామడలన్
బ్రాంచితగతి సామర్థ్యర, మాంచితుఁ డగు నలుఁడు జనకు•నటు లనకట్టన్. ౪౮౦

అర్థములు. సామర్థ్యరమాంచితుఁడు = సామర్థ్య సంపత్తిచేఁ బ్రకాశించు వాఁడు, అనకట్ట=సేతువు.

తాత్పర్యము

సామర్థ్య సంపత్తిగల నలుఁ డైదవ దినమందు నిరువదిమూఁడామడ దూరము సేతువుకట్టెను, ౧౪+౨౦+౨౧+౨౨+౨౩=౧౦౦ నూటయొక్క యామడ యగుచున్నది. నీటి వెడలుపు నూరును ఈ ప్రక్క నగమామడ ఆ ప్రక్క నగమామడ నేలమీఁదను గట్టిరి.

క. అంబరమున స్వాతిపథ, ముం బోలుచు వార్ధి మధ్య•మున సేతువు ప్రా
లం బరికించుచు నభమున, నంబరచరతతులు నిలిచి • నబ్బుర పడుచున్. ౪౮౧

అర్థములు. స్వాతీపథము=స్వాతీనక్షత్ర మార్గము. ఇది యాకాశంబున నెల్లఁగా నుత్తర దక్షిణముగా నక్షత్రకాంతి గానవచ్చును. స్వాతీపథము=ఛాయా మార్గము (౨) స్వాతీవీథి=ఆకాశమున సూర్యాదులచారమునకు మూఁడు మార్గములు గలవు. వానిలో రెండవదానికి మధ్యమార్గ మని పేరు. అందు మూఁడు మార్గములుకలవు. అందు స్వాతిమార్గము రెండవమార్గము. ఇది వాయుపురాణమందుఁ జెప్పఁబడినది. సూర్యాదీనాం త్రయోమార్గా దక్షిణోత్తర మధ్యమాః తథాద్వేచాపి ఫల్గున్యౌ మఘా చైవార్షభీ మతా, హస్త శ్చిత్రా స్తథా స్వాతీ మధ్యవీధ్యభివి్రశ్రుతా, జ్యేష్ఠా విశాఖానూరాధా వీధిరాజగవీమతా, ఏతాస్తువీధయ స్తిస్రో మధ్యమో మార్గ ఉచ్యతే। వాయు పురాణము.

తాత్పర్యము

ఆకాశమున స్వాతిమార్గమువలె సముద్రమధ్యమున సేతువుండఁగాఁ జూచి యాకాశసంచారు లాకాశమునందుండి యాశ్చర్యపడుచుఁ జూచిరి.

సీ. పదియోజనంబుల•పఱపును రెయోజన, శతకంబు నిడివియై•జాను మీఱి
రాణించు కడు మన్క•రంబైన సేతువు, ముక్కున ్రవేలిడి • యక్కజపడి
యద్భుతం బిది రోమ•హర్షణ మిది యస, హ్యంబు నచింత్యం బ•టంచు సకల
భూతముల్ వెఱ గంద•భూరుహచారులు,గంతులు వేయుచు • గర్జలిడిరి
ఆ. కోటివేలుకపులు•సూటి సేతువుఁ దీర్చి, కొనుచు నవలితీర•మునకుఁ జనిరి
గద ధరించి నిలిచెఁ•గాని వారి వధింపఁ, బ్రెగ్గడలును దా వి•భీషణుండు. ౭౮ ౨

అర్థములు. పఱపు=వెడలుపు, అక్కజపడి = ఆశ్చర్యపడి, రోమహర్షణము=గగ్గురుపాటు గలిగించునది, అసహ్యంబు=సహింపరానిది, అనఁగా భగవంతుని తోడ్పాటు లేక యెవ్వఁడును చేయలేనిది, అచింత్యము=భగవత్సహాయము లేనివాఁ డిట్లు నేను జేయఁగల నని యాలోచించుటకును సాధ్యపడనిది, వెఱగు+ అందన్=ఆశ్చర్యము కలుగుచుండఁగా, కానివారిన్=విరోధులను, ప్రెగ్గడలు = మంత్రులు.

తాత్పర్యము

పదియామడ వెడలుపు నూఱామడ నిడివి గలిగి యందమై చేయుటకుఁ గష్టమైన సేతువును జూచి యాశ్చర్యపడి ముక్కుకొనమీఁద ్రవేలుంచుకొని యిది యాశ్చర్యకరము, ఇది గగురుపాటును చేయుచున్నది, ఇది దైవసహాయము లేనివారి కసాధ్యము, అట్టివారు మనస్సునందైనఁ జేయఁ దలంపరానిది యని భూతము లాశ్చర్యపడుచుండఁ గోటివేల క్రోఁతులు ముందుగా సేతువు చక్కఁ జేసికొనుచు నావలితీరమునకుఁ బోయిరి. శత్రువు లే ప్రక్కనుండియైన మాఱువేషములతో వత్తురేమో యని వారిని దండించుటకై విభీషణుఁడు మంత్రులతో గద చేతియందు గలవాఁడై నిలచియుండెను. వచ్చిన శుకుఁ డిచ్చటనే బంధింపఁబడి యుండుటచే రావణునకీ వార్త తెలియదు.

ఫాల్గున బహుళము పాడ్యమినాఁడు సముద్రతీరము చేరుట. ఆనాఁడే విభీష ణున కభయప్రదానము, పాడ్యమి, విదియ, తదియ, దర్భశయనము. చవితి, పంచమి షష్ఠి, సప్తమి, అష్టమి, సేతుబంధనము, అష్టమినాడే సువేలారోహణము.

క. ఏపారి విశాలంబై, తోఁపుడు గొన్నట్టు నునుపు•దోఁపఁగ సమమై
దీపించుచు సేతువు దగెఁ; బాపట దీర్చిన విధాన•వారిధి నడుమన్. ౮౩౦

అర్థములు. ఏపారి = దృఢమై, తోఁపుడుగొన్నట్టు=నునుపు వచ్చుటకై తోఁపుడుపట్టినట్లు, నునుపై = గుంతలు మిట్టలు లేనిదై, పాపటదీర్చినవిధానన్= స్త్రీలు తలలందు పాపటదీర్చినట్లు చక్కఁగా, ఇది యీ కాలపు స్వైరిణుల చెవుల మీఁదికిఁబోవు బజ్జికొప్ముల పాపటలు గావని యెఱుంగవలయును. పాపటలు చక్కఁగాఁ నుండిన మేలేమో, యాజ్ఞానమే యిప్పటి స్త్రీలకుఁ బోయినది.

తా త్ప ర్య ము

సముద్రమధ్యమునందు దృఢమై నేడలుపై తోఁపుడుపెట్టినట్లు నునుపై మిట్ట పల్లములు లేనిదై చక్కఁగా పాపట దీర్చినట్లు సేతువు ప్రకాశించుచుండెను.

—• శ్రీరామ లక్ష్మణులు కపిసేనతోడ సేతువు దాఁటుట •—

సీ. అప్పుడు సుగ్రీవుఁ•డా రాముతో ననుఁ, హనుమంతు మీఁదు శాఁ•రాత్మజాతు
సౌమిత్రి యెక్కనఁ • జయ్యన నీ యబ్ధి, వైహాయసాధ్వంబుఁ • బట్టి వారు
దాఁటింతు రనవుడు • దశరథతనయుఁడు, నహోలక్ష్మణుం డయి•చాప మూని
తోయజాప్తభవుండు•తోడరా సైన్యంబు, ముంగల గాఁగఁ జ•నంగఁ గడఁగె
ఆ. నంతఁ గపులు కొంద•ఱతని పార్శ్వంబులం, గొలిచి రాఁగఁ గొంద•ఱలవుమెఱయ
నీఁదుకొనుచుఁ జనిరి•యేఁగిరి కొందఱు, గరుడుభంగి వేగ•గగన మొరసి. ౮౩౧

అర్థములు. వైహాయసాధ్వంబునన్ = ఆకాశమార్గమున, తోయజాప్త భవుండు=సుగ్రీవుఁడు, ముంగల=ముందుభాగమున, అలవు=బలము.

తా త్ప ర్య ము

అప్పుడు సుగ్రీవుఁడు రామచంద్రమూర్తితో నీవు హనుమంతుని లక్ష్మణు డంగదుని నెక్కితిరేని వా రాకాశమార్గమున నావలియొడ్డు చేరుదురని చెప్పఁగా రామచంద్రమూర్తి వానరుల విడిచిపోవొల్లక సేనకు ముందుగా చాపముఁ గేలఁ బూని సుగ్రీవునితోడఁ బోవ నారంభించెను. అప్పుడు కొందఱు వానరులు ప్రక్కల నడచి వచ్చిరి. కొందరు బలవంతులు నీళ్ళలో నీఁదుచు వచ్చిరి. కొంద రాకాశమున గరుడునివలె నెగిరిపోయిరి.

క. కొందఱకు లేదు మార్గము, యందఱు నిట్లరుగుచుండ • నా సేనరవం
బెందును బర్వుచు జలనిధి, క్రిందెల్లను గ్రమ్మంగ నిమిష•కాలములోనన్. ౮౩౨

తాత్పర్యము

కొండ రెల్లుపోవుటకు నడము దొరికినదికాదు. అందటి ప్రకారము పోవునపుడు వారలు చేయు ధ్వని సముద్రధ్వనిని నిమిషములో మ్రింగివైచెను.

ఉ. సేతువు నిట్లు దాటి కపి • సేన సమూలఫలోదకక్షితిన్
నేతృనిదేశమార్గమున • నెమ్మది డిగ్గెను, గోనలాత్మజా
జాతు సుదుష్కరంపుఁ గృతి • సంభ్రమ తత్పర దృష్టిఁ జూచుచున్
జేతము పొంగ దేవఋషి • సిద్ధులు చారణులున్ రఘూత్తమున్. ౪౧౭

అర్థములు. సమూలఫలోదకక్షితిన్ = గడ్డలు, వేళ్లు, పండ్లు, మంచినీరు గల భూమియందు, నేతృనిదేశమార్గమున=సుగ్రీవుఁ డాజ్ఞాపించినట్లు.

తాత్పర్యము

కపిసేన సేతువుదాటి పండ్లు నీళ్లు మొదలయిన యాహార వస్తువులు దొరుకు చోట సుగ్రీవుని యాజ్ఞచొప్పున విడిసెను, అప్పుడు రామచంద్రమూర్తి చేసిన యసాధ్యకార్యమును దొట్రుపాటుతోఁ జూచుచు దేవఋషి సిద్ధచారణులు రావణు మరణ మికఁ దప్పదని తమ మనస్సులో నుప్పొంగుచు.

వనమయూరము. చేరి యభిషేకమును • జేసి శుభవారిన్
ధీరవర! శత్రుల వ • ధింపుము నపారా
వారమహి నేలుము య • పారసమ లంచున్
సారెకు సమర్చల నొ • నర్చిరి సభక్తిన్. ౪౧౮

అర్థములు. స+పారావారమహి=సముద్రముతోఁ జేరిన భూమి, అపారసమలు=అనేక సంవత్సరములు, సమర్చలన్=పూజలను.

తాత్పర్యము

రామచంద్రమూర్తిని పవిత్రజలముచే నభిషేకించి శత్రువుల జయింపుము. అనేక సంవత్సరముల భూమండల మంతయు నేలుము అని భక్తితోఁ బూజించిరి. ఈమాత్రముననఁ బరత్వము బయటపడెనని చెప్ప వలనుపడదు. అట్టి వాక్యము లందు లేవు.

వనమయూరము. భజసనగగలు గణములు. తొమ్మిదింట యతి.

—• { ౨౩-వ సర్గము. శ్రీరాముఁడు లక్ష్మణున కప్పుడు దోఁచు శకునంబుల తెఱం గెఱింగించుట. } •—

చ. సకల నిమిత్తవేది రఘు • చంద్రముఁ డప్పుడు వర్తమానముల్
శకునము లొలిఁ జూచి యను • జాతునిఁ గౌఁగిటఁ జేర్చి యిట్లనున్
బ్రకటజలాశయంబు ఫల • భాసివనంబుల నాశ్రయించి సా
వికలతఁ గీశవాహినులఁ • బెంపగు వ్యూహము దీర్పు లక్ష్మణా! ౪౧౧

అర్థములు. సకలనిమిత్తవేది = అన్ని శకునములఁ లక్షణములు దెలిసిన వాఁడు, వర్తమానముల్ = జరుగుచున్నట్టివి, ప్రకటజలాశయంబు = విస్తారముగ నీటి సౌకర్యముగల స్థలమును, ఫలభాసివనంబులన్ = ఫలములచేఁ ప్రకాశించు వనంబులను, స + అవికలత = వికలత్వము లేకుండునట్లు.

## తాత్పర్యము

సమస్త శుభాశుభ శకునముల లక్షణ మెఱింగిన రామచంద్రమూర్తి యిప్పుడు శుభశకునంబు లగుట చూచి సంతోషించి మనకు భయము లేదని సంతోషించి లక్ష్మణుఁ గౌఁగిలించి, మంచినీళ్లు విస్తారముగఁ గల ప్రదేశమందును, ఫలముల దండిగ దొరకు వనము లుండు చోటను వానరసేన చెదరకుండ వ్యూహముగాఁ దీర్చుట తగునని చెప్పెను.

రాజు లీ ప్రకారము శకునములు చూచియే కార్యములు చేయవలయు నని నీతిశాస్త్రము చెప్పుచుండుటచే రామచంద్రమూర్తి వానిని గమనించె నని తెలియునది.

నిమిత్తాన్యేవ శంసంతి శుభాశుభ ఫలోదయం । తస్మా దేతాని శాస్త్రజ్ఞో రాజా సముపలక్షయేత్ ॥ కామందకము.

చ. బలిముఖ ఋక్షరాక్షస ని ♦ బర్హణమున్ భృశభీతిదంబు నా
ప్రళయము లోకనాశన క ♦ రంబుగఁ దారసిలెం, బరాగముల్
బలియఁగ వాయువుల్ విసరెఁ ♦ బర్వతశృంగములున్ వణంకె, నీ
యిల చలియించె, నేలపయి ♦ వృక్షచయంబులు వ్రాలెఁ గంటివే. ౮౮౯

అర్థములు. అప్పుడు కానవచ్చిన శకునములను లక్ష్మణునకుఁ జెప్పుచున్నాఁడు. బలిముఖ = వానరులయు, ఋక్ష = ఎలుఁగులయు, రాక్షస = రాక్షసులయు, నిబర్హణమున్ = మరణముగలది-ఇట్లు చెప్పుటచే మనుష్యుల మైన మనకు భయము లేదని భావము, భృశభీతిదంబు = మిగుల భయంకరమైనది, ప్రళయము = ప్రళయకారణమైన యుద్ధము, తారసిలెన్ = తటస్థించెను. పరాగముల్ = దుమ్ములు, బలియఁగన్ = అతిశయింపఁగా, ఇల చలియించెన్ = భూకంపము కలిగెను.

అత్యంతానిష్ట భూకంపము సంధ్యాకాలమందుఁ గలుగును కావున నిట సంధ్యాకాల భూకంపమే గ్రాహ్యము. ఇట్లు చెప్పుటచే నిది సముద్రము దాఁటిన నాఁటి సాయంకాల మని గ్రహింపనగు. "యామత్రయాచ్చ భూకంపో ద్విజాతీనా మరిష్టదః । అనిష్టదః క్షితీశానాం సంధ్యయో రుభయో రపి" అని వసిష్ఠ వాక్యము ప్రమాణము.

## తాత్పర్యము

వానరులకు భల్లూకములకు రాక్షసులకు వినాశకరమైనదియు మిగుల భయంకరమైనదియునగు యుద్ధము లోకనాశనము కొఱకు తటస్థించెను. దుమ్ములు రేఁపుచు

గాలి వీచెను. కొండల శిఖరములు వణంకెను. భూకంపము కలిగెను. ఆ కారణమునఁ జెట్లు నేలఁ బడెను.

తే. భయదమాంసాదనిభములఁ • బరుషములును
 బరుషరవములఁ గ్రూరముల్ • వారివాహ
 నిచయములు ఘోరభంగిని • నెత్తుతోడి
 వృష్టిఁ గురియించె నుత్పాత • హేతుకముగ. ౪౯౦

అర్థములు. భయద=భయంకర మగు, మాంసాద = మాంసమును దిను పక్షిమృగములవంటి యాకారములు గలవి, పరుషములు = మనస్సునకు వెగటు గలిగించునవి, పరుషరవములు=కఠోరధ్వనులుగలవి, క్రూరములు=భయంకరములు వారివాహనిచయములు = మేఘముల సమూహములు, వృష్టి = వాన, ఉత్పాత హేతుకముగ = ఉత్పాతమునకుఁ గారణమై.

తాత్పర్యము

భయంకరములైన మాంసములు దిను డేగలు మొదలగు పక్షుల మృగముల యాకారములు గలవియు, చూడ నింపుగానివియు, కర్ణకఠోర ధ్వనులు గలవియు, భయంకరములునగు మేఘసమూహములు భయంకరముగ నెత్తురు వర్షము కురియించుచున్నవి. ఇవి యుత్పాత సూచకములు.

'దివ్యుల్కాఽపతనం చైవ దివానక్షత్రదర్శనం దివాశేని స్తథా కావత్యంగ రక్త ప్రవర్షణ' మ్మని వరాహమిహిరుఁడు.

సీ. కుంకుముడాలున • ఘోర మయ్యెను సంధ్య, సూర్యునం దొక నల్ల • చుక్కఁ దోఁచె
 మార్తండునం దుండి • మండుచు నొకయగ్ని, మండలంబిల వ్రాలె • కండకాటి
 మృగములుఁ బక్షులు • నెల్లెడ దీనస్వరముల ఘోషించెను • రవిని జూచి
 నిజతేజ మెడయంగ • నిశలందుఁ జంద్రుఁడు, నలుపును నెఱుపున • గలయఁ గొఁకల
తే. విలయకాలంబునను బోలె • వికటముగను,
 దాపమును గూర్చుచున్నాఁడు • ధరణికెల్ల
 గుడును హ్రస్వంబు రూక్షంబు • ఘోర మగుచు
 వెలయుచున్నది యుద్దాని • విధముఁ గంటె. ౪౯౧

అర్థములు. కుంకుముడాలున = కుంకుమము వన్నె చేత నెఱ్ఱగా, సంధ్య-ఇట్లు చెప్పుటచేతను నిది సంధ్యాకాల మనియే యేర్పడుచున్నది. ఎడయంగన్ = తొలఁగిపోఁగా, నిశలందున్=అనుటచే ప్రతిదినము రాత్రులందు అని భావము. ఇది వర్తమానవిషయముకాదు. గడుసు = పరివేషము, హ్రస్వంబు = కుఱుచయైనది, రూక్షము = క్రూరము.

తాత్పర్యము

లక్ష్మణా! సంధ్యాకాల మేఘములు కుంకుమవర్ణము కలవై యున్నవి.

సూర్యునం దొక నల్లని చుక్క గానవచ్చుచున్నది. సూర్యునినుండి యొక నిప్పు సమూహము మండుచు నేలఁబడెను. సూర్యుని జూచి యన్ని ప్రదేశము లందును మృగములు, పక్షులు దుఃఖస్వరముల ధ్వనించుచున్నవి. రాత్రులందు చంద్రుఁడు తనకాంతి క్షయింపఁగా కొనలందు నలుపు, ఎఱుపు కలసిన కాంతి గలవాఁడై ప్రలయకాలమందువలె వేఁడిమి కలిగించుచున్నాఁడు. పరివేషము పుట్టినది, పరుషమై, ఘోరముగ నున్నది, చూచితివా? "అపర్వణి తథా రాహుగ్రహణం చంద్రసూర్యయోః । చంద్రార్కమండలచ్ఛిద్రం దృష్ట్వా జనపదక్షయః" వరాహమిహిరుఁడు. ఇది యష్టమినాఁటి సాయంకాలవార్త.

చ. మలినము లౌచుఁ దారకలు ♦ మానని లోకవినాశ మియ్యెడన్
తెలిపెడిఁ, గాకగృధ్రములు ♦ దేపువ గల్గిన డేగ లెంతయే
నలుకపుఁ బక్షులం దఱుమ ♦ నారట మందెడి, నక్క లెయ్యెడన్
గలయఁగఁ బర్వి భీకరము♦గా రొద సేసెడిఁ గీడు దెల్పుచున్. ౪౯-౨

అర్థములు. తేఁకువ=ధైర్యము, అలుకపుఁ బక్షులు=చిన్నిపిట్టలు.

తాత్పర్యము

నక్షత్రములు మలినములై లోకము నాశమగుట తెలుపుచున్నవి. మిక్కిలి చిన్నపిట్టలు తఱుముకొనిరాఁగా కాకులు, గ్రద్దలు, ధైర్యముగల డేగలు సంకటపడుచున్నవి. ఎక్కడఁ జూచినను నక్కలు వ్యాపించి భయంకరముగాఁ గూయుచుఁ గీడు గలుగుట దెలుపుచున్నవి. లంకయం దీ యుత్పాతములు కానవచ్చుటచే లంకకే కీడు గలుగు నని భావము.

ఉ. వీనిఫలంబుఁ జూడఁ బృథి♦వీస్థలి శోణితమాంసకర్దమం
బౌ నిజ మస్లు గాన విబు♦ధాహితపాలితపట్టనంబు ని
ష్ఠే నిఖిలాటవీచరసే♦నేతముగాఁ జని ముట్టడింత మం
చా నెఱబంటు లంక కెదు♦రై చనె సంభృతచాపహస్తుఁడై. ౪౯-౩

అర్థములు. శోణితమాంసకర్దమంబౌన్=నెత్తుటితోను, మాంసముతోను బురద యగును. విబుధాహిత=దేవవిరోధి యగు రావణునిచే, పాలిత=పాలింపఁబడు, నెఱబంటు = శూరుఁడు; సంభృతచాపహస్తుఁడై = ధరింపఁబడిన విల్లుగల చేయిగలవాఁడై.

తాత్పర్యము

ఈ శకునముల ఫల మేమంటిరా? యీ నేల నెత్తుటితోను, మాంసముతోను బురదగానగును. కావున రావణపాలిత లంకానగరమును నిష్ఠే సేనతోడఁ బోయి ముట్టడింతము అని యీ మహాశూరుఁడు చేత విల్లుధరించి లంక కెదురుముఖమై పోయెను.

తే. సంప్రహారరసావేశ ♦ సంప్రహృష్టు, రాము వెన్కొని సుగ్రీవ ♦ రాక్షసాధి
పతులు లోనగు కపులెల్ల♦వరుసఁ జనిరి, శత్రుమర్దన నిశ్చిత♦స్వాంతు లగుచు.

అర్థములు. సంప్రహారరసావేశ=యుద్ధాభిలాషావేశముచే, సంప్రహృష్టన్ మిగుల సంతోషించినవానిని, సుగ్రీవరాక్షసాధిపతులు=సుగ్రీవవిభీషణులు, శత్రుమర్దన = పగవారిని జంపుటయందు; నిశ్చిత = నిశ్చయింపఁబడిన, స్వాంతులు = మనస్సుగలవారు.

తాత్పర్యము

యుద్ధాభిలాష యావేశించుటచే మిగుల సంతోషించి పోవుచున్న రామచంద్రమూర్తి వెంట సుగ్రీవ విభీషణులు, తక్కిన వానరులు రాక్షసులఁ జంపవలెనని నిశ్చయించుకొనినవారై పోయిరి.

క. వారలభక్తియు శక్తియు, వారల యాలాపములును ♦ వారల చేష్టల్
వారలధైర్యము గని సీ,తారమణుఁడు సంతసించెఁ ♦ దన హృదయమునన్.

అర్థములు. ఆలాపములు=మాటలు.

తాత్పర్యము

ఆ వానరుల భక్తి, శక్తి, వీరాలాపములు, వీరులు చేయఁదగు చేష్టలు, ధైర్యము చూచి వీరుత్సాహపూరితులై యున్నారు. గావున మనకు జయము తప్పదని తన మనస్సునందు సంతోషించెను.

ఇప్పుడు వానరులు సంతోషించి రనుటచే నింతకుఁ బూర్వము వారు మన మీదుర్గములు దాఁటఁగలమా యని నిరుత్సాహులై యుండిరని సూచన. సేనాభటు లుత్సాహవంతులై యుండుట జయచిహ్నము.

**-♦ ౨౯-వ సర్గము. శ్రీరాముఁడు లంకలోనిధ్వనివిని సీతను దలఁచి దుఃఖించుట ♦-**

క. పారావారముఁ బోలు న, పారవనేచరబలౌఘ♦వర్గము ధాటిన్
భూరిజవంబును సైఁపక, ధారిణి వడఁకాడె భీతిఁ♦దతపీడితయై. ౪౯౬

అర్థములు. పారావారము=సముద్రము, అపార=అంతములేని, వనేచర బల=వానరసేనల, ఓఘ = సమూహముయొక్క, ధాటిన్ = దండయాత్రను, భూరిజవంబును=మిగుల వేగమును, తతపీడితయై=మిగులఁ బీడింపఁబడినదై.

తాత్పర్యము

సముద్రమువంటి పారములేని వానరసేనయొక్క దాడిని, మిగుల వేగమును సహింపలేక మిగుల బాధింపఁబడినదై భూమి భయముచే గడగడ వడఁకెను.

ఉ. భ్రాజితతారకానికర ♦ రాజితశారద పౌర్ణమాసి నీ
రేజవిపక్షుచే వలె హ ♦ రిప్రవరౌఘము సంవ్యవస్థితం
బై జగి మీఁతఁ భూమితన ♦ యాధ్వనిచే, విన వచ్చె లంకఁ బే
రోజ మృదంగ కాహళర ♦ వోల్బణముల్ ప్లవగేంద్రపాళికిన్. ౪౯౭

అర్థములు. భ్రాజిత = ప్రకాశించు, తారకానికర = నక్షత్ర సమూహముచే, రాజిత=ఒప్పుచున్న, శారద=శరత్కాలమందలి, పౌర్ణమాసి = పున్నమ,

నిశేశవిభశ్శుచేవలెన్ = చంద్రునిచేతవలె, హరిప్రవరౌఘము = వానర ముఖ్యుల సమూహము, సంవ్యవస్థితంబై = విడిదిపట్టులం జక్కఁగా నిలుపఁ బడినదై, మృదంగ = మర్దలలయొక్కయు, కాహళ = తుత్తూరాల యొక్కయు, రవోల్బణముల్=ధ్వని విశేషములు, ప్లవగేంద్రపాళికిన్=వానరశ్రేష్ఠుల గుంపునకు.

తాత్పర్యము

చంద్రునిచే, నక్షత్ర సమూహములచేఁ బ్రకాశించు తత్కాలము నాఁటి పున్నమవలె (కార్తిక పూర్ణిమ) వారివారి విడిదిపట్టుల నిలుపఁబడి సద్దులేని వానర సమూహములు రామచంద్రమూర్తిచేఁ బ్రకాశించెను. (ఎన్ని నక్షత్రముల కాంతి యైనను నొక చంద్రకాంతికి సరిగానట్టు వానరు లందఱ తేజస్సుకంటె రామచంద్ర మూర్తి తేజస్సే యతిశయించి యుండెనని భావము.) ఇట్లు వానరులు వారి వారి తావుల వారు వారు నిశ్శబ్దముగాఁ గుదురుకొనుటచే లంకలోని మద్దెలలయు, తుత్తూరాలయు ధ్వనులు విశేషముగ వానరులకు వినవచ్చెను.

ఉ. ఆ మహితారవంబులు వ♦నాటుల వీనులఁబడ్డ వారు ను
ద్దామముదంబునం గెరలి ♦ తద్దయు నీసున వాని మించఁగా
భీమరవంబు నింపఁగఁ గ ♦ భీరఘనాఘన గర్జలట్లు లం
కామనుజాశనావళికిఁ ♦ గర్ణసుగోచర మయ్యె భీమమై. ౪౯౮

అర్థములు. మహిత+ఆరవము = గొప్పధ్వని, ఉద్దామముదంబునన్ = అధిక సంతోషముతో, కెరలి=విజృంభించి, ఈసున = రోషముచే, గభీర = దీర్ఘమైన, ఘనాఘన = వర్షాకాల మేఘముల యొక్క, గర్జలు = ఉరుములవలె, కర్ణసుగోచర మయ్యెన్=చక్కఁగా వినవచ్చెను, భీమమై=భయంకరమై.

చ. తతబహుచిత్రకేతన ప ♦ తాకిని లంకనుజూచి జానకీ
పతి తరుణీమణిం దలఁచి ♦ పాపి దశాస్యునిచే నిరుద్ధ యై
సతి మృగశాబలోచన కు♦జగ్రహబాధిత రోహిణీగతిన్
వితతమనోవ్యథం దవిలి♦విన్నఁబడెంగద యీ పురంబునన్. ౪౯౯

అర్థములు. తత=విస్తారమైన, బహు=అనేకములై, చిత్ర = చిత్రములైన, కేతనపతాకిని = కేతనములు, పతాకములు గలది, చిహ్నములుగల టెక్కెములు కేతనములు - చిహ్నములు లేని ధ్వజములు పతాకములు; నిరుద్ధయై = నిర్బంధమున నుంపఁబడినదై, మృగశాబలోచన=జింకపిల్ల కన్నులవంటి కన్నులు గల సీత, సీతాదేవి రామచంద్రమూర్తితో వనవిహారముచేయునపు డామె యొక జింకపిల్లను పట్టుకొనఁబోవ నపు డది బెదరి చూచెను. అప్పు డా జింకపిల్ల కన్నులు సీతాదేవి కన్నులవలె నుండెను. రామచంద్రమూర్తి కిపు డది స్మరణమునకు వచ్చెను. లేదా యిక్కడ సీత నిరుద్ధయై యుండుటకు మృగము(జింక)కదా కారణమని జింక జ్ఞప్తికి రాఁగా నప్పుడు మాయ జింకను జూచిన చూపులు జ్ఞప్తికి వచ్చె

వని రైవను జెప్పనగును. వాల్మీకి వ్యక్తవిశేషణము వేయఁడు, కుజగ్రహాబాధిత = అంగారకునిచే బాధింపఁ బడిన, రోహిణీగతిన్ = రోహిణివలె, వితత = విస్తారమైన, మనోవ్యథన్=మానసిక బాధచే, విన్నఁబడెన్=దీనురా లయ్యెను.

ముందు ధ్వనులు వినఁబడె ననియు, నివు డెత్తిన ధ్వజములు గానవచ్చె ననియుఁ జెప్పుటచే నూరు, వీథులు, నిండ్లు గాన రాలే దని భావము.

తాత్పర్యము

మిగుల విచిత్రములైన చిన్న, పెద్ద ధ్వజములుగల లంకను జూచి రామచంద్రమూర్తి సీతాదేవిని దలంచి పాపాత్ముఁ డగు రావణుచే చెఱయం దుంచఁబడి యంగారకగ్రహముచేఁ బీడింపఁబడిన రోహిణివలె సీత మిగుల మనోవేదనచే నీపురంబున దీనురాలై దుఃఖించుచున్న దిగదా.

తే. అనుచుఁ దా వేఁడి నిట్టూర్పు • నినిచి యనుజుఁ
గాంచి యి ట్లనుఁ దనకుఁ ద • త్కాలమునకు
హితముఁ గూర్చెడి వాక్యముల్ • నుత బలాఢ్య
లంకఁ గనుఁగొంటె యీ పురి • పొంక మార ! ౫౦౦

తాత్పర్యము

అని తనలో ననుకొనుచు వేఁడి నిశ్శ్వాసము విడిచి తమ్మునిఁజూచి యీ కాలమునఁ దనకు మేలు గలిగించు యుద్ధవిషయము, సేనావిభాగ విషయము, లంకావిషయము లోనగు వాక్యముల నిట్లనియె. పొగడ్తగన్న బలవంతుఁడా! యీ లంకా నగరము పొంకము చూచితివా !

వేఁడి నిట్టూర్పు నినిచి, యిప్పుడు భార్యఁ దలఁచి విచారపడవలసిన కాలము గా దనుకొని, ముందుకలిగిన వ్యసనము నిలుపుకొనుటకై నిట్టూర్పు విడిచె నని భావము.

ఉ. భానుపథంబుఁ బైకొనఁగఁ • బాటెడిన ట్టయన విశ్వకర్మచే
మానసకల్పితంబు గతి • త్వాష్ట్రధరశ్శృంగతలంబునందుఁ దా
మానిత మయ్యెఁ గంటివె వి • మానకదంబముతో ధరాస్థలిన్
మా నగు పాండురాంబుద స • మంచిత విష్ణుపదంబు చాడ్పునన్. ౫౦౧

అర్థములు. భానుపథంబు = సూర్యుఁడు పోవుమార్గము, పైకొనఁగన్ = మించిపోవునట్లు, మానసకల్పితంబు=మనస్సుచే నిర్మింపఁబడినది, విమాన కదంబముతో=(౧) ఏడంతస్థుల మేడలతో (౨) ఆకాశయానముల సమూహముతో- పాండురాంబుద = తెల్లనిమేఘములచే, సమంచిత = ఒప్పుచున్న, విష్ణుపదంబు చాడ్పునన్=ఆకాశమువలె (౧) సూర్యస్థానము, (౨)విష్ణుమూర్తికిఁ బాదమైనది (3) సర్వలోక వ్యాపకుఁడైన వాయువునకు స్థానమైనది. ఆకాశమున విమానము వలె లంకయందు విమానములు గలవని భావము.

### తాత్పర్యము

సూర్యుఁడుపోవు మార్గమునకంటె నింకను పైకిఁ బోవలయునని పరుగెత్తుచున్నదో యన్నట్లు విశ్వకర్మచే మనస్సుచేత నిర్మింపఁబడినదానివలె పర్వతశిఖరమునందు నొప్పుచున్న లంకను జూడుము. విమాన సమూహములతో భూమియందుఁ దెల్లని మేఘములతో నొప్పు నాకాశమువలె నున్నది.

ఉ. మంజుల సూనకుంజచయ • మండిత చైత్రరథోపమానమై
కుంజదళిద్విజ ప్రకర • ఘుష్టవనంబులచే మనోజ్ఞమై
రంజిలెఁ బుష్పలీన భ్ర • మరంబును మత్తశకుంతముం బికీ
శింజితమౌ వనావళిని • శీతసమీరణుఁ డోలి నూఁచెడిన్. ౫౦౨

అర్థములు. మంజుల = మనోహరమైన, సూన = పుష్పముల యొక్క - కుంజ = పొదలయొక్క - చయ = సమూహములచే - మండిత = అలంకరింపఁబడిన - చైత్రరథోపమానమై = కుబేరుని యుద్యానవనమైన చైత్రరథముతో సమానమై - కుంజత్ = ధ్వనించుచున్న - "రణతి క్వణతి కుంజత్యపి స్తనతి గర్జతి" అని క్రియానిఘంటువు - అళి = తుమ్మెదలయొక్కయు - ద్విజ = పక్షులయొక్కయు, ప్రకర = సమూహములచే - ఘుష్ట = ధ్వనించుచున్న - వనంబులచే = తోఁపులచే - పుష్పలీనభ్రమరంబును = పూలయందలి తేనెఁ ద్రావి మత్తెక్కి కదలక, మెదలక వానియందే యణఁగియుండు తుమ్మెదలుగలది. మత్తశకుంతమున్ = మదించిన పక్షులు గలది, పికీ = ఆఁడుతుమ్మెదల చే - శింజితము = ధ్వనింపఁబడినది, శీతసమీరణుఁడు = చల్లనిగాలి - శింజితశబ్ద మాభరణముల ధ్వని యను నర్థము గలదైనను పెద్దధ్వని యనియు దాని కర్థము గలదు. లేదా యిచ్చట సామాన్య వాచకముగ పూలహారాదులవలె గ్రహింపనగు.

### తాత్పర్యము

మనోహరములయిన పూఁబొదలచే నలంకరింపఁబడిన చైత్రరథముతో సమానమై, ఝుంకారముచేయు తుమ్మెదలయు, పక్షులయు ధ్వనులచే నిండిన తోఁపులచే నందమై, పూలయందు దాఁగిన తుమ్మెదలు గలదై, మదించిన పక్షులు గలదై యాఁడుకోవెలల ధ్వనులు గలదైన వనముల సమూహమును చల్లనిగాలి యూఁచుచున్నది.

### —• శ్రీరాముఁడు సేనల వ్యూహంబు దీర్చుట •—

సీ. అని యిట్లు వచియించి • యవనిజాపతి సేన, శాస్త్రపద్ధతి విభ•జనము సల్పి
నీలునితోఁ దడ•నీకినితో నంగ, దుం డురోదేశస్థి•తుండు గాఁగ
ఋషభుండు చక్రస • మేతుఁడై దక్షిణ, పార్శ్వంబునం దోలిఁ•బ్రబలి నిలువ
గంధహస్తినిబోలు•గంధమాదనుఁడు దా, డాపట వెలయఁగ • నేపు మెఱసి
తే. వేగదర్శి సుషేణులు•విపినుతుండు, జాంబవంతుండు మువ్వురు•సైన్యకుక్షి
గుక్షిఁగావంగ ముకలిసి•కపులపాత్తుఁ, దనుజుఁడును దాను శిరమున•యందు నిలిచి

అర్థములు. శాస్త్రపద్ధతి = నీతి శాస్త్రమునఁ జెప్పిన ప్రకారము, తద నీకినితో = అతని (నీలుని) సేనతో, ఉరోదేశస్థితుండు = ఱొమ్ము ప్రదేశమం దుండు వాఁడు, చక్రసమేతుఁడై = అతని సేనతోఁ గూడినవాఁడై, గంధహస్తి = మదించిన యేనుఁగును, దాపటన్ = ఎడమవైపు, కుక్షి = కడుపు, నడిమిభాగము, ముదల + ఇడి = ఆజ్ఞచేసి.

## తాత్పర్యము

ఈప్రకారము చెప్పి రామచంద్రమూర్తి రాజనీతిశాస్త్రప్రకారము సేనల విభజించి, నీలుఁ డతనిసేనతోడను, నంగదుఁడును హృదయస్థానమం దుండు నట్లును, ఋషభుఁడు తన సేనతో కుడిప్రక్క నిలుచునట్లును, మదపుటేనుఁగువంటి గంధమాదనుఁడు ఎడమవైపు నిలుచునట్లును, వేగదర్శి సుషేణుఁడు, జాంబ వంతుఁడు ఈ ముప్వురు వారివారి సేనలతో గర్భము గాచునట్లును ఆజ్ఞచేసి తాను లక్ష్మణుతో శిరోదేశంబున నిలిచి,

క. లోకము వెనుకటి యర్థము, జోకన్ వరుణుండు గాచు • చొప్పునఁ గీశా
నీకిని జఘనముఁ గావఁగఁ, బ్రాకటబలు సూర్యపుత్రు • బనిచెన్ సరగన్. ౫౦౪

## తాత్పర్యము

లోకము పడమటిభాగము వరుణుఁడు కాచునట్లు సేనయొక్క పుచ్ఛ భాగ మును రక్షించునట్లు సుగ్రీవుని పంపెను.

ఈ పద్యమందు ముఖ మని, ఱెక్కలని యీప్రకారము చెప్పుటచే శాస్త్రా లుఁడు చెప్పునట్లు సేన గరుడవ్యూహముగాఁ దీర్పఁబడె నని తెలియనగు.

ఉ. అంబుదసంప్లవం బయిన • యభ్రముఁ బోలెడి కీశసేన వృ
క్షంబులు శైలశృంగములు • గైకొని రేఁగి దశాస్యపట్టనం
బుం బోరి నుగ్గునూచముగ • భూధరకూట వితానముష్టులన్
డంబుచెడంగ దంచఁగ నె • డందఁ దలంచె సరోషచిత్తమై. ౫౦౫

అర్థములు. అంబుద సంప్లవము = మేఘములచే నిండినది, అభ్రము = ఆకాశము, కీశసేన = వానరసేన, భూధర కూటవితాన ముష్టులన్ = కొండల శిఖరముల సమూహములతోను, పిడికిళ్ళతోను, డంబు = కాంతి, ఎడందన్ = హృదయమందు.

## తాత్పర్యము

మేఘములచే నిండిన యాకాశమువలె నున్న వానరసేన చెట్లు, శిఖరములు తీసికొని విజృంభించి లంకను కొండలచేతను, శిఖరములచేతను, పిడికిళ్ళచేతను పొడి పొడిగా దంచి రూపుమాపుటకు రోషముతో హృదయమునఁ దలఁచియుండెను.

## —• శుకుఁడు రావణుతోఁ దాను బోయివచ్చిన వృత్తాంతముఁ జెప్పుట •—

సీ. అవ్వేడ శ్రీరాముఁ • డర్కజుతో శుకు, విడిచి పుచ్చు మటన్న • వెడల నడిచె
నతఁడును భయకంపి • తాంగుఁడై రావణు, డాసిన నగుచు రా • కాసిజేఁడు

ఏ మిది శుక! ఱెక్క • లేమాయెఁ గత్తిరించిన జాడ దోఁచెడిఁ • జెనఁటులైన
చలచిత్తులైన కీ • శులచేతఁ జిక్కితా? యే మన నతఁడు లో • నెసఁగు భీతి
తే. రాక్షసోత్తముతో నను • రాక్షసేంద్ర!, నీదు పనుపునఁ జని నేను • నీరనిధికి
నుత్తరపుఁ దీరమునఁ జేరి • మెత్తఁదనముఁ దోఁప మధురోక్తి సుగ్రీవు • తోడ నేర్మి.

అర్థములు. వెడలనడిచెన్ = వెళ్ళఁగొట్టెను-దీనివలన శుకుఁ డిన్ని దినములు వానరసేన యందే చెఱలో నుండెను. విడిచినయెడల వాఁడు రావణునితో వానర సేన సేయు ప్రయత్నము దెలిసి సేతువునకు విఘ్నము గావించు నని తలఁచి విడువఁబడినవాఁడు కాఁడు. ఇపుడు వానివలన భయములేదు గావున వదలి పెట్టఁబడెను. భయ కంపితాంగుఁడై = భయముచే వణకుచున్న దేహము గలవాఁడై - డాసినన్ = సమీపింపఁగా - నగుచున్ = వానిస్థితిని జూచి నవ్వుచు - చెనఁటులు = దుష్టులు - చిక్కితా = చిక్కితివా? పనుపునన్ = ఆజ్ఞచేత - నేర్మిన్ = నేర్పుతో - చలచిత్తులు, కీశులనుటచే - స్థిరబుద్ధిలేనివారు కావున బొమ్మని కానేపు, వలదని కానేపు ఇట్లు పలుమాఱు విడిచి కట్టిరా యేమి యని భావము.

తాత్పర్యము

శత్రువులవలన విఘ్నభయము లేక సేతునిర్మాణసేనాస్థాపనాది కార్యములు దీరుటవలన నిఁక శుకుని వదలిపెట్టుఁడని రామచంద్రమూర్తి సుగ్రీవునితోఁ జెప్పఁగా నతఁడు వానిని నిఁక బొమ్మని వెడలఁగొట్టెను. వాఁడును మరల వానరులు వచ్చి యెక్కడ పట్టుకొందురో యని భయముచే వడఁకుచు రావణుని సమీపింపఁగా వాఁడున్న దీనస్థితికి నవ్వుచు రావణుఁడు యేమిరా శుకా! యిట్లున్నావు? చపలచిత్తులు, దుష్టులగు వానరులచేతిలోఁ జిక్కితివా యేమి? నీ ఱెక్కలను గత్తిరించి నట్లున్నదే యని యడుగఁగా నతఁ డోరి నిష్ప్రయోజకుఁడా! శత్రువుల చేతిలోఁ, జిక్కితివా యింత జాగేల చేసితివి? అని తన్ను నేమో యని భయపడుచు రావణునితో నిట్లనియె. రాక్షసరాజా! నీయాజ్ఞ చొప్పున నేను సముద్రపుటుత్తర తీరమునకుఁ బోయి మంచి తియ్యని మాటలతో నేర్పుగా సుగ్రీవునితో, (నన్ను వారిట్లు చేయుటకు నేను జేసిన యకార్యము లేదు. నేను దురుసుగా మాటలాడ లేదని తెలుపుటకై యిట్లు చెప్పెను.

క. నీ చెప్పినట్ల పలికిన, నేచిన కినుకను గపీంద్రు • లెల్లరు నన్నున్
ద్రోచిరి తాఁచిరి కూలన్, వైచిరి పీచిరి రిల నేను • వాచారంగన్. ౫౦౭

అర్థములు. నీ చెప్పినట్ల = నీవు చెప్పిన ప్రకారమే, ఎక్కువ తక్కువలు లేక, ఏచిన = అతిశయించిన, తాఁచిరి = కొట్టిరి, పీచిరి = గిఱగిఱఁ ద్రిప్పిరి, వాచారంగన్ = ఏడువఁగ.

తాత్పర్యము

నీవు చెప్పినట్లే తూచాతప్పక, యెక్కువతక్కువలు చెప్పక చెప్పితిని. ఆ మాటలువిని వానరులుకోపాతిశయముచే నన్నాకాశమునుండి నేలఁబడఁద్రోచిరి.

కొట్టిరి. తోఁకపట్టుకొని గిరగిర త్రిప్పినేలఁ బడవైచిరి. నే చెప్పుచున్నను వినిచిన వారు గారు.

క. గ్రద్దన పై కెగిరి నను, గ్రుద్దిరి పిడికిళ్ళ గోడు • గుడిపిరి కాలన్
మర్దించిరి బిర్దింపఁగ, గర్దతి తనమునను గపులు • కడఁగిరి ఱేఁడా! ౫౦౪

అర్థములు. గర్దతితనమునన్ = దిట్టతనమున - గోడుగుడిపిరి = దుఃఖ మనుభవింపఁజేసిరి, మర్దించిరి=త్రొక్కిరి - తన్నిరి - బిర్దింపఁగన్=చంపఁగా - కడఁగిరి = యత్నించిరి - ఱేఁడా = ప్రభువా-రాజార్థక పదములు పలుమాఱు చెప్పుట రావణునికిఁ దనపై కోపము రాకుండునుగాక యని కాని, నీ వేమి రాజ వయ్యా, నీ వనిన వానరులకు (రామునిమాట యటుండనీ) లక్ష్యమే లేదు. వారితో యుద్ధముచేసి నీవు మానము దక్కించుకొనగలవా - నా గతియే నీకుఁ బట్టు నని సూచించుటకుఁ గాని చెప్పెనని తెలియఁగనగు.

తాత్పర్యము

నేను నీవు చెప్పినమాట చెప్పితినో లేదో, తటాలున పై కెగిరి దిట్టతనమున వానరులు నన్నుఁ బట్టుకొని పిడికిళ్ళ గ్రుద్దిరి - దుఃఖపెట్టిరి- నేలవైచి కాళ్ళతో నలియ దంచిరి. నన్నుఁ జంపుటకు యత్నించిరి.

ఆ. ముక్కుమీఁద నుండు • ముంగోప మెప్పుడు, సహజముగను గ్రక్క • నకపులకును
నన్నుఁబల్కనీరు • నామాటకును బదు, లిడరు మీఁద మీఁద • నడచువారు. ౫౦౫

తాత్పర్యము

కపిచిత్తులైన వానరులకు స్వభావమున ముంగోపము ముక్కుమీఁదనే యుండును. నన్నేదియుఁ జెప్పనీయరు - నామాట వినరు - ఇఁక బదులు చెప్పుట యెక్కడిది? అట్టిన నేమిచేసి రనెదవా, మీఁదమీఁద, దెబ్బమీఁద దెబ్బవిరామము లేక యొకనివెంట నొకఁడుగఁ గొట్టిరి.

క. ఖరవైరి విరాధాంతకుఁ, డరిభయద కబంధకాలుఁ • డదె రాముఁడు భా
స్కరసుతసహితుం డగుచును, ధరణిసుతన్ నేవతోడ • దాయఁగవచ్చెన్. ౫౦౬

అర్థములు. ఖరవైరి = ఖరుని జంపినవాఁడు, విరాధాంతకుఁడు = విరాధునికి మృత్యువైనవాఁడు, అరిభయద=శత్రువులకు భయము కలిగించు, కబంధ= కబంధునకు, కాలుఁడు=యముఁ డగువాఁడు, అదె = అదిగో నీ విక్కడనుండియే చూడవచ్చును. సమీపమందే యున్నాఁడు - మీఁద యుద్ధము నేయుటో, సీత నిచ్చుటో రెంట నొకటి చేయుమని చెప్పఁబోవును. ఆ రెంటిలో యుద్ధమున మేలు లేదని తెలుపుటకై రాముని బలమును వర్ణించుచున్నాఁడు.

తాత్పర్యము

ఖరుని, విరాధుని, కబంధునిఁ జంపిన రామచంద్రమూర్తి సుగ్రీవునితో సీతా దేవి సమీపమునకు రానే వచ్చెను- అదిగో నున్నాఁడు- నీవే చూడుము.

ఉ. కట్టెను సేతువున్ జలధి • కాండములన్, లవణాబ్ధి దాఁటి తా
మెట్టె నవాచితీరమును • మెండుదళంబులతోడ లంకనున్
ముట్టెను, రాక్షసాళి మును • ముట్టుగఁ గొట్టఁగఁ గార్ముకంబుఁ జే
పట్టెను దిట్టయైన రఘు•వల్లభుఁ డల్లదె రాక్షసోత్తమా! ౫౧౧

ఈముచ్చట యుండనీ రాముఁ డేమిచేసెను, ఇపుడేమి చేయుచున్నాఁడందువా.

తాత్పర్యము

రామచంద్రమూర్తి సముద్రము నీళ్ళయందు సేతువుకట్టెను. సముద్రము దాఁటి దాని దక్షిణతీరమున సేనలతో వచ్చి లంకను ముట్టడించెను. రాక్షసులను మొదలంట దంచుటకు విల్లు చేపట్టి సిద్ధముగా నున్నాఁడు. అదిగో జూడుము.

తే. పర్వతాభ్రనికాశులౌ • ప్లవగఋక్ష, వరులసేనలు వేనవేల్ • ధరణినెల్ల
నావరించెను శాఖామృ•గాసురులకు, సంధి పొసఁగదు దైత్యని•ర్జరుల కట్లు.

తాత్పర్యము

పర్వతాభ్రనికాశులు-ఎత్తున పర్వతములతోను, వ్యాపకమందు మబ్బులతోను సమానమగు వానరభల్లూక సేనలు వేలువేలుగ భూమియంతయు గ్రమ్ముకొనెను. దేవతలకు దైత్యులకు సంధి కుదురనట్లు వానరులకు రాక్షసులకు సంధి కుదురదు.

తే. గండుఁగ్రోఁతులు లగ్గలె•క్కకయమున్న, సీతనిచ్చుటో యుద్ధంబు•సేయుటొండె
నొండు వేనిశ్చయింపు ము•ద్దండ తేజ, తడవు సేసినఁ గార్యంబు•తప్పి వచ్చు.

తాత్పర్యము

పౌరుషముగల క్రోఁతులు లంకకోటలమీఁదికి లగ్గలు పట్టి యెక్కకముందే సీత నిచ్చుటో యుద్ధముసేయుటో నిశ్చయింపుము. ఆలస్యము చేసితివా కార్యము చెడును. అపాయము కలుగును. సీత నిచ్చుటో యుద్ధముసేయుటో యని చెప్పుటచే సీత నిచ్చుటయే క్షేమకరము. అది నీకు నిష్టము లేదేని యుద్ధము చేయవలెను. ఏ ప్రయత్నములేక వారి నలక్ష్యముచేసి యూరకుండరాదని భావము. రావణునకు స్వబలగర్వముచేనైన ప్రమత్తత యెక్కువ. శుకునిఁబంపి యిన్నిదినములాయెనే వాఁడు రాలేదే, ఏమైనాఁడని మఱియొకని బంపినవాఁడుకాఁడు. అట్లు పంపియుండిన వానరులు సేతువు కట్టుచున్న విషయము తెలిసియుండవచ్చును. దానిని గట్టకుండ రాక్షసులు పోయి నివారించి యుండవచ్చును. రాక్షససేన యంతయు నొక్కసారిగ పైఁబడిన యెడల రావణుఁడు జయించి యుండునేమో! రామునితోఁ దానుయుద్ధము పెట్టుకొని యింద్రజిత్తులోనగు రాక్షసులను వానరసేనపై విడిచి యుండెనేని రామునికి జయ మిప్పటివలె సులభసాధ్యమై యుండదు. ఇప్పు డొక్కఁడొక్కఁడే పోవుట వలన వానరులందఱుఁ గలసి యా యొక్కనిని జంపుటకు సాధ్యపడెను. అయినను దీనియందొక యుపాయముకలదు. రాక్షసులందఱు నూరువిడిచివచ్చినవార్త తెలియఁగానే కొందఱు వానరులు లంకపైపడి దానిని రక్షించువారు లేమిని పాడుపట్టింప

వచ్చియుండురు. అప్పు డాఁడువారిని గాపాడు దిక్కుకూడ లేకపోయి యుండును. అప్పుడు వెనుక ముందు వానరులు నడుమ రాక్షససేన చిక్కుకొనును. కావున నిది సరిగాదని యాలోచించి కోటలో నుండుటయే క్షేమము, బల మెక్కువయని యాలోచించి యీ ప్రయత్నము రావణుఁడు మానెను. అట్లు రాక్షసులంద ఱొక్క సారిగవచ్చి యుండిన రామచంద్రమూర్తి సమ్మోహనాస్త్రముచే నందఱ నొక్క సారిగ సముద్రములో ద్రోచి యుండును.

ప్రథమదిన యుద్ధమందు కోటబలముగలవాఁడై రాక్షసుల నందఱ నేక కాలమున యుద్ధమునకు విడిచెను గాని దానివలన మే లేర్పడినది కాదు. కావునఁ దరువాత ముట్టడులందలి యుద్ధపద్ధతి ననుసరించి యొక్కొక్కనినే సేనతో నొక్కొక్క ప్రక్క కంపుచుండెను.

## —• రావణుడు శుకునితో సీత నీయ నని తనపరాక్రమముఁ దెలుపుట •—

మ. అనుడున్ రోషకషాయనేత్రుఁ డయి ర • క్షోధీశుఁ డోరీ శుకా!
విన రా దానవదేవతావళి రణో • ర్విం గూడి న న్దాకినన్
జనతాసంఘములోడ లోకములు సం • తాపించినన్ జానకిన్
జననాథాత్మజు నొద్దకున్ మఱల శుం • ఠా! పంకఁగాఁ బోను రా. ౫౦౪

అర్థములు. అనుడున్ = సీతను మఱల శ్రీరామచంద్రమూర్తి కిచ్చుటయే మంచిదని యభిప్రాయము సూచించుచు చెప్పగా విని, రోషకషాయ నేత్రుఁడయి = కోపముచే నెఱ్ఱనైన కన్నులుగలవాఁడై, జనతాసంఘము = జనులందఱు గుంపులు గుంపులుగాఁ జేరి, సంతాపించినన్ = సంతాపపడినను, నాలుగవ పాదమున అనునాసికాక్షరయతి న=ఠ.

గీ. అలద్రుతంబునకును మధ్యమానునాసి,కమునకును జెల్లు ననునాసికయతులఁగ
డాపలను బూర్ణములుగల్గు టకడథలును, తథదధలను గ్రమంబున దానవారి.
అప్ప. క. ౩ ఆ. ౬౨

తాత్పర్యము

సీతను మఱల రామచంద్రమూర్తి కర్పించుటయే శ్రేయస్కరమని శుకుఁడు చెప్పినమాట విని కోపించి కన్ను లెఱ్ఱచేసి రావణుఁ డిట్లనియె. ఓరీ, శుంఠా! శుకా! వినుము. దేవతలు దానవులు గుంపులై యొక్కటిగఁ జేరి యుద్ధమందు నన్నెదిరించినను జనులందఱు గుంపులు గుంపులుగఁ జేరి సంతాపపడినను రామ లక్ష్మణులకు సీతను మఱల నీయను.

ఉ. ఎన్నఁ డొకో మదీయనిశి • తేషుతతుల్ సురభిం బ్రసూనసం
పన్నకుజాళి కై యళుల • మాడ్కిని రామునిమీఁదఁ బాఱు, నిం
కెన్నఁడొ తూణిఁ దూఁగు శర • బృందము కార్ముకముక్తమై కడున్.
ఛిన్నని జేయు రామునిఁ బ్ర • కృష్టపుటుల్కలు గుంజరంబునన్. ౫౦౫

అర్థములు. మదీయ=నాయొక్క, నిశిత=పదునైన, ఇషుతతుల్ = బాణ సమూహములు, సురభిన్=వసంతకాలమున, ప్రసూనసంపన్నకుజాళికై=పూలచే నిండిన చెట్లకై, అళిలమాళిక=తుమ్మెదలవలె, ఈ యుపమానము గుంపుగాఁ బోవుటమాత్రమే తెలుపుచున్నది. కాని తుమ్మెదవలన పుష్పములకు బాధలేనట్లు రావణు బాణములవలన రామచంద్రమూర్తికి బాధలేదని సూచించుచున్నది. తూణిన్=అమ్ములపొదియందు, తూఁగు = నిద్రపోవు, కార్ముకముక్తమై = వింటిచేత విడువఁబడినవై - నేను చేయవలసినదిలేదు - నావిల్లే యాకార్యము చేయునని భావము, ఉల్కలు=కొఱవులు, కుంజరంబునాన్ = ఏనుఁగునువలె, ఇదియును బెదరించుట సూచించునే కాని హానిని కలిగించుట సూచింపదు.

తాత్పర్యము

ఎన్నఁడు నా బాణములు వసంతకాలమున నిండారఁ బూచిన వృక్షములకై తుమ్మెదలు గుంపులుగాఁ బోవునట్లు రామునిమీఁదికిఁ బోవునో, ఎన్నఁడు నా యమ్ముల పొదియందుఁ బనిలేక నిద్రబోవు బాణసమూహము వింటిచే విడువఁబడి కొఱవు లేనుఁగును వలె రాముని ఖేదపడఁజేయునో యని నేను గాచియుండఁగా నన్ను నీతనిమ్మని చెప్పెదవా ?

క. ఉదయించు నినుఁడు జగమునఁ, బొదలు పదార్థముల తేజ॥మును లోఁగొను న చ్చదురున రామునిబలముం, గదనంబున నే హరింతుఁ॥గలఁగెద వేలా. ౫౧౬

అర్థములు. అచ్చదురునన్ = ఆ విధముగ, కదనంబునన్=యుద్ధమందు, కలఁగెదవు = కలఁతపడెదవు.

తాత్పర్యము

పుట్టుచున్న సూర్యుఁడు లోకములోని యన్ని పదార్థముల దీపముల నక్షత్రముల తేజస్సును తన తేజస్సునకు లోపఱుచుకొనునట్లు రాముని బలమును యుద్ధమున నేను హరింతును. ఈ మాత్రమునకు నీవేల వ్యాకులపడెదవు.

సూర్యుఁడు దీపనక్షత్రములకుఁ గాంతి మాపుమాయ జేయలేఁడు. కొంచెము కాలము దాని తేజ తగ్గించి మఱలఁ దానే యస్తమించుచున్నాఁడు. అట్టులే రావణుఁడు రామాదులఁ గొంచెము కాలము బాధించి తానే హతుఁడగుచున్నాఁడని సూచన.

క. జలనిధిజవము ప్రభంజను, నలఘుగతియు నాకు నుంట॥ నమ్మనుజుండున్. దెలియుండు గాక తెలిసినఁ, గలనన్ న న్నెదురుకొనఁగఁ॥గాంక్షించు నొకో.

అర్థములు. జలనిధి జవము=సముద్రవేగము, ప్రభంజను=వాయువుయొక్క, అలఘుగతియు = బలగమనము.

తాత్పర్యము

ఆ మనుష్యుఁడు సముద్రవేగము వాయుగమనము నా యందుండుట యెఱుఁ

గఁడు. కావున యుద్ధమున న న్నెదిరింపఁ జూచుచున్నాఁడు. కాని తెలిసియుండిన నిట్టి యాలోచన సేయునా?

క. కఱకులు తూణీశయములు, నెఱకలు గల సవిష ఫణుల ♦ బృందము లని తా
నెఱుఁగండు నాదు ములుకుల, నెఱిఁగిన నన్డోఢర రాముఁ♦డేలా వచ్చున్. ౯౮౨

అర్థములు. కఱకులు = పదునైనవి, తూణీశయములు = పొదియందు నిద్రించునవి, ఎఱకలు = ఱెక్కలు, సవిష = విషముతోఁ గూడిన, ఫణుల = పాముల యొక్క, బృందములు = సమూహములు, ములుకులన్ = బాణములను.

తాత్పర్యము

పుట్టలో నిద్రించు విషసర్పములవలె నంబులపొదిలోనుండు పదునైన బాణములు తన్ను నిద్రలేపిన వాని హింసించునని రాముఁ డెఱుఁగఁడు. తెలిసి యుండిన యుద్ధమున నన్ను సమీపింపఁ దలచునా?

రెండవ పాదంబున ఋత్వసంబంధవళి.

గీ. సారిఁ గాదులఁగల వట్టుసుదుల కెల్ల, ఋత్వమిత్రంబులగు వచ్చు లెనయు నైదు
చెల్లు హాయలును స్వరమైత్రి చెందు నపుడు, వెలయు నివి ఋత్వసంబంధవళులనంగ.

అప్ప. ౩. ఆ.

ఉ. జ్యారవసంకులంబును భృ♦శార్తవిభీతమహాస్వనంబు దు
ర్వారఖగప్రకాండతల ♦ వాదితమున్ శరకోణఘోషితో
ద్ఘోరధనుర్విపంచిఁ గొని ♦ దుర్హృదనీకిని యాలకింపఁగా
నే రణరంగరంగమున ♦ నేర్మి జరించెదఁ జూడరా శుకా! ౯౮౩

అర్థములు. జ్యారవసంకులంబును = అల్లెత్రాటిమ్రోఁత యనెడి కోలాహలముకలది, భృశార్తవిభీత = మిక్కిలి బాధపడు వారలయు వెఱచినవారలయు, మహాస్వనంబు = గొప్ప ధ్వనిగలది, దుర్వార = వారింపరాని, ఖగప్రకాండ = శ్రేష్ఠములైన బాణములచే, ఆకాశమునఁ బక్షులవలె గుఱిలేక పాఱు బాణములని సూచన, తల = అఱచేతులచే, వాదితము = ధ్వనిగలదిగాఁ జేయఁబడినది, బాణములుపోవు చప్పుడు. అఱచేత నల్లెత్రాడీడ్చి విడుచు చప్పుడు, శర = బాణములనెడి, కోణ = కొడుపుచే, ఘోషిత = వాయింపఁబడిన, ఉద్ఘోర = మిగుల భయంకరమైన, ధనుః = విల్లనెడి, విపంచిన్ = వీణను, దుర్హృత్ + అనీకిని = వైరులసేన, నేర్మిన్ = నేర్పుతో, రణరంగరంగమునన్ = యుద్ధభూమియను నాట్యమాడు స్థలమున, సంకుల మహాస్వన-వాదిశబ్దములు-వీణయందలి మంద్రమధ్యతారము లను మూఁడు ధ్వనులను దెలిపెడిని-భృశార్తవిభీత - దుర్వార ఖగప్రకాండ, తలశబ్దములు వాని శబ్దమును లాక్షణికములు.

తాత్పర్యము

అల్లెత్రాటి చప్పుడనెడి కలకల ధ్వనికలదియు బాణములు దగిలి బాధపడు

వారలయు పరువెత్తుచు నఱచు విలుకులయు గొప్పధ్వనికలది, ఎదురులేని బాణముల చేతను అఱచేతుల చేతను ధ్వనికలుగఁ జేయఁబడినది, బాణములను కొనుపులతో ధ్వని కలుగఁజేయఁబడినధనుస్సనెడి వీణనుగొని శత్రుసేన వినుచుండఁగా రణభూమియందు నేను నేర్పుతోఁ దిరిగెదను చూచుచుండుము.—అలంకారము—రూపకము — రణరంగమును నాట్యరంగముగఁ జెప్పుటచేతను దాను వైణికుఁడనగుదు ననుటచేతను యుద్ధరంగమందుఁ దన నేర్పు చూపునట్లు తేర్పడెనుగాని జయించినట్లు తేర్పడదు.

క. రాముఁడు పూర్వంబున సం, గ్రామంబున నన్నుఁ దొడరి • కానఁడు మద్వీ
ర్యామితశక్తులు నీయెడఁ, దా మదినెఱిఁగెడిని గాక • తలరఁగ నేలా? ౫౨౧

అర్థములు. తలరఁగన్ = భయముచే మనస్సు చలింపఁగా.

తాత్పర్యము

ఇంతకుముందు రాముఁడు యుద్ధమందు నన్నుఁ దాఁకి నా వీర్యము శక్తి యేమాత్రమో యెఱుఁగఁడు కావున వచ్చుచున్నాఁడు. ఈమాత్రమునకే నీవు భయపడి చలించెద వేల?

మత్తకోకిలము. వేయిగన్నులు గల్గి వెల్గెడు • వేల్పుఱేఁ డరుదెంచినన్
దోయధీశుఁడు పాశహస్తుఁడు • క్రోధివచ్చిన, దండియై
యా యముం డిల వచ్చినన్, ద్రవి • ణాధినేత యెదిర్చినన్
జేయ లేరొకయింతయేనియుఁ • జెట్ట నాకెటు భీరుకా. ౫౨౧

అర్థములు. తోయధీశుఁడు = వరుణుఁడు, దండియై = దండము ధరించిన వాఁడై, ద్రవిణాధినేత = కుబేరుఁడు, భీరుకా = పిఱికీ.

తాత్పర్యము

వేయిగన్నుల యింద్రుఁడు వచ్చి యెదిరించినను పాశమును జేతఁబూని వరుణుఁడు వచ్చినను యమదండము చేఁబూని యముఁడు వచ్చినను ధనాధిపతి కుబేరుఁడు వచ్చినను పిఱికివాఁడా! నాకే కీడును జేయలేరు.

**౨౯-వ సర్గము. రావణుఁడు శుకసారణులను వానరసేనఁ బరికించిరాఁ బనుచుట.**

తే. పొమ్మటంచును వానిని • బుచ్చి యవల, సారణుండును శుకుఁడను • సచివవరుల
వంకఁ గనుఁగొని పల్కె రా • వణుఁడు దుర్భ, రస్మయావిష్టచిత్తుఁడై • రభసయుక్తి.

అర్థములు. సచివవరుల వంక = మంత్రిశ్రేష్ఠుల వైపు, దుర్భరస్మయ = అతిశయించిన గర్వముచే, ఆవిష్ట = ఆవేశింపఁబడిన, చిత్తుఁడై = మనస్సు గల వాఁడై, రభసయుక్తిన్ = తొందరగా.

తాత్పర్యము

నీవు పొమ్మని వానిని బంపి శుక సారణు లను మంత్రులను జూచి గర్వాతిశయమున తొందరగా నిట్లనెను.

ఇందుఁ జెప్పఁబడిన శుకుఁడు మంత్రి శుకుఁడు. ముందు పోయినవాఁడు కాఁడు.

ఉ. ఎన్నఁడు మున్ను విన్నయది • యేదియుఁ గాదు మహాబ్ధిలో మహో
భ్యున్నతసేతు వాజిప్రియ • పుత్రుఁడు నిర్మితి సేయఁ గ్రోఁతులన్
బన్నుగ నబ్ధిదాఁటి మన • పైపడి వచ్చిన వంత, నిక్క మం
చెన్నఁగనేర నంబునిధి • యెక్కడ ! సేతువుకట్టు కెక్కడన్. ౫౨౩

అర్థములు. మహోభ్యున్నత సేతువు=పెద్ద యనకట్ట, అజప్రియపుత్రుఁడు= దశరథుని కుమారుఁడు, రామచంద్రమూర్తి, నిర్మితి=నిర్మాణము.

తా త్ప ర్య ము

ఇప్పుడు నేను జెప్పఁబోవునది యెన్నఁడు విన్నదికాదు. ఏమంటిరా? రాముఁడట. మహాసముద్రమునకు పెద్ద సేతువు కట్టెనఁట. దానిపైఁ గ్రోఁతులు మన నగరముపై పడవచ్చెనఁట. ఇట్లని వింటిని. నిజమని నేను నమ్మఁజాలను. ఏలన సముద్ర మెక్కడ? దానిలో సేతువుకట్టు టెక్కడ ? అదియేమి వాఁగా వంకా ?

సీ. అదియునుగాక వ•నాటసైన్యంబును, గణియించుట యవశ్య•కార్య మగుటఁ
జనుఁ డీరు మాఱు వే•షంబులఁ గపిసేనఁ, జొరుఁడు మీ మ్మెవ్వరుఁ•జూడకుండఁ
బ్లవగుల వీర్యంబు•పరిమాణ మెఱుఁగుఁడు, రామమంత్రులఁ గపి•రాజహితులఁ
బూర్వాభివర్తులు • పురువీర్యవంతులు, వృక్షాటు లెవ్వరో • యెఱిఁగి రండు

తే. వానరాళినివేశంబు • వార్ధిసేతు, నిర్మితియుఁ జూచి చనుదెండు • నిక్కమే మొ
• ప్లవగవీరులకును దళ•వాయి యెవఁడో? చక్కఁగ గ్రహించిరండునా•సచివులార!

అర్థములు. వనాటసైన్యంబును = వానరసేనను, గణియించుట = లెక్క పెట్టుట, ఈరు = మీరు, పూర్వాభివర్తులు=ముందుగా యుద్ధసన్నద్ధులై యున్నవారు, పురువీర్యవంతులు = గొప్ప శౌర్యము గలవారు, వృక్షాటులు=క్రోఁతులు, నివేశంబు=దిగిన స్థలము, దళవాయి=సేనానాయకుఁడు.

తా త్ప ర్య ము

సేతు నిర్మాణము సత్యమా యసత్యమా యని చూచుటయే గాక వానరసేన సంఖ్య యెంతయో తెలియవలయును. కావున మీరు మాఱువేషములు వేసికొని మి మ్మెవ్వరుఁ జూడకుండ వానరసేనలోనికి బొండు. పోయి వానరుల శక్తి యేమాత్రము? రాముని సుగ్రీవుని మంత్రు లెవ్వరు? యుద్ధమునకు ముందుగఁ గాలు ద్రవ్వుచున్నవా రెవ్వరు? ఎక్కువ శౌర్యముగల వానరు లెవరు? వానరసేన యెక్కడ దిగియున్నది? సేతు వెట్లు కట్టిరి ? అది నిజమా ? వానరసేనానాయకుఁ డెవఁడు ? మంత్రులారా ! యివియన్నియుఁ జక్కఁగ తెలిసికొని రండు.

క. రాముఁడు సేయు ప్రయత్నం, బా మానవు బలిమి యాయు•ధాళివిధంబున్.
సౌమిత్రిపరాక్రమము మ,హామాత్రులు? చక్కఁ దెలియఁ•డామూలముగన్.

తా త్ప ర్య ము

యుద్ధవిషయమున రాముఁడు చేయు ప్రయత్నము ఆ మనుష్యుని బల మెంత?

అతఁ డే యాయుధములతో యుద్ధము సేయును? లక్ష్మణు పరాక్రమ మేమాత్రము? మంత్రులారా! మూల ముట్టుగ సర్వము తెలిసికొనిరండు.

సీ. అని సమాదిష్టులై ♦ యా శుకసారణుల్, తిరుచర వేషముల్ ♦ దాల్చి యేగి
కపిసేనఁ గని మేన ♦ గగ్గురు పొడువ దిగ్భ్రమ చెంది లెక్కింప ♦ వశముగాక
శైలకందరగుహా ♦ వేలావనీదేశ, ముల నుపవనముల ♦ వెలయువారి
దాఁటిన దాఁటెడు ♦ దాఁటనుండెడివారిఁ, దీరంబునకు వచ్చి ♦ దిగెడువారిఁ
తే. గాంచి యవిచింత్యమైన యా ♦ కపిబలాబ్ధి; పార మెఱుఁగక తిరుగ న ♦ వ్వారి నెఱిఁగి
వెంటనే పట్టి కట్టి వి ♦ భీషణుండు, రాముముంగల నిలుప నా ♦ రక్కసులను. ౫-౬

అర్థములు. సమాదిష్టులై=చక్కఁగ నాజ్ఞాపింపఁబడినవారై, శైలకందర గుహా వేలావనీ దేశములన్ = కొండ శిఖరములందు, గుహలందు, లోయలందు, సముద్రతీరమందు గల ప్రదేశము లందును, ఉపవనములన్ = ఉద్యానవనము లందును, అవిచింత్యము=మనసు చేనైన నింత యని యూహింపరానిది, కపిబలాబ్ధి పారము=వానర సేనకు నంతము.

తాత్పర్యము

ఇట్లు రావణుచే నాజ్ఞాపింపఁబడినవారై శుకసారణులు వానరులు వేషములు ధరించిపోయి వానర సేనఁజూచి భయముచే దేహము పులకరింపఁగ దిక్కు తెలియక లెక్కపెట్టుటకు వశముగాక కొండ గుహలందు లోయలందు సముద్రతీరమందు నుద్యానవనములందు దిగినవారిని సేతువు దాఁటి వచ్చినవారిని, దాఁటుచు సేతువు మీఁదఁ నుండువారిని, వచ్చుటకు నెడము లేక కాచి యావలియొడ్డున నేయుండువారిని, వచ్చి దిగుచున్నవారిని చూచి మనస్సుచేనైన నింతయని యూహింప సాధ్యపడని యా వానర సేనాసముద్రము యొక్క యంత మెఱుఁగ లేక తిరుగుచుండఁగా రావణుఁ డెవ్వరినైన వేగులను బంపునుగాని పంపక యుండఁడు, వారిని గనిపట్టవలయునని తిరుగుచున్న విభీషణుఁడు వారిఁబట్టి పెడ రెక్కలు విఱుగఁగట్టి రాముని యెదుట రామచంద్రా! వీరు రావణుని వేగులవారని యా రాక్షసులను నిలుపఁగా?

—♦ విభీషణుఁడు శుకసారణులను బట్టి శ్రీరామున కప్పగించుట ♦—

తే. ఆర్తిగొని ప్రాణముల మీఁది ♦ యాశవిడిచి, హస్తయుగళంబు మోడిచి ♦ యనిరి యిట్లు
పంక్తికంఠుని యాజ్ఞ నీ ♦ బలము వలవు, తెలియఁగ వచ్చిన ♦ వారమయ్య.

అర్థములు. ఆర్తిగొని = దుఃఖపడి, నీ బలము వలవు = నీ సేన యొక్క బలము.

తాత్పర్యము

వారు దుఃఖపడి వేగుల వారిని జంపవచ్చునని రాజనీతి కావునఁ బ్రదుకు నాశవదలి రెండు చేతులు మోడ్చి యిట్లనిరి. రావణుని యాజ్ఞ చొప్పున నీ సేనా పరిమాణ విధము తెలిసికొని పోవ వచ్చితిమి.

క. త్రుంచినఁ ద్రుంపుము మము రక్షించిన రక్షింపు జాన•కీపతి! యన నా
లించి హసించుచు నిటు వచి, యించెను నిశ్శేషభూత•హితరతుఁ డెలమిన్.

అర్థములు. జానకీపతి = ఈ నామోచ్చారణము వీరిని రక్షించును. జానకీపతి యనుటచే సీతాదేవి పురుషకారము సూచితము సీతాదేవి తన్నుఁ బదినెలలుగా రాత్రియుఁ బగలు బాధ పెట్టుటచేఁ జంపఁదగిన రాక్షస స్త్రీల నమస్కార మాత్రముననే రక్షించెను. నీవు దస్యులమైన మమ్ము రక్షింపుము, అని సూచితము. ఆలించి=విని, హసించుచు=నవ్వుచు. ఈ కుచేష్టల చేతనా రావణుఁడు బ్రదుకఁ దలఁచి యున్నాఁడు, ఎంతటి మందబుద్ధి యని నవ్వు. నమస్కరించుట, జానకీదేవి పేరు చెప్పుట యీ రెండు వీరిని రక్షించెను. నిశ్శేష భూతహిత రతుఁడు=అనుకూలురైన సమస్త భూతములకు మేలుకోరుటయందు నాసక్తి గలవాఁడు. ఎలమిన్=సంతోషముతో - చంపఁదగినవారిని రక్షింప సమయము దొరకెఁగదా యని సంతోషము. శత్రువులైనను నమస్కరించిన రక్షించుట నా వ్రతమని ముందే చెప్పెగదా!

తాత్పర్యము

ఇది మేము చేసిన దోషము. దీనికిఁగాను నీవు మమ్ముఁ జంపఁ దలఁచితివా చంపుము. రక్షింపఁదలఁచితివా రక్షింపుము. జానకీపతీ! మా ప్రాణములు నీ యధీనములు అనిన విని నవ్వి శత్రుమిత్రభేదములేక యందఱ మేలు గోరు రామచంద్రమూర్తి సంతోషముతో నిట్లనెను. తమ దోషము చెప్పుకొనుట, నమస్కరించుట, తమ ప్రాణములు రామచంద్రమూర్తి స్వాధీనము లనుట, దీనులై నిలువఁబడుట, యివన్నియు శరణాగతి కంగములు. అయినను వీరు ప్రాణరక్షణార్థమై చేసిరి కావున వారి ప్రాణములను రక్షించెను. జానకీపతి యనుటచే పురుషకార మాత సీతాదేవి సమక్షమున నుండఁ బనిలేదు. అనుకూల భావముతో నామె పేరు స్మరించి సంబంధము తెలిపినను చాలును - ఆమెయందుఁ బ్రేమలేనివాఁడు అనుకూలబుద్ధితో నామె పేరు చెప్పఁడుకదా!

ఉ. మీరలు సర్వసైన్యము స•మీక్షణ చేసితి రేని, మా విధం
బారఁ బరీక్ష చేసిన, ద•శాస్యుఁడు మీకు వచించి నట్టి యా
కారియ మెల్లఁ దీరినను • గ్రమ్మఱి పొండు; యథేచ్ఛ మేదియేన్
మీరలు చూడ రేని చని • మీ మతిచొప్పున వెండి చూడుఁడీ. ౧౯

అర్థములు. సమీక్షణ చేసితిరేని=చక్కఁగా చూచియుండినను, ఆరన్=పూర్ణముగ, యథేచ్ఛము=ఇష్టప్రకారము.

తాత్పర్యము

మీరు సమస్త సైన్యమును జక్కఁగాఁజూచి యుండినను మే ముండు విధము మీరు చక్కఁగాఁబరీక్ష చేసియుండినను రావణాసురుఁడు మీకుఁజెప్పినపనులన్నియుఁ

జక్కఁగా మీరు నెఱవేర్చియుండినను మీరు వెడలిపొండు. మీ యుష్మత్ప్రకార మింకను మీరు చూడక నిలువ దేదైన నుండినచో మీ యుష్మత్ప్రకారము పోయి చూడుఁడు.

ఉ. ఏకత మేగ మీకు భయ ♦ మేమి విభీషణుఁ డెల్ల జూపెడిన్
మా కిటు కైవసంపడుట ♦ మానుఁడు ప్రాణముపట్ల భీతి న్యా
యాకలితంబు గాదు విగ♦తాయుధు లై పశుపక్షమాతలన్
జేకు మడంచి చంపుటలు ♦ జిచ్చుపడం బని యేమి మీ కిటన్. ౫౩౦

అర్థములు. ఏకతము=ఒంటరిగ, కైవసంపడుట=స్వాధీనపడుట, న్యాయాకలితంబు = ధర్మముతోఁ గూడినది, విగతాయుధులై = ఆయుధములు ధరింపని వారై, జేకు మడంచి=అణఁగఁద్రొక్కి, జిచ్చుపడన్=వెలవెలఁబోవ, మాతలన్= ఇచ్చట వేగుల వారని యర్థము, రాయబారులు గారు.

తాత్పర్యము

ఒంటరిగ వానరసేనలోఁ బోవ మీకు భయమాయెనా మీకుఁ బరిచితిగల విభీషణునే మీకుఁ దోడిచ్చెదను. ఆయనయే సర్వము మీకుఁ జూపఁగలఁడు. మా చేతిలో మీరు చిక్కిన దానికై చచ్చిన వారమే యని మీరు భయపడ నక్కర లేదు. ఏలన ఆయుధహీనులై చేచిక్కిన వేగులను నణఁగఁ ద్రొక్కి చంపుట న్యాయముగాదు. కావున మీరు విలవిలఁబోవఁ గారణములేదు. ప్రత్యక్షశత్రువై యుద్ధమున నెదిరించిన వానినైనను నిరాయుధుని జంపరాదు. అటుండ నిరాయుధుఁడైన వేగులవానిఁ జంపుట ధర్మము గాదని తాత్పర్యము.

ఇంతటి సర్వ భూతదయ శత్రువులందును వాత్సల్యము రామచంద్రమూర్తి యందుఁ గానవచ్చుచున్నది గాని మఱి యెందుఁగానవగు? ఇట్టివాఁడు భగవంతుఁడు గాక మఱియెవఁడు? శరణాగతుఁడైన విభీషణు రక్షించుట యందు రామచంద్రమూర్తికి స్వార్థపరత్వము గలదని సందేహించినను ఇచ్చట నట్టి దోషము చెప్పనవకాశమే లేదు. వీరిని విడుచుట వీరియందలి దయచేత మాత్రమే కాదు. వీరు సర్వముఁ జూచి యున్నదున్నట్టు చెప్పిన రావణుఁడును యుద్ధ ప్రయత్నము మాని క్షేమపడును గాక యను భావముతోడనే. ఇట్టులే చేచిక్కిన రావణుఁగూడ విడువఁగలఁడు. ఇట్టి వానిని కరుణాకాకుత్స్థుఁడనుట యెంత సార్థకమో వివేకులే యాలోచింప నర్హులు. విభీషణునిఁ జేర్చుకొనుటయందు శ్రీరామ చంద్రమూర్తి యభిప్రాయము రావణుఁడు తనలో "నా తమ్ముఁడు నా విషయము సర్వము నెఱిఁగినవాఁడు శత్రువులలోఁ గలిసెనే. నా మర్మములన్నియు నతఁడు రామచంద్రునకుఁ జెప్పునే. మర్మమెఱిఁగిన శత్రువులతో మనమెట్లు పోరఁగల" మని యుద్ధము చాలించి సంధికి వచ్చునేమో యనియు గలదని చెప్పవచ్చును.

చ. కరము విభీషణా! పరవి • కర్షణశీలురఁ బృచ్ఛమానులన్
సురరిపుచారులన్ విడుము • నొంపకు మంచు వచించి వారితో
ధరణివిభుండు పల్కె క్షణ • దాచరులార! పురంబుఁ జేరి కి
న్నరపతితమ్మునితో నను • నా వచనంబులు గాఁగ నీ విధిన్. ౫౩౧

అర్థములు. కరము=మిక్కిలి, పరవికర్షణశీలురన్=ఇతరులకుఁ గీడుచేయుటయే స్వభావముగా గలవారిని, పృచ్ఛమానులన్=ఆ యుద్దేశముతోనే ప్రశ్నించువారిని, సురరిపుచారులన్=దేవవిరోధి రావణాసురుని వేగులవారిని, నొంపకుము=బాధింపకుము. క్షణదాచరులార = రేద్రిమ్మరులారా! రాక్షసులారా! కిన్నరపతితమ్మునితోన్ = కుబేరుని తమ్మునితో, ఇది కుబేరునివలె నీవును గుణవంతుఁడవై యుండుమని బోధించుటను సూచించును.

తాత్పర్యము

విభీషణా! వీరు మిక్కిలి పరులకుఁ గీడుచేయుటే స్వభావముగాఁ గలవారు. ఆ యుద్దేశ్యముతోనే వీరు ప్రశ్నింతురు. వలన వీరు రావణుని వేగువాండ్రు. పరుల నెట్లు చంపవచ్చునా యని వారి లోపములను వెదకుటయేకదా వీరికి నిత్యకృత్యము. ఇట్టివారు వధ్యులే. అయినను వీరిని బాధింపకుము. వదలిపెట్టుము అని చెప్పి యా శుకసారణులను జూచి యిట్లనియె. రాక్షసులారా! మీరు మరల మీ పురంబునకుఁబోయి కుబేరుని తమ్మునితో నేను జెప్పితినని నా మాటలుగా నిట్లని చెప్పుఁడు.

ఉ. ఏమిబలంబు నమ్మి యసు • రేశ్వర! నా పతి సీతఁ గానలో
నా మెయి ముచ్చిలించితివొ • యా బలమున్ సహాసైన్యబాంధవ
స్తోమముఁ గాఁగ నీ వలచు • చొప్పునఁ జూపుము, రేప లంక నా
నామహితాస్త్రజాలముల • నాశముఁ జేసెద నీవ చూడఁగన్. ౫౩౨

అర్థములు. ముచ్చిలించితివొ=దొంగిలించితివో, నీ వలచు చొప్పునన్=నీ యిష్టము ప్రకారము, రేప = ఉదయముకాఁగానే.

తాత్పర్యము

రాక్షసరాజా! నీవేమి బలమునమ్మి నా భార్యను నడవిలో మోసగించి దొంగిలించితివో యా బలమంతయు సేనలయు, చుట్టములయు సమూహముతో నీ యిష్టప్రకారము కొఱఁతలేకుండఁ జూపుము. సూర్యోదయముకాఁగానే నానావిధములైన గొప్ప యస్త్రములచేత నీ కన్నుల యెదుటనే నీవు చూచుచుండఁగనే నాశము చేసెదను.

ఉ. దారుణమైన వజ్రమును • దానవకోటులమీఁదఁ బంచు పా
కారిగతిన్ మదీయభయ • దాగ్రహమున్ భవదీయసేనపై

వారక వేఁగుబోఁక వెసఁ ♦ బంచి సతోరణ మైనలంకఁ బ్రా
కారయుతంబు ధ్వంసితము ♦ గా నొనరించెదఁ జూడు రావణా? ౫౩౩

అర్థములు. పాకారిగతిన్ = ఇంద్రునివలె, మదీయ = నాయొక్క, భయద = భయంకరమైన, ఆగ్రహమున్ = కోపమును, భవదీయ = నీయొక్క, సేనపై = దండుమీఁద, వేఁగుఁబోకన్ = ఉదయమున, వెసన్ = శీఘ్రముగ, సతోరణమైన = గోపురములతోఁ గూడిన, ప్రాకారయుతంబు=ప్రాకారములతోఁ గూడినదానిని, ధ్వంసితము=నాశము చేయఁబడినది.

తాత్పర్యము

తీవ్రమైన వజ్రమును నింద్రుఁడు దానవులమీఁద వేయునట్లు నా కోపమును నీ సేనపై తెల్లవారగానే పంపి గోపురములతోడి ప్రాకారములతోఁ గూడ నీ లంకను నాశముచేసెదను జూడుము.

క. అని పల్కుఁడు మీ పతికిం, జనుఁడని విడిపింప వారు ♦ జయరవములతోఁ
ఘను ధర్మవత్సలునిఁ గీ, ర్తనసేసిరి; యంతఁ బోయి♦రావణుఁ గనుచున్. ౫౩౪

తాత్పర్యము

అని మీ రాజునకు మీరు చెప్పుఁడు పొండని కట్లు విడిపింపఁగా వారు గొప్ప గుణములు గలవాఁడును ధర్మమునందు ప్రీతిగలవాఁడును నగు రామచంద్రుని జయ జయ రామచంద్రా యని పొగడిరి. అంతటఁ జారులు రావణుఁ జూచి,

—♦ శుకసారణులు రావణుతో సీతాదేవిని శ్రీరామున కిమ్మని చెప్పుట ♦—

చ. పలికిరి రాక్షసేశ్వర! భ ♦ వద్వినిదేశము మేర కేగి త
ద్బలములలోఁ జరింప మముఁ ♦ బట్టి విభీషణుఁ డా కృపాళు రా
ములకడ నిల్ప వధ్యుల మ♦మున్ విడిపించె మహోగ్రతేజుఁ డా
యలఘుపరాక్రమాఢ్యు విధ ♦ మంతయు నేమని చెప్పువారమో. ౫౩౫

అర్థములు. భవద్వినిదేశము మేరకు = నీ యాజ్ఞప్రకారము, కృపాళు = దయాశాలియగు, వధ్యులన్ = చంపఁబడఁ దగినవారిని, మహోగ్రతేజుఁడు = మిగుల భయంకరమైన తేజముగలవాఁడగు, అయలఘుపరాక్రమాఢ్యు = గొప్ప పరాక్రమసంపద గలవానియొక్క, విధము = తీరు.

తాత్పర్యము

రాక్షసరాజా! నీ యాజ్ఞాప్రకారము పోయి వానర సేనలలోఁ దిరుగు చుండఁగా విభీషణుఁడు మమ్ము బట్టుకొనిపోయి దయాశాలియగు రాముని యొద్ద నిల్పఁగా వేగుల మగుటచే చంపఁబడఁ దగిన వారమైనను మమ్ము వదలిపెట్టెను. మిగుల భయంకర తేజముగల యా గొప్ప పరాక్రమవంతుని విధము మే మేమని చెప్పఁగలము. ఇట్లని చెప్ప సాధ్యముగాదు.

ఉ. వీరులు శస్త్రవేదు లతి • విక్రమవంతులు దిగ్ధవోపముల్
చేరిరి నల్వు రొక్కచొక • శ్రీరఘురాముఁడు లక్ష్మణుండు వృ
త్రారిసమానవిక్రముఁ డ • హార్పతిజుండు విభీషణుండునున్
వీరలె పెల్లగింప మన • వీడు సమూలము పాఱుఁబిమ్మఁగన్. ౫౩౬

అర్థములు. దిగ్ధవోపముల్ = దిక్పాలురతో సమానులు, వృత్రారి = ఇంద్రునితో, సమాన=సరియగు, విక్రముఁడు=పరాక్రమము గలవాఁడు, అహర్పతిజుఁడు = సూర్యపుత్రుఁడు, సుగ్రీవుఁడు, సుగ్రీవునకు శస్త్రజ్ఞానము లేకున్నను ఛత్రిన్యాయమున నన్వయించుకొనునది.

తాత్పర్యము

శూరులు, అస్త్రముల నెఱిఁగినవారు, మిగుల పరాక్రమము గలవారు, దిక్పాలురతో సమానులునగు నల్వురు రామలక్ష్మణ సుగ్రీవవిభీషణులు లొక్కచోటఁ జేరిరి. ఈ నలువురే మన పట్టణమును పాదులోడఁ దీని నాశముచేయ సమర్థులు.

చ. వలతులు, తక్కువృక్షచర • వర్యులమాట యటుండనిమ్ము; రా
ముల వివిధాస్త్రసంపదయు • మూర్తివిశేషముఁ జూడఁజూడఁగా
నలవున నాతఁ డొక్కఁడె న • మర్థుఁడు పో మన లంక యంతయున్
గులగులలై చెడన్ ధరణిఁ • గూల్పఁగఁ దక్కిన ముగ్గు రేటికిన్. ౫౩౭

అర్థములు. వలతులు=సమర్థులు, రాముల = రామచంద్రమూర్తియొక్క, పూజ్యార్థమందు బహువచనము, మూర్తివిశేషము = ఆకారముయొక్క గొప్పదనము, అలవునన్=పరాక్రమముచే, గులగులలై=పొడిపొడియై.

తాత్పర్యము

తక్కిన వానరులమాట యటుండనిమ్ము. రామచంద్రమూర్తి నానావిధములైన యస్త్రముల సంపత్తియు, ఆకారముయొక్క గొప్పతనము నాలోచించు కొలఁది పరాక్రమముచే మన లంకను పొడిపొడి చేసి నేలఁబడఁజేయ నాయన యొక్కఁడే చాలును; తక్కిన ముగ్గురుకూడఁ బనిలేదు.

ఉ. రాముఁడు లక్ష్మణుండు హరి • రాజును బాలనసేయు సేన సు
త్రామపురోగమామరుల • రాజికి నేని జయింపరాదు, నూ
ఱామడ యాయతంబుఁ బది • యామడ విరివియు నైన సేతువుం
దీమసమార దాఁటి మన • తీరమునం గపిసేన యంతయున్. ౫౩౮

అర్థములు. సుత్రామపురోగమామరుల = ఇంద్రుఁడు మొదలుగాఁ గల దేవతలయొక్క, రాజికి=సమూహమునకు, ఆయతము=దీర్ఘము, విరివి=వెడల్పు, దీమసము=ధైర్యము, మనతీరమునన్=మన లంకవైపునందు నొడ్డున.

తాత్పర్యము

రామలక్ష్మణ సుగ్రీవులు రక్షించు వానరసేనను మనుష్యులు రాక్షసులే కాదు,

ఒకరిద్దఱు దేవతలుగారు దేవతల గుంపంతయుఁగాదు ఇంద్రునితోడ దేవతల గుంపంతయునైన జయింపసాధ్యపడదు. నూఱామడ పొడుగు పదియామడ వెడలుపు గల సేతువును సమీపమందే శత్రువు లగు రాక్షసులున్నవారే వారు చూచిన పైబడి వత్తురేమో యను భయమైన లేక ధైర్యముతో మన లంకకు సమీపమున నుండు తీరమునందే వానరసేన యంతయు.

ఉ. పాళెము డిగ్గి యున్న యది ♦ వారధి దాఁటిన దాఁటు చున్న సై
  న్యాళికి నంతముం గనము ♦ హర్ష వివృద్ధకపీంద్రపాళితో
  నాలము సేయ డీకొనుట ♦ యర్హము గాదు, శమించు టొప్పు, భూ
  పాలున కప్పగింపుము వృ♦పాలతనూజ, శుభంబు నీ కగున్. ౫౩౯

అర్థములు. పాళెముడిగ్గి = విడిసి, హర్షవివృద్ధ = సంతోషముచేఁ బెరిఁగిన, ఆలము=యుద్ధము, శమించుట=కోపము తగ్గించుట.

తాత్పర్యము

విడిసియున్నది. సముద్రము దాఁటిన వారి, దాఁటుచున్న వారి సేనకుఁ దుద కానరాలేదు. సంతోషాతిశయముచే దేహము పెరిగిన వానరసమూహముతో యుద్ధము సేయఁబూనుట తగదు. కోపము తగ్గించి సీతను రాముని కిచ్చుటే తగిన కార్యము. దాని వలన నీకు మేలగును.

**౨౬-వ సర్గము. రావణుఁడు శుకసారణులతోఁ బ్రాసాద మెక్కి కపిసేనలఁజూచుట.**

చ. అని యిటు పథ్యసూక్తుల భ♦యంపడ కాడినమంత్రి సారణున్
  గని వచియించు రావణుఁడు ♦ కాఱులు పల్కెదవేల? దేవతల్
  దనుజులు గూడి యొక్కటయి ♦ తార్కొని రేని జగంబులెల్ల నా
  కనుపమభీతిఁ జూపిన ధ♦రాత్మజ నిచ్చుట లేదు నమ్ముమీ. ౫౪౦

అర్థములు. పథ్య సూక్తులను = మేలు కలిగించు మంచి మాటలను, కాఱులు = వ్యర్థ వాక్యములు, తార్కొనిరేని = ఎదిరించినను.

తాత్పర్యము

ఈ ప్రకారము సారణుఁ డనువాఁడు భయములేక మేలైన మంచి మాటలు చెప్పఁగా రావణుఁ డిట్లనియె. ఓరీ ! నీవేల వ్యర్థముగ వదరెదవు? దేవతలు దానవులు కలిసికొని యొక్కటైవచ్చి నన్నెదిరించినను లోకములన్ని కలసి నన్నుఁ జంపెద మనినను సీతను మరల నీయను; నమ్మము.

క. అక్కపివరులకు వశపడి, చక్కఁగ మర్దింప వారు ♦ సంత్రస్తుఁడ వై
  యిక్కరణి సీత నిమ్మని, పెక్కులు కొఱగాము లెల్లఁ♦బ్రేలెదు పిఱికీ! ౫౪౧

అర్థములు. సంత్రస్తుఁడవై=భయపడినవాఁడవై, కొఱగాములు = పనికి రాని మాటలు - ప్రేలెదు = వదరెదవు.

తాత్పర్యము

ఓరి పిఱికివాఁడా! వానరులకుఁ జిక్కి వారు బాగుగఁ దన్నఁగా భయపడి యీ విధముగ సీత నిమ్మని పనికిమాలిన మాట లనేకములు వదరెదవా?

ఉ. ఎవ్వఁడు రోరి న న్నని జ • యించెడి శత్రువు? రమ్మ చూత మం
చవ్విబుధాహితుండు మిహి • కార్జునమున్ బహుతాళికోన్నతం
బవ్వనుపీది నంటు నొక • యుబ్బవుమేడను రోష మాత్మలో
నివ్వటిలంగ నెక్కి యవ • నీధరకానన సాగరంబులన్. ౹౪౨

అర్థములు. విబుధాహితుండు = దేవవిరోధి - రావణుఁడు - మిహికార్జునమున్ = మంచువలెఁ దెల్లనైనది. బహుతాళికోన్నతంబు = పెక్కు తాటిచెట్ల యెత్తు నుండునది. బొటనవ్రేలిని నడిమి వ్రేలినిజాచినచో వాని నడుమ నుండు కొలఁత ప్రదేశము తాలము, తాలమే తాలకము. అట్టి కొలఁతలు పెక్కు లుండునట్టిది. "ప్రాదేశ తాల గోకర్ణ వితస్త్యశ్చయథాక్రమం భవంతి వితతాంగుష్ఠ ప్రదేశిన్యాదిభిస్సహ"॥ అవనీధర కానన సాగరంబులన్ = కొండలు, అడవులు సముద్రము (సేతువు)

తాత్పర్యము

ఎవఁడురా నన్ను జయించుశత్రువు, చూతము రమ్మని రావణుఁడు రోషము ప్రబలుచుండ మంచువలెఁ దెల్లనై పెక్కులు తాటిచెట్ల యెత్తుగలదై యాకాశ మంటుచున్న మేడయెక్కి కొండలందు, అడవులందు, సముద్రమునందు.

చ. వనచరపూర్ణ దేశము న • పార మసంఖ్యము భూరికీశవా
హినిఁ గని పల్కె సారణుని • నెవ్వరు కీశచమూసమూహమం
దొనరిన వీరవారమున • నుగ్రబలాఢ్యులు శౌర్యసత్తముల్
పెనుపరు లగ్రతస్సరులు • విశ్రుతులున్ వ్యవసాయవంతులున్. ౹౪౩

అర్థములు. వనచర పూర్ణ దేశము = వానరులతో నిండిన ప్రదేశమును. అపారము = అంతము లేనిది, అసంఖ్యము = లెక్కలేనిది, భూరికీశ వాహినిన్ = గొప్పవానరసేనను, కీశచమూ సమూహమందు = కోఁతిదండుల గుంపునందు, ఒనరిన=కల, వీరవారమునన్=వీరుల సమూహమందు, పెనుపరులు=గొప్పవారు, అగ్రతస్సరులు = ముందు నడచువారు, విశ్రుతులు = ప్రసిద్ధి కెక్కినవారు, వ్యవసాయవంతులున్=కార్యనిశ్చయము గలవారు.

తాత్పర్యము

వానరులతో నిండిన ప్రదేశము అంతము లేనిది లెక్కలేనిది యగు వానర సేనను జూచి సారణుతో నిట్లనెను. ఈ కోఁతిదండునందుఁ గల వీరుల గుంపులలో విశేష బలముగల వా రెవ్వరు? పరాక్రమము గల వా రెవ్వరు? రామకీర్తి వృద్ధి

చేయఁగలవా రెవ్వరు? ఎవరు ముందుగా నడచువారు? ప్రసిద్ధులెవ్వరు? ఏ కార్య మెట్లు చేయవలయునో కార్యక్రమము నిశ్చయించుకొన్న వా రెవ్వరు ?

క. ఎవరికిఁ జెవి నిచ్చు కపి, ప్రవరుండు ? ప్రధాను లెవరు ♦ ప్లవగబలమునం
 దెవ రొకొ యూథపయూథపు? లివి యెల్ల యథార్థముగను♦నెఱిఁగింపుము రా. ౫౮౫

తా త్ప ర్య ము

సుగ్రీవుఁ డెవరిమాట ముఖ్యముగా విని యా ప్రకారము చేయుచుండును ? వానరులందు సేనానాయకు లెవరు ? సేనానాయకులకు నాయకు లెవ్వరు ? ఇవి యన్నియు నున్న దున్నట్లు చెప్పుము.

క. అని తన్నడుగు దశగ్రీ, వునకున్ శాఖామృగాళి ♦ వ్యూహములోనన్
 ఘనులను ముఖ్యశ్రేష్ఠుం డిట్లని చెప్పెన్ సారణుఁడు య ♦ థార్థపుభణితిన్. ౫౮౬

తా త్ప ర్య ము

అని తన్నడుగుచున్న రావణునకు వానరుల గుంపులో గొప్పవారిని ముఖ్యులుగా నుండువారిని దెలిసినసారణుఁడు సత్యవాక్యములతో బ్రేలఁజూపుచు నిట్లనెను.

**—♦ సారణుఁడు రావణునకు నంగదాదుల నెఱిఁగించుట ♦—**

ఉ. అల్లదె లంకకెట్టెదుట ♦ నార్భటులన్ మనలంక ప్రాఁతుతోఁ
 బెల్లదరంగఁ జేయుచును ♦ భీషణకీశులు నూఱువేలు దన్
 మొల్లమిఁ గొల్వ సేనలకు ♦ ముంగలి యై నిలుచున్న వాఁడె యా
 వల్లభ ! వాహినీపతి ప్ల♦వంగము ముఖ్యుఁడు నీలుఁ డాఖ్యచేన్. ౫౮౭

అర్థములు. కట్టెదుటన్ = కడు + ఎదుట = కట్టెదుట - ఎట్టెదుట, ప్రాఁతుతోఁ=పునాదితో, మొల్లమి = దట్టముగా, ముంగలియై = ముందుగానున్న వాఁడై, వాహినీపతి=సేనానాయకుఁడు, ఆఖ్యచే=పేరిచే.

తా త్ప ర్య ము

అదిగో లంకకు నెట్టయెదుట మనలంక పునాదితోఁగూడ నదరునట్లు బొబ్బలు వేయుచు భయంకరులైన లక్ష వానరులు గుంపుగాఁజేరి తన్ను సేవింపఁగా సేనల కన్నిటికి ముందుగా నిలుచున్న వాఁడే నీలుఁ డను వానరసేనా నాయకుఁడు.

ఉ. సారబలుండు ధారిణిఁ బ♦చారము సేయుచు బాహు లెత్తి దు
 ష్పూర్ణిరవిలోకనావళులఁ ♦ గ్రోధవశుం డయి లంకఁ జూచుచున్
 సారెకుఁ గేరి వాలమున ♦ క్ష్మాస్థలి బ్రద్దలువాఱఁ గొట్టు నా
 సారసకేసరాభుఁడు ర♦సాధర శృంగనిభుండు చూచితే ? ౫౮౮

అర్థములు. పచారము చేయుచున్ = ఇటునటు దిరుగుచు - ప్రచార శబ్ద భవము పచారము, దుష్పూర్ణిరవిలోకనావళులన్ =మిగులఁ గ్రూరములైన చూపుల సమూహములచే, క్రోధవశుండయి = కోపమునకుఁ బాలుపడినవాఁడై, సారస

కేసరాభుఁడు=తామరలయందలి యకరువుల వన్నె గలవాఁడు, రసాధర=పర్వతము యొక్క, శృంగ=శిఖరముతో, నిభుండు=సమానుఁడైనవాఁడు.

తాత్పర్యము

దృఢమైన బలముగలవాఁడు, చేతులెత్తుకొని యిటునటు నడచుచున్నవాఁడు, కోపముగలవాఁడై క్రూరములైన చూపులచే లంకఁజూచుచు విజృంభించి పలుమాఱు తోఁకతో భూమిం బగుల్పవారువట్లు కొట్టుచున్నవాఁడు, తామరల యకరులవన్నె గలవాఁడు. కొండశిఖరమువలె నున్నవాఁడు చూచితివా?

ఉ. అతఁడె యంగదుండు ప్లవ • గాధిపుఁ డాతని యౌవరాజ్యమం
దాతతరీతి నిల్పెఁ గని • తా? నినుఁ బోరికిఁ బిల్చుచున్నవాఁ
డాతఁడు వాలికిం దగిన • యాత్మజుఁడున్ రవిపుత్రునుప్రియుం
డాతఁడు వజ్రికై వరుణు • నట్టులు రామునకై పెనంగెడిన్. ౧౮౮

అర్థములు. పెనంగెడి = యుద్ధము చేయును.

తాత్పర్యము

వాఁడే యంగదుఁడు. సుగ్రీవుఁడు వానికి యౌవరాజ్య మిచ్చెను. చూచితివా? వాఁడు నిన్ను యుద్ధమునకుఁ బిలుచు చున్నవాఁడు. వాలికిఁ దగిన కొడుకు. సుగ్రీవునకు మిగుల ప్రియుఁడు. వాఁడు ఇంద్రునకుమున వరుణునివలె రామునకై యుద్ధము చేయును.

క. ఈతనిబుద్ధిఁ గదా యీ, వాతాత్మభవుండు రాఘ • వప్రియఘటనా
చేతస్కుండు రుజవన, స్ఫీతుఁడు హనుమంతుఁ డరసి • సీతం గాంచెన్. ౧౮౯

అర్థములు. రాఘవప్రియ ఘటనా చేతస్కుండు=రామునకు మేలు చేయు మనస్సు గలవాఁడు, ఉరుజవనస్ఫీతుఁడు=మిగుల వేగముచేఁ బ్రకాశించువాఁడు, అరసి = వెదకి.

తాత్పర్యము

ఇతఁడు చెప్పిన యాలోచన మీఁదనే కదా రామచంద్రునకు మేలు చేయు తలంపు గలవాఁడును, మిగుల వేగము గలవాఁడును, వాయుకుమారుఁడు నగు హనుమంతుఁడు సీతను వెదకి చూచెను.

క. ఆయోధనకర్కశుఁ, డితఁ, డాయతయూథములఁ గూడి • యవిజయ్యుండై
యో యామినీచరేశ్వర!, జే యని చనుదెంచె రణముఁ • సేయఁగ నీతోన్. ౧౯౦

అర్థములు. ఆయోధన కర్కశుఁడు=యుద్ధమందుఁ గఠినుఁడు, దృఢముగ నిలిచి యుద్ధము చేయువాఁడు, ఆయతయూథముగ = విస్తారసేనలను, అవిజయ్యుండై = జయింపరానివాఁడై, యామినీచర + ఈశ్వర = రాత్రిమ్మరులకుఁ బ్రభువా, జే = జయ.

తాత్పర్యము

యుద్ధమునందు దయాదాక్షిణ్యములు లేక దృఢముగ నిలుచువాఁడు, గెలువ రానివాఁడు, అనేక సేనలతోడ రాక్షసేశ్వరా! నీతో యుద్ధము చేయుటకై క్రేయని వచ్చెను.

ఉ. వాలిజు వెన్కఁ గేశబల • వారముతో రహిమించువాఁడె శా
ర్దూలసదృక్షుఁడౌ నలుఁడు • దోర్బలవంతులు చందనాలయుల్
పోలఁగ వేయికోట్లు కపి • పుంగవు లెన్మిదినూర్లవేలు నే
వేళ భజించు చుండ్రు సుర • భీషణ! సేతువుఁ గట్టె నితఁడే. ౫౫౧

అర్థములు. శార్దూల సదృక్షుఁడు=పులికి సమానుఁడు, చందనాలయుల్= చందన పర్వతము, చందన వృక్షములు విశేషముగనుండు పర్వతము=మలయాద్రి.

తాత్పర్యము

అంగదుని వెనుక ప్రక్క వానర సేనలతో పులితో సమానుఁడై ప్రకాశించువాఁడే సేతువు కట్టిన నలుఁడు చందన పర్వతమందుండు వేయికోటు లెనిమిది నూర్ల వేలు వానరులు సర్వదా యితని గొల్చుచుందురు.

ఉ. ఆతనిపై నికల్ గనుము • యార్భటులన్ దెసలెల్ల నించుచున్
చేతముఁ గ్రోధపూర్ణముగఁ • జేసి చివాలున లేచి గాత్రమున్
భీతి ఘటింప నుద్ధవిడిఁ • బెంచి విదుర్చుచు నిన్నుఁ జూచి ప్ర
స్ఫీతగతిం బయిం దుముకు • చెన్ను వహించిరి, వారు తెంపరుల్. ౫౫౨

అర్థములు. ఆర్భటులన్ = సింహనాదములచే, చేతము =మనస్సు, క్రోధపూర్ణముగన్ = కోపముతో నిండినదిగా, చివాలున = దిగ్గన, గాత్రమున్ = దేహమును, ఉద్ధవిడిన్ = వేగముగా, చెన్ను = విధము, తెంపరుల్ = సాహసము గలవారు.

తాత్పర్యము

ఆ నలుని సేనలఁ జూడుము. దిక్కులునిండ సింహనాదము చేయుచు మనస్సు నిండ క్రోధముగలవారై తటాలున లేచి దేహమును పెంచి విదలించి నిన్నుఁజూచి మీఁద దుముకునట్లున్నారు. వీరు మిగుల సాహసముగలవారు.

ఉ. శ్వేతుఁడు వెండికొండ కెన • చెప్పఁగఁ జాలినవాఁడు, లోక వి
ఖ్యాతుఁడు, భీమవిక్రముఁడు • నస్థిరచిత్తుఁడు, బుద్ధిమంతుఁడున్
వేతపనాత్మజుం గదిసి • వెన్కకుఁ బోయి దళంబు సర్వమున్
రీతిగఁ దీర్చెడిం గదుఁ బ్ర • హృష్టముఁ జేయుచు రాక్షసేశ్వరా! ౫౫౩

అర్థములు: వెండికొండ = కైలాసము, వెండివలెఁ దెల్లగానుండు కొండ. ఎన=సమానముగ, అస్థిరచిత్తుఁడు=నిలుకడయగుమనస్సులేనివాఁడు, తపనాత్మజున్= సుగ్రీవుని, కదిసి = సమీపించి, దళంబు = సేన, ప్రహృష్ట = సంతోషించినది.

తాత్పర్యము

వెండికొండతో సమానుఁడని చెప్పఁదగిన శ్వేతుఁడు లోకమున ప్రసిద్ధి గన్నవాఁడు, భయంకరమైన పరాక్రమము గలవాఁడు, స్థిరచిత్తము లేనివాఁడు, అయినను మంచిబుద్ధి గలవాఁడు వేగముగ సుగ్రీవు నొద్దకుఁ బోయి యేవియో మాటలాడి వెనుకకు వచ్చి సేననంతయు నుత్సాహముచే సంతోషపెట్టుచు చక్క-సవరించు చున్నాఁడు.

మ. కుముదుం డాతఁడు గోమతీతటగ సం ♦ కోచాఖ్య శైలంబు ము
న్నమరన్ స్థానము గాఁగ వృక్షచర రా♦జ్యం బేలు వేవేల్ కపుల్
విమలస్వాంతులు గొల్వ రాజిలు మహా♦వీరుండు తద్దీర్ఘవా
లమునన్ లోహితపీతనీలసితముల్ ♦ బ్రాలెన్ మహారోమముల్, ౫౫౮

అర్థములు. గోమతీతటగ = గోమతీ నదీతీరమందుండు, సంకోచాఖ్య శైలంబు=సంకోచ మను పేరుగల పర్వతము, విమల స్వాంతులు=నిర్మలచిత్తులు, లోహిత పీత నీల సితముల్ = ఎఱ్ఱని, పచ్చని, నల్లని, తెల్లని. మహారోమముల్= పెద్ద వెంట్రుకలు, బ్రాలెన్ =ప్రకాశించెను.

తాత్పర్యము

అదిగో వాఁడే కుముదుఁడు. వీఁడు గోమతీనదీ తీరమందుఁగల సంకోచమను పర్వతమందలి వేనవేలు వానరులను పాలించును. నిర్మలమైన మనస్సుగలవారు వేనవే లితనిఁ గొల్చుచుందురు. వీఁడు మహావీరుఁడు. వీనితోఁకయందు ఎఱుపు నలుపు పసుపు తెలుపుగల పెద్ద వెంట్రుక లున్నవి.

క. రోషణుఁడు సాంపరాయిక, భీషణుఁడు భవత్సమిద్గ ♦ వేషణుఁడు యశో
భూషణుఁడు చండుఁ డరిపుర, శోషణశక్తుండు విమత ♦ సూదన కంటే. ౫౫౯

అర్థములు. రోషణుఁడు = రోషముగలవాఁడు, సాంపరాయిక = యుద్ధమందు, భీషణుఁడు = భయంకరుఁడు, భవత్ +సమిత్ + గవేషణుఁడు = నీతో యుద్ధముచేయు సమయమును వెదకుచున్నవాఁడు, యశోభూషణుఁడు = కీర్తియే యలంకారముగాఁ గలవాఁడు, అరిపురిన్ = శత్రువుల పట్టణమును, శోషణ = ఎండించుటయందు, శక్తుండు = అశక్తిగలవాఁడు, విమతసూదన =శత్రుసంహారకుఁడా!

తాత్పర్యము

మిగులఁ గోపముగలవాఁడు, చండుఁడు, యుద్ధమందు భయంకరుఁడు నీతో యుద్ధము చేయఁ గోరుచున్నవాఁడు, కీర్తియే యలంకారముగఁ గలవాఁడు. పగవారి నగరమును పాడుచేయ నాసక్తిగలవాఁడు-చూడుము.

చ. తిరుఁ డతిదీర్ఘలోచనుఁడు ♦ ధీరుఁడు సింహానిభుండు చూడ్కి- నీ
పురము దహించుపోల్కి- నిటు ♦ పొంగుచుఁ జూచెడిఁ, గృష్ణవింధ్యభూ

ధరముల సహ్యాపర్వతసు • దర్శనసీమల సంచరించు నీ
హరివృషభుండు రంభుఁడు సు • రాంతక ! నిస్తులశౌర్యుఁ డీతనిన్. ౫౫౬

అర్థములు. తిరుఁడు = స్థిరుఁడు, అతిదీర్ఘలోచనుఁడు = మిగుల నిడివిగల కన్నులు గలవాఁడు, ధీరుఁడు = ధైర్యము గలవాఁడు, సింహనిభుండు = సింహముతో సమానుఁడు, కృష్ణ వింధ్యభూధరములన్ = కృష్ణపర్వతమందును వింధ్య పర్వతమందును, సహ్యపర్వత సుదర్శన సీమలన్=సహ్యపర్వతమందును సుదర్శన పర్వత మందును, హరివృషభుండు=వానరశ్రేష్ఠుఁడు, నిస్తులశౌర్యుఁడు=అసమాన పరాక్రముఁడు.

తాత్పర్యము

అదిగో వాఁడే రంభుఁడనువాఁడు, స్థిరుఁడు, మిగుల నిడివియైన కన్నులు గల వాఁడు, ధైర్యముగలవాఁడు, పరాక్రమమున సింహముతో సమానుఁడు, చూపు చేతనే నీ నగరము దహించువానివలె నుప్పొంగుచు చూచుచున్నవాఁడు. వీఁడు కృష్ణపర్వతము, వింధ్యపర్వతము, సహ్యపర్వతము, సుదర్శనపర్వతము వీనియందు సంచరించుచుండును. వానరులందు శ్రేష్ఠుఁడు, అసమాన శౌర్యముగలవాఁడు.

క. వీరులు శూరులు రణదుర్వారులు చండులు ప్రచండ•పటువిక్రములుం
గ్రూరులు ముప్పదికోట్లగ, చారులు తప్పిఁ గొలుచువారు సమ•రోత్సుకులై.

తాత్పర్యము

ఈ రంభుని, వీరులు, శూరులు, యుద్ధమున నెదురులేనివారు, కోపులు, తీవ్రమైన విక్రమము గలవారు. శత్రువులందు దయ యెఱుంగనివారు నగు ముప్పది కోట్ల వానరులు సేవింతురు.

ఉ. వీనులు నిక్కఁబెట్టి మెయిఁ • బెంచుచు మాటికి మాటికిం గ్రుధ
న్మేను వణంకఁ దోఁకపయి • నిల్పుచు దృష్టుల యుద్ధమాపులన్
దా నదె చూచుచున్ మరల • దారుణగర్జల నించుచున్న వాఁ
డా నగచారి గంటె శర•భాఖ్యుఁడు వాఁడె సురేంద్రమర్దనా; ౫౫౭

అర్థములు. వీనులు=చెవులు, క్రుధన్=కోపముతో.

తాత్పర్యము

ఇంద్రుని జయించినవాఁడా! చెవులు నిక్కఁబెట్టి దేహము పెంచుచు కోపముచే దేహము వణకఁగా తోఁకమీఁద జూపులుంచి యుద్ధచూపులఁ జూచుచు మఱల భయంకరముగ సింహనాదములు సేయుచున్న యీ వానరుని జూచితివా! వాఁడే శరభుఁడను పేరు గలవాఁడు.

క. పాఱఁడు దురమున జవమున, మీఱెడు గీఱెడిని గిరుల • మృత్యువునకు నే
మాఱొడ్డెడు వెఱవున నోఁటాఱఁడు సాల్వేయ శైల•మందు వసించున్. ౫౫౮

అర్థములు. మాఱొడ్డెడున్ = ఎదిరించును, ఓటాఱఁడు = వెనుదీయుఁడు.

తాత్పర్యము

యుద్ధమునందు బరువెత్తువాఁడు కాఁడు. వేగాతిశయము గలవాఁడు, కొండలనైనఁ జీల్పఁగలవాఁడు, మృత్యువు నెదిరించువాఁడు, భయముచే వెను దీయఁడు వీఁడు సాల్వేయ పర్వతమందు వసించును.

క. వీరాగ్రణి యీ శరభ వి,హారులనన్ సైన్యపులు సహస్రశతంబుల్
చేరి భజియింత్రు వారలు, కోరుచునున్నారు లంకఁగూల్పఁగ గడిమిన్. ౪౦

తాత్పర్యము

వీరులందు శ్రేష్ఠుఁడైన యీ శరభుని విహారులను సేనానాయకులు నూఱు వేలు సేవించుచుందురు. వీరందఱు లంక నాశముచేయఁ గోరుచున్నారు.

వీరాగ్రణి యీశరభున్ — కొన్నియెడల విశేషణంబుల ద్వితీయాదులకున్ బ్రథమ యగునని - ప్రౌఢ - వ్యా కా. ౨౨. సూ.

చ. పఱమొగులు లాకసం బలము భంగిగనై తెలిగంటిగుంపుల
న్నెఱసెడి గుంటిసూఁడన వ సేదరకోఁతులలో వెలింగి పె
న్నులుములఁబోలు గర్జల ర గోత్సుకుఁడై విలసించువాఁడై యే
యలగోల లేని ధీరుఁడు మహా బలుఁడో పనసుండు దేవరా! ౪౧

అర్థములు. పఱమొగులు=వెడలుపాటి మేఘములు. అలము=వ్యాపించు, తెలిగంటి = దేవతల, గుంటిసూఁడు = పర్వతవిరోధి, ఇంద్రుఁడు — అలగోల = లోపము.

పెను+ఉరుము=పెన్నులుము,అచ్చులు పరంబులగుచో విశేషణంబులయిన పెన్వాదులకడ హల్లునకు ద్విత్వంబగు. సు-వ్యా-సంధి-౫౫.

తాత్పర్యము

వెడలుపాటి మేఘము లాకాశము నాక్రమించుపట్లులను దేవతల గుంపులందు మెఱసెడి యింద్రుఁడో యనునట్లు వానరులలోఁ బ్రకాశించి పెన్నులుములన్ = పెద్దయులుములను జేయుచు యుద్ధమునం దభిలాష కలవాఁడై యే లోపము లేని ధీరుఁడు మహాబలవంతుఁడు దేవరా! వాఁడె పనసుఁ డనువాఁడు.

క. వీనిని నేబదిలక్షలు, వానరపరివృఢులు యూథ పశ్రేష్ఠులు శౌ
ర్యానుత్తములు భజింతురు,మానక యల పారియాత్రమందు వసించున్. ౪౨

అర్థములు. పరివృఢులు=శ్రేష్ఠులు, యూథపశ్రేష్ఠులు = యూథపతుల యందు శ్రేష్ఠులు, శౌర్యానుత్తములు=శౌర్యమునందు మిగులశ్రేష్ఠులు, నాలుగవ పాదమున నఖండయతి.

తాత్పర్యము

వీనిని నేఁబది లక్షలు వానరశ్రేష్ఠులు యూథపతులందు శ్రేష్ఠులు శౌర్యమునందు నసమానులు గొలుతురు. ఇతఁడు పారియాత్ర పర్వతమందు వసించును.

సీ. అంబుధివేల రెం•డవమహోదధి యన, భీమమా సేనకు•వెలుఁగు గొలిపి
దర్దరధారణీ•ధరమున కుద్ది యౌ, వాఁడె పో వినతుఁ డన్•వానరుండు
అఱువదిలక్షల•యుగచరుల్ గొల్వంగఁ, బర్ణాస యను నది•వారిఁ గ్రోలుఁ
గలహంబునకు నిన్నుఁ•బిలుచుచు నున్న యౌ, తండె క్రోధనుఁ డను•తరుచరుండు
ఆ. వేనవేలు గలరు • వీరు లితనియొద్దఁ, దోఁపురంగువాఁడు•తోడివారి
గేలి సేయువాఁడు• హేళిఁబోలిన తేజు, వాఁడు గవయుఁ డనెడి•వనచరుండు. ౫౬౩

అర్థములు. అంబుధివేలన్ = సముద్రతీరమునందు, తోఁపురంగు=ఎఱ్ఱని కాంతి, గేలి = పరిహాసము, హేళిన్=సూర్యుని.

తాత్పర్యము

సముద్ర తీరమునందు రెండవ సముద్రమువలె నుండు భయంకర సేనకు ప్రకాశము గలిగించుచు దర్దర పర్వతముతో సమానుఁడై యుండువాఁడే వినతుఁ డను వానరుఁడు. వీఁడు పర్ణాసనదీ తీరమున నఱువది లక్షల క్రోఁతులు కొల్వఁగ నుండును. నిన్ను యుద్ధమునకు బిలుచు చున్నాఁడే, వాఁడే క్రోధనుఁ డను వానరుఁడు. ఇతనియొద్ద వేనవేలు వానరులు గలరు. ఎఱ్ఱని వన్నె గలవాఁడు. ప్రక్కవారలఁ బరిహాసము చేయువాఁడు, సూర్యకాంతి గలవాఁడు, గవయుఁ డను వానరుఁడు.

క. డెబ్బదిలక్షల క్రోఁతులు, గబ్బితనమువారు గొలువఁ • గనలున నీపై
దబ్బునఁ బడి యొకదెబ్బన్, నిబ్బరమునఁ దీయ వాఁడు•నిగిడెడిఁ గంటే. ౫౬౪

అర్థములు. గబ్బితనమువారు = గర్వము గలవారు, కనలునన్ = కోపముతో, దబ్బున = లటాలున, నిబ్బరమున = ధైర్యమున, నిగిడెడిన్ = ఎగిరిపడుచున్నవాఁడు.

తాత్పర్యము

గర్వించిన డెబ్బది లక్షల క్రోఁతులు సేవింపఁగా నీపై దబాలునఁ బడి యొక దెబ్బ కొట్టవలె నని ధైర్యముతో నెగిరిపడు చున్నవాఁడు చూచితివా.

క. వీరలు దుష్ప్రసహులు బల, హారులునుం గామరూపు•లతిశయ వేగో
దారులు యూథపనాయకు, లారఁగ యూథములు వీరి • ననిశముఁ గొలుచున్.

అర్థములు. దుష్ప్రసహులు = సహింపరానివారు, బలహారులు=బలముచే మనోహరులు, కామరూపులు=కోరిన రూపమును ధరింపఁగలవారు, యూథపనాయకులు=యూథనాయకులకునాయకులు, వీరిని యూథములు సర్వదా గొలుచుచుండును.

తాత్పర్యము

వీరు యుద్ధమునందు సహింపరానివారు, బలముచే మనోహరులు, శత్రుబలముల హరించువారు, కామరూపులు, మిగుల వేగముగలవారు, యూథపతులకు పతులు. వీరి వశమున యూథములు సర్వదా యుండును.

## —• ౨౬.వ సర్గము. సారణుఁడు రావణునకు హరాదియూథనాథుల నెఱింగించుట. •—

సీ. రామునిమిత్తమై • ప్రాణముల్ గోల్పోవ, నున్నవారల విను•మున్నవారి
నిద్ధంబులైకడు • నిడుపులై కావియు, దెలుపును బసుపును•నలుపు మఱియుఁ
జెక్కులౌ రంగుల • వెంట్రుకల్ తోఁక పై,నిట్టగ్రమ్మగఁ గొన్ని• నేలఁ వ్రాలి
రవిమరీచులవోలె • రాణించు చున్నవి, వాఁడు హరుం డను•వానరుండు

ఆ. యూథనాథుఁ డాతఁ•డుర్వీరుహంబులు, గేలఁ గ్రాల లంక • సాలయులను
లీల నెక్కఁ జతన•మోలి సేయుచు నున్న,వారు సూర్యసుతుని•వారె వీరు. ౨౬-౧

అర్థములు. ఇట్లు యూథప యూథపులఁ జెప్పి యిఁక యూథపతులఁ జెప్పు చున్నాఁడు. కోల్పోవన్ = పోఁగొట్టు కొనుటకు, ఉన్నవారిన్ = తక్కిన వారిని, నిద్ధంబులై=నునుపులై, నిట్ట=నిలువుగ, రవి మరీచులవోలెన్ = సూర్యకాంతుల వలె,ఉర్వీరుహంబులు=చెట్లు, సాలములను = ప్రాకారములను, జతనము = ప్రయత్నము, సూర్యసుతునివారె=సుగ్రీవునకు నాప్తులు.

### తాత్పర్యము

రామచంద్రమూర్తి నిమిత్తమై ప్రాణములు పోఁగొట్టుకొన సిద్ధపడి యున్న వారిని దక్కినవారిని జెప్పెద వినుము.నునుపులై మిగుల నిడుపులై ఎఱుపు తెలుపు నలుపు తెలుపు మఱియు నానావర్ణములుగల వెంట్రుకలు తోఁకపై నిలఁబడి యుండఁగా నేలమీఁదఁ గొన్నిరాలి సూర్యకాంతులవలె నుండఁగా రాణించు చున్నవి. వాఁడె హరుఁడనువాఁడు, వీఁడు యూథపతి. చెట్లను జేతఁదీసికొని లంక ప్రాకారముల నెక్క యత్నముచేయుచున్నవారు సుగ్రీవుని కాప్తులు.

ఉ. అంజనపర్వతంబొ యసి•తాంబుద సంఘమొ యున్నయట్టులై
యంజిక లేనివారు రణ•మందు యథార్థ పరాక్రముల్ గుహా
పుంజములన్ నదీతటులఁ • బొల్చెడివారయి నీపయిం బడన్
గొంజక చూఁచుచున్న వెలుఁ • గుంగమి జోదులఁ జూడు రావణా! ౨౬-౨

అర్థములు. అంజనపర్వతంబొ = కాటుక కొండయో, అసితాంబుద సంఘమొ = నల్లమబ్బుల సమూహమో, అంజిక = భయము, యథార్థపరాక్రములు = సత్యమైన పరాక్రమముగలవారు, గుహాపుంజములన్ = గుహల సమూహములందును, నదీతటులన్=ఏటి యొడ్డులను, కొంజక=సందేహించక, జోదులన్= యోధులను-వీరులను.

### తాత్పర్యము

కాటుక కొండయో, నల్లమబ్బుల గుంపోయన్నట్లు నల్లని దేహకాంతి గల వారై,భయమెఱుంగనివారై యుద్ధమందుసత్యపరాక్రములై,గుహలపొదలయందు

నేటి తీరములం దుండువారలై నీపై పడ జంకక చూచుచున్నవారగు భల్లూక వీరులఁ జూడుము.

క. గర్జద్ఘనములు చుట్టిన, పర్జన్యుఁడు వోలె వెలుఁగు • బంటులు గొలువన్
దుర్జయుఁడై క్రాలెడు భయ,వర్జితు భీమాక్షు భయద•వపువుం గంటే. ౫౦

అర్థములు. గర్జత్+ఘనములు=ఉఱుముచున్న మేఘములు, పర్జన్యుఁడు=వర్షాధిదేవత, భయవర్జితున్ = భయముచే విడువఁబడినవానిని, భీమాక్షున్ = భయంకరములైన కన్నులు గలవానిని, భయద = భయంకరమైన, వపువున్ = దేహముగలవానిని, కంటే=చూచితివా?

తాత్పర్యము

ఉఱుముచున్న మేఘములు చుట్టుకొన్న వర్ష దేవతవలె వెలుఁగులు సేవింపఁగా జయింపరానివాఁడై భయముచే విడువఁబడినవాఁడై భయంకరములైన కన్నులు దేహము గలవానిని జూచితివా?

క. ఆతండు ఋక్షవద్వి,ఖ్యాతాద్రి వసించి నర్మ • దాంబులు గ్రోలున్
నేత సుమీ భల్లూక, వ్రాతములకు ధూమ్రుఁ డనఁగఁ•బరఁగుం బేరన్. ౫౧

అర్థములు. ఋక్షవత్+విఖ్యాతాద్రిన్ = ఋక్షవంత మను ప్రసిద్ధిగల కొండయందు, నేత=ప్రభువు.

తాత్పర్యము

వాఁడు ఋక్షవంత మను పర్వతమందు వసించి నర్మద జలములఁ ద్రాగుచుండును. ఎలుఁగుల సమూహములకు వాఁడు ప్రభువు. వాని పేరు ధూమ్రుఁడు.

సీ. వానితమ్ముఁడు చూడు వసుమతీధ్రంబన, గ్రాలెడి సన్న తా•కారమునను
సముఁడయ్యు శ్రేష్ఠుఁడు • చటులవిక్రమమున, యూథపయూథపుఁ•డుద్ది లేఁడు
గురుసేవ సల్పె నం • గరమునఁ జండుండు, విబుధాసురాహవ • వేళయందు
శంబసాధనునకు • సాహ్యంబుఁగావించి, పెక్కులు వరములు • పేర్మిఁ గాంచె
ఆ. గుదియదాల్పు నేని • యెదురొడ్డి చెండించు, వీని సేన గిరుల • పైన నిలిచి
యురలఁ ద్రోయుచున్న•యురుతరాశ్మంబుల, రాజిఁ జూడవయ్య•రాక్షసేంద్ర!

అర్థములు. వసుమతీధ్రంబు = పర్వతము, విబుధాసురాహవకేళిన్=దేవాసుర యుద్ధక్రీడయందు, శంబసాధనునకున్=ఇంద్రునకు, వజ్రమాయుధముగా గల వానికి, గుదియ దాల్పునేనిన్ = దండము ధరించు యమునినైన నెదరించి యోడించును, ఉరుతర=మిగుల గొప్పవగు, అశ్మంబుల=ఱాళ్ళ, రాజిన్ = సమూహంబును.

తాత్పర్యము

వానితమ్ముఁడు జాంబవంతుఁడు కొండవలె నున్నవాఁడు. అన్నకు సమమైన యాకారముగలవాఁడు. అయినను విక్రమమం దంతకంటె శ్రేష్ఠుఁడు యూథప

యూథపుఁడు. ఇతనికి సముఁడు లేఁడు. గురుసేవ చేసెను. యుద్ధమందు భయంకరుండు. దేవాసుర యుద్ధమందు నింద్రునకు పెక్కుమార్లు సహాయపడి యనేక వరములను బొందెను. దండధరునినైన నెదరించి యోడించును. వీని సేన కొండ మీఁదనుండి క్రిందికి గుండులను బండలను దొర్లించుచున్నవి చూడు.

క. రోమముల దండి రక్షః స్తోమపిశాచావళులకుఁ ♦ దుల్యము లగుచున్
ధూమధ్వజదీప్తులునై, యీ మహితధ్వజిని దిరుగు ♦ లాడెడిఁ గంటె. ౫౭౧

అర్థములు. దండిన్ = అతిశయముచే, ధూమధ్వజదీప్తులు = అగ్నికాంతులు గలవి, మహిత ధ్వజిని = గొప్ప సేన.

తాత్పర్యము

రోమములు పెక్కులగుటచేత రాక్షస పిశాచ సమూహములకు సమానములై యగ్నికాంతివంటి కాంతిగలదై యీగొప్పసేన తిరుగు లాడుచున్నది చూచితివా!

క. జంభారి నుపాసించు న,దంభ బలపరాక్రముండు ♦ దారుణతరసం
రంభవిజృంభితుఁ డల్లదె దంభుఁడు ప్లవమానుమాడ్కి ♦ దర్శితుఁ డాజిన్ ౫౭౨

అర్థములు. జంభారిన్ = ఇంద్రుని, ఉపాసించు నదంభ పరాక్రముఁడు = సంతోషపెట్టు వంచనలేని పరాక్రమము గలవాఁడు, దారుణతర = మిగుల భయంకరమైన, సంరంభ = వేగిరపాటుతో, విజృంభితుఁడు = అతిశయించినవాఁడు, ప్లవమానుమాడ్కిన్ = ఎగురుచున్నవానివలె, దర్శితుఁడు = కానవచ్చువాఁడు.

తాత్పర్యము

ఇంద్రుని సంతోషపెట్ట వంచనలేని బలపరాక్రమములు గలవాఁడు, మిగుల భయంకరమైన వేగిరపాటు నతిశయము గలవాఁడు, యుద్ధమునందు నెగురుచున్న వానివలె నగపడువాఁడు, వాఁడె యదిగో దంభుఁ డనువాఁడు.

సీ. ఆమడ దవ్వున్న ♦ యద్రిను లప్పుడు పార్శ్వగతము లెన్నడికి వే ♦ గంపునడక
యోజనోన్నతుఁ డయి ♦ రాజిల్లు నెవ్వఁడు, హాళినై నిలుచున్న ♦ యట్టి నేల
నిలఁ జతుష్పాజ్జంతు ♦ వులలోన నెవని యీ, కారంబునకు మిన్న ♦ గానరాదు
తొలిపురుహూతుని ♦ సురమునమారొక్కని, యెవ్వఁడోటమిమాట ♦ యెఱుఁగ కెసఁగె

తే. దరుచరాళికి నెవఁడు పి ♦ తామహుండు, నుగ్రదర్పుండు యూథపయూథనాథుఁ
డతనిఁగనుఁగొంటెసన్నాదు ♦ నతులనాదుఁ, బరమబలదర్పసదన యో ♦ పంక్తివదన.

అర్థములు. చతుష్పాత్ జంతువులలోనన్ = నాలుగుకాళ్ళుగల జంతువులందు, పాదస్యలోపోఽహస్త్యాదిభ్యః-సంఖ్యాం పూర్వస్య-పాణిని-ప్రకారసంఖ్యాపూర్వకమగుట పాదశబ్దమున కడపటి అకారము లోపించెను. దురమునన్ = యుద్ధమందు, ఓటమి = అపజయము, బలదర్పసదన = బలగర్వములకు స్థానమైనవాఁడా!

తాత్పర్యము

ఎవఁడు వేగముగ నడచునపుడు ఆమడనున్న చెట్లప్పుడే ప్రక్కకు వచ్చునో ఎవఁడు నిలుచున్నప్పుడు యోజన మెత్తయి కానవచ్చునో, నాలుగు కాళ్ల జంతువులలో నెవని యాకారమునకు మించిన యాకారముగలది లేదో, యెవఁడు పూర్వ మింద్రుని యెదిరించి యపజయము పొందలేదో, వానరులకుఁ దాత యెవఁడో, యట్టి భయంకరమైన దర్పముగలవాఁడు యూథపులకు యూథపుఁడు నయిన సన్నాదుఁడను వానిని జూచితివా? సత్+నాదుఁడు=సన్నాదుఁడు, పీడు చక్కఁగాఁ బాడఁగల వాఁడగుట యీ పేరు కలిగెను.

మ. దనుజాధీశ్వర! చూడుమా యితని గం • ధర్వాంగనాపుత్రుఁడై
జనియించెం బవమానమిత్రునకు, న • స్వప్నాసురాయోధనం
బున లేఖాళికి బాసటై యరిగి పెం • పుం జూపె, శాకారితో
నెనయున్ విక్రమసంపదం గ్రథనుఁ డం • డ్రీ యూథపాగ్రేసరున్. ౫౩౪

పవమానమిత్రునకు = అగ్నిహోత్రునకు, అస్వప్న+అసుర+ఆయోధనంబున = దేవాసుర యుద్ధమున, లేఖాళికి = దేవతల సమూహమునకు, బాసటై = తోడై, ఎనయున్=సరిపోలును.

తాత్పర్యము

రాక్షసరాజా! యీ క్రథనుఁ డను వానిఁ జూడుము. వీఁ డొక గంధర్వ స్త్రీ యందు నగ్నిహోత్రునకు సుతుఁడై పుట్టెను. దేవాసుర యుద్ధమందు దేవతలకు సహాయపడెను. విక్రమమందు నింద్రునకు సమానుఁడు.

ఉ. ఎచ్చట నుండు నేరెడు మ • హీజము సేవ యొనర్చు యక్షరా
జెచ్చట హాయిగాఁగఁ జరి • యించును నిచ్చలు నీ విమాతృజుం
డెచ్చటఁ గిన్నరావళు ల • హీనగతిన్ విహరించు నట్టిభూ
భృచ్చయవర్యమందు వసి • యించు నితం డవికత్థనుం డగున్. ౫౩౫

అర్థములు. నేరెడు —రూ— నేరేడు— మహీజము= చెట్టు, యక్షరాజ= కుబేరుఁడు, విమాతృజుండు=సవతితల్లి కొడుకు, భూభృచ్చయవర్యము = పర్వత సమూహమందు శ్రేష్ఠమైనది.

తాత్పర్యము

కుబేరుఁ డెచ్చటనుండు నేరేడుచెట్టు సేవచేయునో, యెచ్చట నీ సవతితల్లి కొడుకు హాయిగాఁ దిరుగు చుండునో, యెచ్చట నతనిని గిన్నరులు సేవింతురో యట్టి పర్వతమందు నీ యాత్మ శ్లాఘ నెఱుఁగని క్రథనుఁ డుండును.

క. కోటిసహస్రంబులు శై, లాటులు దనుఁ గొల్వ నిజబ • లావళితో న
ద్ఘాటించి లంక నేల,న,పాటముగాఁ జేయఁ దలఁచుఁ • బాటవ మమరన్. ౫౩౬

అర్థములు. శైలాటులు = కొండముచ్చులు, క్రోఁతులు, ఉద్ఘాటించి =

వీఁకిపైచి, సపాటంబుగన్=సమముగ, పాటవము=సామర్థ్యము.

తాత్పర్యము

వేయికోట్ల వానరులు దన్ను సేవింపఁగా దన సేనలతో లంకను బీఁకిపైచి నేలతో సమానముగాఁ జేయ వీఁడు తలఁచు చుండును.

ఉ. వారణవానరావళుల ♦ ప్రాఁబగ లోన స్మరించి జాహ్నవీ
తీరమునన్ మతంగజత ♦ తిం బెదరించుచుఁ జెట్ల గారులన్
గారులఁ జెట్లచే గిరుల ♦ ద్రుమ్మజతతిన్ హరియించుచున్ మహా
వీరుఁ డుశీరబీజగిరి ♦ వేడ్కఁ జరించును గంగఁ దొడ్డునన్. ౫౭౭

అర్థములు. ఇది ప్రమాథి వర్ణనము, వారణ వానరావళుల=ఏనుఁగుల కోఁతుల గుంపుల, ప్రాఁబగ = ప్రాఁతపగ, మతంగజతతిన్=ఏనుఁగుల సమూహమును, గారులన్=ఏనుఁగులను, ద్రుమ్మజతతిన్=చెట్ల సమూహమును, ఉశీరబీజగిరి= ఉశీరబీజ మను కొండ, మునుపు శంబసాదనుఁ డను నొక రాక్షసుఁడు, ఏనుఁగురూపము నెత్తి ఋషుల బాధించుచుండెను. అపుడు ఋషు లందఱు కేసరి యను వానరోత్తముని ప్రేరించి వానిచే నీ రాక్షసుని జంపించిరి. ఆ కార్యమునకు సంతోసించి ఋషులు కేసరికి హనుమంతుఁ డుదయించున ట్లనుగ్రహించిరి. అది మొదలు వానరులకు నేనుఁగులకు వైరము కల్గెనని పురాణకథ.

తాత్పర్యము

•దీర్ఘ కాలముగ నేనుఁగులకు వానరులకుఁ గల పగఁ బట్టి గంగాతీరమున వసించుచు నందలి యేనుఁగులను బెదరించుచుఁ జెట్లచే నేనుఁగులను, నేనుఁగులచే జెట్లను గొండలచేఁ జెట్లనుఁ బడఁగొట్టుచు నుశీరబీజ మను పర్వతమందుండును.

చ. కపు, లొకకోటి గొల్వ హరి ♦ కాంతుఁడు వీఁడు ప్రమాథినామ యూ
థపుఁడు సురాలయంబు బల ♦ దానవఘస్మరుఁబోలి తద్గిరిన్
విపులబలాఢ్యుఁ డేలు సుర ♦ వీరమదాపహా ! వీర్యవిక్రమా
కృపణులు వీనిసైనికు ల ♦ హీనమదస్ఫురితాత్ము లెంతయున్. ౫౭౮

అర్థములు. సురాలయంబున్ = స్వర్గమును, బలదానవ ఘస్మరున్ = ఇంద్రుని, సురవీరమదాపహా= దేవవీరుల గర్వము నడచినవాఁడా! వీర్యవిక్రమాకృపణులు=వీర్యవిక్రమములందు నుదారులు, అహీన=గొప్పదగు, మద = గర్వముచే, స్ఫురితాత్ములు=తోఁచు దేహముగలవారు.

తాత్పర్యము

కోటి వానరులు సేవింపఁగా నీ ప్రమాథి యను పేరుగల యూథనాథుఁడు ఇంద్రుఁడు స్వర్గమును బాలించునటు లాకొండను బలాఢ్యుఁడై పాలించును. వీని సేనలవారు ఉత్సాహపరాక్రమములందు గొప్పవారు. పూర్ణమదముచేఁ గానవచ్చు దేహములు గలవారు.

క. వానిద సుమ యదిగోఁ బవ,మానసమాధూతరక్త • మహితరజస్సం
దానిత మతిసంరబ్ధం, బా నిష్ఠురకీశసేన • యసురాధీశా ! ౫౬౯

అర్థములు. వానిద = ఆప్రమాథిదే, పవమాన=గాలిచే, సమాధూత=ఎగురఁగొట్టబడుచున్న, రక్త=ఎఱ్ఱని, మహితరజస్సందానిత = ఎక్కువ దుమ్ముచే గూడినది, అతిసంరబ్ధము = మిగులఁ గోపముగలది, నిష్ఠుర = పరుషమైన, కీశసేన=వానరసేన.

## తాత్పర్యము

గాలిచే నెగురఁగొట్టఁబడుచున్న యెఱ్ఱని దుమ్ముచేఁ గూడినదియుఁ మిగులఁ గోపము గలదియు పరుషమైనదియు నగు వానరసేన యాప్రమాథిదే సుమా.

తే. గండుగొండంగులం దెల్ల • గండుఁ డతఁడు
చూడుము గవాక్షుఁ డనియెడి • శూరవరుఁడు
వానిఁ గాటుక మొగముల • వఱలు కొండ
ముచ్చు లోకకోటి కొలిచెడి • హెచ్చుబలిమి. ౫౭౦

అర్థములు. గండు గొండంగులందు = బలశాలులైన కొండ ముచ్చుల యందు, గండుఁడు=శూరుఁడు.

## తాత్పర్యము

బలముగల కొండముచ్చులలో వీఁడు బలశాలి. వానిపేరు గవాక్షుఁడు. శూరుఁడు. వానిని నల్లని ముఖములుగల కొండముచ్చు లోక కోటి సేవించు చున్నవి.

సీ. ఎందు మిళిందముల్ • క్రందుగా రొదసేయు, సర్వర్తుతరుఫల • సంతతులను
దేనినీ దనరంగు • లీను నగంబును సూర్యుఁ డెల్లప్పుడు • చుట్టుపెట్టు
నే గిరి తన్నాశ్ర•యించిన మృగపక్షి, తతులను దనకాంతిఁ • దనరఁజేయు
దేనిని దేవతల్ దివ్యమహర్షులు, పాయక యుందురు • భవ్యరీతి

తే. వలచినట్టివి ఫలము ల•వారిగాఁగ, నవ్వి యెయ్యది యొసఁగు నే•నొడను దేని
సోన గురియును నారమ్య•మైన మేరు,నగమునందుండుఁ గేసరి•నామకుండు. ౫౭౧

అర్థములు. మిళిందముల్ = తుమ్మెదలు, క్రందుగా=గుంపుగా. సర్వర్తు=సర్వఋతు=అన్ని ఋతువులందు ఫలించు, తరుఫలసంతతులను = చెట్లయందును పండ్లసమూహములయందును, చుట్టుపెట్టు ప్రదక్షిణించును, వలచినట్టివి = కోరినట్టివి, అవారిగాఁగ=దండిగా, సోన=సన్నవాన.

## తాత్పర్యము

సర్వఋతువులందు ఫలించు చెట్లయందును పండ్లయందును తుమ్మెదల గుంపు లెచ్చోట ధ్వనించుచుండును, తన కాంతిగల యే పర్వతమును సూర్యుఁడు సర్వదా ప్రదక్షిణము చేయుచుండును. ఏపర్వతము తనయం దుండు మృగములకుఁ బక్షులకుఁ

దన కాంతిని గలిగించును. ఏ పర్వతమును దేవతలు మహర్షులు వాయక యుందురు, కోరిన ఫలములు దండిగా పర్వతమున దొరుకును, ఎందు తేనె తుంబరగాఁ బడుచుండును. అటువంటి రమ్యమైన మేరుపర్వతమందుఁ గేసరియును వానరుఁ డుండును.

సీ. గండరగండఁ డీ • తండు రాక్షసతతి, మధ్యంబునందు నీ • మాడ్కిఁ దేన
యఱువదివేల స్వ • ర్ణాద్రుల నడుమను, మేరువు రాణించు • మేటి యగుచు
శాఖామృగంబు ల • చ్చట శ్వేతకపిలలో, హితమధుపింగళా • కృతుల నొప్పఁ
గరవాఁడి గోళ్ళను • గఱకుఁగోఱలు నయి, బెబ్బులు లట్టులు • గబ్బు లగుచు
తే. బొబ్బ మెకములవడువునఁ • బోడవులైన, నాల్గుకోఱలు గలిగి యం • టంగరాని
వేల్పుతోడను బోమించి • విషధరాళిఁ, బోలి మదవారణములకుఁ • బురుడు నూవి.

అర్థములు. గండరగండఁడు = శూరులలో శూరుఁడు, స్వర్ణాద్రుల = బంగారుకొండల, శ్వేత = తెల్లని, కపిల = గోరోచన వర్ణము, లోహితము = ఎఱుపు, మధుపింగళ = తేనెవలెఁ బసుపు, ఆకృతులన్ = ఆకారములను, కరవాఁడి = మిగులఁ బదునైన, గబ్బులు = మదించినవి, ఏక — గబ్బి, బొబ్బమెకముల = సింహముల, వడువున = విధముగా, అంటంగరాని వేల్పు = అగ్ని. బోమించి = (ఉగ్రత యందు) సరిపోలి, విషధరాళిన్ = పాములగుంపును, పురుడు = సమానము.

తాత్పర్యము

రాక్షస సమూహమందు నీ వెట్టులో యట్టులే వీఁడు శూరులలో శూరుఁడు. అఱువదివేల బంగారుకొండల నడుమ మేరువావర్ణి గొప్పదై ప్రకాశించును. అచ్చటి క్రోఁతులు తెలుపు, గోరోజన వర్ణము, ఎఱుపు, తేనెవర్ణములును మిగులఁ బదునైన గోళ్ళు కఱకుఁ గోఱలు గలవై పెద్దపులులవలె మదించి సింహములవలె పొడవైన నాలుగు కోఱలు గలిగి యగ్నిహోత్రమువలె నంటరాక, పాములవలె రోషము గలవై యేనుఁగులతో సమములై యుండును.

తే. దీర్ఘవాలంబు లమర మ • దించినట్టి, గారులను గొండలను బోలి • ఘనపయోద
రావులై వృత్తపింగళ • రక్తనయన, ములరహింపఁగ నీ లంక • మూలముట్టుగఁ గార్చి

అర్థములు. దీర్ఘవాలంబులు = నిడివితోఁకలు, గారులను = ఏనుఁగులను, ఘనపయోదరావులై = గొప్పమేఘముల ధ్వనివంటి ధ్వనిగలవై, వృత్త = గుండ్రములై పింగళ = తేనెపచ్చ, రక్త = ఎఱుపుగల, నయనములు = కన్నులు, మూలముట్టు = పునాదితో.

తాత్పర్యము

నిడివిగల తోఁకలుగలిగి మదించిన యేనుఁగులను, కొండలనుబోలి, మేఘధ్వని గలవై, వర్తులములు పింగళములు నగు కన్నులు గలిగి నీ లంకను పాతుతోడ.

తే. నాకమును జేయ నున్నట్టి • కేశవరుల, నడుమ విజయార్థియై యున్న • నగచరుండు
దేవ శతవలి యనిపొడి • ధీరతుండు, దినముదినము నుపాసించు • దివసనాథు. గరర

అర్థములు. నగచరుఁడు=వానరుఁడు.

తాత్పర్యము

నాశముచేయనున్న వానరశ్రేష్ఠుల నడుమ జయము గోరియున్న వానరుఁడు శతవలి యనిపెడివాఁడు. వీఁడు తూర్పుకొండయందుండి దినదినము సూర్యు నుపాసించును.

క. బలియుఁడు శూరుఁడు పౌరుష,కలితుఁడు రాముసకుఁ బ్రియముఁ • గావించుటకై
తలఁపఁడు 'ప్రాణముదీప'ను పలు కుర్విశ్లాఘ్యారు లంకఁ • బాడొనరింపన్. ౫౦౫

అర్థములు. ప్రాణము తీపు=ఇది లోకోక్తి. ఏది తీపనిన ప్రాణము తీపని సామెత గలదు! ఉర్విశ్లాఘ్యారు=మిక్కిలి యాశపడు.

తాత్పర్యము

బలవంతుఁడు శూరుఁడు పౌరుషము గలవాఁడు నగు వీఁడు రామునకుఁ బ్రియము చేయవలయు నను తలంపుతోఁ బ్రాణమునందలి యభిమానము వదలి లంక పాడుచేయుట యెప్పుడా యని కోరుచున్నాఁడు.

తే. గజగవాక్షులు నీలుండు • గవయనలులు
నొక్కఁ డొక్కఁడు దశకోటి • యూథసమితి
పతులు వింధ్యంబునందలి • ప్లవగవరుల
రాక్షసేశ్వర యెన్నఁ దరంబు గాదు. ౫౦౬

తాత్పర్యము

గజుఁడు, గవాక్షుఁడు, నీలుఁడు, గవయుఁడు, నలుఁడు వీరొక్కొక్కరు పది కోట్ల యోధుల గుంపునకు నాయకులు. ఇఁక వింధ్యపర్వతము నందలి క్రోఁతులు లెక్కింప సాధ్యముకాదు.

క. అంద ఱమితప్రభావులు, నంద ఱచలాభకాయు • లంద ఱు భూభృ
ద్బృందంబులు పొడిపొడిచే, యం దిట్టలు క్షణములోన • నసురాధీశా! ౫౦౭

అర్థములు. అచలాభకాయులు=పర్వత సమానములగు దేహములు గలవారు, భూభృత్ = కొండల, బృందంబులు = సమూహములను, పొడిపొడి = సన్నని పొడి—దుమ్ము, దిట్టలు=సమర్థులు.

తాత్పర్యము

అందఱు నపరిమిత ప్రభావముగలవారు అందఱు కొండలంత దేహముగలవారు అందఱు కొండలు పిండి పిండిగా నిమిషములోఁ గొట్ట సమర్థులు.

—• ౨౮ సర్గము. శుకుఁడు రావణునకు మైందాదుల నెఱింగించుట. •—

క. సారణుభాషణముల విని, తీర వచింపం దలంచి•దివిజారికి నా
పారావార మెఱయు కపి, వారంబుం జూఁజూపి • పలుకు శుకుండున్. ౫౦౮

అర్థములు. తీరన్ = పూర్ణముగ.

### తాత్పర్యము

సారణుఁడు చెప్పినమాటలువిని వానరుల విషయము పూర్తిగాఁ జెప్పదలఁచి సముద్రముతో సమానముగ నున్న వానరసేనను జూపుచు రావణునకు శుకుఁ డిట్లనియె.

సీ. ప్రాలేయగిరి నున్న ♦ సాలవృక్షంబులో, మందాకినీతటి మఱ్ఱిచెట్లో
మత్తిల్లితిరిగెడి ♦ మాతంగనాథులో, యనఁగ దుస్సాధులు ♦ నధికబలులు
కామరూపులు దితి♦జామరసంకాశు, లని దేవసన్నిభు ♦ లైన ప్లవగు
లిరువదియొకకోటి ♦ తరుచరు లట్టులే, వేయిశంఖంబులు ♦ బృందశతము
తే. వీరు కిష్కింధయందుండు ♦ వారు సూర్య, తనయుసచివులు దేవగం♦ధర్వతతికి
సంభవించిన వారలు సమరమునను, శత్రుంకీకరు లెల్లరు ♦ శక్రవైరి. ౨౮౬

అర్థములు. ప్రాలేయ గిరిన్=హిమవంతమునందు, సాలవృక్షంబులో=మద్దిచెట్లలో, మందాకినీ తటి = గంగయొడ్డున నున్న, దితిజ+అమర+సంకాశులు = దైత్యులతో దేవతలతో సమానులు, అనిన్=యుద్ధమందు, తరుచరులు=క్రోఁతులు, సచివులు=మంత్రులు.

### తాత్పర్యము

మంచుఁగొండయందలి మద్దిచెట్లో, గంగాతీరంబున నున్న మఱ్ఱిచెట్లో, మదించి తిరుగు నేనుఁగులో యనునట్లు సాధింపరాని యధికబలులు కోరినరూపము ధరింపఁగలవారు దేవదైత్యసమానులు, యుద్ధమందు దేవసములు, ఇరువదియొకకోటి వానరులు, అట్టులే వేయి శంఖంబులు నూఱుబృందములు-వీరు కిష్కింధయందుండువారు. సుగ్రీవుమంత్రులు, దేవగంధర్వులకు జనించినవారు యుద్ధమందుభయంకరులు.

మ. త్తకోకిలము. వారిఁ జూడు మవార్యవీర్య విభా♦ప్రభావులు బాలకా
కారు లబ్జజుపంపునన్ మురి♦గంపుమీఱి సుధారసం
బారఁ గ్రోలిరి మైందుఁడున్ ద్వివి♦దాఖ్యుఁడున్ నిను నీ పురిం
భూరివిక్రమసంపదన్ మును♦ముట్టఁ గూల్పఁగఁ జూచెదన్. ౨౮౭

అర్థములు. విభ=కాంతి, అవార్య=నివారింపరాని, ప్రభావులు = మహత్త్వము గలవారు, బాలక+ఆకారులు=వయస్సువచ్చిన పిల్లవాండ్ర యాకారములు గలవారు, అబ్జజుపంపునన్ = బ్రహ్మయాజ్ఞచే, మురిగంపు = బలము గర్వము, సుధారసంబు=అమృతము,

### తాత్పర్యము

వారింపరాని వీర్యము కాంతియొక్క మహత్త్వముగలవారు, వయస్సువచ్చిన బాలురవలె నుండువారు, దానికిఁ గారణమేమన బ్రహ్మయాజ్ఞప్రకారము బలగర్వము లతిశయింపఁగా నమృతముఁ ద్రావిరి. వారి పేరు మైందుఁడు. ద్వివిదుఁడు. నిన్ను నీ పట్టనమును గూడ భుజబలాతిశయముచే పాఁతులతోఁ బడఁగొట్టఁ జూచుచున్నారు

క. వారల ప్రేవల శైలా, కారులు సుముఖాసుముఖులు • కాలునితనయుల్
వీరులు జనకసమాను ల, పారబలులు పాఱఁజూచు • వారలు లంకన్. ౫౯౧

అర్థములు. ప్రేవలన్ = ప్రక్కల, శైలాకారులు = పర్వతముల యాకారము గలవారు. కాలుని తనయుల్ = యముని కొడుకులు.

### తాత్పర్యము

వారి ప్రక్కల పర్వతములవలె నుండువారును, వీరులును, తండ్రితో సమానులు, యముని కుమారులు అపరిమిత బలముగలవారు, సుముఖుఁడు అసుముఖుఁడు అను వారున్నారు, వారినిఁ బాలించి చూడుము.

సీ. మత్తమాతంగంబు • మాడ్కి నుండెడివాఁడు, కనలునఁ గడలి నేన్ • గాఁచువాఁడు
పవమానసుతుఁ డని • ప్రథఁ జెలంగెడివాఁడు, కేసరితనయుఁడై • కెరలువాఁడు
దలఁచినరూపంబు • ధరియింపఁ గలవాఁడు, బలరూపములకీవిఁ • బ్రబలువాఁడు
వాయువున ట్లని • వార్యవేగమువాఁడు, హరిచయంబుల మిన్న • యైనవాఁడు
తే. దర్పమున సాగరంబును • దాఁటినాఁడు, క్ష్మాత్మజను నిన్నుఁ జూచి మా • టాడినాఁడు
తిరిగి యిచ్చటి కిపు డరు • దెంచినాఁడు, కనితివే వాఁడె హనుమంతుఁ • డనెడివాఁడు.

అర్థములు. మత్తమాతంగంబు = మదపు టేనుఁగు, కనలునన్ = కోపమున, కడలి నేన్ = సముద్రమునైనను, ప్రథ = కీర్తి, మిన్న = శ్రేష్ఠుఁడు.

### తాత్పర్యము

మదపు టేనుఁగు వలె నుండు వాఁడును, కోపించెనేని సముద్రమునైనఁ గలఁతె పెట్టువాఁడును, వాయుపుత్రుఁ డని కీర్తి గన్నవాఁడును, కేసరి పుత్రుఁ డగు వాఁడును, కోరిన రూపము ధరింపఁ గలవాఁడును, బలరూపముల వైభవము గల వాఁడును, వాయువువలె వర్జింపరాని వేగము గలవాఁడును, వానర సమూహములలో శ్రేష్ఠుఁ డగు వాఁడును, బలగర్వముచే సముద్రమును దాఁటినవాఁడును, సీతను, నిన్నుఁ జూచి మాటాడినవాఁడును, మరలి పోయి యందఱఁ బిలుచుకొని యిచ్చటికి వచ్చిన వాఁడును నగు హనుమంతు డదిగో నున్నాఁడు చూచితివా ?

ఉ. వాఁడు కిశోరవృత్తి చెలు • వం బగువేళ క్షుధార్తి నప్పుడే
వేఁడి వెలుంగు ప్రాచిఁ బ్రభ • వింపఁగ నాఁకలి దీఱ వీనినిన్
బోఁడిమి మ్రింగువాఁడ నని • పూని చివుక్కున మింట నామడల్
మూఁడు సహస్రము ల్నెగసి • లోకవిలోచను డాయఁ బోక యే. ౫౯౩

అర్థములు. కిశోరవృత్తి = శైశవమున, క్షుధార్తిన్ = ఆఁకలి బాధచే, వేఁడి వెలుంగు = సూర్యుఁడు, ప్రాచిన్ = తూర్పునందు, ప్రభవింపఁగన్ = పుట్టఁగా, లోకవిలోచనున్ = సూర్యుని, లోకమునకు కన్నయిన వానిని.

### తాత్పర్యము

వాడు శిశువుగానుండుసమయమందు నాఁకలిగొన్నసమయంబునసూర్యుఁడు

తూర్పున నుదయించుచుండఁగా జూచి పండని తలఁచి యాఁకలిదీఱ దీనిఁ దిందు నని ప్రయత్నించి చివాలున నాకాశమున కెగసి మూఁడు వేలామడ పోయి సూర్యుని సమీపింపలేక.

(౧) సూర్యునికి భూమికి లక్ష యామడల దూరమని యొక లెక్క గలదు. కావున మూఁడనునది బహుత్వమును సూచించును, పెక్కువేలని గ్రహింపనగు, (౨) హనుమంతుఁ డపుడు మేరుపర్వతముపై నుండినవాఁడు కావున అచ్చటికి నపుడు సూర్యుఁడున్న చోటికి మూఁడు వేలామడ దూరమని గ్రహింపనగు.

కిష్కింధాకాండమందు (స. ౧౪౧౩)

'ఫలకాంక్షదివంబున కుద్గమించి యోజనములు మూఁడుసార్లు చని చండకరాతప తప్తదేహుఁడై' యని యున్నది. అచ్చట మూఁడునూర్లని చెప్పఁబడినదే యిచ్చట మూఁడు వేలని చెప్పఁబడెను. 'శతం సహస్రమయుతం సర్వ మానంత్య వాచకమ్' విశేషసంఖ్య చెప్పవలసివచ్చినపుడు నూఱు, వేలు, లక్షలని చెప్పుట గలదు. కావున నిచ్చట నట్టిసంఖ్యగా గ్రహింపనగు. ఈ యభిప్రాయమును ఉత్తర —౯౮౦వ పద్యమునందలి 'వేనవేల్' అను పద్యము దృఢపఱుచుచున్నది. సంస్కృతంబున మూఁ డనునది బహుత్వమును బోధించును.

క. శైలవరకూటతలమున, వ్రాలుటయున్ హనువు గాఁయపడెఁ జీలికయై
వ్రాలుమగఁడు దానం గద, వాలెన్ హనుమంతుఁ డనెడివరవిఖ్యాతిన్. ౫౬౪

అర్థములు. శైలవరకూటతలమునన్ = ఒక పర్వత శిఖర ప్రదేశమున, హనువు = చెంప, వాలుమగఁడు = శూరుఁడు.

తాత్పర్యము

పర్వతశిఖర ప్రదేశమున పడెను. చెంప గాయపడుటచే నీ శూరుఁడు హనుమంతుఁడను పేరఁ బ్రసిద్ధుఁడయ్యెను.

క. హనుమంతుఁడు హనుమంతుఁడు,హనుమంతుం డనుచు నితని నాప్తులు పిలువన్
విని యెఱిఁగితి నీతనిబల, ఘనమహిమ సురూపములను గాదు వచింపన్. ౫౬౫

తాత్పర్యము

హనుమంతుఁడు హనుమంతుఁడు హనుమంతుఁడు అని యితని మిత్రులు పిలుచుటచేఁ బీఁడే కదా హనుమంతుఁడని తెలిసికొంటిని. వీని బలముయొక్క గొప్ప మహిమను సురూపమును వర్ణింప సాధ్యపడదు.

హనుమంతుఁడని ముమ్మాఱు చెప్పనేల యనిన — వానరులందఱు నితని స్మరించువారే యని సూచించుటకు, నితనియం దందఱకుఁ గల ప్రీతి సూచించుట కును. రాముఁడు రాముఁడు రాముఁ డని జగము రామమయమైనట్లని యెంచనగు. రాముని వెనుక హనుమంతుఁడే బహుజనపూజ్యుఁడు. రామునివలె హనుమంతుఁ డందఱకుఁ బూజ్యుఁడు గదా!

క. ఉవ్వనఁ బైపడి యిపుడే, యువ్వెత్తుగ లంక నెల్ల • నుహ్వాని మీటన్
గ్రొవ్వునఁ దలఁచెడి నీతం, డవ్విధికిని జాలువాఁడ • యని నేఁ దలఁతున్. ౫౬

అర్థములు. ఉవ్వెత్తుగన్=అడుగునుండి - నిశ్శేషముగ, ఉహ్వాని=ఊహ్వా అని, ఊదునప్పటి శబ్దమున కనుకరణము. "ఉహ్వాని హోమాగ్ని నూఁద నొల్లఁ" డని పాండురంగమాహాత్మ్యము. మీటన్=ఎగఁజిమ్ముటకు, అవ్విధికిని = అంత పనిని చేయుటకు, చాలువాఁడ=శక్తి గలవాఁడే.

తాత్పర్యము

ఉవ్వనవచ్చి పైబడి యిపుడే నిశ్శేషముగ లంక నెల్ల నుహ్వాని మింటికి నెఁగ జిమ్ముటకు బలగర్వముచేఁ దలఁచుచున్నాఁడు. అంతపని చేయుటకు సమర్థుఁ డనియె నా యభిప్రాయము.

—• శుకుఁడు రావణునకు శ్రీరామ లక్ష్మణులఁ జూపుట •—

సీ. సారసనేత్రుండు • శ్యామల గాత్రుండు, ఘనగుణహారి వి•క్రమవిహారి
శూరవరేణ్యుండు! • సుజనశరణ్యుఁడు, నర్కవంశజలయుం•దశరథుండు
పౌరుష ప్రథితుండు, • ధీరసంకథితుండు, వేదవేదాంగ సం•విద్ధనుండు
ధర్మైకశరణుండు • ధర్మానుసరణుండు, బ్రహ్మాస్త్రమంత్రశాలిఁ • బండితుండు
తే. బాణములవిన్న బ్రద్దలు • పాపఁజాలు, నచలములఁ బిండిసేయంగ • నైనఁ గ్రాలుఁ
బరమరుపగొన్న మృత్యుదే • వతనుబోలుఁ, బటుపరాక్రమమునదివ • స్పతికిమేలు.

అర్థములు. సారస నేత్రుండు = కమలములవంటి కన్నులు గలవాఁడు, రామసౌందర్యమందుఁ గన్నులు ప్రధానములుగఁ బలుతావులఁ జెప్పఁబడెను. శూర్పణఖను మోహింపఁజేసినవి, సీతను దుఃఖింపఁజేసినవి, యీకన్నులే. అట్లే శుకుఁడును శ్రీరాముల దివ్యమంగళవిగ్రహము వర్ణించుటయందు నేత్ర వర్ణనముతోఁ బ్రారంభించెను. ప్రథమమందు వాని మనస్సు నాకర్షించినవి యీకన్నులే. వాఁడేమి చేయఁగలడు ?

శ్యామలగాత్రుండు=నీలమేఘమువలె,దూర్వాంకురమువలె,నల్లకలువవలెఁ గాంతికలవాఁడు. ఇది చూచువారిని నాకర్షించు బాహ్య సౌందర్యము. ఘనగుణహారి=గొప్ప సద్గుణములచే మనోహరుఁడైనవాఁడు. బాహ్యసౌందర్యముఁ బచ్చెన బొమ్మకునుగలదు. అట్లుగాక యీయన గుణములుగూడ జనులనాకర్షించునవి యని చెప్పఁబడెను.దయావాత్సల్యాది గుణములుండిన నుండునుగాక, దానివలన నాకేమి భయము, అందువేమో! విక్రమవిహారి=పరాక్రమము గలిగి సంచరించువాఁడు, పరాక్రమముచే విశేషముగ నాకర్షింపఁ బడువాఁడు, సాధువులు మంచి గుణములచే నాకర్షింపఁబడిన, విరోధులు పరాక్రమముచే నాకర్షింపఁ బడుదురు. ఏలన-శూరవరేణ్యుండు = శూరులందు శ్రేష్ఠుఁడు, సుజనశరణ్యుండు = సజ్జనుల

రక్షించువాఁడు, ఇట్లు చెప్పుటచే నీవంటి దుర్జనుల దండించువాఁ డని భావము. అర్కవంశజులందున్ = సూర్యవంశ రాజులందు, అతిరథుండు=వెనుకకుఁ దిరుగని తేరుగలవాఁడు, పరాజయ మెట్టిదో యెఱుఁగనివాఁడు, పౌరుషప్రథితుండు=పౌరుషముగలవాఁడని కీర్తిగన్నవాఁడు. కావున నిది నా యొక్కని మాటయే కాదు. పదుగురనుకొను మాట నేను చెప్పుచున్నానని భావము. ధీరసంకథితుఁడు=ధీరుఁడు అని విశేషముగఁ జెప్పఁబడుచున్నవాఁడు, ధైర్యము, బలము వీని కేమిలే, పులులు సింహములు ఏనుఁగులకు నివి లేవా! జ్ఞానములేని కారణమున మనుష్యులచేఁ జచ్చుటలేదా యందువేమో! వేద వేదాంగ సంవిత్ +ఘనుండు = వేదములయు వేదాంగములయు జ్ఞానముచే గొప్పవాఁడు. అయిన నవి నేను చదివిన విద్యలే కదా యనెదవేమో! ధర్మాత్మక శరణుఁడు=తాను రక్షించు ధర్మము తన్ను రక్షించునని యున్నాఁడుకాని బలపౌరుషములచేతనే నీవలె గెలువఁదలఁచినవాఁడు కాఁడు. 'ధర్మోజయతి' - 'ధర్మో రక్షతి రక్షితః' అని యుండువాఁడు, జయమునకుఁ గావలసిన ముఖ్యపదార్థము నీయందు లేదు అని భావము. ధర్మమునకు నొకఁడే రక్షకుఁడగువాఁడు. 'ధర్మస్య ప్రభు రచ్యుత' యన్నట్లు ధర్మమాయన నాశ్రయించి యున్నది. ఆయన లేకున్న ధర్మమునకు నిలువ నాధారములేదు. ధర్మము తన్ను రక్షించినవానిని రక్షించును. అట్టి ధర్మమును, అనుసరణుండు=అనుసరించువాఁడు, ధర్మము నతిక్రమించి యేపని చేయఁడని భావము. ఇదివఱకు నాచే దెబ్బలు దినిన రాజులందఱు ధర్మాత్ములుగారా! నా బాణములముందఱ నీ కనిధర్మమేమి నిలువఁగల దందువా? నీకుఁ దెలియని యస్త్రము లెఱింగిన వాఁడని చెప్పుచున్నాఁడు. బ్రహ్మాస్త్రమంత్రశాలిన్=బ్రహ్మాస్త్ర నారాయణాస్త్రాదిమంత్రములందు పండితుఁడు. అస్త్రముల దాఁకఁ బోనేల? ఉత్తబాణములచేతనే, వియన్ = ఆకాశము, బ్రద్దలుపాపఁజాలు=పగులఁ గొట్టఁగలఁడు. అచలమును=కొండలను, పరమరుష=మిగులఁ గోపము, దివస్పతికి=ఇంద్రునికంటె, మేలు=గొప్పవాఁడు.

## తాత్పర్యము

తామరలవంటి కన్నులుగలవాఁడు. నీలవర్ణమైన శరీరము గలవాఁడు. గొప్ప గుణములు గలవాఁడు. పరాక్రమము గలవాఁడు. శూరులందు శ్రేష్ఠుఁడు. మునిజనులకు దిక్కైనవాఁడు. సూర్యవంశపు రాజులందు నతిరథుండు. పౌరుషము గలవాఁడని లోకమునఁ గీర్తిగన్నవాఁడు. ధైర్యశాలి యని చెప్పఁబడువాఁడు. వేద వేదాంగముల జ్ఞానమునందు గొప్పవాఁడు. ధర్మమే రక్షకముగాఁగలవాఁడు. ధర్మమునకుఁ దానొక్కఁడే రక్షకుఁ డగువాఁడు. ధర్మము ననుసరించి తిరుగువాఁడు. బ్రహ్మాస్త్రము మొదలగు మంత్రముల నెఱిఁగినవాఁడు. బాణములచే నాకాశమును జీల్పఁగలఁడు. కొండలఁబిండి కొట్టఁగలఁడు, కోపము వచ్చెనా మృత్యు దేవతతో సమానుఁడు. గొప్ప పరాక్రమమందు నింద్రునికంటె గొప్పవాఁడు.

క. వేనిసతిన్ సీత జన, స్థానంబునఁ దెచ్చి తట్టి • దశరథమహీభృ
త్సూనుఁడు రాముఁడు వాఁడే, పూనెను నీతోడ యుద్ధ • మున కసురేంద్రా ?

అర్థములు. మహీభృత్ + సూనుఁడు = రాజకుమారుఁడు.

తాత్పర్యము

ఎవనిభార్యను నీవు జనస్థానంబుననుండి తెచ్చితివో యట్టి దశరథరాజ కుమారుని కొడుకగు రాముఁడనువాఁడే, ఆయన నీతోడ యుద్ధము చేయఁబూనెను.

సీ. ఆయన పయిదోడు • నన్నకు సరిజోడు, వలపటికయివంక • వఱలువాఁడు
మిసిమిమేలికడాని • మెఱుఁగులీనెడువాఁడు, కఱియుంగరంబుల • నెఱులవాఁడు
కెందామరల నవ్వు • కందోయిగలవాఁడు, నిక్కు పేర్వెడలుపు • టక్కువాఁడు
అసమున నన్నకై • యుసురునిల్పెడివాఁడు, నోటమి యెఱుఁగని • యేటుకాఁడు
తే. రామునకుఁ గుడికేలయి • గ్రాలువాఁడు, నతనికిని నిచ్చ వెలి యుసు • రైనవాఁడు
పూని యని నేరికిని గెల్వ • రానివాఁడు, కనలునిండారు డెందానఁ • దనరువాఁడు.

అర్థములు. పయిదోడు=సహోదరుఁడు, సరిజోడు=సమానుఁడు, వలపటికయివంకన్ = కుడిచేతివైపు, మిసిమి = మెఱుఁగుగల, మేలికడాని = మంచి బంగారుముక్క, మెఱుఁగులు=కాంతులు, కఱి = నల్లని, ఉంగరంబుల = ఉంగరములవలె వంకలైన, నెఱులు=వెండ్రుకలు, కందోయి=రెండుకన్నులు, అక్కు=ఱొమ్ము, అసమున = దర్పముచే, ఉసురు = ప్రాణము, ఓటమి=అపజయము, నిచ్చ=ఎల్లవేళ, రూ - నిచ్చలు - వెలియుసురు=వెలుపలి ప్రాణము, అనిన్ = యుద్ధమందు, కనలు = కోపము.

తాత్పర్యము

ఆ రామచంద్రమూర్తికి సహోదరుఁడు, అన్నకు సమానుఁడు కుడిప్రక్కనున్నవాఁడు, మెఱయుచున్న మంచిబంగారు కాంతిగలవాఁడు, ఉంగరమువలెనున్న నల్లని వెండ్రుకలు గలవాఁడు. ఎఱ్ఱదామరలవంటి రెండు కన్నులు గలవాఁడు, మిగుల వెడలుపగు ఱొమ్ముగలవాఁడు, తాను జీవించుట యన్న సేవకే యని తలఁచువాఁడు, పరాజయ మెఱుఁగనివాఁడు, రామునకుఁ గుడిచేతివంటివాఁడు, ఆయనకు వెలుపలి ప్రాణమైనవాఁడు, యుద్ధమం దెట్టివారికిని గెల్వరానివాఁడు, నీ మీఁది కోపముచే నిండిన హృదయము గలవాఁడు.

క. ఈతని లక్ష్మణుఁ డందురు, భ్రాతకుఁ బ్రియతముఁడు మఱియుఁ • బ్రాణసముండున్
నీతిని సంగరరీతిని, ఖ్యాతుఁడు సర్వాస్త్రశస్త్ర • గణకోవిదుఁడున్. ౬౦

తాత్పర్యము

ఈయనపేరు లక్ష్మణుఁడు అన్నకు మిగులఁ బ్రియుమైనవాఁడు. అంతియ కాదు, ప్రాణములతో సముఁడు. నీతియందు యుద్ధక్రమమునందుఁ బ్రసిద్ధుఁడు. అన్నివిధములైన యస్త్రశస్త్రసమూహములందుఁ బండితుఁడు.

క. బలియుఁడు మేధావంతుం, డలఘుపరాక్రముఁడు రాక్ష•సావళి నెల్లన్
గలనం దానొక్కఁడె, పొలియింపఁగఁ దమకపడెడుఁ•బురురోషమునన్. ౬౦౧

తాత్పర్యము

బలవంతుఁడు, బుద్ధిబలముగలవాఁడు, గొప్ప పరాక్రమము గలవాఁడు, యుద్ధమునందు రాక్షసుల నందఱను దానొక్కఁడే చంపుటకు మిగుల రోషముతో నుత్సాహము చేయుచున్నాఁడు.

క. హితుఁడై రామునకును నా, శ్రితుఁడై డాపలను నిల్చి • శ్రితరక్షస్సం
వృతుఁడైనవాఁడు రాక్షస, పతియైన విభీషణుండు • భవదనుజుండున్. ౬౦౨

అర్థములు. ఆశ్రితుఁడై=ఆశ్రయించినవాఁడై, డాపలను = ఎడమవైపు, శ్రిత=తన్నాశ్రయించిన రాక్షసు లగు మంత్రులచే, సంవృతుఁడు=చుట్టుకొనఁబడి యుండువాఁడు, భవదనుజుండున్=నీ తమ్ముఁడు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి మేలుకోరువాఁడై. రామునకు నాశ్రితుఁడై యెడమ ప్రక్క తనమంత్రులగు రాక్షసులతోఁ గూడియుండువాఁడు, నీ తమ్ముఁడు రాక్షస రాజగు విభీషణుఁడు. ఈ పద్యమందు గాయత్రి పదునాలవ యక్షరముగలదు.

తే. మానవాశన! యితఁడు శ్రీ•మద్వరుండు, రాజరాజైన శ్రీరఘు•రాముచేత
లంక కధిపతి యగుచు ను•ల్లాసగరిమఁ, దాఁక నున్నాఁడు నిన్నని•దర్పయుక్తి.

అర్థములు. మానవాశన=మనుష్యులను భక్షించువాఁడా! ఇతఁడు విభీషణుఁడు. శ్రీమద్వరుండు=శ్రీమంతులలో శ్రేష్ఠుఁడు. ౧ ఇది శ్రీరఘురామ శబ్ద విశేషణము. శ్రీరామచంద్రమూర్తి అవాప్తసమస్త కాముఁడు ఏమి కటాక్ష లేశముచేఁ గలిగిన యశ్వైర్యము చేతనే తాము శ్రీమంతుల మనుకొనుచున్నారో, అట్టి వారలలో నా శ్రీకే పతి యగుటచే శ్రేష్ఠుఁడు. లెక్కఁవ యుండవల శ్రీ, వారిని కొన్ని దినములకు వదలిపోవును. ఈయనకు శ్రీమంతుఁడు=శ్రీతో నిత్యసంయోగము గలవాఁడు. కావున నీ రాజ్య మాశించినవాఁడు కాఁడు. (౨) ఇది విభీషణ పర్యాయముగ నన్వయింప వచ్చును. దేవప్రసాదే వరణే, జామాతరి వరఃపుమాన్ క్లీబేతు కుంకుమే శ్రేష్ఠే, త్రిష్విష్టే త్వవ్యయం వరమ్ 'నానా౹౮. వర మనఁగా దేవ ప్రసాదము. కావున శ్రీమంతుఁ డగు రాముని యనుగ్రహమునకుఁ బాత్రుఁడైన వాఁడు. (౩) వరము=ఇష్టము, శ్రీరామచంద్రమూర్తి కిష్టుఁడైన వాఁడు కావుననే (౪) రామచంద్రమూర్తిచే నీవు లంకకు రాజవు కమ్మని కోరఁబడినవాఁడు. ఇట్లు చెప్పుటచే లంకారాజ్యమును విభీషణుఁడు కోర లేదనియు రామచంద్రమూర్తియే యనుగ్రహించి యిచ్చుటచే పరతంత్రుఁడు కావున నిరాకరింపఁ జాలక గ్రహించె ననియు భావము. (౫) ఈ కారణముచే శ్రీమంతులలో శ్రేష్ఠుఁడైన వాఁడు. రాజరాజగు=రాజుల కందఱకు రాజయిన, ఇతఁడు రాజయినఁగదా రామ

చంద్రమూర్తి రాజరాజగును. తన రాజరాజత్వము రక్షించు కొనుటకై అభిషిక్తుఁడు=అభిషేకింపఁబడినవాఁడు, ఉల్లాసగరిమన్=సంతోషాతిశయముచే, తాఁక నున్నాఁడు=నీతో యుద్ధము సేయఁదలఁచి యున్నాఁడు.

తాత్పర్యము

ఓరీ! నేను రాక్షసపతినై యుండ విభీషణుని రాక్షసపతియనెదవేల యందువా, నీవు మా+నవాశనుఁడవు. నీయొద్ద లక్ష్మి యెట్లు నిలువఁగలదు. నీవు మానవ+అశనుఁడవు, నిన్ను మనుష్య రూపములో నుండు రామచంద్రమూర్తి యెట్లు రక్షింపఁగలఁడు. కావున రామచంద్రమూర్తి నిన్ను రక్షింపఁడు. లక్ష్మి నీయందు నిలువదు. ఏలన నీ విభీషణుఁడు శ్రీమంతుఁడగు రామునిచే ననుగ్రహింపఁబడిన వాఁడై యా కారణమున శ్రీమంతులలో శ్రేష్ఠుఁడై రాజరాజగు రామచంద్రునిచే రాక్షసరాజుగ లంకాపురికి నభిషేకము చేయఁబడి సంతోషముతో యుద్ధమందు నీతోఁ బోరఁదలఁచి యున్నాఁడు. కావున నీ రాజత్వము కొలఁది దినముల లోనే ముగియఁ గలదు అని భావము.

సీ. క్రోఁతుల నడుమను • గొండనా నున్నవాఁ, డగచరాళికి భర్త•యైనవాఁడు
ధీజ్ఞానయశములఁ• దేజఃకులంబుల, ధరములఁ బ్రాలేయ•గిరివరంబు
వెలిఁగించు పగిదిఁ గో•తుల నేలువాఁడును, గలఁడు వెన్నీయని•కడిమికాఁడు
నగహానద్రుమ మయి • శైలదుర్గస్థ మా, కిష్కింధగుహాలోనఁ • గోశయూథ
తే. పతులును బ్రధానులును గొల్వఁ • బ్రబలువాఁడు
లలితపుష్కరశోత మయి • లక్ష్మి సుప్ర
తిష్ఠితం బయి కాంత మై•దేవమనుజ
తతికిఁ దగు హేమమాలికఁ • దాల్చినాఁడు. ౭౮

అర్థములు. ధీ-జ్ఞాన-యశములన్=బుద్ధిజ్ఞానకీర్తులచే, తేజః కుశలంబులన్=తేజస్సుచే కులముచే, ధరములన్=పర్వతములను, ప్రాలేయగిరి, వరంబు = కొండలలో శ్రేష్ఠమైన మంచుగొండవలె, వెన్ను+ఈయని = వీఁపుచూపని, కడిమికాఁడు=బలశాలి, నగహానద్రుమ మయి = గుహలతోఁ జెట్లతోఁ గూడిన, శైలదుర్గస్థమా=పర్వతదుర్గమగు, కిష్కింధగుహాలోన=కిష్కింధ యను గుహయందు, లలిత = మనోహరమైన, పుష్కరశోతమయి = తామరపూవులు గలదై, లక్ష్మి సుప్రతిష్ఠితంబయి=సుప్రతిష్ఠిత లక్ష్మిగలదై, శాశ్వతమైన కాంతిగలదై, కాంతమై=మనోహరమై, హేమమాలిక=బంగారుసరము, ఈ మాలికా ప్రభావము కిష్కింధా కాండమునందు వివరింపఁబడెను. ఇది వాలిదత్తము. శత్రువుల బలము తన లోనికి లాగుకొను శక్తి గలది.

తాత్పర్యము

క్రోఁతుల నడుమ గొండవలె నుండువాఁడు కావున క్రోఁతులకు కొండవలె

నాశ్రయుమైనవాఁడు, వానరులకు భర్తయగువాఁడు. ఊహాపోహముల చేతను, శాస్త్రజన్యమైన తెలివిచేతను కీర్తిచేతను ప్రతాపముచేతను సద్వంశమునఁ బుట్టుటచేతను కొండలయందు హిమవంతమువలె వానరుల నేలువాఁడు. యుద్ధమందు వీఁపు చూపని బలశాలి. గుహాలతోఁ జెట్లతో నిండి పర్వతదుర్గమైన గుహవంటి కిష్కింధయందు వానర యూథపతులు మంత్రులు గొలువఁగా బ్రబలుచున్నవాఁడు. మనోహరమైన నూఱు కమలముల చేత స్థిరమైన కాంతి గలిగి దేవతలకు మనుష్యులకు మనోహరమైన బంగారుసరమును ధరించినవాఁడు.

క. దురమున వాలిని గూల్చి, ధరణీతనయాధవుండు • తారాసతినిన్
దిరమగు కపిరాజ్యం బీ,సరియును సుగ్రీవునకు నొ•సంగెం బ్రితిన్. ౨౦౯

అర్థములు. దురమునన్=యుద్ధమునందు, సరి=హారము.

తాత్పర్యము

యుద్ధమునందు వాలినిజంపి రామచంద్రమూర్తి తారను హారమును కపిరాజ్యమును సుగ్రీవునకు లభింపఁజేసెను. తారయు హారము రామచంద్రమూర్తి యియ్యకున్నను వాలిని చంపుటచే నవి లభించుటచే రామచంద్రమూర్తి యిచ్చినట్టులే.

—• శుకుఁడు వానర సేనాసంఖ్యను రావణునకుఁ దెలుపుట •—

సీ. కోటియా లక్షను•నూటిచే గుణియింపఁ, గ్రాలుఁ దల్లక్ష శం•ఖంబు పేర
నది లక్షయైన మ•హాశంఖ మనఁబడు, నది లక్షయైన బృం•దాఖ్యఁబరఁగు
నది లక్షయైన మ•హాబృంద మందురు, తల్లక్ష యగును బ•ద్మంబు దేవ!
యది లక్షయైన మ•హాపద్మమై చెల్లు, నది లక్షయైన ఖ•ర్వాభిధాన
ఆ. మదియు లక్షయేన్ మ•హాఖర్వమాఁ దత్సహస్ర మగు సముద్ర•మదియు లక్ష
యైన నోఘనుందు•రది లక్షయు మహాఘ, మంచు గణితవేత్త•లందు రధిప!

అర్థములు. రాక్షసరాజా! యిఁక సంఖ్యాలక్షణము. వానరసేనా సంఖ్య చెప్పెద వినుము. నూఱులక్ష లొక కోటి, లక్షకోటు లొక శంఖము, లక్షశంఖములు మహాశంఖము, లక్ష మహాశంఖములు బృందము, లక్షబృందములు మహాబృందము, లక్ష మహాబృందములు పద్మము, లక్షపద్మములు మహాపద్మము, లక్ష మహాపద్మములు ఖర్వము, లక్ష ఖర్వములు మహాఖర్వము, వేయి మహాఖర్వములు సముద్రము, లక్ష సముద్రములు ఓఘము, లక్ష ఓఘములు మహౌఘము అని గణితశాస్త్రజ్ఞులు చెప్పుదురు.

సీ. ఈ యున్న వానర•బృందంబు గణియించి, వివరింతు వినవయ్య• వేయికోట్లు
శంఖశతము మహా•శంఖసహస్రంబు, బృందశతము మహా•బృంద మొక్క-
వేపద్మశతమును • వేమహాపద్మము, ఖర్వసముద్రము•ల్నూతము శతము
శతమహౌఘంబులు•శతసహస్రశతము, హౌఘముల్ గలిగి మ•హాబ్ధియట్లు

తే. పెంపుగను వాహినియును వి॰భీషణుండు, సచివయుక్తంబుగాఁ దన్ను॰నుచితరీతి
బలసియుండంగనీతోడ॰భండనమున, కెమరుచూచుచునున్న వాఁ॰డినసుతుండు.

తాత్పర్యము

ఈ గణితము ప్రకారము వానరసేన సంఖ్య చెప్పెద వినుము. వేయికోట్లు, నూఱుశంఖములు, వేయిమహాశంఖములు, నూఱుబృందములు, ఒక మహా బృందము, వేయినూర్ల పద్మములు, వేయి మహాపద్మములు, నూఱు ఖర్వములు, నూఱు సముద్రములు, నూఱు మహౌఘములు, పదివేల మహౌఘములు గలిగి పెద్ద సముద్రమువలె గొప్పదగు సేన విభీషణుఁడు మంత్రులతోఁ దన్నుఁ దగిన విధముగ చుట్టుకొనియుండ సుగ్రీవుఁడు నీతో యుద్ధము చేయనున్నాఁడు.

ఇందు వానరసేన సంఖ్య యొక్కఁ మొత్తముగాఁ జెప్పఁ బడలేదు. సేనాపతుల విభాగమును బట్టి యా యా సేనానాయకుల క్రిందఁ బనిసేయు వారి సంఖ్య యని తెలియవలయును.

చ. అలఁతులఁ బోఁడు దేవర! మ॰హాబలవంతుఁడు వీర్యవిక్రమా
స్థలితుఁడు ప్రజ్వలద్గ్రహస॰కాశచమూసము పేతుఁ, డాతనిన్
బలమును బాఱఁ జూచి యటు ॰ పై నెటు లోటమి రాక యుండునో
గెలుతువొ శత్రువర్గమును ॰ గోరి ప్రయత్నము సేయు మవ్విధిన్. ౬౦౪

అర్థములు. అలఁతులఁబోఁడు=అల్ప ప్రయత్నముతో సుగ్రీవుఁ డూరక పోవువాఁడు గాఁడు. ప్రజ్వలత్=జ్వలించుచున్న, గ్రహనికాశ=గ్రహములతో సమానమైన చమూసముపేతుఁడు = సేనతోఁ గూడినవాఁడు, ఓటమి = పరాజయము.

తాత్పర్యము

దేవరా! సుగ్రీవుఁడు నీ వల్ప ప్రయత్నము చేసితివేని యూరక పోవువాఁడుకాఁడు. మిగుల బలశాలి. వీర్యము విక్రమము సమృద్ధిగాఁ గలవాఁడు. ప్రకాశించు గ్రహములతో సమానమైన సేనతోఁ గూడినవాఁడు. అతనిని, సేనను చక్కఁగాఁ జూచి యెటు చేసిన నోడిపోకుందువో శత్రుసమూహమును గెలుతువో అట్టి ప్రయత్నమును జేయుము.

**—॰ ౨౫-వ సర్గము. రావణుఁడు శుకసారణుల నిందించుట ॰—**

చ. శుకుఁ డిటు లాడఁగాఁ బ్లవగ ॰ శూరసమూహము రామభూమిభృ
న్నికటగతున్ నిజానుజని ॰ నిస్తులవీర్యుని రామదక్షిణ
ప్రకటభుజున్ సుమిత్రసుతు ॰ బంధురవిక్రము సర్వకోశనా
యకుఁ గని గుండె ఝల్లన నొ॰కంత దశాస్యుఁడు క్రోధచిత్తుఁడై. ౬౦౫

తాత్పర్యము

శుకుఁ డీ ప్రకారము చెప్పఁగా వానర శూరుల సమూహమును రామచంద్ర

మూర్తి సమీపమున నున్న తన తమ్ముని విభీషణుని సమానవీర్యము గలిగి రామునకుఁ గుడిభుజమైన లక్ష్మణుని, విశేష విక్రమము గల సర్వవానర ప్రభు వగు సుగ్రీవునిఁ జూచి భయముచే గొంచెము గుండె ఝల్లుమనఁగా, నది తెలియ కుండునట్లు వెంటనే కోపము దెచ్చుకొనినవాఁడై.

క. వెలవెల నై నమ్రతరా, స్యులు నై నిలుచున్నవారి • శుకసారణులన్
 దిలకించి రోషగద్గద, కలితకఠోరోక్తి ననియెఁ • గడిమి దలిర్పన్. ౬౧౦

అర్థములు. నమ్రతరాస్యులు=మిగుల వంచుకొనఁబడిన ముఖములు గల వారు, రోష = కోపముచే, గద్గదకలిత = డగ్గుత్తికతోఁ గూడిన, కఠోరోక్తి = పరుష వాక్యము, కడిమి=బలము, తలిర్పన్=చిగిరింపఁగా.

తాత్పర్యము

వీనికిఁ గోపమువచ్చెనే యేమిచేయునో యని భయముచేఁ దెల్లపోయి తలలు వంచుకొని నిలుచున్న శుకసారణులఁజూచి రోషముచే మాట తడఁబడుచుండఁ బరుషముగాఁ దన బల మభివృద్ధి తెలియ నిట్లనెను.

ఉ. నేరిమి ప్రగ్రహంబును వి • నిగ్రహముం గలరాజు తోడనే
 వారక వానిసొమ్ముఁ దిను • వారలు విప్రియము ల్వచింపఁగాఁ
 దీరగు నొక్కొ? మీ తెలివి • తేటలు నీ ఱయి యేల పోయెనో?
 మీరలె నాకు ధీ గఱపు • మేటులు? చెల్లునె యిట్లు లాడఁగన్? ౬౧౧

అర్థములు. నేరిమి=నేర్పు, ప్రగ్రహము = అనుగ్రహము, వినిగ్రహము= తిరస్కారము, విప్రియములు=అప్రియములు, తీరగునొక్కొ = తగునా? నీఱు = భస్మము, ధీ=బుద్ధి, కఱపు=నేర్పు, మేటులు=గొప్పవారు.

తాత్పర్యము

నేర్పుగలట్టియు మేలుచేయుటకుఁ గీడుచేయుటకు శక్తిగలట్టియు రాజుముఖము నెదుటనే వాని సొమ్మదిని జీవించువారే ప్రియముగాని మాటలు చెప్పవచ్చునా? వల మీ తెలివితేటలు బూడిదయైపోయెను, మీరా నాకు బుద్ధిచెప్ప పెద్దలు? మీరు మీ యోగ్యత నాలోచింపక యిట్లు చెప్పఁదగునా?

క. ప్రతికూలురు యుద్ధార్థా, గతు లగు శాత్రవులు దఱిసి • కడిమిఁ బయిపడన్
 హితులవలె వారిఁ బొగడెద, రితవే మీకిదియు? సమయ • మెఱుఁగఁగవలదే!

అర్థములు. యుద్ధార్థాగతులు=యుద్ధము సేయఁగోరి వచ్చినవారు, శాత్రవులు = విరోధులు, దఱిసి = సమీపించి, కడిమిన్ = బలముచే, హితులవలెన్= వారి స్నేహితులవలె, ఇతవే=హితమా?

తాత్పర్యము

ఎదుటి పక్షమువారు యుద్ధమునకై వచ్చినవారునగు విరోధులు,బలవంతులై పైబడి రాఁగా, యుద్ధము చేయవలసిన సమయమందు వారి స్నేహితులవలె మీరు

వారిని బొగడెదరు. ఇది మీకుఁ దగిన కార్యమా? ఇది హితము చెప్పుసమయమా? ఎప్పుడు హితము చెప్పవలయునో యప్పుడేల చెప్పలేదు? మిమ్ము నందఱ నడిగితిని గదా! అప్పుడు మీరందఱు యోధులవలెఁ బౌరుషములు పలికి నన్ను యుద్ధమునకు దించి యిప్పు డీ నీతులు వచించెదరా ?

ఉ. ఆర్యగుణైకభూషణుల • నాదటనై గురువృద్ధులన్ మహా
   చార్యుల సేవఁ దన్పితిరి • శ్రద్ధను భక్తిని, దానఁ గల్గ దే
   కార్యము, నిష్ప్రయోజనము • గాఁ జనియెం జదు వెల్ల, భూమిభృ
   ద్వర్యులఁ గొల్చు పద్ధతుల • తత్త్వము మీర లెఱుంగఁ జాలమిన్. ౧౧౩

అర్థములు. ఆర్య గుణైక భూషణులన్=గొప్పగుణమే యలంకారముగాఁ గలవారిని, ఆదటనైన్=ప్రేమతో, గురువృద్ధులన్=జ్ఞానవృద్ధులను, వయోవృద్ధులను, మహాచార్యుల=గొప్ప యాచార్యుల. తన్పితిరి=తృప్తి బొందించితిరి. భూమిభృద్వరులన్=రాజశ్రేష్ఠులను, తత్త్వము=రహస్యము.

తాత్పర్యము

మీరు గొప్పగుణము భూషణముగాఁగల జ్ఞానవృద్ధులను వయోవృద్ధులను మహాచార్యులను ప్రేమతో శ్రద్ధాభక్తులతో సేవచేతఁ దృప్తి పొందించితిరి. ఫలము లేకయ్యెను. మీరు చదివిన చదువులెల్ల వ్యర్థమైపోయెను. ఏలన గొప్ప రాజుల నేవిధముగాఁ గొలువవలయునో యారహస్యము మీర లెఱిఁగినవారు కారు.

క. తెలిసికొని యుంటి రేనియు, ఫల మేమియుఁ గలుగ దనుభ • వమునకు రామిన్
   బలితపు శాస్త్రజ్ఞానము, బరు వొక్కటె మోసి తిరుగు • వారలు మీరల్. ౧౧౪

తాత్పర్యము

ఒకవేళ మీకు మనస్సునఁ దెలిసియున్నను నది యనుభవమునకు రామిచే నిష్ఫలము. అనుభవమున నుపయోగపడని బలిష్ఠమైన శాస్త్రజ్ఞాన మను బరువు మోసికొని మీరు తిరుగుచున్నారు.

క. మీయట్టి మంత్రులను వైధేయులఁ గట్టుకొని నేను • దేవుని కృపచేఁ
   జేయుచు రాజ్యము దేహం, బే యనువునవో ధరించి • యిటులున్నాఁడన్. ౧౧౫

అర్థములు. వైధేయులను=మూఢులను.

తాత్పర్యము

మమ్ము మూఢుల మంటివే యిట్టి మంత్రులఁ గట్టుకొని యిన్ని దినా లెట్లు రాజ్యము చేసితి నందురా? మీయట్టి బుద్ధిమాలిన మంత్రులను గట్టుకొని దేవుని కృపచే రాజ్యము చేయుచున్నాను. దేహమును గాపాడుకొనుచున్నాను గాని మీ యాలోచనబలము మీ దేహబలముచేత గాదు.

తే. ఎఱుఁగరా మీరు నా నాల్క • యే శుభంబు
   నశుభమును మీకుఁ గూర్ప స • మర్థ మనుచు ?

నిట్లు పరుషంబు వన్నాడ • నెత్తికొనుట
కేమిరా మృత్యుభయము లే • దేర మదుల? ౧౬

తాత్పర్యము

ఓరీ! మీకు మేలు కీడు కలిగించునది నాలుకయని యెఱుఁగరా? నాలుక నుండి మాట వెలువడిన మీ రేమైపోదురో ఆ భయములేక నన్ను మీరు కఠినముగా మాటలాడుటకు మీకు చావు భయములేదా యేమి?

ఆ. కారుచిచ్చు దవిలి • కాననంబున నుండు, వృక్షచయము నిలిచి• వెలయుఁగాక
ప్రభువుకోపమునకుఁ • బాత్రుఁడౌ నపరాధి,తనువు నిలుప లేఁడు•ధరణిమీఁద.

తాత్పర్యము

అడవిలో కారుచిచ్చునకుఁ దప్పి కాలక చెట్టు నిలిచిన నిలుచునేమో కాని రాజునకుఁ గోపమువచ్చునట్లు చేసిన యపరాధి బ్రదుకఁ జాలఁడు.

ఉ. పాపుల శత్రుపక్షమున • వారిఁ బ్రశంస యొనర్చు మిమ్ము నా
కోపమహాశుశుక్షణికిఁ • గూర్చనె యాహుతిఁగాఁగఁ, జిత్తమున్
మీ పొనరించి యున్న తొలి•మేళ్ళ నెఱింగి కృతజ్ఞ మందజేన్;
గాపథవర్తు లీరలు పొ•కాలుఁడు ఛీ నిలకుండు దాపువన్. ౧౭

అర్థములు. ఆశుశుక్షణికిన్=అగ్నికి, పొనరించి = చేసి, కాపథవర్తులు = కుత్సితమార్గమందు వర్తించువారు, పొకాలుఁడు=ఛీ పొందు.

తాత్పర్యము

పగవారిపక్షమువారిని పొగడు పాపులను మిమ్ము నా కోపమను మహాగ్నికి నాహుతిగా నీయకుందునా? మీ రిదివఱకుఁ జేసిన మేళ్ళ నాలోచించి కృతజ్ఞుఁడనై మనస్సు మెత్తని దగుటచే సహించితిని. మీరు కుత్సితమార్గమునఁ దిరుగువారు. ఛీ పొందావల! నా యెదుట నిలువకుఁడు.

క. మీ మేలు దలఁచి మిమ్మున్, నే మృతిఁ గూర్పంగ నేర • నెఱి చెడి మీరున్
నామేలు మఱచి యున్న, బ్రేమకు దూరస్థు లగుటఁ • ద్రెళ్ళినవారల్. ౧౮

తాత్పర్యము

ఇదివఱకు మీరు చేసిన మేలు దలఁచి మిమ్ము నేను జంపఁజాలకున్నాను. నీతిమాలి నేను జేసిన మేలు మఱచి నా ప్రేమకు దూరమైతిరి గావున మీరు చచ్చినవారే. ఆ శిక్ష మీకుఁ జాలును.

క. అని యిట్లు పంక్తికంధరుఁ, డన లజ్జానతశిరస్కు•లయి యా మంత్రుల్
వినయంబున జయజయ ని, స్వనముల నుతియించి చనిరి•సభ నుండి వెసన్.

అర్థములు. లజ్జానత శిరస్కులు = సిగ్గుచే వంచుకొనఁబడిన తలలు గలవారు.

### తాత్పర్యము

ఈ ప్రకారము రావణుఁడు చెప్పగా సిగ్గుచేఁ దలలు వంచుకొని యా మంత్రులు వినయంబున జయ జయ ధ్వనులు చేయుచు సభనుండి వెడలిపోయిరి.

**—◆ రావణుఁడు శార్దూలాదులను శ్రీరామునిచర్య కనుగొని రాఁ బంపుట ◆—**

ఉ. అంతట రావణుండు నిక◆టావనివర్తి మహోదరాఖ్యుతో
నెంతటి నీతివేదుల న◆హీనచరిత్రుల వేగువాండ్ర న
త్యంతజవంబునం బిలువ ◆ నంపు మటన్నను వాఁడు శేముషీ
మంతుల వేగువాండ్ర సుర ◆ మర్దను ముంగల నిల్పె వారలున్. ౬-౨౧

అర్థములు. నికటావనివర్తి=సమీప ప్రదేశమం దుండువాఁడు. ఎంతటి నీతివేదులన్=చక్కఁగా నీతిశాస్త్ర మెఱింగిన వారిని, అహీనచరిత్రులన్=గొప్ప గుణములు గలవారిని, ఇట్లు చెప్పుటచేత శుకసారణుల వంటివారు గాక దనకు విరోధముగఁ జెప్పెడివారు గానివారుగా నుండవలెనని సూచన, శేముషీమంతులన్=బుద్ధిమంతులను.

### తాత్పర్యము

వారు వెడలిపోయినపిమ్మట సమీపమందున్న మహోదరుఁ బిలిచి రాజుల యొద్ద నేది యెట్లు చెప్పవలయునో తెలిసినవారిని గొప్ప గుణము గలవారిని మిగుల శీఘ్రముగ వేగులవాండ్రను బిలిపింపుమనిన, వాఁడును బుద్ధిమంతులగు వేగులవాండ్రను రావణు నెదుట నిల్పఁగా వారును.

క. జయశబ్దము పూర్వముగ నవి, నయముగఁ గేల్మోడ్చి నిలిచి◆నన్ వారల ని
ర్భయులన్ భక్తుల శూరుల, నయవేదులఁ గాంచి రావ◆ణాశ్రుభ ననియెన్.

అర్థములు. నిర్భయులన్=శత్రువులకు భయపడనివారిని, నయవేదులన్=నీతి నెఱిఁగినవారిని.

### తాత్పర్యము

జయ జయ యనుచు వినయముతోఁ జేతులు జోడించి నిలువఁగా శత్రువులకు భయపడనివారిని తనయందు భక్తిగలవారిని శూరులను నీతిశాస్త్ర మెఱింగిన వారిని జూచి రావణుఁ డిట్లనెను.

ఉ. పొం డిట నుండి చక్క రఘు◆పుంగవుపాళెము డిగ్గుచోటి కా
తం డొనరించుయత్నము వి◆ధంబును శోధన చేసి యంత నా
తం డెడ నమ్మువారి చరి◆తంబును నాతనిమీఁదఁ బ్రీతిమై
నుండెడి మంత్రివర్యుల స◆ముద్యమముం గని రండు లెస్సగన్. ౬-౨౩

అర్థములు. పాళెము డిగ్గుచోటికి=రాముని దండు విడిసిన చోటికి, నమ్మువారి=నమ్మినవారి, సముద్యమమున్=ప్రయత్నము.

తాత్పర్యము

మీరు రిచ్చటనుండి చక్కఁగా రాముని సేన దిగినచోటికిఁ బోవలసినది. రాముఁడేమి యుద్ధ ప్రయత్నము చేయుచున్నాఁడో శోధించి తెలిసికొని యీ సిమ్మట నాతనికి నమ్మకమైనవా రెవ్వరు? వారి నడవడి యెట్టిది? అతనియందుఁ బ్రీతిగల మంత్రు లెవ్వరు? వారే ప్రయత్నము నందున్నారు. ఇవి చక్కఁగాఁ జూచి తెలిసికొని రండు.

తే. ఎవరుతోడుగ నేవేళ • నెట్లు నిద్ర
గొనును రాఘవుఁ డొంటియై • గూర్కఁ గొనునొ
యెపుడు మేల్కొను మఱి యెపు • డేమి సేయుఁ
దెలిసి సర్వంబుఁ జక్క రా • వలయు మీరు. ౨౪

తాత్పర్యము

రాముఁ డెప్పుడు నిద్రించును? అప్పుడెవరు తోడుందురు? లేక యతఁ డొంటిగనే నిద్రించునా? ఎపుడు మేలుకొనును? మఱియు నెప్పు డేయే కార్యములు సేయును. ఇవన్నియుఁ జక్కఁగాఁ దెలిసికొని రావలయును. (సమయము కనిపెట్టి చంపుటకై యీ విచారము.)

క. వైరుల తెఱంగు మతిమ,చ్చారులచే నెఱిఁగి ఱేఁడు • శాత్రవగణమున్
బోర లఘుయత్నమున ధి,క్కరించి జయించు ననిన • గడుకొని చారల్. ౨౫

అర్థములు. మతిమత్ + చారులచే = బుద్ధిమంతు లగు వేగులచే, లఘు యత్నమున = విశేష శ్రమము లేక.

తాత్పర్యము

బుద్ధిమంతులగు వేగులవారిచే విరోధుల ప్రవర్తనము దెలిసికొని రాజగు వాఁడు శత్రువుల సమూహమును యుద్ధమందు విశేషప్రయాసము లేక తిరస్కరించి జయించును అని చెప్పఁగా వారు పనిబూని.

సీ. వల్లెయటంచును • వలగొని మ్రొక్కి శా,ర్దూలుండు మున్నుగాఁ • దూర్ణమరిగి
ప్రచ్ఛన్న వేషులై • రామసౌమిత్రులు, విహరించుచున్న సు • వేల మరిగి
వానరరాక్షస • వల్లభ సహితులౌ, దాశరథుల వారి • ధ్వజినిఁ జూచి
వెల్లబోవుడును వి • భీషణుం డెఱిఁగి యు,ద్ధార్థ వర్ణు లటంచు • నగచరాళి

తే. కొయ్య నెఱిఁగించి శార్దూలుఁ డొక్కరుండె
పాపి యని పట్టి యుమ్మలఁ • బాఱఁదోలెఁ
బెట్టు ద్రిమ్మరులును వానిఁ • బట్టి కొట్టి
పిండి యిడి రెంతయును వాని • గం దడంగ. ౨౬

అర్థములు. వల్లె = అట్లాలే తెలిసికొని వచ్చెదమని, వలగొని = ప్రదక్షిణించి, తూర్ణము = త్వరగా, ధ్వజిని = సేన, వెల్లఁబోవుడును = వెల్లఁబోవఁగా,

యథార్థ్యవర్ణులు=వేగువాండ్రు, చెట్టు ద్రిమ్మరులును=క్రోఁతులు, పిండియిడిరి= పిండిగొట్టినట్లు కొట్టిరి. గండు=గర్వము.

తాత్పర్యము

ఆ వేగువాండ్రును అట్టులే తెలిసికొని వచ్చెదమని చెప్పి ప్రదక్షిణము చేసి నమస్కరించి శార్దూలుని ముందుగా నుంచుకొని శీఘ్రముగాఁబోయి మాఱువేష ములు వేసికొని రామలక్ష్మణులు సంచరించు సముద్రతీరముఁ జేరి సుగ్రీవ విభీషణు లతోఁ గూడిన రామలక్ష్మణులను వారి సేనను జూచి భయపడి వెళ్లఁబోఁగా విభీషణుఁడు తెలిసికొని వీరు వేగులు, వీరిలో శార్దూలుఁడే దోషి, తక్కిన వా రాతనివెంట నూరక వచ్చినవారే యని చెప్పి శార్దూలుని దప్పఁదక్కిన వారిని గొట్టి పాఱఁద్రోలిరి. శార్దూలుని బట్టుకొని పిండి దంచినట్లు దంచిరి.

క. వాని విలాపము సీతా, జాని విని కృపాళుఁ డగుచుఁ జరవర్గముతో
వాని విడిపింప వాఁడును, వానరఘాతముల గుండె ♦ వకవక లగుడున్. ౨౯

అర్థములు. సీతాజాని = సీత యెవనికి జాయయో యతఁడు. సీతా జాని = రామచంద్రమూర్తి, కృపాళుఁడు = దయ గలవాఁడు, చరవర్గముతో = వేగువాండ్ర సమూహముతో, వానరఘాతములన్=క్రోఁతులు కొట్టిన దెబ్బలచే, వకవకలు=బద్దలు.

తాత్పర్యము

వాని యేడుపుధ్వని రామచంద్రమూర్తి విని దయగలవాఁడై వేగులుగా వచ్చినవారితో శార్దూలుని విడువవలసిన దని చెప్పఁగా వాఁడును వానరులు కొట్టిన దెబ్బలచే గుండె బ్రద్దలుకాఁగా.

**-♦౩౦-వ సర్గము-రావణునకు శార్దూలుఁడు కపులచేఁ దానుబడినపాటు దెలుపుట.♦-**

క. ఎగయూరుపుతో వేలుపుఁ, బగ డాయఁగఁ జని సువేల ♦ పర్వతమున నా
జగదీశుఁడు విడిసినవాఁ, డగచర సైన్యంబుతోడ ♦ నని వచియించెన్. ౩౦

అర్థములు. వేలుపుఁబగ = దేవవిరోధి.

తాత్పర్యము

ప్రాణము పోవువానివలె నెగయూపిరి విడుచుచు రావణు నొద్దకుఁబోయి జగదీశ్వరుఁడు రాముఁడు సువేలయందు వానరసేనా సమేతుఁడై విడిసియున్నాఁ డని చెప్పఁగా.

సీ. రావణుండును మది ♦ రాముండు కడుదాపు, దఱిసె నంచు నొకింత ♦ తత్తఱిల్లి
యపసర్పవరునితో ♦ ననియె శార్దూల! నీ, తనుకాంతి పూర్వవి ♦ ధంబు గాదు
కందువాఱితి వేల? ♦ కడుఁ జిక్కినాఁడవు, కపులు దాయలకు లోఁ ♦ గావు గాదె?
యనుచుఁ బ్రశ్నింప భ ♦ యాకుల చిత్తుఁడై, యల్లనల్లన నిట్టు ♦ లనియె వాఁడు

ఆ. దేవ! వేగు దీయ ♦ దెప్పరవుం బని, క్రోతులందు వార ♦ కుంఠబలులు
సమితవిక్రమాఢ్యు♦లది గాక రామర, క్షితులు సుమ్ము వారిఁ ♦ జేర రాదు.

అర్థములు. తతిసెన్=సమీక్షించెను. తత్తఱిల్లి = సంభ్రమించి, చలించి అపసర్పవరునితోన్ = చారశ్రేష్ఠునితో, కపులుదాయులకున్ = కోపముగల కపి వారికి.

తాత్పర్యము

రామచంద్రమూర్తి కేవలము సమీపమునకు వచ్చినాఁడన్న వార్తవిని రావణుఁడు మనస్సునఁ గొంచెము తత్తఱపడి వేగులవాండ్రలో శ్రేష్ఠుఁడగు వానితో నిట్లనియె. శార్దూలా? నీ దేహకాంతి యిచ్చటినుండి పోవునపు డెట్లుండెనో యిప్పుడట్లు లేదు. వాడిపోయియున్నది. చాల బడలితివేల? కోపులగు కపివారికిఁ జిక్కలేదుగదా! యని యడుగఁగా చెప్పిననేమో చెప్పకున్ననేమో యని భయపడుచు మెల్ల మెల్లగా వాఁడిట్లనెను. దేవా! వానరులలో వేగుదీయుట చాల నపాయకరమైన కార్యము. వారు మిక్కిలి బలపరాక్రమ సంపన్నులు. అదిగాక రామరక్షితులు. వారిని సమీపింపనైన సాధ్యపడదు.

ఉ. కిమ్మని యాడరా దచటఁ ♦ గీశుల నేమని ప్రశ్నసేయ? మా
ర్గమ్ముల నెల్లఁ బర్వతని ♦ కాశులు క్రోఁతులు కాచు చున్నవా
రిమ్ముగ నేను జొచ్చితినొ ♦ యించుక లేదొ తటాన నన్ను రే
ద్రిమ్మరు లుక్కడంపు బిగిఁ ♦ దెప్పునఁ బట్టిరి కొట్టి రుగ్రులై. ౨౦

అర్థములు. కిమ్ = ఏమి, అని-కిమ్మని - అనుకరణంబునం దుదిహల్లునకు ద్విర్వచనం బగు-సు-వ్యా - సూ - ౧౫ సంధి. పర్వతనికాశులు = కొండలవంటి వారు, రేద్రిమ్మరులు = రాక్షసులు = విభీషణుని మంత్రులు, ఉక్కడంపు బిగి= అధికమైన బిగువుతో-గట్టిపట్టు - ఉత్కట శబ్దభవము ఉక్కడము- తెప్పునన్ = శీఘ్రముగ.

తాత్పర్యము

వానరులయొద్ద నితరులు శబ్దమే చేయరాదు. ఏమి యనరాదు, ఇఁక యేమని ప్రశ్నింప సాధ్యపడును? అన్ని మార్గములందుఁ గొండంత క్రోఁతులు కావలియున్నారు. లోపలికి పోవుటకే మార్గములేదు. అట్టులే యేదో యుపాయము చేసి లోపల గొంచెము దూరము పోయితినో లేదో వెంటనే విభీషణు మంత్రులు వచ్చి నన్నుఁ గట్టిగఁ బట్టుకొనిరి. ఆ కారణముచే విడిపించుకొని రాఁజాలనైతిని. మిగులఁ గోపించి కొట్టిరి.

ఉ. దంచిరి, నన్నుఁ బాదములఁ ♦ దద్దయుఁ జేతుల వ్రేళ్లగోళ్ళ నొ
ప్పించిరి, ముష్టిఘాతములఁ ♦ బిండిగఁ గొట్టిరి, దంతపంక్తిచే

నుంచిరి మేనఁగా ల్లుదిల • నుక్కిరి బిక్కిరి నై తపింప మ
ర్దించిరి, నాల్గువంకలను • ద్రిప్పిరి దెప్పిరి యొప్పి రా కపుల్. ౬౩౧

అర్థములు. ఉక్కిరిబిక్కిరి=ఊపిరితిరుగక, ఉదిలన్=దుఃఖింపఁగా.

తాత్పర్యము

ఊరక చెంపలు వాయించుటకాదు. కాళ్ళక్రింద వైచికొనిరి. రోఁకండ్లతో ధాన్యము దంచినట్లు పాదములతో నలియదంచిరి. చేతులచే వ్రేళ్ళ గోళ్ళ నొప్పి కలుగఁజేసిరి. పిడికిలి గ్రుద్దులఁ బిండిగఁ గొట్టిరి. నోటి పండ్లచేఁ గొఱికిఁ గాట్లు పడఁజేసిరి. దుఃఖముచే నూపిరాడక తపించునట్లు దబా గుబా మర్దించిరి. అంతతో విడువక యిట్లు కొట్టుచు సేనయందు నాల్గు ప్రక్కల వానరులారా! వీఁడు దొంగ చారుఁడు, చూడుఁ డని చెప్పుచుఁ ద్రిప్పిరి. నీ వఁటరా వేగుదీయు వాఁడ వని కొందఱు నిందించిరి. కొందఱు హుంకరించిరి.

ఆ. త్రిప్పిత్రిప్పి నన్నుఁ • దెచ్చిరి శ్రీరాము, కడకు నేను నెత్రు • కాల్వ వాఱు
మేనితోడ నడలు • మానసంబున రాము, నంఘ్రియుగళిఁ గావు • మనుచుఁ బడితి.

తాత్పర్యము

ఇట్లు త్రిప్పి త్రిప్పి కడపట నన్ను శ్రీరామునొద్దకుఁ దెచ్చిరి. పట్టుకొనఁగానే యాయనయొద్దకుఁ దీసికొనిపోయిన యెడల రామచంద్రుఁడు దయాళువు గావున నన్ను విడిపించునని వానరు లెఱుఁగుదురు. ఆ కారణమున వారు కడపట నాయనయొద్దకుఁ దెచ్చిరి. నేను నెత్తురు వఱదలై పాఱు దేహముతో దుఃఖపడు మనస్సుతో రక్షింపుమని రామచంద్రమూర్తి పాదములపైఁ బడితిని.

క. సీతాపతి చేతఁ బరి, త్రాతుఁడనై యెట్లో బ్రతుకు • దలఁ గంటిఁ; గపి
వ్రాతముచే శైలశిలా, జాతము నింపించి కడలి • జననాయకుఁడున్. ౬౩౩

అర్థములు. సీతాపతిచేతన్=నీ వేమెను చెఱనుంచి బాధపఱుచుచున్నావో యా సీతాదేవి భర్తచేత; పరిత్రాతుఁడనై=బాగుగఁ గాపాడఁబడినవాఁడనై యతి కష్టముమీఁదఁ బ్రాణముతో నుండఁగలిగితిని. నా గతి యట్లుండ నీ రామచంద్రుఁడు చేయుచున్న కార్యము చెప్పెద వినుము. వానరులచేఁ దెప్పించి సముద్రమంతయు రాలచే వృక్షములచే నింపించియున్నాఁడు. (ఇందుకుఁ గావలసిన రాలు మొదలైన వెచ్చటనుండియో యీ సమయమునకు వచ్చె నను సందేహముల నిది పరిష్కరించు చున్నది.)

క. గరుడవ్యూహంబున నగ, చరవర్గము తన్నుఁ గొలువఁ • జాపాయుధుఁడై
ధరణీపతి మన లంకా, పురిగవని న్నిలిచెఁ జుమ్ముఁ • పురుహూతారీ! ౬౩౪

తాత్పర్యము

గరుడాకారముగఁ దీర్పఁబడిన వానరసేనలు తన్నుఁ గొలువఁగా వింటిని

నాయుధముగాఁ గలవాఁడై రామచంద్రుఁడు మన లంకాపురి గవనివాకిటనే నిలిచి యున్నాఁడు.

'దండవ్యూహేన తన్మార్గం యాయాత్తు శకటేన వా వరాహమకరాభ్యాంవా సూచ్యావా గరుడేనవా.' శత్రువులమీఁదికి దండయాత్ర పోవువాఁడు దండ వ్యూహముగాఁగాని, శకట వ్యూహముగాఁగాని, వరాహ వ్యూహముగాఁగాని, మకర వ్యూహముగాఁగాని, సూచీ వ్యూహముగాఁగాని, గరుడ వ్యూహముగాఁ గాని తనసేనలఁ బన్నవలయును.

(౧) దండవ్యూహము:— అనఁగా మొదట బలాధ్యక్షుఁడు, మధ్యను రాజు, వెనుక సేనాపతి, పార్శ్వములందు ఏనుగులు, వాని ప్రక్కన గుఱ్ఱములు, వాని వెంబడి కాల్బలము—ఇవ్విధంబునఁ దీర్చిన నిడుపయి యంతట సమముగా నిలిచి యున్న వ్యూహము. తాముపోవు మార్గమందంతట భీతిగలిగినప్పుడీ దండవ్యూహ ముతో శత్రుపురముపైకిఁ బోవలయును.

(౨) శకటవ్యూహము:—అనఁగా ముందు సూదివలెనుండి వెనుక వెడ ల్పుగా సేనను నిలుపుట. వెనుకతట్టు భయముగలిగి నప్పుడు ఈ శకట వ్యూహ ముతోఁ బోవలయును.

(౩) వెనుక ముందు సన్ననై, నడుమ వెడల్పయి యుండు సేనానివేశము వరాహవ్యూహము.

(౪) మిక్కిలి విశాలమయిన నడిమిభాగము గలది గరుడ వ్యూహము. ఈ రెండు వ్యూహములతోను ప్రబలభయము గలిగినపుడు పోవలయును.

(౫) ముందును వెనుకను వెడల్పయి, నడుమ సన్నని సేనానివేశము గలది మకర వ్యూహము, ముందును వెనుకను భయము గలిగినపుడు మకర వ్యూహ ముతో ముట్టడింపవలయును.

(౬) చీమల బారువలె వరుసగా నుండవలసినచోట నెక్కువ శూరుల మొత్తము గలిగినది సూచీ వ్యూహము. ముందు భయముగలిగినపుడు దానితోఁ బోవలయును.

క. నను విడిచి లంకమీఁదం, దనదృష్టిని నిలిపెఁ గ్రోఁతి • తతి లగ్గలకున్
జను దేశమున్న యుద్ధమొ, జనకజ నిచ్చుటయొ యొకటి•పలుపు మటన్నన్.

తాత్పర్యము

నన్ను వదలిపెట్టి యీ వీటిని సాధించు టెట్లని యాలోచింపఁ దన దృష్టి లంకమీఁదఁ బఱపెను. క్రోఁతులు లగ్గ లెక్కుననుటయందు సందేహము లేదు. వా రట్లు చేయుటకు ముందే యుద్ధము చేసిన బాగా? సీత నిచ్చుట బాగా యను నది యాలోచించి తీర్మానించు కొనుము.

—• శార్దూలుఁడు రావణునకుఁ గపుల బలపరాక్రమములు దెలుపుట •—

సీ. ఆమాట లాలించి • యసురాధిపతి యిట్లు, పలికె వానికి గొప్ప • వాక్యమొండు
దేవగంధర్వులు • దితిజదానవులును, నుత్కటఁ దా రెల్ల • నొక్కటగుచు
నెదిరించి వచ్చిన • నెల్ల లోకములచే ముమ్మరంబుగఁ గీడు • మూఁడె నేని
సీత నిచ్చుట లేదు • సిద్ధాంత మియ్యది, యిది యుండనిమ్ము త • ద్వృత్తచరుల
ఈ. బలములందుఁ దిరిగి • వచ్చినాఁడవు గదా, శూరు లెచట నున్న • వారు? వార
లెట్టివారు? కొలఁదు • లెంత మాత్రము? ప్రభావంబు లెట్టి వందు • బలియు రెవరు?

అర్థములు. ఆలించి = విని, ఉత్కటసన్ = బలముచే, ముమ్మరంబుగన్ = అధికముగ.

తాత్పర్యము

శార్దూలుఁడు చెప్పిన యామాటలు విని రావణుఁడు వానితో నిట్లనెను. ఓరీ! యుద్ధము చేయవలయునా? సంధి చేయవలయునా యను విచారము నాకు లేదు. ఆ విషయమై నే నాలోచింప వలసినది లేదు. దేవ గంధర్వులు, దైత్యులు, దానవులు నందఱు నొక్కటిగాఁ జేరి యెదిరించి వచ్చినను, లోకము లన్నిటిచేఁ గీడు కలుగున ట్లున్నను సీతను మరల నీయను. ఇది సిద్ధాంతము. యుద్ధము చేయుటే నిశ్చయము. ఇది యటుండ నిమ్ము. నీవు దెబ్బలు తినినఁ దింటివి. ఆ విధముగ నైన వానరసేన నంతయుఁ జూచివచ్చితివి గదా! ఏ పార్శ్వమునందు శూరు లున్నారు. (ఏదిక్కుల బలవంతులు తక్కువగ నున్నారో యాప్రక్క తానుబోయి పైపడవచ్చునని రావణు నభిప్రాయము) ఆ శూరు లెట్టివారు? వారిశక్తి యెంత మాత్రము? వారి మహత్త్వము లెట్టివి? వారిలో బలిష్ఠు లెవ్వరు?

క. ఎవ్వరి పుత్రులు తత్కపు, లెవ్వరి మనుమండ్రు? తెలుపు • మెదిరిబలంబో
నెవ్విధి లెఱింగి సకలం, బవ్వల యోజింతుఁ జేయ • నర్హక్రియలన్. ౬౩౭

తాత్పర్యము

ఆ శూరు లెవ్వరి పుత్రులు? ఎవ్వరి మనుమలు? (ఈ పెద్దవారిలోఁ దనకుఁ బరిచితు లుండిరేని వారిచేఁ జెప్పించి వీరిని వెనుకకుఁ బోవఁజేయుటకై యీ ప్రశ్న) విరోధుల సేన విధమంతయుఁ దెలిసికొని యేమేమి చేయవలయునో యదియంతయు నావలనఁ జేసెదను.

క. దురమును గోరెడివారికిఁ, బరుల బలాబలము లెఱుఁగ • వలయు న టన్నన్
సురవైరిఁ గాంచి యుత్తమ, చరుఁ డిట్లని చెప్పె శైల • చరవిషయంబున్. ౬౩౮

అర్థములు. దురమును = యుద్ధమును, పరుల = శత్రువులయొక్క, బలాబలములు = బలమును-దుర్బలత్వము.

తాత్పర్యము

యుద్ధము చేయఁగోరినవారికి శత్రువు లే విషయమున నే ప్రదేశంబున బల

వంతులు? ఏ విషయమున నేర్పై పున బలహీనులు? ఇది తెలియవలయును. అని చెప్పఁగా వానరులవిషయము వేగువారలలోఁ గొప్పవాఁడగు శార్దూలుఁడిట్లు చెప్పెను.

సీ. ఋక్షరజసుపట్టి • వృక్షాటరాజు సు,గ్రీవుం డాతని నని • గెలువరాదు
గద్గదుకొడుకు ఋ • క్షప్రభుఁ డాతఁడే, జాంబవదాఖ్య ప్ర • శస్తి గాంచె
ధర్ముని పుత్రుండు • ధర్మచిత్తుఁడు వీర్య,ధని సుషేణుండు దో • ర్దర్పయుతుఁడు
సౌమ్యుండు సోమసం • జాతుండు దధిముఖుం, డపరమృత్యువులుగ • నబ్జభవుఁడె
తే. వృక్షచరరూపమున ధర • సృష్టి చేసె, సుముఖదుర్ముఖు లనియెడి • శూరవరుల
వేగదర్శిని రాజేంద్ర! వీతిహోత్రు,సుతుఁడు నీలుఁడు సేనాని • శూరతముఁడు.

సుగ్రీవుఁడు ఋక్షరజసుని కొమరుఁడు, వానరరాజు, అతనిని యుద్ధమునందు గెలువ సాధ్యపడదు. జాంబవంతుడు గద్గదు కొడుకు. భల్లూకరాజు, (జాంబవంతుఁడు బ్రహ్మ యావులించినపుడు జనించెనని బాలకాండమున ౪౨౭౪ పద్యంబునఁ జెప్పఁబడెను. ఇచ్చట గద్గదు కొడుకని చెప్పబడెను. (౧) గద్గదుఁడు పెంచిన తండ్రియై యుండవచ్చును. యశోదానందనుఁ డన్నట్లు. (౨) బ్రహ్మ యావులించినపుడు వెడలిన శక్తి గద్గదు భార్యయందు నావేశించి జాంబవంతుఁడుగానైనఁ బుట్టి యుండవచ్చును.

సుషేణుఁడు వరుణుని కుమారుఁడు. (అప్పటికి సుషేణుఁడని బాలకాండమున ౪౪౧౪ పద్యంబునఁగలదు. కావున నిచట ధర్మశబ్దము వరుణపర్యాయము, లేదా యీ యిరువురు వేఱువేఱు వానరు లనికాని, శార్దూలుఁడు భయభ్రాంతుఁడగుటచే దాఱుమాఱుగఁ జెప్పెననికాని గ్రహింపనగు.) ధర్మముతోఁగూడిన మనస్సుగలవాఁడు కావున ధర్మపక్షమందే యతఁడుండును గాని, మన పక్షమునకు రాఁడు. వీర్యమే ధనముగాఁగలవాఁడు, భుజబల గర్వముగలవాఁడు, దధిముఖుఁడనువాఁడు చంద్రుని కొడుకు. సౌమ్యమైన స్వభావముగలవాఁడు, దుష్కార్యములకు రాఁడు. అపరమృత్యువులుగ= రెండవ మృత్యువులుగ-అని కాని మృత్యువు పుత్రులని కాని గ్రహింపనగు. అందఱకుఁ దండ్రులపేరు చెప్పుటచే నిచ్చట నట్లులే గ్రహింపనగు. వీతిహోత్రుని= అగ్నియొక్క, సేనాని=వానర సేనానాయకుఁడు, శూరతముఁడు=మిక్కిలి శూరుఁడు.

### తాత్పర్యము

వానరులందు శూరులగు వారికిఁ దండ్రు లెవ్వరని యడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాఁడు. సుగ్రీవుఁడు ఋక్షరజుని కొడుకు. వానర రాజు. యుద్ధమునందు వీనిని గెలువ సాధ్యపడదు. జాంబవంతుఁ డనువాఁడు గద్గదుని కొడుకు భల్లూకరాజు. వరుణుని కొడుకు, ధర్మచిత్తుఁడు, వీర్యమే ధనముగాఁ గలవాఁడు సుషేణుఁడు. దధిముఖుఁడు చంద్రుని కొడుకు. సాధువర్తనము కలవాఁడు. సుముఖుఁడు దుర్ముఖుఁడు వేగదర్శి యనువారు మృత్యుదేవత కొడుకులు. బ్రహ్మ

దేవుఁడే వీరిని వానరరూపమున సృష్టించెను. అగ్నిహోత్రుని కొడుకు వానరసేనా నాయకుఁడు, మిక్కిలి శూరుఁడు నీలుఁడు.

క. నీకొడుకు లోనుగాఁగల, నాకారులఁ బిల్కుమార్చి • ససహాయుండై
రోకపి యాతనిజనకుఁడు, పాకారిగురూద్భవుండు • ప్రబలుఁడు పోరన్. ౨౮౦

తా త్ప ర్య ము

నీ కొడుకు శత్రుఁడు మొదలుగాఁగల రాక్షసుల ససహాయుఁడై యెవఁడు చంపెనో యా హనుమంతుని తండ్రి కేసరి. కేసరి పేరు చెప్పఁబడకున్నను గమ కత్వముచే గ్రహింపవలెను. అతఁడు ఇంద్రుని గురువగు బృహస్పతి కుమారుఁడు. యుద్ధమునందుఁ బ్రబలుఁడు.

క. అనిలునితనయుఁడు హనుమఁడు, ఘనవిక్రముఁ; డుక్కలుండు • గట్టులపగకున్
మనుమఁడు దీవనవంతుఁడు, చను నంగదుఁ డనెడిపేర • శక్రారాతీ! ౨౮౧

అర్థములు. ఉక్కలుఁడు = ధురంధరుఁడు, గట్టులపగకున్=ఇంద్రునకు, దీవనవంతుఁడు = ప్రాయమువాఁడు.

తా త్ప ర్య ము

నీకుఁ దెలిసిన హనుమంతుఁడు వాయువు కుమారుఁడు. మిగులఁ బరాక్రమము గలవాఁడు. ఎంతకార్యమైన సాధింపఁగలవాఁడు. ప్రాయమునం దుండు నంగదుఁడు ఇంద్రుని మనుమఁడు.

తే. మైందుఁడును ద్వివిదుండును • మహితశౌర్యు,లశ్వితనయులు
వైవస్వ • తాత్మభవులు
గజగవాక్షగవయులును • గంధమాదనుండు శరభుండునా యము • నుద్దివారు.

తా త్ప ర్య ము

మైందుఁడు - ద్వివిదుఁడు అనువారు అశ్వినీనయులు. గజుఁడు గవయుఁడు గవాక్షుఁడు గంధమాదనుఁడు శరభుఁడనువారు యముని కొడుకులు (వీరు బాల కాండమునఁ జెప్పఁబడిన వారు గారు) యమునితో సమానులు.

క. శూరులు శ్రీమద్దేవకుమారులు రణదోహలులు స • మానవిరహితుల్
ధీరులు పదికోట్లు వసే, చారులు గల రున్న వారిఁ • జాలం జెప్పన్. ౨౮౩

తా త్ప ర్య ము

శూరులును, శ్రీమంతులు, దేవతల కుమారులు, యుద్ధమునందు మిగుల నాశక్తి గలవారు, ఈడు లేనివారు, ధైర్యవంతులు నగు వానరులు నేను లెక్కించిన వారు పదికోట్లు గలరు. ఇంకను గలరు గాని యందఱను నేను జెప్పఁజాలను.

సీ. సింహసంహననుల • క్షీణబలాఢ్యులు, దశరథపుత్రులు • నిశిచరేంద్ర
వారిలో నెక్కటి • పోరిలోఁ ద్రిశిర, ఖరహంత గంధర • గండఁ డయ్యె
యులవిరాధుఁ గబంధు • నంతకాతిథులుగా, ననిచినరాముఁడు • యమవిభుండు
విక్రమంబున రామ • విభునితో సరిపోల్పఁ గానరాఁ డొకఁడు జ • గంబులందు

తే. నల జనస్థాన మంతయు • హతము నొనర్చి, నట్టి పౌరుష శాలి గు•ణాళి నెన్న
నెవ్వఁ డేనియు నేరఁ డీ•యెల్లలోక,ములను సత్యంబు రాక్షస•కులవతంస !

అర్థములు. సింహసంహననులు = అవయవ సౌష్ఠవ పరిపూర్తి గలవారు. వరాంగరూపో పేతో యస్సింహ సంహననో హిసః'అని యమరము. ఒక్కటిపోరి లోనన్=ద్వంద్వ యుద్ధమునందు; ఒక్కఁడొక్కనితో యుద్ధముచేయుట ద్వంద్వ యుద్ధము. ఒక్కటిపోరు, గండర గండఁడు=శూరులందు శూరుఁడు, అంతకాతిథులుగన్=యమునకు నతిథులుగ—.చచ్చినవారిగ.

తా త్ప ర్య ము

సింహసంహననులును, క్షయింపని బలముగలవారును నగు రామలక్ష్మణులు దశరథుని పుత్రులు, వీరిలో ద్వంద్వయుద్ధమందు ఖరుని త్రిశిరుని జంపిన రాముఁడు శూరులలో శూరుఁడు. నీతో సమానుఁ డని ప్రసిద్ధిగన్న విరాధుని కబంధుని జంపిన రాముఁడు యమునితో సముండు. పరాక్రమంబున రామునితో సమానుఁ డని చెప్పఁదగినవాఁడు ముల్లోకంబుల లేఁడు. ఆ జనస్థానమంతయు నాశము చేసిన పౌరుష శాలి. ఇఁక నాయన సద్గుణములను లెక్కించుటకుఁ జాలినవాఁడు లోకము లం దన్నిట లేఁడు. నేను సత్యము చెప్పుచున్నాను.

క. వారణసన్నిభుఁ డని నని, వారణవిక్రముఁడు భూమి•వరు సోదరుఁ డా
వీరు నిశితనారాచము, బారిం బడి బ్రతుక లేఁడు • బలశాత్రవుఁడున్. ౭౩౫

తా త్ప ర్య ము

ఆయన తమ్ముఁడు లక్ష్మణుఁడు బలమున నేనుఁగు వంటివాఁడు. వారింపరాని విక్రమము గలవాఁడు ఆ వీరుని బాణముల బారినిబడి యింద్రుఁడైన బ్రదుక లేఁడు.

క. శ్వేతుఁడు జ్యోతిర్ముఖుఁడును, ఖ్యాతబలుల్ సూర్యతనయు•లప్పతికిఁ దనూ
జాతుండు హేమకూటా, ఖ్యాతుం డల నలుఁడు విశ్వ•కర్మాత్మజుఁడున్. ౭౩౬

తా త్ప ర్య ము

శ్వేతుఁడు జ్యోతిర్ముఖుఁడనువారు సూర్యుని కొడుకులు. ప్రసిద్ధబలులు. జలాధిపతి యగు వరుణునికిఁ గొడుకు, హేమకూటుఁ డనువాఁడు. సేతువుకట్టిన నలుఁడు విశ్వకర్మకొడుకు.

క. హరివీరుల మేటి సుదు,ర్ధరుఁడు వసువుసుతుఁడు సుమ్ము • రాక్షసులందున్
గరము వరిష్ఠుఁడు నీ సో,దరుఁడు విభీషణుఁడు• హితుఁడు•దాశరథులకున్.

తా త్ప ర్య ము

దుర్ధరుఁ డనువాఁడు వానరులలో గొప్పవాఁడు. వసువు కుమారుఁడు. రాక్షస శ్రేష్ఠుఁ డగు విభీషణుఁడు నీ తమ్ముఁడు రామలక్ష్మణులకు మిగుల హితుఁడు.

క. ఈరీతిగఁ గపిసేనల, తీ రంతయుఁ దెలియ నాడి•తి సువేలాద్రిన్
వా రున్నవారు తక్కిన కారియముం దీర్ప నీవ • గతి యంతటికిన్. ౭౩౭

తాత్పర్యము

ఈ విధముగఁ గపిసేన యున్న విధమంతయు నీకుఁ గావలసినది తెలిపితిని. వారందఱు సువేలాద్రిమీఁద నున్నారు. తరువాతఁ జేయవలసిన పను లేవియో యవి నీవే నిర్ణయించుకొనుము.

—• ౩౧-వ సర్గము. రావణుఁడు విద్యుజ్జిహ్వుని రాముని శిరస్సుఁ జాపముఁ గల్పింప నాజ్ఞాపించుట. •—

సీ. అపసర్పరీతి • నక్షోభ్యబలముతో, నంబుజాక్షుండు సువే • లాద్రిమీఁద
విడియుట వినిభిన • విని వింశతిభుజుండు, నెద ఝల్లుకనఁగ నో • కింత కలఁచి
నిబ్బరంబున మంత్రి • నివహంబుతో ననుఁ, సచివులారా! నీతి • శాస్త్రవేదు
లార! మీ రెల్లరు • నాలంబు లేకుండ, రండు వేవే మంత్ర • ముండు కాల
గీ. మిపుడు ప్రాప్తించె నని వార • లెల్లవారు, రాఁగ మంతన ముండి యా • రావణుండు
వారిఁ బని వినుఁడని చెప్పి • చేరి స్వాల, యంబుఁ దిలకించి యట మహా • బలాఢ్యు.

అర్థములు. అపసర్పులు = వేగులు, అక్షోభ్య బలముతో = కలఁత పెట్ట సాధ్యపడని సేనతో, విడియుట వినిచిన విని వింశతి భుజుండు = ఇందు వ్యత్యయ ప్రాసము, ఆలంబు = ఆలస్యంబు, వేవే=త్వరత్వరగా, మంతనముండి = ఆలోచించి, పని వినుఁడని=పొండని, ఈ పదము గొప్పవారు కొలఁదివారికిఁ బొండని చెప్పునప్పుడు మాత్రమే ప్రయోగింపవలయును. స్వ+ఆలయంబు=తన గృహము.

తాత్పర్యము

వేగులవారు మీఁదఁ జెప్పిన ప్రకారము క్షోభ కలిగింప సాధ్యపడని సేనతో రామచంద్రమూర్తి సువేలపర్వతమునిమీఁద దండు దిగియున్నాఁడని విని రావణుఁడు గుండె ఝల్లుకనఁగా కొంచెము భయపడి మరల ధైర్యము తెచ్చుకొని మంత్రి సమూహమును జూచి మంత్రులారా! నీతిశాస్త్ర మెఱిఁగినవారలారా! మంత్రాలోచనము చేయవలసియున్నది. మీరందఱు నాలస్యము సేయక వేగుల వేగముగ రండని చెప్పి వారందఱు రాఁగా వారితో నాలోచించి వారిని బొండని చెప్పి తన యింటికిఁ బోయి మహా బలాఢ్యుని,

సీ. మాయావిదుని మహా • మాయు విద్యుజ్జిహ్వుఁ, గనియిటులనియెను • గ్రమ్మతినా జ
మోసగింపఁగ వలె • నీపమంతయు భేద; మేమి లేకుండ శ్రీ • రాము శిరము
సశరమౌ నాతని • చాపంబు మాయచేఁ, గల్పించి నే నండు • కడకు రమ్ము
టన్న నాతఁడు నల్లె • యనఁ గొన్ని సొమ్ములు, పసదనంబుగ నిచ్చి • పంచియతనిఁ
గీ. దాను విశ్వంభరాసుతా • దర్శనాభి, లాషియై యశోకవనీత • లంబుఁ జొచ్చి
దీనురాలి నధోముఖిఁ • దీవ్రశోక, బాధ్యమాన రఘునాథ్యాత్మఁ • బరమశీల. ౨౧౦

అర్థములు. మాయావిదుఁడు=మాయలు నేర్చినవాఁడు, మహామాయు= గొప్ప మాయావి, పసదనంబుగన్ = బహుమతిగ, ప్రసాదన శబ్దభవము.

విశ్వంభరాసుతా=భూపుత్రియగు సీతయొక్క, దర్శనాభిలాషి యై=దర్శనమందుఁ గోరిక గలవాఁడై, అధోముఖిన్=తలవంచుకొని యుండుదానిని, తీవ్రశోకబాధ్యమానన్=తీక్ష్ణమైన శోకముచే బాధింపఁబడుచున్నదానిని, అదైన్యార్హ=వ్యసనమునకు నర్హురాలుగానిదానిని, పరమశీల=ఉత్తమ పతివ్రతను.

తాత్పర్యము

మాయలు చేయనేర్చిన రావణుఁడు తనకంటె నెక్కువ మాయలు నేర్చిన విద్యుజ్జిహ్వుఁడనువానిని జూచి నేను సీతాదేవిని మోసగింపవలెను. కొంచెమైనను భేదము లేకుండునట్లు శ్రీరాముని శిరస్సును, బాణముతోడి యతని వింటిని నీకు కి చేఁ గల్పించి నేనుండు చోటికిఁ దీసికొనిరమ్మని చెప్పఁగా వాఁ డట్లు లేచేసెద నని చెప్ప నతనికిఁ గొన్ని సొమ్ములు బహుమానముగ నిచ్చి పంపి తాను సీతాదేవినిజూడఁగోరి యశోకవనముఁ బ్రవేశించి దుఃఖయోగ్య కాకున్నను దుఃఖించుదానిని, బరమ పతివ్రతను, తల వంచుకొని విచారపడుదానిని, తీవ్రశోకముచేఁ బీడింపఁబడుదానిని.

చ. ధరణితలోపవిష్ట యయి • దారుణవిగ్రహరాక్షసాంగనా
పరివృతయైనదానిఁ, దన • ప్రాణవిభున్ స్మరియించుదాని, సుం
దరిఁ గని డాయఁబోయి యమి • తప్రమదాకరవార్త యేదియో
సరసిజనేత్రకుం బలుకు • చందమునన్ వచియించు ధీరుఁడై. ౬౫౧

అర్థములు. ధరణితలోపవిష్ట = భూమిమీఁదఁ గూర్చుండినది, దారుణ విగ్రహ = భయంకరాకారముగల, రాక్షసాంగనా = రాక్షసస్త్రీలచే, పరివృతయైనదానిన్ = చుట్టఁబడినదానిని, అమితప్రమదాకరవార్త = మిగుల సంతోషము గలిగించు వృత్తాంతము, ధీరుఁడై=దిటము గలవాఁడై.

తాత్పర్యము

నేలమీఁదఁ గూర్చుండి భయంకరమైన యాకారములుగల రాక్షసస్త్రీలు చుట్టుకొని యుండఁగాఁ దన భర్తను స్మరించుచున్నదానిని సుందరిని జేరఁబోయి యామె కేదియో గొప్ప సంతోషవార్త చెప్పువానివలె, తనమోసము తెలియరాని విధముగ దిటము గలవాఁడై యిట్లనెను.

—• రావణుఁడు సీతకు శ్రీరామాదులు హతులైరని చెప్పుట •—

శా. ఎంతో నిన్ బతిమాలుకొంటిఁ గదె తన్వీ నన్నుఁ జేపట్టఁగాఁ
జింతాకంతయు నా నుడిన్ వినక ఛీఛీ యంటి వెవ్వానిపై
స్వాంతం బంతయు నుంచి యట్టి భవదీయప్రాణనాథుండు నీ
కాంతుం డా ఖరహంత రాముఁడు సతీ కయ్యానఁ జంపంబడెన్. ౬౫౨

తాత్పర్యము

ఓసీ సీతా! నన్ను గ్రహింపుమని నిన్ను నే నెంతమారమో ప్రార్థించితిని గదా! నామాట నీవు చింతాకంతయు లక్ష్యముచేయక ఛీఛీ పొమ్మంటివి. నీ వెవ్వ

నిపై మనస్సంతయు నుంచి నన్ను ధిక్కరించితివో యట్టి నీ మగఁడు నీ ప్రియుఁడు ఖరుని జంపినవాఁడు యుద్ధమందుఁ జంపఁ బడెను.

ఉ. మోడిగ నీదునేసుపె స•మూలము నాశముఁ జేసె నీ పతిన్,
 పీడఁగఁగొట్టినాఁడఁ గద • నీ తలఁగ్రొవ్వును మూలముట్టుగా,
 నేడువు మెంత యేడ్చెదవొ • యిష్టము దీరఁగ, దిక్కులేక నీ
 వేడుచునైన నాదు హృద•యేశ్వరి వయ్యెదు నీవ చూడుమీ. ౬౫౩

అర్థములు. మోడిగ = బింకముగ, ఒక న్యాయమున నిది నబిందుకముగ నుండవలయును. అయినను బూర్వులు దీని విర్బిందుకముగ గ్రహించినారు. కావున నిచ్చట నట్లే గ్రహింపఁబడెను. మోఁడి=మొండి.

తాత్పర్యము

బింకము విడువలేక నీ వేడ్చిన యేడుపే నీ మగని నిర్మూలముగ నాశము చేసెను. నీ తలలో నుండు క్రొవ్వును నిశ్శేషముగ వదలించితినిగదా! ఇంక నెంత యేడువ వలయు నని నీకు కోరికయో యంతయు నేడువుము. వేఱు దిక్కులేక యేడ్చుచునైన నా భార్యవు నీవే యయ్యెదవు. నీవే చూచుచుండుము.

ఉ. చచ్చినవానిఁ గట్టుకొని • చారువిలోచన యేల యేడ్చె, దీ
 పిచ్చితనంబు మాను మిఁక • చేరిమిమిూఱఁగ మత్సతీతతిన్
 బచ్చఁగ రాణివై మనుము • పండితమానిని యల్పపుణ్య మో
 మచ్చరికత్తె స్వార్థహిత • మారిణి బాలిశురాల దుర్మతీ! ౬౫౪

అర్థములు. పండితమానిని = జ్ఞానము లేకున్నను గలదాన నని తలఁచుదానా! అల్పపుణ్య=కొంచెము పుణ్యము గలదానా! కొంచెము పుణ్య ముండుట చేతనే రాముఁడు పోయినను నేనైన నీకు దిక్కయితిని, మచ్చరికత్తె=మాత్సర్యము కలదానా! స్వార్థహితమారిణి = నీ మేలును నీవే నాశము చేసికొనుదానా! బాలిశురాల=మూఢురాల. దుర్మతీ=చెడుబుద్ధి గలదానా!

తాత్పర్యము

మనోహరములైన కన్నులుగలదానా! వటికే కన్నులు వాచునట్లు చచ్చిన వానికై యేడ్చెదవు? చచ్చినవాఁడు నీ వేడువగానే వచ్చునా యేమి? ఇక నీ పిచ్చి చేష్టలు వదలిపెట్టుము. గొప్పతనము వహించి నా భార్యలలో నీ వొకతెవై పచ్చఁగ రాణివై బ్రదుకుము. నీకు జ్ఞానము లేదు. కలదాన నని దురభిమానము మాత్రము గలదు. కావుననే మంచిమార్గము చెప్పినను తెలిసికొన లేకున్న దానవు. నీవు పాపము విశేషముగఁ జేసినను కొంచెము పుణ్యము చేసిన దాన వగుటచే రాముఁడు చచ్చినను నేను నీకు దిక్కయితిని. కావున నింతవఱకున్న మాత్సర్యము, పట్టుదల వదలిపెట్టుము. ఏల నీ మేలు నీవే నాశము చేసికొనెదవు? ఇట్లు చేయుటకు

నీ వెంత బుద్ధిలేనిదానవో కదా! బుద్ధిలేకపోయిన మేలే బుద్ధిలేనివారొకరు చెప్పిన నైన వినరు. నీవు దుష్టబుద్ధిగలదానవు.

క. విను వృత్రాసురవధవలె, విన ఘోరంబైన నీదు ♦ విభువధ మెలన్
వననిధిదరికిని నీ పతి, చనుదెంచెను నన్నుఁ జంప ♦ నకపిబలుండై. ౬౫౧

తాత్పర్యము

వృత్రాసురవధ యెంత ఘోరమైనదో నీ మగనివధవిధ మంత ఘోరమైనదే. దానిని వివరించి చెప్పెద వినుము. నీ మగఁడు వానరసేనతోడ నన్నుఁజంప సముద్రతీరమునకు వచ్చెను.

చ. దినకరుఁ డస్తమించు నెడఁ ♦ దీవ్రకరాత్మజు తెచ్చి యున్న య
వ్వనచరసేనతో లవణ ♦ వారిధి యుత్తర తీరమందుఁ జే
రెను, బయనపుగాసి నిదు ♦ రించెను రాముఁడు, రాత్రివేళ నా
పనిచిన వేగు లవ్విధము ♦ బాగుగ శోధన చేసి క్రమ్మఱన్. ౬౫౨

తాత్పర్యము

సూర్యాస్తమాన మగు కాలమున సుగ్రీవుఁడు తెచ్చిన వానర సేనతో లవణ సముద్రము నుత్తర తీరమును నీ మగఁడుచేరి దారి నడచిన బడలికచే నిదురించెను. ఆ రాత్రివేళ నేనుబంపిన వేగు లావిధమును శోధనచేసివచ్చి నాకుఁజెప్పిరి.

ఉ. ఆవల సేనతోఁ జని ప్ర♦హస్తుడు వైరులు డిగ్గియున్న యా
తావును మెల్లఁ జేరి శర♦దండ మహాయసఖడ్గయష్టి శూ
లావళి శక్తి చక్రపరి♦ఘాయుధముద్గర తోమరాళిలన్
వే విదళించి రెల్ల కపి♦వీరుల భీతులఁ దూఁగుఁబోతులన్. ౬౫౩

అర్థములు. శర = బాణములచేతను, దండ=కట్టెల చేతను, మహాయస ఖడ్గ = ఉక్కు-కత్తుల చేతను, యష్టి = ఉక్కు-కఱ్ఱల చేతను, శూలావళి = శూలముల సమూహముచేతను - చక్రముల చేతను, పరిఘాయుధ=ఇనుపకట్ల గుదియల చేతను - ముద్గరములచేతను, తోమరములచేతను=చిల్లకోలలచేతను, వే = శీఘ్రముగ = త్వరగ.

తాత్పర్యము

ఈవార్త రాఁగానే ప్రహస్తుఁడు సేనతో విరోధులు దిగియున్న స్థలమునకుఁ జప్పుడు చేయక మెల్లగఁ బోయి తటాలునఁ బైపడి బాణాది సాధనములచే బాధయుపడిన వారిని, తూఁగుచున్న వారిని విదళించెను.

క. గుఱక యిడుచు నిద్రింపఁగ, మెఱుఁగు మెఱచినట్లు లఱిమి♦ మెలఁతుక రామున్
నఱకెన్ శిరముఁ బ్రహస్తుఁడు, కఱకఱ మనియుఱక పెద్ద♦కరవాలమునన్.

తాత్పర్యము

ప్రహస్తుఁడు పోవు సమయమునకు రాముఁడు గుఱకపెట్టి నిద్రించు చుండఁగాఁ జూచి పైబడి పెద్ద కత్తితో నతని గొంతు కఱకఱ మని నఱకెను.

సీ. మింటికై యెగురు వి ♦ భీషణు మావారు, పట్టి కట్టిరి చక్క ♦ బాతళించి
క్రోఁతులలో నొక్క ♦ క్రోఁతియై సౌమిత్రి, యూడని బాడె ది ♦ గ్వ్యూహములకుఁ
గీశాధినేత సు ♦ గ్రీవుండు కృత్తసు, గ్రీవుఁడై పన్నుండె ♦ క్షితితలమున
హనుమంతుఁడు నిర ♦ స్తహనుకుఁడై తండ్రికిఁ, బ్రాణంబు లర్పించె ♦ బట్టువదలి
తే. జాంబవంతుఁడు రాక్షసుల్ ♦ చటుల పట్టి
సాదులను మోదఁ మోఁకాళు ♦ లవనిఁ గూల
నంగలార్చుచు జానకీ! ♦ యంతరించె
నెలుఁగు గావున ఓలుచు ♦ నెలుఁగు లిడుచు. ౨౯

అర్థములు. మింటికై = ఆకాశమునకు, బాతళించి=తత్తఱపడి, ఊడని, బాడెన్ = పరువెత్తెను, దిగ్వ్యూహములకు = నానాదిక్కులకు, కృత్త=నఱకఁబడిన, సుగ్రీవుఁడై=మంచి మెడగలవాఁడై, పన్నుండెన్=పండుకొనెను, నిరస్తహనుకుఁడై=బుగ్గలు చీలిన వాఁడై, ఓలుచున్ = ఏడ్చుచు, ఎలుఁగు లిడుచు= ధ్వనిచేయుచు.

తాత్పర్యము

తక్కిన వారిగతి యేమైనది చెప్పెద వినుము. విభీషణుఁడు ఆకాశమునకై యెగిరిపోవఁ జూచెఁగాని మా వారు తత్తఱపడి వానిని బట్టి కట్టిరి. లక్ష్మణుఁడు క్రోఁతులలోఁ దా నొక్క క్రోఁతియై దిక్కుల వెంటఁ బరువెత్తెను. వానరనాయకుఁడు సుగ్రీవుఁడు నఱకఁబడిన మెడ గలవాఁడై నేలమీఁదనే పండుకొనెను. హనుమంతుఁడు చెంపలు చీలి తన ప్రాణవాయువులను దండ్రియగు వాయుదేవున కప్పగించెను. రాక్షసులు పట్టిసము లోనగు నాయుధములచేత కొట్టఁగా నేల మోఁకాళ్ళూఁది పడి యేడ్చుచు నఱచుచు జాంబవంతుఁడు చచ్చెను.

క. మైందద్వివిదులు రక్షో ♦ బృందము దమ్మంగవింప ♦ బీరువడి వెసన్
మ్రందిరి రోఁజుచు నేడ్చుచుఁ, గుందుచు డిందుచును మిగులఁ ♦ గొందలపడుచున్.

అర్థములు. అంగవింపన్ = అతిక్రమింపఁగా, బీరువడి=వ్యర్థులై, భయపడి, మ్రందిరి=చచ్చిరి, కొందలపడుచున్=కలఁతపడుచు.

తాత్పర్యము

మైందుఁడు ద్వివిదుఁడను వారలు రాక్షససమూహము తమ్మతిక్రమింపఁగా భయపడి వ్యర్థులై వెంటనే రోఁజుచు కలఁతపడి చచ్చిరి.

తే. పనసకాయను గుందిన ♦ పగిది గాఁగ, భిన్నమును భిన్నమును జేయఁ ♦ జేవ దఱిగి
పార్థు చున్నాఁడు నెత్తుటఁ ♦ బువ్వఁబోణి, పనసుఁ డింకేల పసగొట్ట ♦ భర్తకొఱకు.

అర్థములు, చేవ=బలము, తఱిగి=క్షయించి, పసగొట్టన్=ఉపద్రవపడ, మూలుగఁగా.

తాత్పర్యము

పనసుఁడను వానరుని మారాక్షసులు తునుకలు తునుకలుగాఁ బనసకాయను గుందినట్లు గుందఁగా బలముచెడి తన నెత్తుటిలోఁ దానే పొర్లుచున్నాఁడు. ఇంకను మగఁడో మగఁడో యని యేల మూలిగెదవు? పనసశబ్దము కుశాదులలోఁ జేరుటచే ముపర్ణకము రాదు.

సీ. నారసంబుల మేను ♦ నీరసంబుగ దరీ, ముఖుఁడు దరీముఖ ♦ మునను జచ్చెఁ
గూఁతయొక్కటి లేక ♦ కుముదుండు కుముదుఁడై, యంబకములకు మే ♦ నప్పగించెఁ
దుండు తుండుగ నొడల్ ♦ తుండింపఁగా నంగ, దుండు నిపతితాంగ ♦ దుండునయ్యె
నుక్కులు రక్కసు ♦ లొక్క పెట్టునఁ గుమ్మ, రథము లేనికలు తు ♦ రంగమములు
ఆ. పటప నిచ్చకోలఁ ది ♦ ప్లవగులు కొందఱు, నాగవితతి ద్రొక్క ♦ నలఁగి చచ్చి
రతివ! కొన్ని క్రోఁతు ♦ లరదముల్ పైఁ బాఱ, నజ్జుగుజ్జ నెత్తు ♦ బజ్జలయ్యె. ౬౬౨

అర్థములు. నారసంబులన్ = బాణములచే, నారాచ శబ్దభవము. నీరసంబుగన్ = రసహీన మగునట్లు, దుర్బలమగునట్లు, దరీముఖమునన్ = గుహాముందట, కుముదుఁడై = సంతోషహీనుఁడై, అంబకములకు = బాణములకు, నిపతిత + అంగదుండు = పడిపోయిన భుజకీర్తులు గలవాఁడు, ఉక్కులు = బలవంతులు, నాగవితతి = ఏనుఁగుల సమూహము, నజ్జుగుజ్జు నెత్తుబజ్జలు = నుక్కులి నలిగి నెత్తురు కలసి బజ్జలవలె నైరి.

తాత్పర్యము

బాణముల దెబ్బలచేఁ దన దేహము బలహీనముకాఁగా దరీముఖుఁడు గుహాముఖంబునఁ జచ్చెను. కుముదుఁడు సంతోషహీనుఁడై గట్టిగా నఱచుటకు సాధ్యపడక బాణములకుఁ దన దేహము ధారవోసెను. రాక్షసులు తన దేహమును తుండు తుండుగా నఱకఁగా నంగదుఁడు తన భుజకీర్తులను నేల పడవేసికొనిన వాఁడయ్యెను. బలవంతులగు రాక్షసు లొకసారిగ బాణములచేఁ గుమ్మ, తేరులు, ఏనుఁగులు, గుఱ్ఱములు మీఁదఁ దోలఁగా వానరులు కొందఱు ఏనుఁగులు ద్రొక్కఁగా నలఁగి చచ్చిరి. కొన్ని క్రోఁతులు తేరులు తమపైఁ బోవుటచే నలిగి నెత్తుటిలోఁ గలసి బజ్జలవలె నైరి.

క. నిలిగిరి నలఁగిరి, తొలగిరి మలిగిరి దెరలిరి భయాన ♦ మడిసిరి క్రోఁతుల్
దలరిరి గెడసిరి మునిసిరి, యిలిగిరి మఱి డింక వేసి ♦ రిం కేమందున్. ౬౬౩

అర్థములు. నిలిగిరి = నీల్గిరి = ఒళ్ళు విఱుచుకొనిరి, మలిగిరి = నశించిరి, తెరలిరి = కలఁతపడిరి, తలరిరి = కదలిపోయిరి, కెడసిరి = పడిరి, ఇలిగిరి = చచ్చిరి. డింకవేసిరి = చచ్చిరి, ఇందుఁ గొన్ని పర్యాయపదములుగాఁ దోఁచినను వానిలోఁ గొంచెము భేదముండుటచేతను సేనయందుఁ గొందఱకుఁ గొన్ని, కొందఱకుఁ గొన్ని యన్వయించుటచేతను బునరుక్తి దోషము లేదు.

—అలంకారము - సముచ్చయము - ఏకకాలమందు కొన్ని కార్యములు జరిగినట్లు చెప్పిన సముచ్చయాలంకార మగును.

తా త్ప ర్య ము స్పష్టము.

క. పారీంద్రంబులచేతను, వారణవారములువోలె ♦ బ్రాలిరి నగసం
చారులు కొండలు దూటిరి, వారాన్నిధి నుప్పరంబుఁ ♦ బ్రాఁకిరి వెఱచేన్.

అర్థములు. పారీంద్రము = సింహము, "సింహః కంఠీరవో భీమవిక్రాంతః కరిమాచలః పంచశిఖశ్చ శైలాదిః పారీంద్రః శ్వేతపింగళః" త్రికాండ శేషము. రూ— పారీంద్రము— వారణ వారములు=ఏనుఁగుల గుంపులు, నగసంచారులు= వానరులు, వారాన్నిధిన్=సముద్రమును, ఉప్పరంబున్=ఆకాశమును, వెఱచేన్= భయముచే.

తా త్ప ర్య ము

సింహములచేత నేనుఁగులవలె వానరులు నేలఁబడిరి. కొండలు సముద్రములోఁ దూఁకిరి. కొండలు భయముచే నాకాశమున కెగిరిపోయిరి.

క. వానరులవృత్తి తమకు న, నూనంబుగ సాయపడఁగ ♦ నుర్వీరుహసం
తానంబు నెక్కెనెలుఁగులు, కానలఁ గోనలను నిండెఁ ♦ గపులశవంబుల్.

అర్థములు. అనూనంబుగన్=కొఱంతలేక - పూర్ణముగ, సాయపడఁగన్= తోడుపడఁగా, ఉర్వీరుహసంతానంబున్=చెట్లగుంపులను, శవములు=పీనుఁగులు.

తా త్ప ర్య ము

వానరుల నడవడి తమకుఁ బూర్ణముగఁ దోడుపడఁగా ఎలుఁగులు చెట్లనెక్కెను. అడవులందుఁ గోనలందుఁ గ్రోఁతుల పీనుఁగులు నిండినవి.

క. నా దళము లిట్లు పొడువఁగ, నీ దయితుఁడు దత్తబడలు ♦ నీల్గిరి యిఁకిం
కేది గతి నీ కటంచును, నా దశముఖుఁ డామె వినఁగ ♦ నను రక్కసికిన్. ౬౬

అర్థములు. దళములు=సేనలు, పొడువఁగన్=చంపఁగా, నీదయితుఁడు= నీప్రియుఁడు, దత్తబడలు=పరివారము, నీల్గిరి=చచ్చిరి, రక్కసికిన్=రాక్షసస్త్రీకి.

తా త్ప ర్య ము

నా సేన లీప్రకారము చంపఁగా నీ మగఁడు పరివారముతోఁ జచ్చెను. నీ కిఁకేదిగతి? అని చెప్పి యా రావణుఁ డామె వినునట్లు రాకాసి కిట్లనెను.

ఇప్పు డీ యుపాయము చెప్పిన వాఁడిట్లల చేసి యుండరాదు. వానరసేన యుత్తరతీరమున విడియఁగానే వేగులవాఁడు చెప్పెను. ఆరాత్రి వారిపైపడ నాలోచించెను. కాని వానరు లందఱు హెచ్చరికతో మేలుకని యుండుటచే వాఁ డేమి చేయుటకు లేకపోయినది. దాని నిప్పు డిట్లు త్రిప్పి చెప్పుచున్నాఁడు.

—• రావణుఁడు సీతాదేవికి రాముని కల్పితశిరశ్చాపంబులఁ జూపుట •—

క. రామునిశిరంబు సంగర, భూమీస్థలినుండి తెచ్చు • భూరిక్రౌర్యో
ద్దాముఁడు విద్యుజ్జిహ్వుం, డా మానవభోజిఁ బిలువు•మా యిచ్చటికిన్. ౭౭౮

తాత్పర్యము

యుద్ధభూమినుండి రాముని శిరస్సును మిగులఁ గ్రూరుడగు విద్యుజ్జిహ్వుఁడు తెచ్చును. ఆ రాక్షసుని యిచటికిఁ బిలుచుకొనిరమ్ము.

క. అనునంతలోన మూర్ధం, బును ధనువు గ్రహించి వచ్చి • మ్రొక్కి-డి దశకం
ధరునియెదుట నిలువ నాతం, డను విద్యుజ్జిహ్వునకు మ•హాజిహ్వునకున్. ౭౭౯

అర్థములు. మూర్ధంబును = శిరమును, ధనువు=విల్లు.

తాత్పర్యము

అని చెప్పిన యంతలోనే తల విల్లు దీసికొనివచ్చి నమస్కరించి రావణుని యెదుట నిలఁబడఁగా నతఁడు పెద్ద నాలుకగల విద్యుజ్జిహ్వునకు నిట్లనియె.

క. ఓరీ! రామునిశీర్షం, బా రమణికి నెదుట నుంపు•మా చయ్యనఁ గ
న్నారఁగ నీ నిర్భాగ్య మ,నోరమణునిచరమదశఁ గ•నున్ లెస్స యనన్.

అర్థములు. నిర్భాగ్య=భాగ్యము పోయినది, దరిద్రురాలు,చరమదశను= కడపటి స్థితిని.

తాత్పర్యము

ఓరీ! రాముని తల దీనికి యెదుట వేగముగ నుంపుము. ఈ దరిద్రురాలు కన్నులు కఱవుదీఱ తన మగని కడపటి దశను జూచునుగాక!

క. మనుజాశనుండు ప్రియదర్శన మగు తచ్ఛిరము నుంచి • జానకి కెదుటన్,
జనియెను దిరోహితుండై, దనుజేంద్రుఁడు రామశిరముఁ•దత్కార్ముకమున్.

అర్థములు. మనుజాశనుండు = రాక్షసుఁడు, ప్రియదర్శనము = చూచుటకుఁ బ్రియమైనది, తిరోహితుండై =మఱుఁగుపడి, తత్ కార్ముకమున్=రాముని యా వింటిని.

తాత్పర్యము

ఆ రాక్షసుఁడు చూచుటకుఁ బ్రియమై ప్రియమైన చూపులు గల యా తలను జానకి కెదుట నుంచి తొలఁగిపోయెను. రావణుఁడు రాముని శిరస్సు విల్లు

చ. ధరణిజ ముందఁ ద్రోచి యిదె • తామరసాక్షి రో లెస్స చూడు సం
గరమున మా ప్రహస్తుఁడు ప్ర•కాశముగా నిశ రాము నీ మనో
హరు వధియించి తెచ్చెఁ జుమ • యాతని సజ్యశరాసనంబు, నో
సరసిజనేత్ర! యేమిటికి • జాగు? వశంపడు మింక నా కనన్. ౭౮౧

అర్థములు. సజ్యశరాసనంబు=అల్లెత్రాటితోఁ గూడిన విల్లు, ఎక్కు-పెట్టఁ బడిన విల్లు.

తాత్పర్యము

సీతాదేవి కెదుటనైచి యో కమలాక్షీ! ఇదిగో మా ప్రహస్తుఁడు బహిరంగముగ నందఱు చూచుచుండఁగా యుద్ధభూమినుండి తెచ్చిన రాముని యెక్కుపెట్టిన విల్లు. ఇఁక నేల జాగు సేసెదవు? నాకు స్వాధీనపడుము! అని చెప్పఁగా,

**• ౩౨-వ సర్గము. శ్రీరాముని మాయాశిరశ్చాపంబులఁజూచి సీత దుఃఖించుట •**

ఉ. అచ్చెలి యా శిరంబును శ • రాసనముం గని వాయుపుత్రు వా
  క్రుచ్చిన భాస్కరాత్మభవు • కూటమియుం దలపోసి యేమియుం
  బొచ్చెము లేని మోముసరి • మోమును గన్నులవంటి కన్నులున్
  దచ్చికురాళికుంతల వి • తానము తద్వదనాబ్జ వర్ణమున్. ౬౭౨

అర్థములు. భాస్కరాత్మభవు కూటమి = సుగ్రీవునితోడి స్నేహము, తలపోసి = ఆలోచించి, పొచ్చెము = కొఱఁత, చికురాళి = వెండ్రుకలవంటి, కుంతల వితానము = వెండ్రుకల సమూహము, వదనాబ్జవర్ణము = ముఖకమలము వన్నె.

తాత్పర్యము

ఆ సీత యా శిరస్సును, వింటినిజూచి హనుమంతుఁడు చెప్పియుండిన సుగ్రీవు స్నేహము నాలోచించి కొంచెమైనను భేదములేక రాముని ముఖముతో సమానముగా నున్న మొగము, కన్నులవంటి కన్నులు, తల వెండ్రుకలవంటి వెండ్రుకలు ఆ ముఖమువన్నె. హనుమంతుఁడు చెప్పిన సుగ్రీవు స్నేహమనుటచే దాని కావలి వార్త యేదియు సీతాదేవికిఁ దెలియదనియే యేర్పడుచున్నది. రావణుఁ డెవ్వరిని జెప్పనిచ్చినవాఁడు కాఁడు. లోపలికిఁ బోనిచ్చినవాఁడు కాఁడు.

క. శుభకర చూడారత్నము, విభ రాజసమానయాన • యీక్షించి తమిన్
  విభుశిరమని నమ్మి మహో, ద్రిభరంబున నేడ్చెఁ గురరి • తెఱఁగున మిగులన్.

అర్థములు. శుభకర = మేలుకలిగించు, చూడారత్నము = జడబిళ్ళ, ఇది సీతాదేవి హనుమంతునిచేఁ బంపినది-ఇది రామచంద్రమూర్తి శిరస్సునందుఁ గాన వచ్చిన దనుటచే దాని నాయన తన తలవెండ్రుకలందుఁ గూర్చి కట్టుకొని రక్షించె నని తెలియవచ్చెడిని. రెండవ కారణము, అది పోఁగొట్టవలసిన పదార్థముగాదు గదా! ఒకటి - మిగుల వెలగల యపూర్వవస్తువు. రెండవది ప్రియురాలుపంపినది. రెంటిలో నిది బలిష్ఠకారణము.

ఇభ రాజసమాన యాన = గొప్ప యేనుఁగు నడకవంటి నడక గలది, తమిన్ = కోరికతో, మహోద్రిభరంబునన్ = దుఃఖాతిశయముచే, కురరి = ఆఁడు లకుముకి.

తాత్పర్యము

తాను పంపిన జడబిళ్ళను సీతాదేవి మిగులఁ గాంక్షతోఁ జూచి యది మగని

తల యని నమ్మి శోకాతిశయమున నాదు లకుముకిపక్షివలె నేడ్చెను.

ఉ. హా జగడాలమారి కయికా! నెఱవేఱెనుగా త్వదీప్సితం
బో జగజంత ! వంశకలశోదధిచంద్రుఁడు గ్రుంకె, వంశస
ద్బీజముఁ బాడుచేసితివి తెంపరివై, యిఁకమీఁదఁ హాయిగా
నే జడ చింత లేక సుఖయింపుము గుండియనిబ్బరంబుతోన్. ౬౭౮

అర్థములు. జగడాలమారి = కలహించు స్వభావము గలదానా! త్వదీప్సితంబు = రాముఁడు చావవలయునన్న నీ కోరిక, జగజంత = జగము తద్భవము జగము, జగమంత జంత జగజంత=విశేష ధూర్తస్త్రీయని యర్థము. వంశ=సూర్య వంశమనెడి, కలశోదధి = పాలసముద్రమునకు, చంద్రునివంటివాఁడు, గ్రుంకెన్= అస్తమించెను, వంశ సద్బీజము=వంశముయొక్క మంచి విత్తనము, తెంపరివై= సాహసము గలదానవై, భరతాదులు లేరా, వారివలన వంశాభివృద్ధిగాదా యందు వేని, కాదు. నీవు అరణ్యమందు రాముఁడు చచ్చును, భరతుఁడు సుఖపడును అని చేసిన యాలోచనలు చెడినవి, రామచంద్రమూర్తి మరణించిన వార్త వినఁగానే లక్ష్మణ భరత శత్రుఘ్నులు బ్రదుకరు. అంతతో వంశము నిలిచిపోవును. హాయిగా=సుఖముగా, జడను=ఆలస్యము, గుండియ నిబ్బరంబుతోన్=రాముఁడు మరల వచ్చునో యేమో యను భయములేక- రెండవపాదంబునఁ బ్లుతయతి-శ్లేషము.

తాత్పర్యము

అయ్యో! కలహశీలవైన కైకా! రాముఁడు చావవలయు నను నీ కోరిక నెఱవేఱెనుగదా! ఓసీ మహాధూర్తురాలా! సూర్యవంశమను పాలసముద్రమునకు చంద్రుఁడే డస్తమించెను. మంచి వంశము సాహసురాలవై విత్తు పాడుచేసితివి, సూర్యవంశమే నిలిచిపోయెను. ఇఁక నే యాలస్యము నభ్యంతరము లేక హాయిగా దిగులు లేక సుఖింపుము.

క. ఏ విప్రియంబు నీకుం, గావించె మహాత్ముఁడైన కాకుత్స్థుఁడు నీ
కా విధి యడవులఁ ద్రోయఁగ, గా వల్కముఁ గట్టఁజేసి కసి నాతోడన్. ౬౭౯

అర్థములు. విప్రియము=నీకుఁ బ్రియమైనదానికి విరోధమైనది, కసిన్ = పగచేత.

తాత్పర్యము

గొప్ప మనస్సుగల రామచంద్రమూర్తి నీ కనిష్టమైనదానిని దేనిని చేసెనని నీ వావిధముగ నారలుగట్టి నాతోడ నడవుల ద్రోచి పగ సాధించితివి.

చ. అనుచు విదేహరాజసుత యుంచితభూరితపోవ్రతాఢ్య హా
యని విలపించి బాలిక వ్యథాతిశయంబున వేపమాన యై

వనరుచు ఛిన్నమై ధరణి • వ్రాలు వనంటిని బోలి త్రెళ్ళి చే
తన చెడి వెండియుం దెలిసి • తచ్ఛిరముం గొని మూరుకొంచునున్. ౧౬

అర్థములు. వేపమానయై=వణఁకుచున్నదై, వనరుచున్ = శోకించుచు, ఛిన్నమై=నఱకఁబడినదై, చేతనచెడి=మూర్ఛపోయి, మూరుకొంచును = వాసన చూచుచు, బాలిక=సత్యాసత్యములు పరిశీలించి తెలిసికొనునంతటి లోకజ్ఞానము లేనిది, కట్టుకొన్నభార్య - చేతికిఁదీసికొని చూచి పరిశీలించి భేదము కనుఁగొన లేకుండునంత పోలిక కలదిగా శిరస్సుచేయుటయందుఁజూపిన యద్భుతము ఆశ్చర్య కరమునైన శక్తికి మాయ యనిపేరు. ఇట్టి దానిఫలము శాశ్వతమైనచో దానిని సత్యమందుము. కాని దానిని మాయయందుము. ఆ భేదమునుబట్టి శక్తి, శక్తివలన నైన పదార్థము మాయయనియే చెప్పఁబడును.

తాత్పర్యము

అని చెప్పి గొప్ప తపస్సు, పాతివ్రత్యము అను సంపదగలది యగు సీతాదేవి హాయని యేడిచి శోకాతిశయముచే వణకుచు నేమ్చుచు నఱకఁబడి నేలఁబడిన యరటి చెట్టువలెఁ దెలివి తప్పిపడి మరలఁ దెలివిరాఁగా నా తలను వాసన చూచుచు.

తే. హా! మహాబాహ! రణధీర! హాసువీర!, యయ్యయో! నాకమైతినో • ప్రాణనాథ!
యిట్టి నీచరమావస్థ • నేను గాంచి, విక్రమైకధనాఢ్య హా • విధవనైతి. ౧౭

అర్థములు. చరమావస్థ=చావు, సంస్కృతమున బాహాశబ్దమాకారాంతము.

తాత్పర్యము స్పష్టము.

క. సతి గుణహీనత చేతం, బతి తొలుతం జచ్చునంచుఁ • బల్కుదురు బుధుల్
సుతశీల! నీవు నా దుష్కృతిఁ దెగితివి నేను లెస్స • జీవింపఁగన్. ౧౮

అర్థములు. సతి=భార్యయొక్క, సిద్ధసమాసము కాదు, గుణహీనత చేతన్= దుర్గుణముచే, భర్తయొక్క యాయుస్సు, అభ్యుదయము వాని భార్య సుగుణ దుర్గుణములకొలఁది నుండును. భార్య పోయిన జన్మమునందుఁ బాపకార్యములు చేసియుండెనేని యా పాపఫలము ననుభవింపవలసి యున్నది. కావున వైధవ్యము కలుగును. ఆమె పుణ్యాత్మురాలై యుండినయెడల నాయువయు దీర్ఘాయురారోగ్య ధనధాన్య సంపత్తిగలవాఁ డగును. తినెడివారి యదృష్టముకొలఁది పెట్టెడివారి సంపద. నాకీ వైధవ్యము వచ్చుటకు నా పాపములే కారణము. నీవు సుతశీలుఁ డవు=పొగడఁబడిన సదాచారసంపత్తి గలవాఁడవు. కావున దోషము నీయందు లేదు. దుష్కృతిన్=పాపముచే, 'వ్యభిచార రతా నారీ బాలరండా తు జాయతే' యని పోయిన జన్మమున జారిణియగు స్త్రీ యీ జన్మమున బాల్యమునందే విధవ యగును. తన దేహములో సగము దేహము, తన పుణ్యములో సగము పుణ్యము పంచియిచ్చి భారణ పోషణముల కాధారమై యెంతో ప్రేమగలవాఁడై వర్తించు

భర్తను మోసము చేసినదాని కిహమందుఁ గాని, పరమందుఁ గాని సుఖమెందుండి వచ్చును ?

తాత్పర్యము

భార్యయొక్క గుణహీనతచేతనే దాని భర్త ముందుగాఁ జచ్చునని జ్ఞానులు చెప్పుదురు. నీవు సదాచారసంపత్తియందుఁ బొగడ్త గన్నవాఁడవు. కావున నీ వర్థాయు వగుటకు దోషము నీయందు లేదు. నేను జేసిన పాపము చేతనే నేను జీవించి యుండగనే నీవు మరణించితివి.

ఉ. పాపిని నే నటంటకును ♦ వారిజలోచన! సందియంబొకో
 యాపదమీఁద నాపదలు ♦ ప్రాప్తములై వ్యసనాబ్ధి మున్గచో
 బ్రోపొనరింపఁ దెప్పగతిఁ ♦ బూని ప్రయత్నముఁ జేయు నిన్నరో
 పాపపుమిత్తి ద్రెకొ్కనిరొఁ ♦ బాపము గల్గునె యింత కెక్కుడున్. ౭౭౯

అర్థములు. పాపినిన్=పాపాత్మురాలను, పుం. పాపి స్త్రీ, పాపిని, అటు+అంటకును = అప్రకారము చెప్పుటకు, ప్రోపు = రక్షణము, మిత్తి = మృత్యువు, ద్రెకొ్కనిరొన్=భ్రమింగెను.

తాత్పర్యము

నేను బాపాత్మురాల ననుటయందు సందేహముకూడఁ గలదా? ఏలన:— సముద్రము నందలి యలలవలె నాపద వెంట నాపద మీఁదమీఁద రాగా నాపత్సముద్రమునందు మునుఁగు నపుడు నన్ను రక్షించుటకై తెప్పవలె ప్రయత్నము చేయు నిన్ను పాపపుమృత్యుదేవత భ్రమింగెను. ఇంత కెక్కువ పాపముకూడఁగలదా?

సుగంధి, కుల్య! రామభద్ర! యిట్టి ♦ క్రూరమైన వార్తహృ
 చ్ఛల్య విసంగఁ గల్గ ♦ సాధుశీల యత్తకౌ
 సల్య పుత్ర పుత్ర రామ ♦ చంద్ర యంచు దుఃఖధీ
 లౌల్య లేఁగఁ బాయు గోవు ♦ లా గడెంత కుందునో. ౭౮౦

అర్థములు. కుల్య=మంచి వంశమునఁ బుట్టినవాఁడా! 'కృత్రిమాల్పనదీ కుల్యా ప్రణాళ్యాంచ కులోద్భవే॥ నానార॥ హృత్+శల్యము=హృదయమునందు మేకై, దుఃఖ, ధీలౌల్య=దుఃఖముచేఁ జలించిన బుద్ధిగలది.

గొప్పవంశమునఁ బుట్టినవాఁడా! నీకా యిట్టి నికృష్టపుఁ జావు. రామభద్రా! నేను జేసికొనిన పాపము నే ననుభవింపవలసినదే. తప్పదు. ఇది నాతోఁ బోదే. ఈ క్రూరమైన వార్తవినఁగానే హృదయమందు మేకుగొట్టినటులయి సాధు స్వభావముగల నా యత్తగారు కౌసల్య కొడుకా! కొడుకా ? రామచంద్రా! యని యేడ్చుచే బుద్ధి చలించినదై లేదూడను బోఁగొట్టుకొన్న యావలె నెంత దుఃఖించునోకదా! నేనొక్కతెను జేసినపాపము నిరపరాధుల నెందఱ బాధించుచున్నదో చూడుము. సుగంధి - రజరజర గణములు - తొమ్మిదింటయతి.

ఉ. మాయురె! శాస్త్రవేత్త లస•మానపరాక్రమ! పల్కి రార దీ
ర్ఘాయువు నీకు, వారినుడు•లయ్యె నసత్యము ప్రాణనాథ! య
ల్పాయువు నీ వికైతి, వన•ఘాత్మక, నీకు నకాలమృత్యు వె
ట్లాయెనొ వారి కక్లు మతి•హానియు, దైవము హేతు వింతకున్. ౬౦౧

అర్థములు. మాయురె = ఔరా, శాస్త్రవేత్తలు=జ్యోతిషము తెలిసిన వారు, నుడులు=మాటలు.

## తాత్పర్యము

ఏమి యాశ్చర్యము? జ్యోతిషము తెలిసినవారు అసమాన పరాక్రముఁడ వౌట నీకు యుద్ధమందు మరణము లేదనియు, దీర్ఘకాలము జీవించెదవనియుఁ జెప్పిరి. వారిమాట లసత్య మయ్యెను. ప్రాణేశ్వరా! నీ వల్పాయువైతివి. పాప రహితుఁడ వగుట నీకిట్లు మృత్యు విప్పుడు రావలసిన కారణములేదు. నీకు నిష్కారణముగ నకాలమృత్యు వెట్లు వచ్చెనదో వారికి మతిహానియు నట్లేవచ్చెను. ఈ రెంటికి దైవమే కారణము.

చ. తెలియనివాఁడ వౌదువె పతీ! నయశాస్త్రము లెల్ల? నీవినిన్
జెలువుఁగ వచ్చు నియ్యవి•విసర్జనయోగ్యములం, జెఱుంగు ని
న్నలమె నదృష్టరూపమున • న య్యపమృత్యువు నిద్ర యన్మిషన్,
దలఁపఁగ నడ్డమూట గల • దా విధికిన్ మతి యెంత గల్గినన్. ౬౦౨

అర్థములు. నయశాస్త్రములు=నీతిశాస్త్రములు, విసర్జనయోగ్యములు= విడువదగినవి, అదృష్టరూపమున=కన్నులకుఁ గానరాని విధముగ, అపమృత్యువు= అకాలమృత్యువు=గండము, మిషన్=నెపమున.

## తాత్పర్యము

నీతిశాస్త్రములెల్ల నీ వెఱుఁగనివాఁడవా? ఎప్పుడేది చేయవచ్చును, ఎప్పు డేది చేయరాదని నీ వెఱుఁగవా? ఇట్లన్నియుఁ దెలిసిన నీకు నిద్ర యను నెపమున నపమృత్యువు కన్నులకుఁ గానరాకుండ వచ్చి పై బడినది. ఎవఁ డెంతబుద్ధిమంతుఁ డైనను దైవసంకల్పమున కడ్డము లేదుగదా!

ఇంద్రవంశము. నీ కేజపద్రత్తుఁడ! నిర్దయాత్మికన్
క్రూరన్ మహారౌద్రను • ఘోరదుష్కృతా
కారన్ ననున్ వల్లభ! • కాళరాత్రినిన్
జేరంగ నీ వీయుటఁ • జేటుఁ దెచ్చితిన్. ౬౦౩

అర్థములు. నిర్దయాత్మికన్=దయలేని హృదయముగలదానను, క్రూరను= కఠినస్వభావముగలదానను, మహారౌద్రన్ = మిగుల భయంకరురాలను, ఘోర దుష్కృతాకారను=ఘోరపాపమే మూర్తీభవించిన ట్లున్నదానను, కాళరాత్రిని= కాళరాత్రి యను పేరుగల యొకానొక సర్వనాశంకరమైన దయ్యమును. నేనెక్కడఁ

జేరుదునో యక్కడ నాశము చేయుదును. చంపితి నని యశ్లీలవాక్యము చెప్పలేక చేటు తెచ్చితి ననెను. నీరేజపత్రేక్షణ = కమలలోచన యనునవి హేతుగర్భ విశేష్యములు. దయ్యె మందముగా నున్నవారినే బాధించును. కావునఁ గాళరాత్రి యగు నేను నీకుఁ జేటు తెచ్చితి నని భావము. భరతుఁడు కైకను గాళరాత్రి యనెను. హనుమంతుఁడు సీతాదేవి నీ పాలిటఁ గాళరాత్రి యనెను. సీతాదేవి రాముని పాలిటికిఁ దాను గాళరాత్రి యనెను. కాళరాత్రియ నునది చేరిన చోట నాశనముచేయు శక్తి. ఇక్కడ కైకయు సీతయు నట్టి చెఱుపనచేఁటు లని తలఁప వలయును గాని వీరు కాళరాత్రి యవతారము లని తలఁపరాదు.

'పాలిచెఁ గాళరాత్రి పోలిక నా రాత్రి' ౯౧౧౮ ప. కాలరాత్రి నిగుడ్చు కాలుమాడిక్క-౧౬౬-౨ ప. 'ఇన్ని ప్రయోగంబులందును భయంకరత్వము నాశకత్వము ద్యోతితము కాని సాక్షాత్కాళరాత్రి వచ్చిన' దని యర్థము కాదు.

కాళరాత్రి తనమగనిఁ దాను జంపదుగదా!- పరికరానుప్రాణిత రూపకాలంకారము. ఇంద్రవంశము=తతజర-గణములు, ఎనిమిదింట యతి.

తాత్పర్యము

తామరరేకులవంటి కన్నులు గలవాఁడా! దయలేని మనస్సు గలదానను. కావుననే కఠినచిత్తను-కావుననే మహాభయంకరను-ఏలన, మహాభయంకరములగు పాపములు నా యాకారమును ధరించినవి. వల్లభ! నేను నీపాలికి కాళరాత్రిని. ఇట్టి దానిని నీవు చేరఁదీయుటచే నిన్నే చంపితిని. నెలుగు దగ్గఱదీసిన గుట్టక విడుచునా?

స్రగ్విణి. ఓ మహాబాహూ! నీ•వొద్దికం గానఁగా
నే మహానిష్ఠలన్ • నిచ్చ వర్తింపఁగా
రామ! భూమిం బరీ•రంభసంధాతవై
ప్రేముడిం గూరితే • పీడితే నన్నిటన్. ౬౨౪

అర్థములు. నిచ్చ=ఎల్లవేళ, పరీరంభసంధాతవై=కౌఁగిలించినవాఁడవై, ప్రేముడిన్=ప్రేమను.

తాత్పర్యము

దీర్ఘములైన బాహువులు కలవాఁడా! నీతోడ నుండఁగోరి నేను నిత్యము గొప్ప నిష్ఠల నాచరించుచుండఁగా నన్నువదలి భూదేవిని ప్రేమచేఁ గౌఁగిలించితివి గదా! నీ వేకపత్నీనియమము గల యనుకూల నాయకుఁడవే. నీకీ దక్షిణనాయకత్వము దగునా? స్రగ్విణి నాలుగు రగణములు-ఏడింటయతి.

క. సతత మేను గంధసుమనో, వితతుల నర్చింప నాకుఁ • బ్రియ మగు కనకాం
చిత మగు నీ కార్ముక మిా, గతిఁ బట్టిన నేఁడు దిక్కు•కావక వీరా! ౬౨౫

అర్థములు. సతతము = ఎల్లప్పుడు, గంధసుమనో వితతులన్ = గంధముచేతను, పూలసమూహముల చేతను, కనకాంచితము=బంగారుచేఁ బ్రకాశించు, కార్ముకము = విల్లు.

తాత్పర్యము

ప్రతిదినము నేను గంధముచేతను, పూలచేతను పూజించునట్టియు నాకుఁ బ్రియమగు నట్టియు నీవిల్లు నేఁడిట్లు విచారించునారు లేక యీ గతిఁ బట్టెనా?

క. నా మామగారు నీపైఁ, బ్రేమము గల తండ్రితోఁడ•బితరులతోన్ సు
త్రామజగంబున సౌఖ్యం, బామనిగా నున్నవాఁడ•ప్రాణేశా! ౬౮౬

అర్థములు. నామామగారు - కొన్ని యెడల విశేషణంబు ద్వితీయామలకుం బ్రథమ యగు. ప్రౌ.వ్యా.కార ౨. పితరులతోన్ = ఆయన తండ్రి తాతలతో, సుత్రామ జగంబున్ = స్వర్గమందు, ఆమనిగా = సమృద్ధిగా, నాలుగవ పాదంబున ప్లుతియతి.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! నాకు మామగారును నీపైఁ బ్రేమగల తండ్రియు నగు నాయనతో, నాయన పితరులతో స్వర్గలోకమున సమృద్ధిగా సుఖము ననుభవించు చున్నావా?

క. అయపుణ్యశీలురకు సు, ప్రియమగుం బుణ్యంబు నగుచుఁ • బే ర్గన్నత్వద
న్వయముం గను చున్నాఁడవె? నయశీలా! మింటనిలిచి•నక్షత్రమవై. ౬౮౭

అర్థములు, అయపుణ్య శీలురకున్ = శుభకార్యములుచేయు పుణ్యాత్ములకు, త్వదన్వయమున్ = మీ వంశమును.

తాత్పర్యము

పుణ్యకార్యములు చేయువారికిఁ బ్రియమును న్యాయముగాఁ బుణ్యములు చేయునదియు నని ప్రసిద్ధిగన్న నీ వంశమును నాకాశమందు నక్షత్రమవై నిలిచి చూచుచున్నావా?

మత్తకోకిలము. బాలికం గద బాల్యమందున • ప్రాప్తనైతిని వల్లభా!
శీలినిన్ సహచారిణిన్ శుభ•శీల! భార్యను బత్నినిన్
బాలి న న్గన వేల? మాటయుఁ•బల్కవేటికి? నేమి కాం
తాళిమా హృదయేశ!మత్కృత•దారుణాఘము చెప్పుమా. ౬౮౮

అర్థములు. బాల్యమందున = చిన్న వయస్సునందే, ప్రాప్తనైతిని = వివాహమాడుటచే నీకు లభించితిని. వివాహ మప్పటికి నీవు చిన్న వాఁడవే, నేను జిన్నదానవే యని యర్థము, శీలినిన్ = శీలముగలదానిని, సహచారిణి = నీతోడ ధర్మములఁ జేయుదానను, భార్యను = భరింప యోగ్యురాలను, పత్నిని = పత్యురనయో సహాయజ్ఞయోగా న్సంపద్యత ఇతిపత్నీ; పతికి నీమెతోఁగూడ యజ్ఞయోగము గలదు. నీవుచేయు యజ్ఞమందు నేను గూడ నుండవలసిన దానను, బాలిన్ = కాంక్షచే, కాంతాళిమా = కోపమా, మత్కృత = నాచేఁ జేయఁబడిన, దారుణ = ఘోరమైన, అఘము = పాపము.

## తాత్పర్యము

ప్రాణేశ్వరా! నీవు నన్నగ్నిసాక్షికముగా వివాహము చేసికొన్న సమయమున మన మిరువురము బాల్యమందున్న వారమె కదా! అప్పటినుండి నీవు చేయు ధర్మకార్యములందన్నిట సుఖదుఃఖములందును నీతోడనే తిరుగుచున్నానుగదా! వల్లభా! సదాచార సంపత్తి గలదాననే కదా! నీవే కదా నన్ను భరింపవలసినవాఁడవు. నన్నుఁగూడ నుంచుకొనియె కదా నీవు యజ్ఞములు చేయవలెను? ఇట్టినన్ను ప్రేమచేఁ జూడవేల? ఒక్క మాటయిన మాటలాడవేల? నామీఁద నీకేమి కోపమా? హృదయేశ్వరా? లేక నేను జేసిన మహాఘోరపాపమా? చెప్పుము.

సీ. పాణిగ్రహణవేళ • బాయ నిన్ననినట్టి, బాసను మఱచితే • ప్రాణనాథ !
నీ తుల్య సుఖదుఃఖ • రీతుల నేఁ గాన, నీతోడఁ గొనిపొమ్ము • నీరజాక్ష !
నీ ప్రాణకాంతను • నేనిట దుఃఖింప, వీడి పో న్యాయమా • విదితచరిత !
నా దిక్కు నీవె కా • నాయకా! పరలోక, మర్హమా యొంటిఁబో • న్యాయశీల!
తే. సారఘనసారసమ్మిశ్ర • చందనముల, నవ్యభూషణముల నొప్పి • నాయొకర్త
యంకపాళి సుఖించు మే • నయ్యొ కంక, గృధ్రముల పాలుపడియెనా • నృపవతంస.

అర్థములు. పాణిగ్రహణవేళన్=వివాహకాలమందు, నీ తుల్యన్=నీతో సమానురాలను, ఘనసార = పచ్చకర్పూరముతో, సమ్మిశ్ర = కలిపిన, చందనములన్=గంధములచే, నా యొకకర్త యంకపాళి = నన్నొకతెనే కౌఁగిలించుటచే, మేను=దేహము, కంక=రాపులుగులు, గృధ్ర = గ్రద్దలు, నృపవతంస = రాజశ్రేష్ఠా.

## తాత్పర్యము

వివాహకాలమున నా పాణిని నీ పాణిచేఁ బట్టుకొన్నపుడు ధర్మార్థకామములందు నన్నతిక్రమించి పోనని ప్రమాణము చేసితివే ప్రాణేశ్వరా! దానిని నీవు మఱవవచ్చునా? నీ సుఖదుఃఖములను నీతో సమముగ ననుభవించు దాననుగదా! కావున నీవు పోయిన చోటికి నన్నుఁ దోడుకొనిపొమ్ము. నీ ప్రాణములకుఁ బ్రియురాలనుగదా! ఇచ్చట నేను దుఃఖించుచుండ నీవు మాత్రము పోవుట న్యాయమా- నాకు దిక్కు నీవు తప్ప మఱెవ్వరు లేరుగదా! నాయకా! నన్నిట దిక్కుమాలినదానను జేసి నీ వొంటరిగ పరలోకమరుగుట న్యాయశీలుఁడవగు నీకు ధర్మమా? రాజేంద్రా! ప్రతిదినము నాచేఁ బచ్చకర్పూరముతోఁ గలసిన చందనాదులచేతను మనోహరములైన భూషణములచే నలంకరింపఁబడి నన్నొకతెనే కౌఁగిలించు నీదేహము నేఁడిట్లు రాపులుగులయు, గ్రద్దలయు పాలాయెనా?

ఈ కడపటివాక్యము శ్రీరామచంద్రమూర్తి యేకపత్నీవ్రతమును స్థాపించుచున్నది.

క. అగ్నిష్టోమాదుల హుత, భుఙ్నికురుంబంబుఁ దన్పి • పూర్ణంబుగఁ ద్వ
త్ప్రాక్పరపాలురగతిని ద, దగ్నుల సంస్కార మందు•టబ్బద సీతకున్. ౯౯౦

అర్థములు. అగ్నిష్టోమాదులన్ = అగ్నిష్టోమము మొదలగు యాగములచే, హుతభుక్+నికురుంబంబు = అగ్నిహోత్ర సమూహమును అనఁగా గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని ఇత్యాదులను, హుతభుక్+నికురుంబంబు= హుతభుఙ్నికురుంబం బని యైనఁ జెప్పవచ్చును. 'యరోనునాసికేఽనునాసికోవా' పాణిని ౮-౪-౪౫. ప్రాక్+పరపాలు రన్నచోట నిట్టులే గ్రహించునది, తన్పి = తృప్తిపఱిచి, త్వత్=నీయొక్క, ప్రాక్ పరపాలుర గతిని = పూర్వరాజులవలె, తదగ్నులన్ = ఆ శ్రౌతాగ్నులచే, సంస్కారమందుట = సంస్కరింపఁ బడుట, దహింపఁబడుట, అబ్బద=లభింపద.

తాత్పర్యము

నీ వగ్నిష్టోమాది యాగములఁ జేసి యగ్నులను పూర్ణముగఁ దృప్తిపఱిచి నీ పూర్వపు రాజులవలె నా యగ్నులచే సంస్కారము నొందుట లభింపఁదయ్యెఁగదా?

శ్రీరామచంద్రమూర్తి వనవాసమునకు ముందు అగ్న్యాధానము చేయలేదు. ఈ వనవాసము దీర్చి యయోధ్య చేరిన పిమ్మటనే యాధానాగ్నిష్టోమాదుల నొనర్చి శ్రౌతాగ్ని సంపాదించుకొన్న యెడల ఆపై, వయఃక్రమముగాఁ గాలగతి తటస్థించెనేని యా యగ్నిచేతఁ బ్రేత సంస్కారము జరుగఁబడి యుండును గాని యవి యేవి చేయకమునుపే యిట్లపమృత్యువు పాలబడుటచే నగ్ని సంస్కారార్హ్మన కది లేకపోయెకదా యని సీత దుఃఖించెనని భావము. శ్రీరాముఁడు వనవాసపూర్వము యజ్ఞాదులఁ జేయలేదనుట యీ పద్యము సూచించుచున్నది. ఇది యయోధ్యా కాండమున విస్తరింపబడినది.

సీ. ఒంటి సౌమిత్రి య•యోధ్యకుఁ బోవంగఁ, గౌసల్య యాతని•గాంచి వనికి
నాయనా! మువ్వురు•పోయితి రే మీరు, కలిసి యబ్బంగి నొ•క్కండ విట్లు
వచ్చితి తక్కిన•వార లే రన నీవు, రాక్షసతతులచే•రాత్రి నిద్ర
బలఁగంబుతోడుతఁ•బరిమార్పఁ బడుటయు, నేను రావణునింట•నిట్టు లుంట
ఆ. జీవితేశ యతఁడు • చెప్పిన బెగ్గిల్లి, కళవళించి కుంది • కలవరించి
జలదరించి తరలి • జలిమై దూపిల్లి, పల్లటిల్లి గుండె • పగిలిచచ్చు. ౯౯౧

అర్థములు. ఒంటి = ఒక్కఁడే, వనికిన్ = అడవికి, బలగంబుతోడుత= సేనతో, బెగ్గిల్లి=భయపడి, కళవళించి=కలఁతచెంది, జలదరించి=కంపమంది, తరలి = చలించి, ఇటునటు దిక్కు తెలియకపోయి, దూపిల్లి = తపించి, పల్లటిల్లి=వెల్లఁబోయి, సముచ్చయాలంకారము, అన్నికార్యము లేక కాలమందు జరగక పోయినను సముచ్చయాలంకారమే యగును.

### తాత్పర్యము

ఈ గండమునుండి తప్పించుకొని యొంటరిగా లక్ష్మణుఁడయోధ్యకుఁబోఁగా కౌసల్య యాయనను జూచి నాయనా! యడవికి మీరు ముగ్గురు పోయితిరే నీవొక్కఁడవే యిట్లు వచ్చితివే, తక్కినవారేరీ యనిన నీవు రాత్రి నిద్రించునపుడు రాక్షసులచే నీవలతోడఁ జంపఁబడుటయు నేను రావణు నింటఁ జెఱఁబడి యీవిధముగా నుండుటయు నతఁడు చెప్పఁగా ప్రాణేశ్వరా! యా పుణ్యవతి భయపడి కలఁతచెంది దుఃఖించి కలవరించి కంపించి చలించి దుఃఖముచేఁ దపించి తెల్లఁబోయి గుండెపగిలి చచ్చును. ఈ క్రియలు దుఃఖాతిశయమును నవస్థాభేదములను దెలుపును.

ఉ. ఉక్కున నొక్కఁటీఁడు మహి◆మోదధి పార్థివనందనుండు నా
మక్కువకాఁడు రాముఁడు కు◆మానిని నాకొఱకై యనర్హపుం
ఫక్కిని గూలె దాఁటియును◆వారిధి గోష్పదమంతమాత్రలోఁ
దక్కెను యట్టి దివ్యగుణ◆ధన్యుఁడు నీ దురదృష్టురాలికిన్ ? ౯-౨

అర్థములు. ఉక్కున = బలమునందు, ఒక్కఁటీఁడు = అద్వితీయుఁడు, సమానుఁడుగాని యధికుఁడుగాని రెండవవాఁడు లేనివాఁడు. మహిమ+ఉదధి= మాహాత్మ్యమునకు సముద్రుఁడు నామక్కువకాఁడు = నాయందు ప్రేమగలవాఁడు. కుమానిని = కుచ్ఛితపు స్త్రీయగు, అనర్హపుంఫక్కిని =' యోగ్యముగాని విధముగా=వారిధి దాఁటియును, ఖరదూషణాదులను, సముద్రమును దరించియు, ముందు రావణుఁడే సముద్రమున కుత్తరతీరమందే యుద్ధము జరిగినదని చెప్పుటచే నిపుడు సముద్రము దాఁటివచ్చిరని చెప్పరాదు. గోష్పదమంతమాత్రలోన్ = అల్పుఁడగు ప్రహస్తు చేతిలో, గోష్పదమంత - 'కొన్నిచోట్ల షష్ఠీసమాసంబునం దుకారంబునకచ్చు పరంబగునపుడు నుగాగమంబునకు లోపంబును నగు—ప్రౌ—వ్యా—సంధి—౧౦—'గోవుల మిల్లిల్లును' ఉ.హరి,పూ౫ ఆ-బచ్చింట-పాండు ౩, ఆ. శిరసందంబు-పాండు ౨ ఆ ఇనుమంత—తిక్కన.

### తాత్పర్యము

బలమునం దసమానుఁడు-మహిమయందు సముద్రుఁడు-రాజకుమారుఁడు-నాయందుఁ బ్రేమగలవాఁడు-రామచంద్రుఁడు-అల్పస్త్రీనగు నా నిమిత్తమై సముద్రమువంటి ఖరదూషణాదులను వారిసేనను జయించి గోవుపాదమువలె నల్పుఁడైన ప్రహస్తునిచేఁ జచ్చెనఁట. అటువంటి దివ్యగుణములే ధనముగాఁ గలవాఁడు నావంటి నిర్భాగ్యురాలికి దక్కునా ?

ఉ. పాపిని నన్ను నాత్మకుల◆పాంసనినంచు నెఱుంగలేక ని
ష్పాపుఁడు రామభద్రుఁడు వి◆వాహమునన్ గ్రహియించెఁ గూర్మి, నా
పాపపుఁజేఁత రామునకు◆భార్యయె మృత్యువు నయ్యె, భార్యదౌ
పాపము పుణ్య మెగ్గను◆శుభం బొనగూర్చుఁ దదీయభర్తకున్. ౯-౩

అర్థములు. పాపిని = పాపాత్మురాలను, ఆత్మకులపాంసని=తన వంశము పాడుచేయుదానను, నిష్పాపుఁడు=పాపము వాసన యెఱుఁగనివాఁడు, నా పాపపు చేఁత=నేను జేసిన పాపముచేతనే, పాపము పుణ్య మెగ్గును. శుభంబు=క్రమాలంకారము, పాప మెగ్గును పుణ్యము శుభంబును అని యన్వయము.

తాత్పర్యము

పాపాత్మురాల నగు నన్నుఁ దన వంశమునాశముచేయుదాన నని తెలియ లేక పాపమెట్టిదో యెఱుఁగనివాఁ డగుటచే నా వలనఁ దన వంశము వృద్ధియగు నని వివాహమునందు నన్నుఁ బ్రేమతో గ్రహించెను. నేను బాపాత్మురాల నగుట రామచంద్రునకు భార్యనే మృత్యువయ్యెను. సర్పమును బూలదండయని మెడలో వేసినది కఱవక మానునా? భార్యవలన భర్తయెట్లు చచ్చు నందువా? భార్య చేసిన పాపము దాని భర్తకుఁ గీడును, పుణ్యము మేలును గలిగించుచుండును.

ఉ. నే నిదో పూర్వజన్మమున ♦ నిశ్చిత ముత్తమ మైన కన్యకా
దానము విఘ్నపా టొదవ ♦ దారుణవృత్తి ఘటింపఁ గంటి, స
ద్దాన నె సర్వలోకజన ♦ తాపరిపూజ్యుని భార్య నయ్యునున్
మానగు భోగకాలమున ♦ మాఁడెద నిట్లతిదుఃఖవహ్నులన్. ౬౯౮

అర్థములు. సర్వలోక=అన్నిలోకములందుండు, జనతా = జనసమూహముచే, పరిపూజ్యుని=చక్కఁగాఁ బూజింపఁబడువాని, అతిదుఃఖ = విస్తార దుఃఖమనెడు వహ్నులన్=అగ్నులందు.

తాత్పర్యము

నేను బూర్వజన్మమందు నిశ్చయము కాఁబడిన యుత్తమకన్యాదానమును క్రూరురాలనై విఘ్నపఱిచితిని. ఆ కారణముచే నిప్పుడు సర్వజన సంపూజ్యుఁడైన వాని భార్యనయ్యును, సుఖ మనుభవింపవలసిన కాలమున శోకాగ్నులచేఁ గాల్పఁబడుచున్నాను. 'అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మశుభాశుభ'మ్మని కలదు గాదా? ఇది వ్యావహారిక ధర్మ మనుసరించి లోకసంగ్రహార్థము చెప్పఁబడినది.

క. రావణ! మేలగు నన్నున్, జా వింతయు లేక రామ ♦ చంద్రునిమీఁదన్
ద్రోపుము సతిఁ బతిఁ గూరిచి, కావింపఁగదయ్య! పరమ♦కల్యాణంబున్. ౬౯౯

అర్థములు. జావు = జాగు, ఆలస్యము-గకారమునకు వకారము-పగలు, పవలులోనగు వానివలె - కావింపఁగదయ్య = ప్రార్థనంబున సన్నప్రత్యయాంత క్రియలమీఁదఁ గదకదవు నాన్నాదు లనుప్రయుక్తంబు లగు. ప్రౌ-వ్యా క్రి-సూ ౯. కావింపుమని ప్రార్థించెద నని యన్వయము.

తాత్పర్యము

రావణా! ఆలస్యము లేక రామచంద్రునిమీఁద నన్నుఁబడవేయుము. భార్యను భర్తతోఁ గూర్చి పరమ శుభకరమైన కార్యము చేయుము. ఇట్లు చేసితివేని నీకు

మేలగును. రామచంద్రుని శిరస్సు, దేహము రావణుని స్వాధీనమందుండుటచే వానిని ప్రార్థింపవలసివచ్చెను. అవి నేను సహగమనము సేయుటకై నీవు నా స్వాధీనమందిమ్మని భావము.

క. రామునికాయముతోడన్, నా మేనిన్ నాదుశిరము ♦ నాథుశిరము ర
క్షోమండలవర! కూర్పుము, యా మహితాత్మునికరికి♦నరిగెద నేనున్. ౮౯౮

తాత్పర్యము

రాక్షసరాజా! రాముని దేహముతో నా దేహము, నాథుని శిరముతో నా శిరము కూర్పుము. సహగమనము చేసి నా భర్త పోయిన లోకమునకు నేను బోయెదను.

సహగమన విషయమై శాస్త్రములందీ వాక్యములు కానవచ్చుచున్నవి. "భర్తరి ప్రేతే బ్రహ్మచర్యం తదన్వారోహణంవా" విష్ణుస్మృతి. భర్త మరణించెనేని బ్రహ్మచర్యమైన నవలంబింపవలయును. లేదా సహగమనమైనఁ జేయవలయును. ఈ రెంటిలో నొకటి తప్ప మఱియేదియు (పునర్వివాహము) చేయరాదని యర్థము.

"తిస్రః కోట్యర్థకోటీచ యానిలోమాని మానుషే. తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యాఽనుగచ్ఛతి" మనుష్యుల దేహముమీఁద మూఁడున్నరకోట్లు వెండ్రుకలుగలవు. సహగమనముచేసిన స్త్రీ యంతకాలము భర్తతో స్వర్గమునసుభవించును.

'మాతృకం పైతృకం చైవ, యత్ర కన్యా ప్రదీయతే కులత్రయం పునాత్యేషా భర్తారం యాఽనుగచ్ఛతి' భర్తతోడ సహగమనముచేయు స్త్రీ తల్లి వంశమును, తండ్రి వంశమును, భర్తవంశమును మూఁడు వంశములను పావనము చేయును.

'బ్రహ్మఘ్నోవా కృతఘ్నోవా మిత్రఘ్నోవా భవేత్పతిః। పునాత్యవిధవా నారీ తమాదాయ మృతాతు యా, మృతే భర్తరి యానారీ సమారోహేద్ధుతాశ' నమ్ 'మగఁడు బ్రహ్మహత్య చేసినవాఁడైనను, కృతఘ్నుఁడైనను, మిత్రద్రోహము చేసినవాఁడైనను వానితోడ మరణించి విధవగాని స్త్రీ వానితోడ నగ్నిహోత్రమందుఁ బ్రవేశించెనేని వానిని పవిత్రుని జేయును. గర్భిణిస్త్రీలు, చిన్న వయస్సు పిల్లలుగల స్త్రీలు సహగమనము చేయరాదు. భర్త దేశాంతరమందు మరణించెనేని ఆయన పాదుకలను ఱొమ్ముపై నుంచుకొని యగ్నియందుఁ బ్రవేశింపవలెను.

'సమారోహతి దీప్తేఽగ్నౌ తస్యాశ్శక్తి నిబోధత. యది ప్రవిష్టో నరకం- బద్ధః పాశై స్సుదారుణైః సంప్రాప్తో యాతనాస్థానం గృహీతో యమకింకరైః విష్ఠితో వివశో దీనో వేష్ట్యమాన స్స్వకర్మభిః వ్యాళగ్రాహీ యథా వ్యాళం - బిలాదుద్ధృత్య శంకితః సాతం భర్తారమాదాయ-దివంయాంతి సతీ చయాసాభర్తృ పరమా స్వర్గే స్తూయమానాఽప్సరోగణైః క్రీడతే పతినా సార్థం యావదింద్రా శ్చతుర్దశ॥ భర్తతోడ నగ్నులయందుఁ బ్రవేశించు స్త్రీశక్తి చెప్పెదవినుము. మగఁడు

మహాపాపియై పాశములచేఁ గట్టఁబడి, నరకమునకు దీసికొని పోఁబడి యాతనా స్థానమందుంచఁబడినను వాఁడు చేసిన పాపములచే చుట్టుకొనఁబడినవాఁడై, వివశుఁడై, దీనుఁడై, నీచదశయందున్నను పతివ్రత పాములవాఁడు పుట్టలో నున్న పామును వెలుపలికి లాగునట్లు వానిని స్వర్గమునకు లాగుకొని పదునాలు గింద్రు లున్నంత కాలము స్వర్గమునసుభవించును. ఇది బ్రాహ్మణస్త్రీ వ్యతిరిక్త విషయము. బ్రాహ్మణ స్త్రీ భర్త చితియందే ప్రవేశింపవలయును. తక్కినవారికి వేఱు చితులని కొందఱ యభిప్రాయము. ఓయీ! "తస్మాదుహ న పురాయుష స్స్వర్గకామీ ప్రేయాదితి" శ్రుతిః. ఆయుష్య పూర్తికాకముందే మరణించరాదని సహగమనము నిషేధించుచున్నది గదా! యందురేమో? ఆ వాక్యమున కర్థమేమన మోక్షార్థులగు స్త్రీలు అల్పకాలమందుండునది, అల్పసుఖ మిచ్చునది యగు స్వర్గమును గోరి యాయువును వ్యర్థము చేయరాదు. జీవితశేషము నిత్యనైమిత్తికకర్మములచే, శ్రవణ మనన నిదిధ్యాసన భక్తిజ్ఞానములచే నంతఃకరణకళంకనాశము చేసెనేని సత్య నిరతిశయానంద శాశ్వత బ్రహ్మపదప్రాప్తి లక్షణమైన మోక్షము లభించును. కావున ననిత్యాల్ప స్వర్గార్థము ఆయువును వ్యయపఱుపరాదు. కావున మోక్షముఁగోరక స్వర్గమునుగోరు స్త్రీ తక్కిన యితర కామ్యానుష్ఠానములవలె నిదియుఁ జేయఁ దగిన దని విజ్ఞానేశ్వరీయము.

దీనివలన మోక్షమందిచ్ఛ గలిగిన పతివ్రత విధవ యగునేని బ్రహ్మచర్యమవలంబించి భక్తి స్వధర్మ నిరతయై భక్తిమార్గమునఁ గాలక్షేపము చేయుటే యుత్తమ పక్షము. అట్లు చేసెనేని భర్తను దరింపఁజేయును.

ఈ సహగమనము పతివ్రత చేసినచో దంపతులకిరువురకు శ్రేయస్సుగలదు. పాపాత్మురాలు చేసెనేని దాని పాపమును క్షయింపఁ జేసికొనునే కాని భర్తను రక్షింపలేదు. భర్తృసాలోక్యము పొందను లేదు. ఈ విషయము పురాణసారమందలి నారదవాక్యమువలన స్పష్టమగును. "పాపం యది కృతం భద్రే — పరపూరుష సేవయా। తథాప్యస్యాపి పాపస్య నాశో వహ్నిప్రవేశనాత్। పతివ్రతా ధర్మపత్నీ భర్తృశుశ్రూషణేరతా। యాఽనుగచ్ఛతి భర్తారం సైవ స్వర్గం యాతి ఉభౌ ధ్రువమ్॥

కం. అని కమలాయతలోచన, తన హృదయేశ్వరుని శిరము • ధనువు మఱిమఱిన్
గనుఁగొను విలపించును నేడ్చును నారట మందుఁ గుందు • సొమ్మలు వోవున్.

తాత్పర్యము

ఈ ప్రకారము కమలములవలె దీర్ఘములైన కన్నులుగల సీతాదేవి తన భర్త శిరము, ధనుస్సు పలుమారు చూచిచూచి యేడ్చును, ఆరటమందును, దుఃఖించును, మూర్ఛపోవును.

"పతి యెడఁబాసిన సాధ్వియు క్షితి బ్రతుకంజాలదు." అయోధ్య రాగాప. అని చెప్పిన సీతాదేవి యిప్పు డెట్లు బ్రతుకఁగలిగెను. ఈ దివ్యదంపతులకు పరస్పర

సత్తయే జీవితధారణమందు నిమిత్తముగాని, జ్ఞానాజ్ఞానములుగావు. భర్తకు జీవిత వైకల్యము లేదు. కావున సీతాదేవి జీవింపఁగలిగెను.

**—• మంత్రులు పిలువ రావణుఁడు కొలువుకూటంబునకుఁ బోవుట •—**

సీ. అంతలో ద్వారపా•లాధ్యక్షుఁ డరుదెంచి, హస్తముల్ జోడించి•యార్యపుత్ర!
జయ మగు నంచు నా•శాస్యముల్ వచియించి, దేవ! ప్రహస్తుండు•తావకీన
దర్శనకాంక్షియై•తక్కినసచివ వర్గంబుతో వాకిటఁ • గాచినాఁడు
తనరాక యెఱిఁగింపు•మనిన వచ్చితి రాజ, మైన నీవే చేయ • నర్హమైన
ఆ. యది యవశ్యకార్య • మైనది గలదని, జయము చేయు మన్న•సత్వరముగఁ
బంక్తిముఖుఁ డశోక•వని వీడి రాము న,దృశ్యము నెఱిఁగి సభకు•నరిగియుండు.

అర్థములు. ద్వారపాలాధ్యక్షుఁడు = ద్వారపాలకుల కధిపతి ఆశాస్యములు=దీవనలు, తావకీన=నీయొక్క, దర్శనకాంక్షియై=దర్శనము కోరినవాఁడై, ఆర్యపుత్ర శబ్దము భర్తను భార్య సంబోధించు పదము అయినను పూజ్యార్థంబున నిటఁ బ్రయుక్తము.

తాత్పర్యము

ఇట్లు సీత యేడుచుచుండఁగా నింతలో ద్వారపాలకుల కధిపతి యగు వాఁడు వచ్చి జయ జయ యని మంగళ వాక్యములు వచించి రాజా! మిమ్ముఁ జూడఁగోరి ప్రహస్తుఁడు తక్కిన మంత్రులతోడను వచ్చినాఁడు. వాకిట నిలబడియున్నాఁడు. తాను వచ్చినవార్త నీకుఁ దెలుపు మనుటచే వచ్చితిని, నీవే చేయవలసిన యవశ్య కార్యము గలదఁట. త్వరగా రమ్మను చున్నాఁడు. అని చెప్పఁగా నశోకవనము వదలిపోయి రాముఁడు చేయు ప్రయత్నము దెలిసికొని సభకుఁ బోయెను.

కం. వలసినకార్యముఁ గూరిచి, తలపోయుచు నుండె; నిందు • దశకంఠుఁడు త
త్తలమున్ వీడిన యంతన, తిలకింపఁగ శిరము ధను వ•దృశ్యము లయ్యెన్.

తాత్పర్యము

అచ్చట రావణుఁడు యుద్ధవిషయమై చేయవలసిన యాలోచనచేయు చుండెను. ఇచ్చట రావణుఁ డశోకవనము విడువఁగానే రాముని తల, విల్లు అదృశ్యము లయ్యెను. దీనివలన నిది కేవల మనస్సంయమముచేఁ గల్పితమనియు,మనో బలముచే నిర్వహింపఁ బడెననియు, నా బలము తొలఁగఁగానే యదియుఁ బోయె ననియు గ్రహింపనగును.

మ. అట రక్షోధిపుఁ డెల్ల కార్యములఁ బ•ర్యాలోచనం జల్పి యు
త్కటసేనానుల నంతికస్థుల కనుం • గాలార్హమౌ వాక్కులన్
స్ఫుటకోణాహతి భేరినాదముల ర • క్షోవాహినీపాళి ను
ద్భటయుద్ధోద్యమ మొప్పఁ గూర్పఁదగుఁ, జె•ప్పం బోకుఁడీ హేతువున్. ౨౦౦

అర్థములు. అంతికస్థులకు=సమీపమున నున్న వారలకు, కాలార్హము =

సమరయోచితము, స్ఫుటకోణాహతి = స్పష్టమైన కోదవుల దెబ్బలచే, భేరీనాదములతో=నగారాధ్వనులచే.

తాత్పర్యము

ఆ సభయందు రావణుఁడు చేయవలసిన పని చక్కఁగా నాలోచించి దగ్గఱ నున్న మంత్రులకు, సేనానాయకులకు నిట్లనియె. అందఱకు వినవచ్చునట్లు భేరులు గట్టిగా వాయించుచు రాక్షససేన నంతయు యుద్ధప్రయత్నములో జతగూర్పుఁడు. వారికిఁ గారణము చెప్పవలదు. కారణము చెప్పిన నొకయాఁడుదాని నిమిత్తమయియా మనము చావవలయు నని కొందరు తిరుగబడవచ్చును. కొంద రుపేక్షించవచ్చును అని భయము.

కం. వారును వల్లె యటంచును, వారల సైన్యంబు లెల్ల ♦ వలనుగ నొకచోఁ
గూరిచి తెలిపిరి వెస నా,తిరు రణోత్సాహియైన♦దివిజరిపునకున్. ౨౦౧

తాత్పర్యము

ఆ మంత్రులు సేనానాయకు లట్లే చేసెదమని చెప్పి పోయి వారి వారి సేనల నెల్ల నొక్కొక్కచోఁ జేర్చి యా వృత్తాంతము రణమునం దుత్సాహము గల రావణునకుఁ దెలిపిరి.

## —♦ ౩౩-వ సర్గము. సరమ సీతాదేవిని సమాధానపఱచుట. ♦—

సీ. రావణాదిష్టయై♦రక్షించు సరమ యన్, చాన దృఢవ్రత ♦ సదయశీల
తనకు నెచ్చెలి యయి ♦ తనకాచు చున్నట్టి,సీత నంచిత యయి♦జాతదుఃఖ
మునఁజాలఁ దపియించి♦మూర్ఛ విసంజ్ఞయై,పుడమిధూళిని బ్రుంగి♦బడబయువఁగ
నుండుటఁ గనుఁగొని♦యొద్దకుఁ జని మృదు, వాక్యసంతతుల నా♦శ్వాసపఱచి
తే. చెలిమిబలమున సువ్రత♦పలుకు నిట్లు, లూఱడిలుము జానకీ! ♦ యూఱడిల్లు
మాయలాఁ డగు రావణు♦మాటఁ బట్టి,వగచె దేటికిఁ దపియింప♦వలదువలదు.

అర్థములు. రావణాదిష్టయై=రావణునిచే నాజ్ఞాపింపఁబడినదై, రక్షించు=కాపాడు, తక్కినవారివలె బెదరించి బాధించునది కాదని భావము. చాన = స్త్రీ, ఈమె విభీషణుని భార్య తన భార్యలలో నెవ్వతెనైన నేర్పాటుచేసిన సవతి మచ్చరముచే నది సీత కేదైనఁ గీడు చేయునేమో యనియు, క్రొత్తవారి నేర్పాటు చేసిన వారు నగరమంతయు నీ రహస్య విషయము వెల్లడింతు రనియు రాక్షస స్త్రీలు కేవల భయమునే చూపుచుండిన సీతాదేవి విసిఁగి ప్రాణత్యాగము చేయునేమో యనియుఁ దలఁచి సాత్త్వికురాలైన యీమెను సీతాయోగక్షేమములు విచారింప రావణుఁడు నియమించెను. ఈ యింటివారు తప్పఁ దక్కినవా రంతఃపుర స్త్రీలైనను రావణునాజ్ఞ లేక అశోకవనము లోనికిఁ బోరాదని రావణుఁ డాజ్ఞచేసెను. అరణ్య ౫-౫౬౭ పద్యముఁ జూచునది.

దృఢవ్రత = స్థిరమైన పాతివ్రత్యము గలది. అనఁగా భర్త సీతయం దనుకూల భావము గలవాఁడై యుండుటచేత నాయన మార్గమునందే పోవలయు ననుదృఢనిశ్చయము గలది. భర్తల ననుసరించుటకదా సాధ్వుల వ్రతము. ఈమె సాధ్వి గావున సాధ్వియగు సీతాదేవియందుఁ బక్షపాతము గలదయ్యెనని గ్రహింపనగు, (౨) తన ప్రాణమిచ్చియైన సీతాదేవిని రక్షింపవలెనను స్థిరమైన వ్రతము కలది. సదయశీల=స్వభావము చేతనే దయాగుణముగలది. ఆకారణముచే రావణుఁడు సీతను నిరాకరణముగఁ బెట్టు బాధ లామె మనస్సునకు సరిపడ లేదని భావము. భర్త యాజ్ఞచేతనే కాక స్వభావగుణముచేతను సీతయందు సరమ పక్షపాతము వహింపఁగారణము చెప్పఁబడెను. సచ్చెలి = స్నేహితురాలు. తక్కిన రాక్షసస్త్రీలవలె నీమె బెదిరింపక దయగలదై ధైర్యముఁ జెప్పుచు ననుకూలయై యుండుటచే సీతా సరమలకు స్నేహము కుదిరె నని భావము. వంచిత=మోసగింపఁబడినది. జాత దుఃఖమునన్=కలిగిన దుఃఖముచే, విసంజ్ఞయై = తెలివితప్పినదై, (౨) యథార్థజ్ఞానము పోయినది. అతి స్నేహము పాపశంకి గావున నీ మగఁడు చచ్చినాఁడనఁగానే యేడువ మొదలు పెట్టెను గాని, వీఁడు మాయలమారి గదా. వీని మాట నమ్మవచ్చునా యని కాని, విశ్వామిత్రుఁడిచ్చిన బలాతిబలలు, కౌసల్య కట్టిన రక్ష నిద్రపోయినను ఏమఱి యుండినను రక్షించుననను విషయము తెలిసి యుండియు నవి రక్షింపక యేల పోవు నని కాని, రాముఁడు నిద్రించువేళ లక్ష్మణుఁడు నిద్రింపఁడుకదా యని కాని, కోట్లకొలఁది వానరులందఱు నేకకాలమున రక్షకులఁగూడ నియమింపక నిద్రపోదురా యని గాని, ఒకఁడు మేలుకొని యుండినను రాక్షసుల గుంపును దూరమునఁ జూడఁగానే యందఱ లేపి యుండఁడా యని కాని సీతాదేవి యాలోచించినదికాదు. బ్రుంగి=మునిఁగి, బడబ = ఆఁడుగుఱ్ఱము, ఆశ్వాస పఱిచి=సమాధానపఱిచి, ముగుద=ముగ్ధ=మోసమెట్టిదో తెలియఁగనిది కావున,నిది మోసమని తెలిసికొనలేకపోయినది,సువ్రత=పరోపకారవ్రతముగలది.

## తాత్పర్యము

రావణుచే నాజ్ఞాపింపఁబడి సీతను రక్షించు సరమ యను రాక్షసి దృఢమైన పాతివ్రత్యముగలది. సీతారక్షణమందు భర్త యనుసరించిన మార్గ మనుసరించునది. ప్రాణమిచ్చియైన సీతాదేవిని రక్షింపవలయు నను వ్రతము గలది. స్వభావముచే దయాగుణముగలది. తనకు స్నేహితురాలయి తాను రక్షించుచున్న సీత రావణుచే మోసగింపబడి యా కారణమున గలిగిన దుఃఖముచే తపించుచు స్మృతితప్పి యాఁడు గుఱ్ఱమువలె నేల దుమ్ములో బడి మునిగియుండుట చూచి సమీపమునకు బోయి మెత్తని వాక్యముల నూరార్చి స్నేహబలముచే నాసువ్రత యిట్లులనెను. జానకీ! ఊరడిల్లు మూరడిల్లుము. మాయలమారి యగు రావణు మాట నమ్మి నీ వేల దుఃఖించెదవు? సంతాపపడ వలదు వలదు, ఆదరమున ద్వీరుక్తి.

ఉ. రావణుఁ డిప్పు డీవు బెద • రన్ వచియించినరీతి నాపయిన్
నీవును నుత్తరం బిడుట • నే గగనాంగణలీనగాత్రనై
రావణభీతి డీల్పడక • రాజముఖీ సకలంబు వింటి, నా
జీవితమందు నేన్ బ్రియము • సేయను నీ కొఱ కబ్జలోచనా. ౨౦౩

అర్థములు. బెదరన్ = భయపడునట్లు, గగనాంగణలీనగాత్రనై=ఆకాశమున దాగిన దేహము కలదాననై (౨) చెట్లతొర్రలలో దాగినదాననై, బావ యెదుట రాఁగూడదని దాఁగెనని భావము. తిరస్కరణీవిద్యచే నెవ్వరికిఁగానరానిదై, రావణభీతి=రావణుఁడు తెలిసికొనిన నేమిచేయునో యను భయముచే, డీల్పడక= దార్ఢ్యము చెడిన దానఁగాక. ఇట్లు చెప్పుటచే రావణుఁడు సీతకు రాముని శిరము చూపునప్పు డా ప్రాంతముల నెవ్వరుండఁ గూడదని యాజ్ఞాపించినట్లేర్పడుచున్నది. అట్లుండియు వానిని మోసగించి యీమె యుండినది. ఇది ప్రాణాపాయకరమైన విషయముగదా! రాజముఖీ=చంద్రునివంటి ముఖము గలదానా! ఇట్లు చెప్పుటచే సరమవాక్యముల సీత ప్రసన్నవదన యయ్యెనని సూచన.

### తాత్పర్యము

ఇప్పుడు నీవు భయపడునట్లు రావణుఁడు చెప్పినవిధము దానికి నీవు ప్రత్యుత్తరమిచ్చిన విధము నేనాకాశమున యోగవిద్యచే నెవరికిఁ గానరాక, రావణునకు భయపడక సర్వము వినుచుంటిని. ఏలయింత సాహసము చేసితివి? రావణుఁడు తెలిసికొని యుండిన నీకుఁ బ్రాణాపాయము కలిగించి యుండునే యనెదవేమో! నీకుమేలు కలిగించుటయందు నాకుఁ బ్రాణము మీఁదను నాశ లేదు. ప్రాణము విడిచియైన నిన్ను రక్షించెదను. కావున నాకొఱకై నీవు విచారపడకుము.

ఆ. అసురనాథుఁ డిప్పు • డదరున బెదరున, నాదబాద చనిన • యట్టివిధము
నేను వెలికి నరిగి • నిక్కం బెఱింగితి, వినఁగదమ్మ! సీత • విశదముగను. ౨౦౪

అర్థములు. అదరున = గుండెలు చలింపఁగా, బెదరున = భయముచే, ఆదబాద=తొందరతొందరగా, రూ. ఆదరబాదర.

### తాత్పర్యము

రావణుఁ డిప్పుడు భయమున గుండె లదరఁ దొందర తొందరగాఁ బోయిన విధముఁ జూచి దీనికేమి కారణమని నేను వెలుపలఁబోయి వాస్తవ మెఱింగి వచ్చితిని. దాని విధము చెప్పెద వినుము.

ఉ. అమ్మరో! నిద్రపోవ విది • తాత్ముని రాముని హింస సేయ శ
క్యమ్మును గాదు, నీదు విభుఁ • డంతము నొందఁడు, పాదపాయుధుల్
నెమ్మది నున్నవారలు వ • నేచరు లందఱు, వారి నొంప సా
ధ్యమ్మును గాదు వేల్పులు బ • లారివలెన్ రఘురాముఁ డోమఁగన్. ౨౦౫

అర్థములు. విదితాత్మని=(౧) తెలియఁబడిన యాత్మగలవాఁడు. ఆత్మజ్ఞాని కపమృత్యువు రాదని భావము. (౨) ప్రసిద్ధికెక్కిన విష్ణువును (౩) ప్రసిద్ధికెక్కిన ధైర్యముగలవానిని- (౪) ప్రసిద్ధికెక్కిన బుద్ధిమంతుని-శక్యమ్మునగాదు=సాధ్యము పడనేపడదు. అట్లుచేయ నాలోచింపనుగూడ సాధ్యపడదు. కనుకనే రావణుఁడట్టి యాలోచన చేయలేదు. కౌసల్య గట్టిన రక్షచేతను విశ్వామిత్రుఁడిచ్చిన బలాతిబలల విద్యచేతను ప్రమాదదశయందైనను రామలక్ష్మణులకుఁ గీడెవ్వరుచేయ సాధ్యపడదు. బాల-స. ౨౧౬. "నిదురను బూనియున్న యెడనేనిఁ బ్రమాదము నందునేని నాఁపద నొదవింపలే రసురసంఘ్తులు"- పాదపాయుధుల్=చెట్లాయుధములుగాఁ గలవారు-వనేచరులు=వానరులు-ఓమఁగన్=రక్షింపఁగా.

తాత్పర్యము

అమ్మా, సీతా! విదితాత్ముఁడగు రామచంద్రమూర్తిని నిద్రపోవు సమయంబున హింసింప సాధ్యమునుగాదు. అట్లు చంపఁబడను లేదు. చెట్లనాయుధములుగాఁగొని వానరు లందఱు క్షేమముగా నున్నారు. ఒక్కఁడైన జావలేదు. దేవతలను నింద్రుఁడు రక్షించునట్లు వానరులను రామచంద్రమూర్తి రక్షించుచుండుటచేత వారిని బాధింప నెవ్వరికి సాధ్యపడదు.

సీ. వెడఁదవక్షమువాఁడు•నిడుద వ్రటువయునై, కవఁగిల్లు పీనబా•హువులవాఁడు
శౌర్యంబుగలవాఁడు•సతతంబుఁ దన్నును,దన యాశ్రితులఁ బ్రోవఁ•దనరువాఁడు
ధర్మచింతగలాఁడు•ధరణివిఖ్యాతుండు,దంబుమీఱిన కార్ముకం•బువాఁడు
సంహాననమువాఁడు•చారుసౌందర్యల,క్ష్మీనిధానం బయి•చెలఁగువాఁడు.

తే. బంధురంబైన దోఃప్రతా•పంబువాఁడు, నీతిశాస్త్రవిదుం డన•నెగడువాఁడు,
సోదరునిలక్ష్మణునిఁగూడి•యొప్పినాఁడు,యువతిసీత రక్షకశీలి•యైయున్నవాఁడు.

అర్థములు. వెడఁద=విశాలమైన, నిడుద=నిడివి, వ్రటువ = గుండ్రము, కవఁగిల్లు=ఒప్పునట్టి, పీన = బలిసిన, బాహువులవాఁడు = చేతులు గలవాఁడు, సంహాననము = అవయవసౌష్ఠవము, బంధుర = అధికము, దోఃప్రతాపము=భుజప్రతాపము.

తాత్పర్యము

నా మగఁడు క్షేమముగా నున్నాఁడంటివే నీవు చూచివచ్చితివా యందు వేమో! చెప్పెదవినుము. వెడలుపగు ఱొమ్ముగలవాఁడు, నిడివి గుండ్రమునై బలసిన చేతులవాఁడు, శౌర్యముగలవాఁడు,తన్నుఁదనయాశ్రితులను గాచువాఁడు,ఏది చేసినను ధర్మమును విచారించి చేయువాఁడు, భూమియందుఁ బ్రసిద్ధుఁడు, మిగులఁ గాంతిగల విల్లుగలవాఁడు, అవయవసౌష్ఠవము గలవాఁడు, మనోహరమైన సౌందర్యలక్ష్మికి స్థానమైనవాఁడు,విశేష భుజప్రతాపము గలవాఁడు,నీతిశాస్త్రము తెలిసినవాఁడని పేరుపడ్డవాఁడు, తమ్ముఁడగు లక్ష్మణునితోడనున్నాఁడు. నీ భర్త

కుశలముగా నున్నాఁడు. ఇట్టి చిహ్నములు, గుణములు గలవానికి నపమృత్యు వెట్టులు వచ్చునమ్మా!

కం. సీతా! శాత్రవసేనా, వ్రాతనికారణుఁ డచింత్య ♦ బలపౌరుష వి
 ఖ్యాతుఁ డజయ్యుఁడు శ్రీసము, పేతుఁడు రాముండు కాఁడు ♦ హింసితుఁ డబలా!

అర్థములు. శాత్రవ సేనావ్రాత నికారణుఁడు = శత్రుసేనల సమూహములఁ జంపువాఁడు - అచింత్య = ఇంతయని యాలోచింప సాధ్యముకాని - బల పౌరుష విఖ్యాతుఁడు = బలమునందు, పౌరుషమునందు ప్రసిద్ధికెక్కినవాఁడు, అజయ్యుఁడు=జయింప శక్యముగానివాఁడు - 'క్షయ్యజయ్యౌశక్యార్థే' అని పాణిని. శ్రీసముపేతుఁడు=శోభతోఁగూడినవాఁడు-హింసితుఁడు=చంపఁబడినవాఁడు.

తాత్పర్యము

శత్రుసేనల వధించువాఁడును, ఇంతయని యాలోచించి తెలియరాని బల పౌరుషములు గలవాఁడును, జయింప సాధ్యపడని వాఁడును, లక్ష్మీయుక్తుఁడు నగు శ్రీరామచంద్రమూర్తి చంపఁబడినవాఁడు కాఁడమ్మా, సీతా!

తే. తెలివిమాలిన పనులను ♦ జలుపువాఁడు, నఖిలభూతంబులకుఁ బగ ♦ యైనవాఁడు
 మాయలను జక్కనెఱిఁగిన ♦ మాయలాఁడు, క్రూరకర్ముండు నిన్నంత ♦ కుటిలపఱిచె.

అర్థములు. పగ=విరోధి - కుటిలపఱిచెన్ = బాధపెట్టెను - రావణుఁడు కర్త - అధ్యాహార్యము - బుద్ధిమాలిన పనులను = బుద్ధిమాలినవి పనులుగాఁగు వానిని జేసినవాఁడు బుద్ధిమాలినవాఁడు- బుద్ధిమాలిన వాని పనులు బుద్ధిమాలిన పనులు - మధ్యమపదలోపి.

తాత్పర్యము

బుద్ధిలేక పనులను జేయువాఁడును, అన్ని జీవులకు విరోధియైన వాఁడును, మాయలను బాగుగఁ దెలిసినవాఁడును, క్రూరమైన పనులను చేయువాఁడు నగు రావణుఁడు నిన్నిట్లు బాధపెట్టెను.

కం. పోయెను దుఃఖము లన్నియు, డాయఁగ నున్నయది శుభము ♦ తరుణీ నిన్నున్
 జేయని భజింప సిరి వి చ్చేయును ముత్కరముఁ బ్రియముఁ ♦ జెప్పెద వినుమీ.

తాత్పర్యము

దుఃఖము లన్నియుఁ బోయెను. మేలు రానున్నది. నిన్ను సేవింపలక్ష్మి జేయని వచ్చును. నీకు సంతోషకరమైనది యొకటి చెప్పెద వినుము. పోయెను దుఃఖములు= అవ్యవహిత భవిష్యత్తునకు వర్తమాన భూతము లగు. సు. వ్యా-వాక్య. ౭౧ సూ.

—♦ సీతాదేవికి నరమ యుద్ధసన్నాహముఁ దెలుపుట ♦—

సీ. వారిధి దాఁటి నీ ♦ పతి కీశసేనతోఁ, దక్షిణతీరంబు ♦ దఱిసినాఁడు
 జలధితీరస్థ చూ ♦ శైలాటసేనచేఁ బరిరక్షితుం డయి ♦ ప్రబలినాఁడు

పూర్ణార్థుఁడగు రఘు•పుంగవుఁ గన్నారఁ, గంటిఁ దమ్మునితోడఁ•గ్రాలినాఁడు
రావణప్రేరిత•రాక్షసుల్ లఘుపరా,క్రము లకూపారంబు•రాఘవుండు
ఆ. దాఁటినాఁడటంచుఁ•దద్వార్తఁ దెలిపిరి, దావఁ జూమ్మ వీఁడు•దశముఖుండు
మంత్రిజనముతోడ•మంతనం బున్నాఁడ, టంచుఁ జెప్పుచుండు•నంతలోన.

అర్థములు. తతీసినాఁడు=చేరినాఁడు, జలధితీరస్థము=సముద్రము నొడ్డున నుండునది, శైలాటసేనచే=వానరసేనచే, పూర్ణార్థుఁడు = నిండిన యుద్ధవస్తువులు గలవాఁడు, యుద్ధమున కుపయోగపడు వస్తువులన్నియు కొఱతలేక నిండించికొని యున్నాఁడు. 'అర్థః-అభిధేయే ధనే శాస్త్రి వస్తు హేతు నివృత్తిషు' నానా॥ కన్నారఁ గంటిన్=నేను చెప్పునది వినికిడిమాటలుగావు. నా కన్నులతో నేను జూచి చెప్పుచున్నాను. ఈ సరమకు సదృశ్యవిద్యయే గాక యాకాశయాన శక్తియుఁ గలదు. (చూ ౭౨౪ ప) కావునఁ బోయి చూచియుండవచ్చును. లేదా, ఎత్తైన మేడయెక్కి రావణుఁడు చూచినట్లు చూచియుండవచ్చును. లఘుపరాక్రములు=వేగముగఁబోవ ననుకూలమైన బలముగలవారు, అకూపారంబు=సముద్రము, మంతనము=ఆలోచనము.

తాత్పర్యము

సముద్రమును దాఁటి నీ మగఁడు వానరసేనతో దక్షిణతీరమునకు వచ్చియున్నాఁడు. వానరసేనయంతయు సముద్రమునొడ్డున రాముని రక్షించుచున్నది. యుద్ధమునఁ వానరులకుఁ గావలసిన వస్తువులన్నియు పూర్ణముగ సంపాదించియుంచుకొన్నాఁడు. తమ్మునితోడ నున్నాఁడు, ఇవన్నియు నేను జూచి చెప్పుచున్నాను. వినికిడి మాటలుగావు. రావణుఁడు పంపిన వేగము పరాక్రమముగల రాక్షసులు రామచంద్రమూర్తి సముద్రము దాఁటివచ్చి దక్షిణతీరముఁ జేరినాఁడని చెప్పిరి. ఆ కారణముచే రావణుఁడు మంత్రులతో నాలోచించుచున్నాఁడు అని చెప్పుచుండఁగనే.

క. వినఁబడిరె రణోద్యోగం,బునఁ దనరిన సైన్యసంఘ•ముల భైరవని
స్స్వనముల్ దండాహతిసం,జనిత మహాభేరికాని•చయరావంబుల్. ౨౧౧

అర్థములు. రణోద్యోగంబునన్ = యుద్ధప్రయత్నమునందు, భైరవ = భయంకరములైన, నిస్స్వనముల్ = సింహనాదధ్వనులు, దండాహతి=కొయ్యచేఁ గొట్టఁబడుటచే, జనిత = పుట్టిన - మహాభేరికా = పెద్దనగారాల, నిచయ = సమూహముల, రావంబుల్=ధ్వనులు.

తాత్పర్యము

యుద్ధప్రయత్నమునందున్న సేనాభటుల భయంకరధ్వనులు, కట్టెలచేఁ గొట్టఁబడుచున్న నగారాలధ్వనులు వినవచ్చెను.

క. గురునిర్ఘోషము వినుచు మ,ధురభాషిణి సరమ సీత•తోననుఁ బితికి
పరఁగెడి పల్లెడ వింటివె, సరభసముగ నెసఁగు సమర•సన్నాహంబుల్. ౨౧౨

అర్థములు. గురునిర్ఘోషము = పెద్దధ్వని - మధురభాషిణి = తియ్యని మాటలుగలది, సరభసముగన్ = త్వరగా. సమరసన్నాహంబుల్ = యుద్ధ ప్రయత్నములు.

తా త్ప ర్య ము

ఆ గొప్పధ్వని విని యింపుగా మాటలాడు సరమ సీతాదేవితో నిట్లనెను. పికకిరవాణీ! నీవు కేవలము భయపడితివే. వింటివా? తొందర తొందరగా రాక్షసులు చేయు యుద్ధప్రయత్నములు.

ఉ. తోయదగర్జితోడఁ దుల•దూఁగు గభీరపుభేరికారవం
బాయత మయ్యె గర్జితగ•జాళుల సజ్జనసేయువారు లే
ర్లాయితముల్ తురంగనిచ•యంబులఁ బూన్చుచు నున్నవారు జా
తీయహయాళి నెక్కి- చను•దెంచిరి కౌతులు ప్రాసహస్తులై. ౨౧౭

అర్థములు. తోయదగర్జితోడన్ = మేఘముల యుఱుములతో-తులఁదూఁగు = సమానమగు-గభీరపు భేరికారవంబు = దీర్ఘమైన నగారాలధ్వని-ఆయతము = విస్తారముగ వ్యాపించినది-గర్జిత గజాళులన్ = ఘీంకారములు చేయుచున్న యేనుఁగుల గుంపులను-సజ్జన సేయువారు = సిద్ధము చేయుచున్నవారు-అలంకారములు లోనైనవి-ఆయితముల్ = సిద్ధపఱుపఁబడినవి- తురంగనిచయంబులన్ = గుఱ్ఱముల సమూహములను - జాతీయ = ఉత్తమజాతియందుఁ బుట్టిన-హయాళిన్ = గుఱ్ఱముల గుంపులను - కౌతులు = గుఱ్ఱపుదండువారు-ప్రాసహస్తులై = ఈఁటెలను చేతుల ధరించినవారై- పూన్చుచు = పూనునట్లు చేయుచు-ఇది పూనుధాతు ప్రేరణార్థక రూపము-పూ-పూంచుచు.

తా త్ప ర్య ము

యుద్ధప్రయత్నము లేవి జరుగుచున్న వందువా? మేఘముల యుఱుములతో సమానమైన భేరీధ్వనులు నాలుగు ప్రక్కల వ్యాపించుచున్నవి. నీకు వినవచ్చుచున్నవి కదా! ఘీంకరించుచున్న యేనుఁగులను నలంకారము చేసి తొండములకు రోఁకండ్లిచ్చి ముఖముల కడ్డముగ నినుపరేకులు కట్టుట మొదలగు పనులు చేయుచున్నారు. రథములకు గుఱ్ఱములను గట్టుచున్నారు. రౌతు లీఁటెలు చేత ధరించి యుత్తమజాతియందు బుట్టిన గుఱ్ఱముల నెక్కుచున్నారు.

కం. అట నటఁ బాదాతిను లగు భటు లుద్భటవృత్తి మూఁగు•వారలుచుమ యు
త్కటదర్శనసేనలతోఁ, బటునదములతోడ రాచ•బాటలు పురిలోన్. ౨౧౮

అర్థములు. అటనటన్ = అచ్చటచ్చట - పాదాతికులు = కాలిబంట్లు-ఉద్భటవృత్తిన్ = అధికసన్నాహముతో-మూఁగువారు = గుంపులుచేరుచున్నారు-ఉత్కటదర్శన సేనలతోన్ = మంచి యలంకారములు చేసికొని మంచి దర్శనముగల సేనలతో-పటునదములతోడ = గొప్ప ధ్వనులతోడ.

### తాత్పర్యము

అచ్చట నచ్చట కాలిబంట్లు అధికసన్నాహముతో నలంకారాదులచే నింపైన వేషముతో, గొప్ప ధ్వనులతో గుంపులు చేరుచున్నారు. పురమునందలి రాచబాటలు.

ఉ. నీరధి వారిపూరముల • నిండినభంగిని నిండి యున్న; వో
చారుదతీ! ధగద్ధగిత • శస్త్రములున్ దృఢచర్మవర్మముల్
వారణఘోటకాళి రథ • వర్గము రాక్షసవీరపాళు లెం
తే రహిఁ బూను భూషలు న • వే దివి నించె ననేక కాంతులన్. ౨౧౫

అర్థములు. నీరధి = సముద్రము – వారిపూరములన్ = జలప్రవాహములచే – చారుదతీ=మనోహరమైన దంతములు గలదానా–ఈ వార్తవిని సీత నంతోషించె ననియు, ముఖము వికాసమై పెదవులు సందు విడిచె ననియు గ్రాహ్యము–ధగద్ధగిత=ధగధగ లాడుచున్న – దృఢచర్మవర్మముల్ = గట్టి చర్మముతో చేయబడిన కవచములు–దృఢచర్మములు వర్మములు – చర్మములు = డాలులు, వారణఘోటకాళి = ఏనుగుల గుఱ్ఱముల గుంపులు – రథవర్గము = తేర్లసమూహము–భూషలు = సొమ్ములు–ఎంతే రహిన్ = విశేషాసక్తితో–దివిన్ = ఆకాశమును అనేక కాంతులన్=నానావిధములైన కాంతులచే.

### తాత్పర్యము

వీళ్ళచే సముద్రము నిండినట్లు నిండియున్నవి. సుదతీ! ధగధగ మను కత్తులు లోనగు శస్త్రములయు, గట్టిడాలులయు, కవచములయు, ఏనుఁగులయు, గుఱ్ఱములయు, రథములయు, రాక్షస వీరులయు నెంతో యాసక్తితో ధరింపఁబడిన భూషణముల నానావిధములైన కాంతులు ఆకాశమున నిండియున్నవి.

కం. నడువేసంగిని నెండిన, యడవుల దహియించు కారు • టగ్గి యనంగా
దడముల దట్టపుఁదేజ ని, బిడమై యొప్పారె నిపుడు,బిసరుహనేత్రా! ౨౧౬

అర్థములు. నడువేసంగిని = నడిమి యెండకాలమందు = కారు+అగ్గి = కారుటగ్గి=కారుచిచ్చు, దడముల=సేనల, నిబిడమై=దట్టమై.

### తాత్పర్యము

నడిమి యెండకాలమందు నెండిన యడవులను గాల్చు కారుచిచ్చువలె సేనల యధికమైన కాంతి దట్టముగ వ్యాపించి యున్నది.

సీ. విన వమ్మ! ఘంటల•వివిధఘుణంఘుణల్, రథముల దబదబల్•రమణి వినుము
ఆలకింపఁగదమ్మ•హయముల హేషల, నాలింప వమ్మ తూ • ర్యారవంబు
లవి యుద్యతాయుధ • హస్తు రాక్షసేంద్రానుయాయుల రోమ•హర్షమైన
సంభ్రమం బగుఁ జూమ్మ • సంతాప పడకమ్మ, వ్యసననాశిని వైన•హర్షలక్ష్మి

తే. చేరు నిను రాక్షసాళికిఁ • జేటు గలుగు, విజితరోషుండు నవిచింత్య•విక్రముండు
సారసాక్షుండు నిర్జర•స్వామిసముఁడు, రావణు వధించి నిన్నేలు•నీ విభుండు.

అర్థములు. హేషలన్ = గుఱ్ఱపుధ్వనులను గుఱ్ఱపు ధ్వనికే హేష యని పేరు. కావున హయముల హేష లన్నప్పుడు హేషకు ధ్వని యను సామాన్యార్థము నే గ్రహింపవలయును. కరి, కలభము, జనవహయము ముక్తాఫలహారము, కడాని బంగరు లోనైన వానివలె గ్రహించునది. తూర్యారవంబు = వాద్యధ్వని, ఉద్యతాయుధ హస్తుల = ఎత్తఁబడిన యాయుధములు గల చేతులు గలవార లయు, రాక్షసేంద్ర అనుయాయులు = రావణుని వెంబడించు వారలయు - రోమహర్షము = గగ్గురుపాటు గలిగించు, సంభ్రమము = ప్రయత్నము-విజితరోషుండు= క్రోధముజయించినవాఁడు-అవిచింత్యవిక్రముఁడు=చింతింప సాధ్యపడని విక్రమము గలవాఁడు-సారసాక్షుండు = కమలములవంటి కన్నులు గలవాఁడు, 'శ్రీర్నత్యజతి రక్తాక్ష'మ్మను సాముద్రికశాస్త్రప్రకారము రామునిఁ దప్పక లక్ష్మి భజింపఁ గలదు. 'శ్రేష్ఠేత్రతాపి చక్షుషీ' సర్వేంద్రియాణాం నయనంప్రధాన' మ్మన్నట్లు సర్వావయువ లక్షణములకన్న నయనసౌందర్య లక్షణము తప్పదని భావము, నిర్జరస్వామి సముఁడు=ఇంద్రునితో సమానుఁడు.

తాత్పర్యము

సీతమ్మా! వినుము. ఘంటల ఘణఘణలు, రథముల దబదబలు వినుము. గుఱ్ఱముల సకిలింపులు, వాద్యముల మ్రోతలు వినుము. ఇదంతయు నాయుధములు ధరించిన రావణు భటుల యుద్ధప్రయత్నములు. కావున రామచంద్రమూర్తికి కీడు కలిగెనని విచారపడకుము. అది నిజమైనయెడల నిపు డీ ప్రయత్న మేల? వ్యసనమును నాశము చేయు సంతోషలక్ష్మి నిన్నుఁ జేరఁగలదు. రాక్షసులకుఁ గీడు గలుగును. క్రోధమును జయించినవాఁడు, చింతింపరాని పరాక్రముఁడు. కమలములవంటి నేత్రములు గలవాఁడు, ఇంద్రునితో సమానుఁడు నగు నీ మగఁడు రావణుఁ జంపి ని న్నేలుకొనును.

కం. బాసట గాఁగ నుపేంద్రుఁడు, వాసవుఁ డరివధము సేయు•వడువునను సుమి
త్రాసుతయుతుఁడై నీ పతి, యాసురసైన్యముల నెల్ల•హతముం జేయున్. ౨౮౧

అర్థములు. బాసట=సహాయుఁడు-ఉపేంద్రుఁడు = విష్ణువు, వాసవుఁడు = ఇంద్రుఁడు - అరివధము=శత్రువధము-వడువున=విధముగ.

తాత్పర్యము

విష్ణువు తోడుగా నింద్రుఁడు శత్రువులఁ జంపినట్లు లక్ష్మణునితోడ నీ మగఁడు రాక్షససేనల నాశము చేయును.

సీ. చూడక పోదునా • సుందరీ! జితవైరి, నీ పతిఁ బతుకు వున • నీవు గలుక
విడువక పోదునా•వెలఁది! కాంతునిఁ గ్రుచ్చి, కౌఁగిట ముద్బాష్ప•కణము లెదను

బతి చిక్కుడీయునే॥పదము లంటెడునిన్ని, నెలలుగఁ బెనఁ గొన్న॥నీదుజడను
బాయక యుండువా॥పాముకుబుసము నాఁ, బతిఁ జంద్రముఖుఁజూచి॥వ్యసనమెల్ల
తే. రావణాసురుఁదూర్ణంబ॥రామచంద్రుఁ, డనినివధియించి ప్రియురాల॥వైననిన్నుఁ
గదిసి సౌఖ్యార్హుఁడెల్ల భోగములఁ దేలు, సంతసింపఁగదమ్మ యో॥జానకమ్మ.

అర్థములు. జితవైరి జయింపఁబడిన శత్రువులుగలవాఁడు- కుఱువునన్ = తొడమీఁద - ముత్ + బాష్పకణములు = ఆనందబాష్ప బిందువులు-ఎదను = హృదయమందు - తూర్ణంబ= వేగము-అనిని= యుద్ధమందు.

తాత్పర్యము

సుందరీ! శత్రువుల జయించిన నీ మగని తొడమీఁద నీవు కులుకుచుండఁగా నేను జూడకపోదునా? నీ మగని నీవు కౌఁగిలించి యతని హృదయమందు నీ వానంద బాష్పములు విడువకుందువా? పది నెలలుగాఁ బెనసిన, పాదముల నంటుచున్న నీ జడను నీ మగఁడు చిక్కుడీయును లే. ఇట్లు జరుఁగఁగా బాము కుబుసము విడిచినట్లు నీవు వ్యసనమును విడువకుందువా? రావణాసురుని నీమగఁడు వేగముగనే యుద్ధమున జంపి ప్రియురాల వగు నిన్నుఁ జేరి సౌఖ్యముల ననుభవింప యోగ్యుఁ డగువాఁడు సకల భోగముల ననుభవించును. సంతోష పడవమ్మా జానకమ్మా!

కం. కారునను వాన గురిసిన, నారబములఁగూడి పుడమి॥యల రెడిమాడ్కిన్
వీరుండు మహాత్ముం డగు,నీ రమణునిఁ గూడి కనెదు॥నిండుముదంబున్. ౭౨౦

అర్థములు. కారునను = తగిన కాలమందు- ఆరబములన్ = పైరులను

తాత్పర్యము

తగిన సమయమున వర్షము గురియుటచే భూమి పైరులతో నిండినట్లు వీరుఁడు, మహాత్ముఁడు నగు నీ మగనితోఁ గూడి నీవు పూర్ణసంతోష మనుభవింపఁ గలవు.

కం. కావా తిరుగు హయుం బనఁ,గా విబుధాలయముఁ జుట్టు॥ కరుణ జగత్సౌ
ఖ్యావహుఁడగు నీ వేలుపు, వేవెలుఁగున్ శరణుఁజొరుదు॥విశ్వాత్మకునిన్. ౭౨౧

అర్థములు. కావా = చక్రాకారముగా - విబుధాలయము = మేరుపర్వతము-వేవెలుఁగున్ = సూర్యుని, సౌఖ్యావహున్ = "అగ్నౌ ప్రస్తాఽఽహుతిస్సమ్య గాదిత్య ముపజాయతే" "వృష్టి ర్వృష్టే రన్నం తతః ప్రజా" యను వాక్యములను సంధించునది. ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అని కలదుకదా!

తాత్పర్యము

గుఱ్ఱము గుండ్రముగాఁ దిరుగునట్లు మేరుపర్వతమును బ్రదక్షిణము సేయు, దయగలిగి లోకసౌఖ్యము గలిగించు సూర్యుని, విశ్వాత్మకుని శరణుజొరుదు.

**-॥౩౪-వ సర్గము.సీతాదేవి నరమను రావణుమనోనిశ్చయం బెఱింగి రమ్మనుట.॥-**

కం. సూరకర తప్తమహి నా,సారంబున శాంతి పఱచు॥చదల నవఁగను ర
క్షోరాణ్మోహిత దుఃఖిని, చారను సంతోషపఱచి॥సఖ్యము పేర్మిన్. ౭౨౨

అర్థములు. సూరకర=సూర్యుని కిరణములచే, తప్త=కాలిన, మహీన్ = భూమిని ఆసారంబునన్=జడివానచే, శాంతిపరమ=చల్లబడజేయు, చనలు = ఆకాశము-రక్షోరాట్ + మోహితన్ = రాక్షసరాజుచే వంచింపబడినదానిని - దుఃఖ విచారను = దుఃఖముతో గూడిన యాలోచన గలదానిని-మగఁడు మరణించెనను దుఃఖము, ఇఁక నా గతియేమి యను విచారము-సఖ్యము పేర్మిన్=స్నేహమువలని యతిశయము వలన.

తాత్పర్యము

సూర్యకిరణములచేఁ దపించిన భూమిని జడివానచేఁ జల్లపఱచిన యాకాశమువలె రాక్షసరాజుచేత విపరీతభావము గలదిగాఁ జేయఁబడి, పతి మరణించె నను దుఃఖముచేతను ఇఁకఁ దనగతి యేమను విచారముచేతను దపించు సీతాదేవిని స్నేహాతిశయమున సంతోషపఱచి.

కం. కాలజ్ఞ నరమ స్మితపూ, ర్వాలాప వచించె నేరి • కగపడకుండన్
బాలా! నీ సేమము వా, క్యాళియు రామునకుఁ దెల్పి • యురుదే నర్తున్. ౭౨

అర్థములు. కాలజ్ఞ=ఏకాలమున సేవని చేయవలయునో యది తెలిసినది. స్మితపూర్వ=చిఱునవ్వు ముందుగాఁ గల-ఆలాప = మాటలు గలది - నవ్వుచు మాటలాడునది.

తాత్పర్యము

సమయ మెఱిఁగి పని చేయఁగలదియు,చిఱునవ్వుతో మాటలాడునదియు నగు సరమ యిట్లు చెప్పెను. ముగ్ధా! నే నెవ్వరికిఁ గానరాకుండఁ బోయి నీక్షేమము, నీవు చెప్పుమాటలు నేను రామునకుఁ దెలిపి రాఁగలను.ఏమి చెప్పిరమ్మనెదవో చెప్పుము.

కం. అంబరమున నేను నిరా, లంబగతిం జనెడివేళ • లలన! యెయిదఁ జ
క్యం బెట్టుగాను పత్త్రర, థంబుల యేలికయు నే స•దాగతి కైనన్. ౭౩

అర్థములు. అంబరమునన్ = ఆకాశమున - నిరాలంబగతిన్ = నిరాధారముగ - వాయువువలె - ఎయిదన్ = నన్నుఁ గలిసికొనుటకు - పత్త్రరథంబుల యేలికయున్ = గరుత్మంతునకు-సదాగతికి=వాయువునకు.

తాత్పర్యము

లంకలో వీథులవెంట రాక్షసుల గుంపంటివి, ఆవల వానరుల గుంపంటివి. అడుఁదాన ఏ గుంపులో నెట్లుపోయి రాఁగలవందువేమో? ఆకాశమున నిరాధారముగ విమానాదులతోఁ బనిలేక నేను బోవునప్పుడు నన్నుఁ గలిసికొన నావెంట నచ్చుటకు గరుత్మంతుఁడు గాని వాయువు గాని యెంత ప్రయత్నించినను శక్తుఁడు గాఁడు.

ఉ. తియ్యఁదనంబు దోఁప సుద•తీమణి శోకముఁ బాచి నెయ్యపుం
దోయ్యలిఁ బల్కు-• నేనెఱుఁగు • దున్ గగనంబు రసాతలంబు నేన్
దయ్యెక పోయి రాఁగలవు • నాదు నిమిత్త మసాధ్యకార్యమేన్
జయ్యనఁ జేయఁగాఁ గలవు • సాధుమతీ! వినుమొక్క-కోరికన్. ౭౪

అర్థములు. నెయ్యపుఁదొయ్యలిన్ = స్నేహితురాలిని, తియ్యదనంబు దోఁపన్ = శబ్దము. అర్థము ఇంపుగా నుండునట్లు, పాచి = పోఁగొట్టుకొని, డయ్యక = గాసిలేక, చయ్యనన్ = త్వరగా.

తాత్పర్యము

సీతాదేవి శోకమువదలి మాట, యర్థము ఇంపుగానుండునట్లు లిట్లు స్నేహితురాలితోఁ జెప్పెను నీ వాకాశమందుఁగాని, పాతాళమునకుఁ గాని గాసిలేక పోయి రాఁగల వని నే నెఱుఁగుదును. మఱియును నీవు నానిమిత్తమై యెంత యసాధ్య కార్య మైనను జేయఁగలవు. అయినను నా కోరిక చెప్పెద వినుము.

ఉ. నీవును మత్ప్రియార్థమున • నిశ్చలచిత్తవ యేని నెచ్చెలీ
రావణుఁ డేమి చేసెడినొ • శ్రీఘ్రమ పోయి యెఱింగి రమ్ము మా
యావి దయావిహీనుఁడు దు•రాత్ముఁడు శాత్రవరావణుం డయో
త్రావినమాత్ర వారుణివి•ధంబుగ నన్నటు మోహ పెట్టెఁగా. ౭-౮

అర్థములు. మత్ప్రియ + అర్థమునన్ = నాకుఁ బ్రియమైన కార్యము చేయుటయందు-నిశ్చలచిత్తవయేని = చలింపని మనస్సుగలదానవైతివేని - శ్రీఘ్ర అన్ = శీఘ్రముగా -మాయావి = మాయలాఁడు - దయావిహీనుఁడు = దయ లేనివాఁడు—దురాత్ముఁడు = దుష్టబుద్ధిగలవాఁడు—శాత్రవ రావణుఁడు = శత్రువుల నేడిపించువాఁడు, వారుణి=కల్లు.

తాత్పర్యము

స్నేహితురాలా! నాకుఁ బ్రియమైన కార్యము చేయవలయునను స్థిరచిత్తము గలదానవైతివేని నీవు త్వరగాఁబోయి మాయలమారియు, దయలేనివాఁడును, దుష్టబుద్ధి గలవాఁడును, పగవారి నేడిపించువాఁడును నగు రావణుఁ డిప్పు డేమి చేయుచున్నాఁడో, నన్ను నింకేదైన మాయోపాయములు చేసి దుఃఖపెట్టఁ జూచుచున్నాఁడా! నా వలనఁ గదా లంక కింత యపాయము వచ్చెనని నన్నుఁజంపఁ జూచుచున్నాఁడా? ఏమి యాలోచించుచున్నాఁడో తెలిసికొని వేగరమ్ము. త్రావిన వెంటనే కైపుచే దేహము తెలియకుండఁజేయు కల్లువలె నన్ను నిమిషములో విపరీతజ్ఞానము కలదానినిఁగా జేసెఁగదా. ఇప్పుడు రామచంద్రమూర్తి యొద్దకు నరమపోయి సాధింపఁదగిన కార్యము లేదు. అట్లు పంపుట భావ్యముకాదు. వలద నిన నరమ యేమి మనస్సు నొచ్చుకొనునో యని యిట్లుపాయముచేసి సీత చెప్పెను.

సీ. కావలి యున్న రా•కాసిమూఁకలు నన్ను, నదరింప బెదరింప • నడలుదాన
నేవేళ కేమేమి • గావించునో యను,సందేహపాటున • భ్రమందుదాన
మనమున స్వాస్థ్య మన్ • మాట లేద యశోక, వని నుంటఁ దద్భీతి•వనరుదాన
వానిచరిత్రంబుఁ• వానినిశ్చయమును, నెఱుఁగ రా దోకయింతి•యేని చాన

తే. కావ వాని విధంబును • గరుణ నెఱఁగి, వచ్చి చెప్పుము నా కదే • సచ్చరిత్ర
పరమ మగు నుపకృతియన•సరమ జవర,నుడులనూరార్చి కన్నీళ్లు•తుడిచిపలుకు.

అర్థములు. అదరింపన్ = గ్రుడ్లు గిరగిర ద్రిప్పి — పండ్లు పటపటఁగొరికి యిత్యాదిచేష్టలచేత భయ పెట్టఁగా; బెదరింపఁగా=చంపు,నరకు,కోయుతిను ఇత్యాది మాటలచే భయ పెట్టగా—అడలుదానన్=దుఃఖించుచున్న దానను,ప్రమందుదానన్ = చచ్చుచున్న దానను— స్వాస్థ్యము = నెమ్మది — వనరుదానన్ = శోకించుదానను. ఉపకృతి=ఉపకారము, జవరనుడులన్=మృదువాక్యములచేత.

తాత్పర్యము

నా మగనియొద్దకు నీ విప్పుడుపోయి చెప్పుగల దేదియు లేదు. నే నిచ్చట దుఃఖించుచుండుట యాయనయే యెఱుఁగును.ఆయనకు నేను జెప్పునదియేమున్నది? రావణాసురుని నా మగఁడు చంపులోపల నన్ను రావణుఁడు చంపక విడచునా యని నా సందేహము. నన్నే వేళకు వీఁడు చంపునో యని భయపడుచున్నాను. పలనఁ గావలియున్న యీ రాక్షస స్త్రీలు న న్నదరించి బెదరింప బాధింపఁబడుచున్నాను. ఏ నిమిషమున వాని కే దుర్బుద్ధి పుట్టునో, యేమిచేయునో యని సందేహముచేఁ జచ్చుచున్నాను. మనస్సునకు నెమ్మది యనునది యెట్టిదో తెలియక వాని స్వాధీనమందుండు నీ యశోకవనమునం దుండి వానికి భయపడి శోకించుచున్న దానను; వాఁడు చేయుకార్యమేదో, వాఁడేమి చేయ నిశ్చయించుకొన్నాఁడో, నాకుఁ గొంచెమైనను దెలియలేదు. మఱల నన్నీయఁదలఁచెనో, యుద్ధమే చేయఁదలఁచెనో, నన్నుఁ జంపఁదలచెనో, యేదియు నాకుఁ దెలిసినది కాదు. కావున నీవు వాని విధము తెలిసికొని వచ్చితివేని నిబ్బరముగ నుండెదను. మంచి నడవడి గలదానా! అదియే నీవు నాకుఁ జేయవలసిన మహోపకారము అని చెప్పఁగా మృదువాక్యముల నూరార్చి సరమ యామె కన్నీళ్ళు తుడిచి యిట్లనెను.

కం. ఇది యేని నీదుకోరిక, యిదెపోయి విరోధిచిత్త • మెఱిఁగి జవమునన్
సుదతీ! క్రమ్మఱుదానను, ముదితమనంబునను జెలఁగు•ముగుదా! నీవున్. ౭-౨౦

అర్థములు. విరోధిచిత్తము=నా ప్రాణస్నేహితురాలవైన నీకు, నా ప్రాణభర్తకును విరోధి యగువాఁడు నాకును విరోధియే యని భావము. కావున నీ విరోధి యనక మన విరోధి యను నర్థము వచ్చునట్లు చెప్పెను. లేదా లోకవిరోధి యనియైన గ్రహింపనగు, జవమునన్ = వేగమున—ముదితమనంబునన్ = సంతోషించిన మనస్సుతో.

తాత్పర్యము

నీ కోరిక యిదియైన పక్షమున నే నిదిగో యిప్పుడే పోయి పగవారి మనస్సు దెలిసికొని శీఘ్రముగా మరలి వత్తును. నీవు శోకింపక సంతోషముగ నుండుము.

—• సరమ సీతాదేవికి రావణునిశ్చయం బెఱింగించుట •—

కం. అని రావణు డాయం జని, విని యా కావరుఁ డమాత్య•బృందముతో వా
కొనువిధము వాని నిశ్చయ,మును దెలిసియశోక వనికి•ముహూర్తములోనన్. ౨౨౯

అర్థములు. కావరుఁడు=మర్మదము గలవాఁడు-అమాత్యబృందముతో = మంత్రిసమూహముతో -వాకొనువిధము = చెప్పెడితీరు - ముహూర్తములోనన్ = అల్పకాలములో.

తాత్పర్యము

ఈ ప్రకారము సీతాదేవికిఁ జెప్పి సరమ పొగరుఁబోతగు రావణుఁ డున్న చోటికిఁ బోయి వాఁడు మంత్రులకుఁ జెప్పువిధము విని వాని నిశ్చయము దెలిసికొని ముహూర్త కాలములో మరల నశోకవనమునకు వచ్చి,

ఉ. క్రమ్మఱి భ్రష్టపద్మ రమ•కైవడి నై తనరాక వేచు నా
కొమ్మను డాయ సీతయును•గూరిమిఁ గౌఁగిటఁ గ్రుచ్చి తాన పీ
ఠమ్మొసంగి పల్కె- నిచ•టన్ క్రమ మాఱ సుఖోపవిష్టవై
యమ్మొఱకైన క్రూరహృద•యంబు విధంబు వచింపు సర్వమున్. ౨౩౦

అర్థములు. భ్రష్టపద్మ = పద్మాసనమును విడిచినది - రమకైవడిన్ = లక్ష్మీదేవివలె-వేచు = కాచుకొను-డాయన్ = సమీపింపఁగా-సుఖోపవిష్టవు = సుఖముగాఁ గూర్చున్నదానవు- మొఱకు=మూర్ఖుఁడు, క్రూర = క్రూరునియొక్క.

తాత్పర్యము

పద్మమును విడిచిన లక్ష్మీదేవివలెనై తానెప్పుడు వత్తునోయని తాను వచ్చు మార్గమునందే దృష్టియుంచి చూచుచున్న యాసీతాదేవిని జేరఁబోఁగా ప్రేమతో నామె సరమను గౌఁగిలించి తానే పీట యిచ్చి దీనిపై నీవు పోయి వచ్చిన గాసిదీఱ సుఖముగఁ గూర్చుండి మూర్ఖుఁడైన యా క్రూరుని హృదయ మెట్టిదో వచింపుము.

కం. అని వణఁకుచు నడిగిన యా, జనకాత్మజతోడ సరమ•సచివాన్వితుఁడై
దనుజేంద్రుఁడు చేసిన యో, జనను యథార్థముగ నిట్లు•సకలముఁ జెప్పెన్. ౨౩౧

అర్థములు. సచివాన్వితుఁడై =మంత్రులతోను సహాయులతోడను గూడిన వాఁడై-'మంత్రీ సహాయ సచివౌ' అని యమరము. మంత్రి = ఆలోచన చెప్పు వాఁడు - సహాయుఁడు=కూడఁ బనిచేయువాఁడు.

తాత్పర్యము

ఇట్లు ఏమి చెప్పునో, యేమోయని భయముచే వణఁకుచు నడిగిన సీతాదేవితో సరమ మంత్రులను సహాయులను గూడినవాఁడై రావణుఁడు చేసిన యాలోచనను నున్న దున్నట్లు సర్వముఁ జెప్పెను.

సీ. రాజాస్య! వినవమ్మ • రావణుతల్లియు, మఱియు నవిద్ధుఁ డ•న్మంత్రివృద్ధు
శ్రీరామవిభునకు • సీత నిమ్మంచును, బలువిధముల బోధ•పఱచి రమ్మ
యల జనస్థానమం • దైన యద్భుతము దృష్టాంతంబుగాఁ గొని•యాడి రమ్మ
యంబుధి లంఘించి • హనుమ వచ్చుట నిట, నినుఁ గంట నసురుల•నిహతిసేఁత
తే. మదిని దలపోయ మానవ•మాత్రుఁ డైన
వాఁడు గావించు పను లౌనె • వలదె దలఁప?
యనుచు బోధింప ధనకాము • ధనముఁబోలె
నిన్ను విడువంగ నొల్లఁడు • నిర్జరారి. ౨౩౨

అర్థములు. రాజాస్య=చంద్రునివంటి ముఖముగలదానా, రావణుతల్లి=కైకసి, మంత్రివృద్ధు=వృద్ధమంత్రి-మంత్రులందు పెద్దవాఁడు-వృద్ధాదులకు దుక్లోపంబు విభాష నగు - నిహతిసేఁత=చంపుట, ధనకాము=ధనమునందుఁ గాంక్ష గలవాఁడు, నిర్జరారి=దేవవిరోధి=రావణుఁడు.

తాత్పర్యము

సీతమ్మా! రావణునితల్లి కైకసి, వృద్ధమంత్రి యవిద్ధుఁ డనువాఁడును శ్రీరామచంద్రమూర్తికి సీతమ్మనిమ్మని నానావిధముల బోధించిరి. జనస్థానమునందు ఖరాదులఁ బదునాలుగువేల రాక్షసులను నల్పకాలములో లక్ష్మణుఁడు కూడఁ దోడు లేక యొంటివాఁడు పాదచారి వధించుట యత్యాశ్చర్యమైనది. ఇప్పుడో లక్ష్మణుఁడును, సేనలతోడ సుగ్రీవుఁడును దోడుపడి యున్నారు కావున నెంత పని యైనఁ జేయఁగలుగును. నాకిక్కడ కోటలు లేవా? సేనలు లేవా? ఖరాదుల మించిన బలవంతులు లేరా యందువేమో? ఒక్క క్రోఁతి సముద్రము దాఁటి యిచ్చటికి వచ్చి నీకుఁ దెలియకుండ సీతను జూచి మాటలాడి కోటలన్ని నొఱిచి పాతిక సేనఁ జంపినపుడు నీ వీరులంద ఱెందుండిరి. ఒక్కఁడైన వానిని నిగ్రహింపఁ గలిగెనా? తమ కొంపలైనఁ దాము గాచుకొనఁ గలిగిరా? ఇప్పు డట్టి క్రోఁతు లెందఱో యున్నారే, వా రంద ఱూరిమీఁదఁబడిన నేమిగతి? ఇవన్నియు సామాన్య మనుష్యునకుఁ జేయ సాధ్యమా? ఇవన్నియు నీ వాలోచింపవలదా యని బోధించిరి. కాని లోభియగు వాఁడు ధనమును వదలలేనట్లు రావణుఁడు నిన్ను వదలిపెట్ట నంగీకరించిన వాఁడు కాఁడు.

ఉ. ముక్కున నూర్పు గల్గ నల•మూర్ఖుఁడు నిన్విడువంగఁ బోఁడు, దన్
ద్రెక్కొను మృత్యులోభమున • నిశ్చిత మయ్యెను వానిబుద్ధి, వాఁ
డుక్కఱి యీవిభీషికల • కో తరుణీ! బెదరండు, దానునన్
రక్కసు లీల్గుదాఁక నిను • రాముని కర్పన సేయ నేరడున్. ౨౩౩

అర్థములు. ఊర్పు=శ్వాసము - ద్రెక్కొను = ద్రింగునట్టి-ఉక్కఱి =

ఉక్క+అజి=బలము చెడి – బిభీషికలకున్ = బెదరింపుమాటలకు – బెదరండు= భయపడఁడు–అప్పన=అర్పణము.

తాత్పర్యము

కొనయూపిరి ముక్కునగూడ విడిచిపోవువరకు అనఁగా పీనుఁగై పడువఱకు నిన్ను వదలఁడు. వానికేల యటువంటి దుర్బుద్ధి యనెదవా? మృత్యుదేవత వానిని మ్రింగ నాశపడియున్నది. కావున 'వినాశకాలే విపరీతబుద్ధి' యన్నట్లు వాడట్లు నిశ్చయము చేసికొని యున్నాఁడు. ఈ బెదరింపుమాటలకు వాఁడు బలగర్వము చెడి భయపడఁడు. కావునఁ దాను దనవారు రాక్షసులందరు చచ్చుదాఁక నిన్ను శ్రీరామున కర్పింపఁడు. ఈ కారణముచే నీకు ప్రాణభయము లేదు. నిన్ను బెదరించునే కాని చంపఁడు.

ఉ. మానిని! రాక్షసేంద్రు శిత•మార్గణపంక్తిని గూల్చి నిన్నయో
ధ్యానగరంబుఁ దోడుకొని • తప్పక పోవును నీ విభుండు, లో
మానుమి శంక యంచు సర•మానతి పల్కుచు నుండునంతలో
వానరశంఖభేరుల ర•వంబులు ధారిణి దద్దరిల్లఁగన్. ౨౩౪

అర్థములు. శితమార్గణపంక్తిని=పదునగు బాణముల వరుసచే, కూల్చి= చంపి, అయోధ్యానగరంబు, ఉద్దేశ్యార్థంబున ద్వితీయ, లోనన్ = మనస్సులో దద్దరిల్లఁగన్ = తల్లడిల్లఁగా.

తాత్పర్యము

అట్లైన నా మగనియొద్ద నేను జేరుట యెట్లందువా? నీ మగఁడు రావణుని వాఁడి బాణముల గుంపులచే చంపి నిన్ను అయోధ్యకుఁ దీసికొనిపోవును. నీవు సందేహ పడవలదు. అని సరమాదేవి చెప్పుచుండు నంతలో వానరుల సింహనాదములు, శంఖముల, భేరుల ధ్వనులు భూమి తల్లడిల్ల పడునట్లు.

కం. విన రా లంకాపురమున, మనుజాశను లెల్ల భీత • మానసముల వి
న్ననిమోములనసుములపై, మనుజాధిపుదోషమునను•మానిరి యాశల్. ౨౩౫

అర్థములు. వినరాన్ = వినఁబడఁగా– భీతమానసములన్ = భయపడిన మనస్సులతో–విన్నని మోములన్=వెలవెలఁబోయినముఖములతో–ఉసురులపై= ప్రాణములమీఁద – మనుజాధిపుదోషమునను = రాజదోషముచే–ఇచ్చట మను జాధిప శబ్దము రాజశబ్ద పర్యాయమాత్ర మగును.

తాత్పర్యము

వినరాఁగా లంకలోనున్న రాక్షసులు భయపడి, తెల్లని మోములు గల వారై తమ రాజు చేసిన దోషమువలన ప్రాణములమీఁది యాశ మానిరి.

**-•౩౫-వ సర్గము మాల్యవంతుఁడు సీతాదేవి నిమ్మని రావణునకు నీతిబోధించుట•-**

తే. శంఖభేరీనినాదముల్ • సాంద్రముగను, బరపురంజయుఁ డగు రామ•భద్రుఁ డేగు
దేరఁ దన్నాద మాలించి•దివిజవైరి, ధ్యానతత్పరుఁ డయిముహూ• ర్తంబొకండు.

అర్థములు. సాంద్రముగను = దట్టముకాఁగా, పరపురంజయుఁడు = శత్రు పురముల జయించువాఁడు, తత్ + నాదము = ఆ ధ్వని, దివిజవైరి = రావణుఁడు, ముహూర్తంబొకండు = ఒక్క ముహూర్తకాలము, ధ్యానతత్పరుఁడయి = ఆలోచన యందు మనస్సుంచినవాఁడై.

తాత్పర్యము

వానరుల శంఖములయు, నగారాలయు ధ్వనులు దట్టముగ దిక్కులు పిక్కటిల్ల వ్యాపింపఁగా, రాముఁడు లంక ముట్టడింప వచ్చు చుండుట తెలిసికొని రావణుఁడు ఒక ముహూర్తకాలము ఏమి చేయుదునా యని యాలోచించినవాఁడై.

ఉ. అంతటఁ మంత్రులం గని మ•హానినదంబునఁ గ్రూరుఁడున్ జగ
ద్బృందమనోవ్యథాకరుఁడు•దిట్టుచుఁ గేకలు వేసి పల్కు మీ
రందఱు సైన్యయుక్తుఁ డయి•యంబునిధిం దరియించి భూమిభృ
న్నందనుఁ డేగుదెంచె నని•నం జుడీఁ నేఁ జెవిఁ దూఱఁబెట్టితిన్. ౨౩౭

అర్థములు. జగత్ + బృంద + మనోవ్యథాకరుఁడు = లోకసమూహముల మనస్సులకు బాధకలిగించువాఁడు, భూమిభృత్ + నందనుఁడు = రాజకుమారుఁడు — రామచంద్రుఁడు, చెవిదూఱఁబెట్టితిని = చెవులలోఁ దూఱునట్లు చేసితిని, నేనై తెలియఁగోరి విన్నదికాదు.

తాత్పర్యము

క్రూరుఁడు, లోకుల మనస్సుల బాధపెట్టువాఁడు నగు రావణుఁడు మంత్రుల నందఱఁజూచి వారిని దిట్టుచు, బొబ్బలు పెట్టుచు నిట్లనియె. మీరందఱు రాజకుమారుఁడు సేనలతోడ సముద్రము దాఁటి వచ్చెనని చెప్పినఁగదా నే నామాట చెవిలో వేసికొంటిని. అంతకుఁ బూర్వము నాకుఁ దెలియనే తెలియదని భావము. బుద్ధిలేని వారకార్యములు చేసి యవి ప్రాణగండముగా వచ్చినపుడు దిక్కుదోఁపక యితరుల పైపడి యుల్లేక్కుదురు. ఎదురు చెప్పువాఁడు లేడని నోటికి వచ్చినట్లెల్ల వాగుదురు. ఇది దుర్బుద్ధుల లక్షణము.

చం. ధరణిసుతామనోహరుని•దర్పము విన్కలి నూనమూని యొం
డొరుల మొగంబుఁ జూచుకొను • చున్నను మీరలు సంగరంబునం
దరుదగు సత్యవిక్రము ల•టంచు నెఱుంగుదు, మిమ్ము నమ్మికా
యరగలి లేక యెంతటి మ•హాకృతి నేనియు నిర్వహించితిన్. ౨౩౮

అర్థములు. విన్కలి = వినుకలి = వినుటచే, అరుదగు = ఆశ్చర్యకరమైన,

అరగలి = అర+కలిమి=సందేహము, మహాకృతి = గొప్పకార్యము, నిర్వహించితిని=నెఱవేర్చితిని.

తాత్పర్యము

సీతానాథుఁ డగు రామచంద్రుని బలగర్వము వీని నోరు మూసికొని యొకరి మొగ మొకరు చూచుచున్నను మీరు యుద్ధమందు నద్భుతము నిర్వంచనము నగు పరాక్రమము గలవారని నాకుఁ దెలియును. మమ్ము నమ్మి కదా సందేహము లేక యింతటి గొప్ప కార్యమైనను నెరవేర్చితిని. ఇప్పుడు మాత్రము మీరు నిండు మనస్సుతో సాహాయ్యము చేసిన నేని కార్యము నిర్వహింపలేక పోదునా?

కం. అని రావణుఁ డాడినఁ దజ్జననికిఁ బినతండ్రి యతులసంవిద్ఘనుఁ డి
ట్లని పలికె మాల్యవంతుం, డను రాక్షసవరుఁడు సనయమగు మార్గమునన్.

అర్థములు. తజ్జననికిఁ బెదతండ్రి=రావణుని తల్లి తండ్రి కన్న — రావణుని తల్లి కైకసి, ఆమె తండ్రి సుమాలి, అతనియన్న మాల్యవంతుఁడు, అతుల సంవిద్ఘనుఁడు=అసమానమైన బుద్ధియందు గొప్పవాఁడు, సనయము=నీతితోఁ గూడినది.

తాత్పర్యము

రావణుఁ డిట్లు చెప్పఁగా మిగుల బుద్ధిమంతుఁడు నతని తల్లికిఁ బెదతండ్రి యగు మాల్యవంతుఁడు నీతియుక్త మగు మార్గమున నిట్లనెను.

తే. నృపతి ధర్మ మెఱింగించు నీతివిద్య,లందుఁ బండితుఁ డయి నయమనుసరించు
వాఁడు చిరకాల మేలు నైశ్వర్యయుక్తి, వైరివర్గంబునెల్ల స్వవశముఁ జేయు.

అర్థములు. నృపతిధర్మము = రాజధర్మము - నయము = నీతి - నీతి విద్యలు ఆన్వీక్షకి, త్రయి, వార్త దండనీతి యని నాలుగు గలవు.

'ఆన్వీక్షకీం త్రయీం వార్తాం దండనీతించ పార్థివః। తద్విద్భి స్తత్క్రియోపేతై శ్చింతయేద్వినయాన్వితః। ఆన్వీక్ష క్యాత్మవిజ్ఞానం। ధర్మాధర్మౌ త్రయీస్థితౌ। అర్థానర్థౌ తు వార్తాయాం। దండనీత్యాం నయానయౌ। విద్యాశ్చతస్ర ఏవైతా యోగక్షేమాయ దేహినాం। విద్యావినీతో నృపతిర్న కృచ్ఛ్రేష్వవసీదతి'' కామందకము.

తాత్పర్యము

రాజధర్మమును దెలుపు నీతివిద్యలందుఁ బండితుఁడయి, నీతిమార్గమనుసరించు రాజు ఐశ్వర్యముతోఁ గూడినవాఁడై చిరకాలము రాజ్య మేలుచు శత్రువులను దనవశ లోఁబఱచుకొనును.

కం. సమయోచితముగ నరివర్గముతోఁ గావింపవలయు రణమును సంధిన్
శమితామర! యది తన పక్షము వృద్ధిం జేసి మిగుల సంపదఁ గూర్చున్. ౭౪౧

తాత్పర్యము

కాలము ననుసరించి శత్రువులతో సంధిచేయ వలసినప్పుడు సంధి, యుద్ధము చేయవలసి నపుడు యుద్ధము చేయువాఁడు తన పక్షమును వృద్ధిచేసికొని సంపద గలవాఁడగును.

క౦. తనబలము తఱుఁగుచున్నను, దనతో సముఁడైన సంధి•తగు శత్రువుతో
దనబలము పెరుఁగుచున్నను, జన దాలము సేయఁ బగఱ•సంగరమె తగున్

తాత్పర్యము

ఎప్పుడు సంధిసేయవలయు, ఎప్పుడు యుద్ధము చేయవలయు నందువేమో- శత్రువునకంటెఁ దనబలము తగ్గిపోవుచున్నను- లేదా శత్రువు సమానుఁడైనను సంధి సేయవలయును. శత్రుబలము తగ్గి తన బలము పెరుఁగుచుండెనా శత్రువుల నుపేక్ష సేయరాదు. యుద్ధమే సేయవలయును.

చ. నయవిధ మిద్ది గాన రఘు•నాయకుతోఁ దగు సంధి యిప్డు, నీ
కయ మది, నీకు రామునకు•నన్యోన్య విరోధము సీతఁ దెచ్చుటన్,
రయమున నామె నిమ్ము రఘు•రామునకుం, బగ దీఱు, నంతతో
భయము దొలంగి నీవు నిర•పాయసుఖస్థితి నుండఁ గల్గెడిన్. ౭౪౩

అర్థములు. నయవిధము = నీతిపద్ధతి-అయము = మేలిచ్చు కార్యము - నిరపాయ సుఖస్థితిన్=అపాయములేని సౌఖ్యదశయందు.

తాత్పర్యము

నీవు చెప్పునది యేమి? ఇప్పుడు యుద్ధము చేయవలయునందువా, సంధి సేయవలయు నందువా, యందు వేమో? ఇప్పుడు నేను చెప్పునది నీతిపద్ధతిగావున నిప్పుడు రామునితో సంధిసేయుటయే తగినకార్యము. దానికేమి సేయవలె? రాముని కార్య మీడేఱబడుమందువా? అక్కఱలేదు. కలహకారణము సీత- సీతను మరల రాముని యొద్దకు వేగముగఁ బంపుము. దానితోఁ బగ ముగియును. అంతతో నీవు నిర్భయముగ నిరపాయసుఖము లందఁగలవు. సీతను బంపఁగానే యుద్ధము నిలుచునని యేమి నమ్మకము అందువా? రాముఁడు తనభార్యను దాను రాఁబట్టుకొనుటకై యుద్ధమునకు వచ్చినాఁడు కాని నీ రాజ్యమాశించి కాదు. కావున నామె నిచ్చుటతోఁ బగ కారణము తీరిపోవును. నీ రాజ్యమున నీవు ఆయన రాజ్యమున నాయన సుఖముగ నుండవచ్చును.

క౦. దేవర్షులు గంధర్వులు, నేవానికి జయము గల్గ•నిచ్చఁ దలఁతురో
యా వసుధాపతితో నే, లా వైరము సంధి సేయ•నర్హము నీకున్.

అర్థములు. ఇచ్ఛన్=మనస్సునందు, నాలుగవ పాదంబునఁ బ్లుతయతి.

తాత్పర్యము

సంధియే యేల చేయవలెను? యుద్ధమేల చేయరాదందువా- దేవర్షులు, దేవగంధర్వులు నేవానికి గెలుపు గలుగవలయునని కోరుదురో యట్టి రాజకుమారునితో నీకు విరోధమేల? పిల్లి శాపమున కుట్లు తెగునా? వారు కోరఁగానే నేను జెడుదునా యందువేమో? పశువుల కాఁపరి పశువులను కొట్టినట్లు దేవతలు తాము చెఱుపఁదలఁచినవానిని కట్టెలతోఁ గొట్టరు వారు సంకల్పముచేఁ గార్యములు చేయుదురు. చేయింతురు. కావున రామునకుఁ గానవచ్చు వానరబలమే గాక దైవబలముగలదు.

సీ. రెండుపక్షంబులు • సృజియించె జగతిపై, ధాత ధర్మంబు న • ధర్మ మనఁగ
నమరులు మహాత్ము•లాశ్రయించిరి ధర్మ, మసుర లధర్మంబు•నాశ్రయింత్రు
ధర్మమే వేళ న•ధర్మంబు మ్రింగునో, యదియుచూ కృతయుగ•మనఁగఁబడును
ధర్మమే వేళ న • ధర్మంబుచేఁ జెడు, నదియ ఘోరకలికాల•మనఁగఁబడెడి
తే. జగములను నీవు చరియించు • సమయములను
నేపుమెయి ధర్మ మెల్లను • రూపు మాపి
సంగ్రహించి తధర్మంబు • నరకు లేక
దాన మనకంటె బలులైరి • కానివారు. ౭౪౫

అర్థములు. ధాత=బ్రహ్మ. మహాత్ములు = గొప్పమనస్సుగలవారు, అన్యము=అధర్మము, ఏపుమెయి = పరాక్రమముచేత, నరకు లేక = లక్ష్యము లేక,

తాత్పర్యము

బ్రహ్మదేవుఁడు లోకమున ధర్మమని, యధర్మమని రెండు పక్షములు సృజించెను. దేవతలు గొప్పబుద్ధికలవారు కావున ధర్మము నాశ్రయించిరి. అసురులు, రాక్షసులు మహాత్ములు కాకుండుటచేఁ దత్కాలమునకు బాగుగఁ గనిపించు నధర్మము నాశ్రయించిరి. ఎప్పుడు ధర్మ మధర్మమునకంటె నతిశయించునో యదియే కృతయుగము. ఎప్పుడధర్మము ధర్మము నడఁగఁద్రొక్కునో యదియే కలియుగము. తన్నాశ్రయించినవారి నుద్ధరించుట ధర్మముయొక్క గుణము. తన్నాశ్రయించినవారి నధోగతుల పాలు చేయుట అధర్మలక్షణము. ఎంతెంతధర్మమెచ్చునో యంతంత దాని నాశ్రయించినవారికి మేలుగలదు. ఎంతెంత యధర్మమెచ్చగునో దానినాశ్రయించిన వారి కంతంత కీడగును. నీవు దిగ్విజయవేళఁ బరాక్రమముచే ధర్మమునాశముచేసికొని పర్యవసాన మెట్లుండునది లక్ష్యము లేక యధర్మమును సంపాదించితివి. కావున నీ యధర్మము నీకుఁ గీడు చేయక మానదు. ధర్మమందున్నవారు బాగుపడక పోరు. కావున మనపగవారు మనకంటె బలిష్ఠులైరి. వారిమూలమున మనకుఁ గీడు కలుగును.

ఉ. మానక నీ వధర్మము ప్ర•మాదముపై నభివృద్ధి చేసి త
ద్దాన నదే గ్రసించెడిని • దానవనాయక యస్మదాదులన్,
మానుగ నయ్యదే విబుధ • మండలిపక్షము వృద్ధిచేసెడిన్,
బూనుట ధర్మమున్ మనుజ•పుంగవుఁడున్ బుధపక్షపాతి యౌ ౭౪౬

అర్థములు. ప్రమాదముపై=హెచ్చరిక తప్పి. గ్రసించెడిని = మ్రింగెడిని, అస్మదాదులన్ = మావంటి వారిని, బుధపక్షపాతియౌ=దేవతల యందుఁ బక్షపాతము గలవాఁడు.

తాత్పర్యము

అధర్మమున, గీడు కలదుకదా యని గమనింపక నీవు హెచ్చరికతప్పి వదలక యధర్మమునే యభివృద్ధి చేసితివి. అది ఫలకాలమున నా వంటివారిని మ్రింగు

చున్నది. ఎప్పుడు మన యధర్మము మనలకుఁ గీడు చేయ నారంభించెనో యదే దేవతలకు మేలు కలిగించెడిని. ఒకటి తగ్గిన రెండవది హెచ్చును. రాముఁడు ధర్మము పూనినవాఁడు కావున దేవతలయందుఁ బక్షపాతము గలవాఁడు కావున వా రాయన మేలు కోరుదురు.

సీ. విషయాసక్తుండవై ♦ ఋషులకన్యలఁబట్టి, యేమేమొ చేసితి ♦ వెఱుకమాలి
వహ్నికల్పులు ఋషి ♦ వర్యుల కద్దాన, నుద్వేగ మమిత మై ♦ యుద్భవిల్లె
మండుచుండెడి వహ్ని ♦ మాడ్కిని దపము పెం,పున దురాధర్షులా ♦ పుణ్యమునులు
భూరితపంబునఁ ♦ బూతచిత్తులు వారు, ధర్మాభివృద్ధి నా ♦ స్థను గలారు
తే. ఆ ద్విజాతులు ముఖ్యంబు ♦ లైన యజ్ఞ,ములను గావించి వేల్చుచ ♦ గ్నులను శాస్త్ర
చోదితం బగు పద్ధతి ♦ వేదరవము నింపెదరు రక్కసులను లె ♦ క్కింప కెదను. ౭౮౭

అర్థములు. విషయాసక్తుండవై = విషయ సుఖములందు మనస్సునుంచిన వాఁడవై, ఏమేమొ = నోరఁజెప్పరానివి, ఎఱుకమాలి = జ్ఞానము లేక, వహ్నికల్పులు = అగ్నితో సమానులు, ఉద్వేగము = మనస్తాపము, దురాధర్షులు = తిరస్కరింపరాని వారు, పూతచిత్తులు = పవిత్రములైన మనస్సులు గలవారు, ధర్మాభివృద్ధిన్ = ధర్మమును మిగుల వృద్ధిచేయుటయందు, ఆస్థ = ప్రయత్నము, ద్విజాతులు = బ్రాహ్మణులు, శాస్త్రచోదితంబు = శాస్త్రము విధించినది, పద్ధతి = మార్గము, లెక్కింపక = లక్ష్యము సేయక.

తాత్పర్యము

విషయ సౌఖ్యముల మఱిగి ఋషుల కన్యకలను, వారి భార్యలను, నీవు నోరఁ జెప్పరాని పనులను జేసితివి. యుద్ధమున జయింపఁదలఁచిన వారిని జయించి యంతతోఁ దృప్తిపడియుండక, యిటువంటి ఘోర కార్యములు చేయుటచే నగ్నిహోత్రునివంటి యా ఋషీశ్వరులు దానిచే మనస్తాపము గలవారైరి. తపస్సు యొక్క యాధిక్యముచే నా పుణ్యమునులు మండెడు నగ్నివలెఁ దిరస్కరింపరాని వారు. వారు గొప్ప తపస్సుచేఁ బవిత్రములైన మనస్సులు గలవారు. వారు ధర్మము నభివృద్ధిచేయు ప్రయత్నము గలవారు. కావున నా బ్రాహ్మణులు ముఖ్యములైన యజ్ఞములను జేసి యగ్నుల వేల్చి శాస్త్రమునఁ జెప్పఁబడిన విధముగ వేదరవమును రాక్షసుల నరకుసేయక దేశమున నించుచున్నారు. ఈ కారణముచే రెండు విధముల ధర్మపక్షము వృద్ధియగుట, అధర్మము నిన్ను నణఁగఁ ద్రొక్కుట-నీకుఁ గీడు కలుగ నయ్యెను.

తే. ఉబ్బు జాఱిన వేసంగి ♦ మబ్బులట్లు, రక్కసులు పాఱుచున్నారు ♦ దిక్కులకును
వారిముంగల వహ్నిసం ♦ భవములైన, పొగలుపదిదిక్కులందును ♦ బగటుమీఱె.

అర్థములు. ఉబ్బు జాఱిన = వృద్ధి క్షయించిన = క్షీణదశకు వచ్చిన - వేసంగి మబ్బులు = ఎండకాలపు మేఘములు - ముంగల = ముందు - అగ్నిసంభవ

ములు=హోమాగ్నులనుండి పుట్టినవి - పగటు విభాతెన్ = ప్రకాశముగ వతిశ యించెను - విస్తారముగ వ్యాపించెను.

తాత్పర్యము

ఎండకాలమందు శ్రీగ్రదశకు వచ్చిన మేఘములవలె రాక్షసులు ఋషుల యెదుట నిలువజాలక దిక్కులవెంట బరువెత్తుచున్నారు. ఋషులకు ముందు హోమాగ్నులవలనఁ గలిగిన పొగలు పది దిక్కులందును వ్యాపించినవి, హోమధూమము రక్షోవినాశకరము గావున నా పొగ వ్యాపించు స్థలముల నిలువలేక రాక్షసులు పరువెత్తుచున్నారని భావము.

కం. ఆ పొగతాఁకునఁ దేజము, రూపఱె రక్కసులగమికి • రూక్షముగ మునుల్
పాపాపహతలములఁ దప, మేఘున గావింప వదియు•యించె వసురులన్. ౨౮

తాత్పర్యము

ఆ హోమధూమము దగులుటచే రాక్షసులకుఁ దేజము నశించెను. మునులు తీవ్రముగ పాపము నాశముచేయు క్షేత్రములందుఁ దీర్థములందు నిలచి తపస్సు చేయుచున్నారు. అది రాక్షసులను బాధించుచున్నది.

ఉ. దానవయక్ష రాక్షసబు•ధ ప్రకరంబులచే వినాశమున్
గానకయుండఁగా వరము • గల్గెను నీకిపు డాహవార్థమై
మానవవానరాచ్ఛము ల•మానుషశౌర్యము లుల్లసిల్ల లం
కానగరంబు ముట్టెను, నిఁ • కం గల కార్యము నూహ సేయుమా. ౨౯

అర్థములు. ఆహవార్థమై=యుద్ధముకొఱకు, మానవవానరాచ్ఛములు = మనుష్యులు, క్రోఁతులు, ఎలుఁగులు-అమానుషశౌర్యములు=మనుష్యులందు లేని శౌర్యములు, ఉల్లసిల్లన్=ప్రకాశింపఁగా, ముట్టెను ముట్టడించెను. కలకార్యము= చేయఁగలపని.

తాత్పర్యము

నీకు దానవులచే, యక్షులచే, రాక్షసులచే, దేవతలచేఁ జావకయుండునట్లు వరమున్నది. ఇపుడు యుద్ధమునకై వచ్చినవారు వారిలో నెవ్వరుకారు. నీవు వరము పొందని మనుష్యులు, వానరులు, ఎలుఁగులు వచ్చి లంకను ముట్టడించినారు. వారైనను మనము మునుపు జూచు సామాన్యమనుష్యులు, సామాన్య మృగములు కావు. మనుష్యులందు దుర్లభములైన శౌర్యములు గలవారు. ఇట్టి సందర్భములందు నీవు చేయవలసిన కార్యమేమో యాలోచింపుము.

ఉ. ఈ తఱి నుప్పరంబున మ•హీన్ జనియించెడి దారుణంబు లు
త్పాతములెల్లఁ గాంచినను • దప్పక నాశము జెందు రాక్షస
వ్రాత మటంచు దోఁచెడి ఖ•ర స్తనితంబులు ఘోరమేఘముల్
భీతికరంబులై కురిసె•వెచ్చని నెత్తురు లంక నెల్లెడన్. ౩౦

అర్థములు. ఉప్పరంబునన్=ఆకాశమునందు ఉపరిశబ్దభవము, మహిన్= భూమియందు - దారుణంబులు = భయంకరములైన - ఉత్పాతములు = కీడును దెలుపు దుశ్శకునములు - రాక్షసవ్రాతము=రాక్షససమూహము - ఖరస్తనితంబులు = పరుషములైన యురుములుగల.

తాత్పర్యము

ఈ సమయమందు నాకాశమున భూమియందుఁ గీడును దెలుపు భయంకరములైన శకునంబులు గానవచ్చుచున్నవి. వానిని జూచిన నీకొకనికే కాదు, రాక్షససమూహమునకు కీడు తప్పదనియే తోఁచుచున్నది. కఠోరములుగా మేఘములురుముచు లంకయందంతటను వేఁడి నెత్తురు గురియుచున్నది.

సీ. కన్నీరు గార్చె శో•కమున వాహనములు, ధ్వజములు ధ్వస్తముల్•వన్నెఁ బాసె
లంకలో గుమిగూడి•కంక గోమాయు గృధ్రంబులు భైరవా•రవము నించెఁ
బూతనాదులు క్షుద్ర•భూతముల్ రాత్రుల, గృహవస్తుతతుల సం•గ్రహము చేసి
మగువల కలలలో•నగపడి తెల్లని దంతముల్, వెలిదోఁప•దగవు లాడి
ఆ. యుపహసించుచున్న•యవి, బలిపిండముల్, కుక్కలిండ్లఁ దూఱి• మెక్కెఁ దోడఁగ
రాసభముల నాలు•ప్రసవించెఁ దిరిగెడి, ముంగిసలను గూడి•మూషికములు.

అర్థములు. ధ్వస్తముల్ = విఱిగిపడినవి - కంక = రాపులుఁగులు - గోమాయు = నక్కలు - గృధ్రంబులు= గ్రద్దలు - భైరవారవము = భయంకర ధ్వని - పూతనాదులు = పూతన మొదలగు - క్షుద్ర భూతముల్ = నీచ పిశాచములు - గృహవస్తుతతులన్ = ఇంటియందలి పదార్థములను - సంగ్రహించి = దొంగిలించి - రాసభములను =గాడిదలను - ఆలు=ఆవులు.

తాత్పర్యము

ఏనుఁగులు, గుఱ్ఱములు లోనగు వాహనములు కన్నీరు గార్చుచున్నవి. ధ్వజములు, కాంతి చెడి విఱిగిపడుచున్నవి. రాపులుఁగులు, నక్కలు, గ్రద్దలులంకలోపల గుంపులై భయంకరధ్వనులు చేయుచున్నవి. పూతన మొదలగు నీచపిశాచములిండ్లలోని వస్తువుల దొంగిలించి రాత్రులందు స్త్రీల కలలలోఁ గనఁబడి తెల్లనిపండ్లు వెలుపలికిఁ గానవచ్చునట్లు కలహించి నవ్వుచున్నవి. దేవతలకు వేసిన బలిపిండములను నిండ్లలోఁ గుక్కలు దూఱి తినుచున్నవి ఆవులకు గాడిదలు పుట్టుచున్నవి. ఎలుకలు ముంగిసలు కలసి మెలసి తిరుగుచున్నవి.

సీ. పిల్లులు పులులతో • విహరించుచున్నవి, కుక్కలు పందులు • గూడి తిరిగెఁ
గిన్నరరాక్షసు•లు నరులొక్కటైరి, పావురంబులు రక్త•పాదములును
దెల్లని మేనులై • తెలిపెడి రాక్షస, పాళులకు వినాశ•కాల మనుచుఁ
జెంపుడు శారికల్ • వేశ్మంబులందు చీ, చీకూచి యని రొద•సేయఁ బోడఁగెఁ

తే. బూర్వనిర్జితములు మృగ♦ములును బక్షు,లుద్ధవిడి వెండి మూఁగెడి♦యుద్ధమునకు
మృగములును బక్షిసంఘముల్ ♦మేర దప్పి, రాజ! వాపోవుచున్నవి♦రవిని జూచి.

అర్థములు. శారికల్ = గోరువంకలు - వేశ్మంబులందు=ఇండ్లయందు - పూర్వ నిర్జితములు=ముందు జయింపబడినవి-ఉద్ధవిడి=మిక్కిలివిడి = విచ్చలవిడి-వాపోవుచున్నవి=ఏడ్చుచున్నవి.

తాత్పర్యము

పిల్లులు పులులు- కుక్కలు పందులు-కలసి మెలసి తిరుగుచున్నవి. కిన్నరులు రాక్షసులు నరులు మైత్రికలవారై యున్నారు. రక్తపాదములు, తెల్లని దేహములు గల పావురములు రాక్షసులకు వినాశకాలమును సూచించు చున్నవి. సాకుడు గోరువంకలు గృహములందు 'చీచి కూచి' యని కూయుచున్నవి. ముందోడి పోయిన మృగములు పక్షులు విచ్చలవిడిగా మరల యుద్ధమునకు గుంపుచేరుచున్నవి. మృగములు పక్షులు వాని మర్యాద విడిచి సూర్యుని జూచి యేడ్చుచున్నవి.

ఆ. మిట్టపండ్లవాఁడు ♦ మిడిగ్రుడ్లవాఁడును, నొఱవ మేనివాఁడు♦కఱకువాఁడు
బోడినెత్తివాఁడు♦పొంచి కన్చున్నాఁడు, వేళవేళఁ దూఁతి♦కాలుఁ డిండ్ల. ౭౫౮

అర్థములు. ఒఱవమేనివాఁడు=నల్లనిగూని గలవాఁడు, కాలుఁడు=మృత్యుదేవత.

తాత్పర్యము స్పష్టము.

కం. ఇట్టివి యుత్పాతంబులు, పుట్టుచు నున్నయవి గాన ♦ బుద్ధిఁ దలఁచి యి
ప్పట్టునఁ జెట్టలు పుట్టని, యట్టిపనుల్ చేయ నీకు ♦ నర్హ మటంచున్. ౭౫౯

అర్థములు. చెట్టలు = కీడులు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఉత్తమసచివాగ్రణులం, దుత్తమపౌరుషధనుండు ♦ నొగిఁ జెప్పియుఁ ద
చ్చిత్తము శోధించియు నది, మత్తపడకున్నఁ జూచి♦మిన్నక యుండెన్.

ఉత్తమసచివాగ్రణులందున్ = ఉత్తమమంత్రులందు - మొదటివారిలో, ఒగిన్ = చక్కఁగా, మిన్నక=ఊరక.

తాత్పర్యము స్పష్టము.

## —♦ ౩౬-వ సర్గము. రావణుఁడు మాల్యవంతుని ధిక్కరించుట ♦—

చం. అన విని కాలకింకరవ♦శాత్మకుఁ డాటను మాల్యవంతు నీ
తిని హితబోధమున్ వినక ♦ దేవవిరోధి సరోషచిత్తుఁడై
కనుఁగవ కెంపు బొమ్మముడి ♦ కన్పడ గ్రుడ్లను ద్రిప్పు చాతనిన్
గని వచియించు దుష్టమతి ♦ కంపలక్రొవ్వున నెల్లరున్ వినన్. ౭౬౦

అర్థములు. కాలకింకరవశాత్మకుఁడు = యమకింకరులకు స్వాధీనపడిన మనస్సుగలవాఁడు, కెంపు=ఎఱ్ఱనికాంతి.

తాత్పర్యము

ఈ ప్రకారము ఆలోచనయందుఁ బౌరుషమునందుఁగూడ నుత్తముఁడగు మాల్యవంతుఁడు చెప్పిన మాటలు విని యమకింకరులకు స్వాధీన పడిన మనస్సు గలవాఁడగుట యతని హితబోధము వినక రావణుఁడు కోపించి కన్నులెఱ్ఱఁజేసి కనుబొమలు ముడివేసి గ్రుడ్లుత్రిప్పుచు దుష్టబుద్ధి రావణుఁడు కండక్రొవ్వుచే పెద్దవాఁడుగదా! యనియైన గౌరవ మెంచక సభలోని యందరు వినునట్లు ఈ ప్రకారము చెప్పెను.

కం. హితమతమని యేమని యీ, గతిఁ బరుషములహితములగు • కాకులు ప్రేలన్
మతి గల్గె? వైరిపక్షవిజితుఁడవు నేఁ గోరఁగనీను • జెవి నీ మాటల్. ౨౫౦

అర్థములు. హితమతము = మేలగు నభిప్రాయము - పరుషములు = వినఁ గఠోరములైనవి - అహితములు = కీడు గలిగించునవి - కాకులు = వ్యర్థ ప్రలాపములు - ప్రేలన్ = వదరుటకు - మతిగల్గెన్ = మనస్సు వచ్చెను - వైరిపక్ష విజితుఁడవు=శత్రుపక్షము వారిచే లంచమిచ్చి వశపఱచుకొనఁబడిన వాఁడవు.

తాత్పర్యము

మేలైన యాలోచన విని యీ విధముగ వినుటకు కఠినములై, కీడు కలిగించునవియైన వ్యర్థపు మాటలు వదరుటకు నీకు మనస్సెట్లువచ్చెను. శత్రువులకు ననుకూలుఁడగు వారిచే నేదో లాభము పొంది యిట్లు చెప్పుచున్నావు. కావున నీమాటలు నేను వినను.

ఉ. ఏ మని తుచ్ఛమానవుని • హీనబలున్ గృపణున్ దరిద్రు శా
ఖామృగసంచయాశ్రయు వి • కారిగఁ దండ్రియు వెళ్ళఁ గొట్టఁగా
దీమసమేది కానలను • ద్రిమ్మరు నొంటరికాని రాము నెం
తో మెఱమెచ్చు లాడెదవు • దొడ్డసమర్థత యేమి గంటివో. ౨౫౧

అర్థములు. తుచ్ఛమానవుని = నీచ మనుష్యుని, హీనబలున్ = బలము లేనివానిని, కృపణున్ = నీచ స్వభావము గలవానిని, శాఖామృగసంచయాశ్రయున్ = క్రోఁతుల నాశ్రయించినవానిని, వికారిగన్=దిక్కులేనివానిగ, దీమస మేది=పౌరుషములేక, మెఱమెచ్చులు=మిక్కిలి మెచ్చులు.

తాత్పర్యము

రాముఁడు నీచ మనుష్యజాతియందుఁ జేరినవాఁడు, బలహీనుఁడు, స్వభావముచే నీచుఁడు, సంపదయందు దరిద్రుఁడు. తనకంటెఁ దక్కువగు క్రోఁతుల నాశ్రయించుటచే నీచాశ్రయము గలవాఁడు. కన్నతండ్రియే దిక్కులేనివానిని జేసి యూరువెడలఁగొట్టఁగా పౌరుషము చెడి యడవులం దొంటరిగాఁ దిరుగు వాఁడు. అట్టివానిని నీవేమో విపరీతముగ మెచ్చుకొనెదవే? వానియందు నాయందు లేని గొప్ప సామర్థ్య మేమి చూచి మాటలాడితివి.

కం. ఏ మనుచు రాక్షసేశ్వరు, సామరగంధర్వజనభ•యంకరు సర్వో
ద్దామపరాక్రమ సంయుతు, నీ మదిఁ గడు హీనుఁగా గ•ణించితి చెపుమా.

అర్థములు. రాక్షసేశ్వరున్ = రాక్షసులకుఁ బ్రభువును, సామర గంధర్వ జన భయంకరున్ = దేవతలతోఁగూడిన గంధర్వులకు భయము కలిగించువానిని, సర్వోద్దామ పరాక్రమ సంయుతున్=అందఱికంటె హెచ్చైన పరాక్రమముతోఁ గూడిన వానిని, కడుహీనుఁగా=మిగుల నీచునిగా.

తాత్పర్యము

రాక్షసుల కందఱకు బ్రభువును. దేవగంధర్వులకు భయంకరుఁడును, విశేష పరాక్రమవంతుఁడును నగు నన్ను మిగుల నీచునిఁగా నేమని లెక్కించితివి.

కం. కనుకుట్టుందనమో యరి,జనతాప్రోత్సాహవిధమొ•శంకింతు ద్విష
జ్జనపక్షపాతమో నీ, యనుటకుఁ బరుషోక్తి నన్ను•నగుఁ గారణముల్. ౭౬౧

అర్థములు. కనుకుట్టుందనమో = ఓర్వలేనితనమో, అరిజనతా = పగవారి సమూహముయొక్క, ప్రోత్సాహవిధమొ = ప్రేరించిన తీరో, ద్విషత్ + జనపక్షపాతమో=విరోధుల యందలి యభిమానమో.

తాత్పర్యము

నన్ను నీవిట్లు కఠినముగా మాటలాడుటకు నా మేలోర్వలేనితనమైనను, శత్రువుల వలన మేలుపొంది వారి ప్రేరణమో, లేక శత్రువుల యందలి పక్షపాతమో కారణమై యుండవలెను.

కం. అరిప్రోత్సాహము లేకమొ, వరశాస్త్రాభిజ్ఞుఁ డైన•పండితుఁ డెవఁ డీ
కరణిని బ్రభావయుతుఁ డగు.పరిపక్వమనస్కునిన్ నృ•పాలుం బలుకున్.

అర్థములు. అరి=శత్రువులయొక్క, వరశాస్త్రాభిజ్ఞుఁడు=గొప్పఁగా శాస్త్రమును, బక్కఁగాఁ దెలిసినవాఁడు,ప్రభావయుతుఁడు=మహత్వముతోఁగూడినవాఁడు.

తాత్పర్యము

శత్రువుల ప్రోత్సాహము లేకుండెనేని నీవలె గొప్ప శాస్త్రముల నెఱిఁగిన పండితుఁ డెవఁ డీప్రకారముగ మహత్వము గలవానిని, చక్కఁగా సంస్కారముచే నిశ్చయజ్ఞానము గలవానిని, అందు రాజును మాట్లాడును.

కం. తామరసహీనరమఁ బోల్, భూమిజ వనిఁ దెచ్చి యేమి•మునిఁగె నటంచున్
రాముఁనకు బెదరికొని నేఁ. గామితమును దీర్చికొనక•క్రమ్మఱ నిత్తున్. ౭౬౩

అర్థములు. తామరసహీనరమ = కమలము వదలిన లక్ష్మినని, అనఁగా ఆశ్రయము లేని దానిని, భూమిజన్=సీతను (౨) ఓషధిని, వనిన్ = అడవినుండి, బెదరికొని = భయపడి.

తాత్పర్యము

ఘోరమైన యడవినుండి యోషధిని దెచ్చినట్టు నెవ్వరు కాచు దిక్కులేక

యాశ్రయరహితయై యొంటరిగా నుండిన సీతను దండకారణ్యమునుండి తెచ్చిన యిప్పుడేమి మునింగిపోయెనని రామునకు వెదరి నాకోరిక నేఁ దీర్చుకొనక మరల నిత్తును ?

శా. నీవే చూడఁగలాఁడ వా వనచరా ♦ నీ వ్రతున్ ససౌమిత్రి సు
 గ్రీవున్ రాముని సంగరక్షితిని నే ♦ గృధ్రాళిపా ల్సేయఁగా
 నే వీరాగ్రణి ద్వంద్వసంగరమునన్ ♦ బృందారకుల్ డాయ లే
 రా వీరాగ్రణి రావణుం డడరునే ♦ యా యోధనక్రీడకున్. ౭౬౪

అర్థములు. ఆయోధన క్రీడకున్=యుద్ధమను కేళికి.

తాత్పర్యము

వానరులతోను, లక్ష్మణునితోను, సుగ్రీవునితోను గూడిన రాముని యుద్ధ భూమియందు నేను గ్రద్దలపాలు సేయఁగా నీవే చూడఁగలవు. వీరులందు శ్రేష్ఠుఁ డైన నెనని ద్వంద్వయుద్ధమందు దేవతలు సమీపమునకైన రాలేరో యట్టి వీరాగ్రణి రావణుఁడు యుద్ధకేళికి భయపడునా ?

కం. ఏవానికి నే లొంగను, దేవఱ నను రెండు గాఁగఁ ♦ జీల్చిన; మత్స్వ
 భావికదోషం బిదియు స్వ. భావము దురతిక్రమంబు♦పాయం దరమే. ౭౬౫

అర్థములు. లొంగను=లోనుగాను=లోపడను, ఏవానికిన్ = ఎట్టివానికి నైనను, చెవ+అఱన్=బలము క్షయించునట్లు, దురతిక్రమంబు=దాఁటరానిది.

తాత్పర్యము

నీవు చెప్పినట్టు రాముఁడు నీ యభిప్రాయము ప్రకారము గొప్పవాఁడగును గాక! వాఁడేకాదు, వానికి నూరంత లెక్కువ గొప్పవాఁడువచ్చి నన్ను రెండుగా నిట్టనిలువునఁ జీల్చినను నేను మఱియొకనికి లోఁబడువాఁడఁగాను. ఈదోషము నాకుఁ బుట్టుకతోడనే లభించినది. దోష మని తెలిసియు నేల సవరించుకొనరా దందువా? స్వభావగుణము దాఁటరానిది కదా! దాని నతిక్రమించి యెవఁడు పోఁగలఁడు ?

ఉ. తోయధి సేతునిర్మితిని ♦ దొడ్డగ నాడెద వేల? కాకతా
 లీయ మ దేమి యచ్చెరువు ♦ లెక్కఁగఁ జెప్పెదు భీతుఁ గొంటె? వి
 స్మయులరామభద్రుఁడు వ♦నేచరయుక్తిని నిందు వచ్చియున్
 గాయముతోడ వెండియును ♦ గ్రమ్మఁబునే విను బాస చేసెదన్. ౭౬౬

అర్థములు. తోయధిన్ = సముద్రమునందు, నిర్మితిని = కట్టుట, కాక తాళీయము=కాకివాలినది, తాటిపండు పడినది, అన్నట్లు కాకివ్రాలఁగనే తాటి పండుపడునా? రాముఁడు కట్టఁగానే సేతు వేర్పడునా? ఏదో యాకస్మిక; అచ్చె రువు=ఆశ్చర్యము, భీతుఁగొంటె = భయపడితివా? వనేచరయుక్తిని = వానరుల తోడను, కాయముతోడ=దేహముతో, గ్రమ్మఁబునే = మఱలిపోవునా? బాస = ప్రమాణము, గ్రమ్మఁబును నేబాస చేసెదను విను మని యొక యర్థము, 'సత్యా వాణీ సరస్వతీ'యని యుద్దేశము లేకున్నను సత్య మొక్కొకసారి నోరవెల్వడును.

తాత్పర్యము

సముద్రమునందు రాముఁడు సేతువు కట్టె ననియది యొక దొడ్డకార్యముగాఁ జెప్పెదవు. కాకి కూర్చుండినది, తాటిపండు పడిన దన్నట్టు లది యేదో యొక యాకస్మికము. అది గొప్పకా లెక్కగఁ జెప్పెదవే, భయపడితివా? ఆ రామచంద్రుఁడు వానరులతోడ నిచ్చటికి వచ్చినను మఱల దేహముతోఁ దిరిగి పోఁడని ప్రమాణము చేసెదను.

కం. అని గర్వంబునఁ బలికిన, విని దశకంఠుండు కోప ♦ వివశుం డనుచున్
మనమునఁ దలంచి, లజ్జా, వనతశిరంబునను మాల్య ♦ వంతుం డుండెన్. ౭౬౭

తాత్పర్యము స్పష్టము.

తే. అవల నమ్మాల్యవంతుఁడు ♦ నాజ్ఞఁ గాంచి
జయము వచియించి వీటికిఁ ♦ జనియె నంత
రావణుఁడు మంత్రివర్గంబు ♦ తో విమర్శ
సలిపి కాపుంచె లంకలో ♦ సకలదిశల. ౭౬౮

తాత్పర్యము

ఇట్లు రావణుఁడు చెప్పిన పిమ్మట మాల్యవంతుఁడు రావణుచే ననుజ్ఞ పడసి జయ జయ యని యింటికిఁ బోయెను. రావణుఁడు మంత్రులతో కార్యవిధము విమర్శించి లంకలో నన్నివైపుల రక్షకుల నియమించెను.

—♦ రావణుఁడు పురద్వారంబులఁ గాపుంచుట ♦—

సీ. తూరుపుదెసఁ బుర♦ద్వారంబుఁ గావఁ బ్ర, శస్తశౌర్యాఢ్యుఁ బ్ర♦హస్తు నిలిపి
దక్షిణమున మహో♦దరమహాపార్శ్వులఁ, బడమటిగవనిఁ ♦బహుళమాయు
సాంద్రసేనావృతు♦నింద్రజిత్తును నిల్పి, సారణు శుకుని వై♦శ్రవణు దెసకుఁ
బనిచి యా దిక్కు తా♦స్వయముగ రక్షింతు, నని చెప్పి గుల్మంబు♦నందు భూరి
తే. బలముతోడ విరూపాక్షు♦నిలిపి యిట్లు, లంక నల్గడఁ గడుఁబటి♦లంబుఁ గాఁగఁ
దగు విధానంబుఁ గావించి♦దశముఖుండు,తలఁచె ధన్యుఁడ నని విధి♦బలము పేర్మి.

అర్థములు. బహుళమాయున్ = అనేకమాయ లెఱింగిన వానిని, సాంద్రసేనావృతున్=దట్టమైన సేనతోఁ జుట్టఁబడిన వానిని, వైశ్రవణు దెసకు=ఉత్తర దిక్కునకు, విధిబలము పేర్మిన్ = దైవబలము యొక్క యతిశయము వలన, గుల్మము=పురమధ్య భాగము.

తాత్పర్యము

రావణుఁడు తూరుపు ప్రక్క పురద్వారమును రక్షించుటకు ప్రశస్తబలసంపత్తిగల ప్రహస్తుని, దక్షిణమున మహోదర మహాపార్శ్వులను నిలిపెను. పడమటి గవని పెక్కు మాయలు నేర్చిన యింద్రజిత్తును విస్తార సేనతో నిలిపెను. ఉత్తరపు గవను గాచుటకు శుకసారణులఁబంపి యచ్చటికి నేనే వచ్చెదనని చెప్పెను. ద్వీపము దక్షిణ భాగమున పడమటి దెసగా నైరృతిమూల లంకానగర మున్నది. కావున సేతు వుత్త

రమునను న్నది. కావున నుత్తరము పడమర తూఁకు దిక్కున కావున నచ్చట నొక చోటఁ దాను నిలిచి యొకచోట నింద్రజిత్తును నిలిపెను. పురమధ్యభాగము రక్షింప గొప్పసేనతో విరూపాక్షుని నిలిపెను. ఈ ప్రకారము లంకకు నాలుగు వైపుల పదిలముగా రక్షకుల నియమించి రావణుఁడు దైవప్రేరణముచేఁ దాను కృతకృత్యుఁడ నని తలఁచెను.

తే. కెలసములు వారి వారికిఁ బలికి యిట్లు, వారి నెల్లరఁ బోవంగఁ బనిచి తాను
 నఖిలసంపత్సమృద్ధమా నంతిపురికిఁ, జనియె నాశీస్సు పలుక నా సచివచయము.

అర్థములు. కెలసములు = పనులు, అఖిలసంపత్సమృద్ధము = సమస్త సంపదలతో వృద్ధిపొందినది, ఆశీస్సు=దీవన.

తాత్పర్యము

వారి వారికిఁ జెప్పవలసిన పనులు వారి వారికిఁ జెప్పి వారినందరి వారివారి సంస్థానములకుఁ బొండని చెప్పి పంపి సకల సంపదలతోఁ గూడిన యంతఃపురమునకు సచివు లాశీర్వదించుచుండఁ బోయెను.

**౩౭-వసర్గము. శ్రీరామునకువిభీషణుఁడురావణసేనాసన్నాహంబువిధంబుఁదెల్పుట**

సీ. నరలోకభర్తవా నరలోకభర్తయు, బావమానియు జాంబవంతుఁ డంగ
 దుండు మైందద్వివిదులు మఱి లక్ష్మణుం, డును సుషేణవిభీష ణులునుగజుఁడు
 నలకుముదులును బనసగవాక్షులుఁ గూడి, కార్య మాలోచింపఁ గడఁగి రక్షో
 దసురేంద్రపాలితం బైన యా లంక యి,దే దుర్జయం బని దేవశాహి
తే. యక్షగంధర్వతతి కైన రాక్షసాధి
 నేత రావణుఁ డిందు స న్నిహితుఁ డెపుడు
 తాన కార్యంబు సిద్ధి కాఁ గల తెఱంగు
 నిపుణమతిఁ జూడఁదగునంచుఁ గపిచయంబు. ౭౭౧

అర్థములు. నరలోకభర్త = రామచంద్రమూర్తి, వానరలోకభర్త = సుగ్రీవుఁడు, పావమాని=ఆంజనేయుఁడు, అనిన్=యుద్ధమందు.

తాత్పర్యము

రామచంద్రమూర్తియు సుగ్రీవుఁడు ఆంజనేయుఁడు జాంబవంతుఁడు అంగదుఁడు, మైంద ద్వివిదులు, లక్ష్మణుఁడు, సుషేణ, విభీషణులు, గజనల కుముదులు, పనస గవాక్షులు అందఱొకచోటఁ జేరి చేయఁదగినకార్యమాలోచింప మొదలుపెట్టిరి. అపుడు వానరులు రావణుఁడు పాలించు లంక లంక యని మన మనుకొనుచున్న లంక యిదే. వచ్చితిమి చేరితిమి. ఇది యుద్ధమందు దేవ గంధర్వ యక్ష పన్నగులకైన జయింపరానిది. రావణుఁ డిందే యుండును గావున మన కార్యము ఫలించు విధము నేర్పుగ నాలోచింపవలయును. దీనిని మనము ముట్టడించుట తప్ప వేఱుమార్గము లేదు. అట్లు ముట్టడించునపు డెవరెవ రేయే దిక్కున

నుండవలయును. వాఁడు బలవంతులనుంచిన దిక్కున నంతకంటెబలవంతులనుగదా వారికెదురుద్దిగానుంచవలెను. బలహీనులనుంచినఫలము లేదుగదాయనుచు నుండిరి.

తే. అనఘ నగ్రామ్యపదవంత • మగుచుఁ బుష్క-
లార్థ మగువాక్యముల రావ • ణానుజుండు
పలుకు ననలుండు శరభుండు • ప్రఘసుఁ డతుల
మతులు సంపాతి యనెడి నా • మంత్రివరులు. ౭౭

అర్థములు. అగ్రామ్యపదవంతములు = గ్రామ్య పదములు లేక వ్యాకరణ శుద్ధమైనవి, పుష్కలార్థములు=పూర్ణముగ నర్థముగలవి. సందేహములు కొఱఁతలు లేనివి.

## తాత్పర్యము

వ్యాకరణ విరుద్ధములైన పదములు లేక శుద్ధములైన వాక్యములతో విభీషణుఁ డిట్లనెను. నామంత్రులు అనలుఁడు శరభుఁడు ప్రఘసుఁడుసంపాతి యనువారు; మాల్యవంతుని మొదటి తమ్ముని సుమాలి కూఁతురు కైకసి. రెండవతమ్ముఁడు మాలికొడుకులు అనలుఁడు, సంపాతి యనువారు. ప్రహస్తుని తమ్ముఁడు ప్రఘసుఁడు.

ఉత్తరకాండమున ౯౩వ పద్యంబున అనిలుఁడు అనలుఁడు,సంపాతి,హరుఁడు ననువారు విభీషణు మంత్రు లని చెప్పఁబడెను. ప్రఘస శరభులే అనల హరులు కాఁబోలు.

సీ. పక్షి వేషంబులఁ బరిపంథిపురిఁ జొచ్చి, దళముల విహితవి • ధానములను
బరికించి వచ్చిరి • పలికెద శ్రీరామ, వారలు చెప్పిన • దీవు వినుము
తూర్పు ప్రహస్తుండు • దొడ్డబలంబుతో, గవనిని గావంగఁ • గడఁగినాఁడు
దక్షిణంబున మహో • దరమహాపార్శ్వులు, పడమట నింద్రజి • త్కడిమి నిలిచెఁ
తే. బట్టిసాసి ధను శ్శూల • పాణులైన, శూరు లెందఱో తోఁతవిఁ • జుట్టినారు
రావణుం డుత్తరంపుద్వా • రంబు కాన, కాచువాఁడయ్యెనాశర • కాండయుక్తి.

అర్థములు. పరిపంథి = శత్రువగు రావణుని, దళముల=సేనల, విహిత విధానములను = పురరక్షణమందుఁ జేయఁబడిన యేర్పాటులను, కడిమిన్=బలముతో, ఆశరకాండయుక్తిన్=రాక్షససమూహములతో.

## తాత్పర్యము

ఈ నలుగురు పక్షి వేషములతో శత్రుపుర మగు లంకఁ బ్రవేశించి యచ్చటఁ బురరక్షణమునకై యేర్పాటుచేయబడిన సేనలవిధమును జూచి వచ్చినారు. వారు చెప్పినవిధము వినుము. గొప్పసేనతో సేనానాయకుఁడగు ప్రహస్తుఁడు తూర్పు గవనిని గాచుచున్నాఁడు. దక్షిణమున మహోదరమహాపార్శ్వ లున్నవారు. పడమట నింద్రజిత్తున్నాఁడు. వానికి సహాయులై పట్టిసములు కత్తులు విండ్లు శూలములు

నాయుధములు గాఁగల వారెందరో యున్నారు. ఉత్తరపుగవను రావణుఁడు తానే రక్షింపఁబూనినాఁడు. వీనికి సహాయులై రాక్షససమూహము లున్నవి.

కం. శూలాయుధహస్తులు కర,వాల లసత్కరులు చాప•పాణులు గొలువన్
జాల విరూపాక్షుఁడు పురిఁ, బాలించును గుల్మమధ్య•పరితిష్ఠితుఁడై. ౭౭౪

అర్థములు. శూలాయుధహస్తులు = శూలములను నాయుధముల చేతి యందుఁ గలవారు, కరవాల లసత్కరులు=కత్తులచేఁ బ్రకాశించు చేతులు గల వారు, చాపపాణులు=విండ్లు చేతులందు ధరించినవారు, గుల్మమధ్య పరితిష్ఠితుఁడై= ఊరినడుమ నుండువాఁడై, ఆయుధహస్తులని చెప్పుటచే యుద్ధమునకు సిద్ధపడి యున్నారని భావము.

తాత్పర్యము

శూలములు, కత్తులు, విండ్లు చేత ధరించినవారితో విరూపాక్షుఁడు నగర మధ్య ప్రదేశమును రక్షించుచున్నాఁడు.

సీ. ప్రతిపక్షసైన్యంబు • పన్నినవిధ మిది, పురమున నొకవేయి • కరులు రథము
లయుతంబు నశ్వంబు • లయుతంబు రాక్షస, కోటియుఁ గలదు ని•కాటు లెల్ల
నాతతాయులు సంగ•రావని శూరులు, పంక్తికంఠుని మెచ్చువచ్చువార
లుగ్రు లీ తెగలలో • నొక్కొక్కదానికి, దశలక్ష పరివార•దళము గల ద
తే. టంచుఁ జెప్పిరి మంత్రులటంచు నారి, ప్రోలనిల్పి మఱిన్ రఘు•ముఖ్యుఁ బలుకు
విత్తపతి గెల్చెనఱువది•వే లసురుల, నాత్మతుల్యులఁగొని రావ•ణాసురుండు.

తాత్పర్యము

అర్థములు. ప్రతిపక్షసైన్యంబు = శత్రువులసేన, అయుతము=పదివేలు, ఆతతాయులు=పరమ దుర్మార్గులు, 'సన్నద్ధేత్వాతతా యీ వధోద్యతే' అమ రము. 'పలాయమానం తయుతే ఉపాంసయా గచ్ఛతీతి ఆతతాయీ' పరువెత్తు వానిని జంప నిచ్ఛచేఁ దఱుముకొని పోవువాఁడు ఆతతాయి. ఇప్పుడు మనము యుద్ధమునకు వెనుదీసిపోయెద మనినను వారు వెంబడించి చంపుదురు. కావున యుద్ధము తప్పదని భావము. 'అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణి ర్ధనాపహః! క్షేత్ర దారహరశ్చైవ షడేతే హ్యాతతాయినః' ఇండ్లకు నగ్ని పెట్టువాఁడు, విషము పెట్టు వాఁడు, చంపుటకై యాయుధము ధరించినవాఁడు, ధనము నపహరించిన వాఁడు' క్షేత్రమును భార్యను హరించినవారు ఆతతాయులు; విత్తపతిన్=కుబేరుని.

తాత్పర్యము

ఈ ప్రకారము శత్రువులు తమసేనలఁ బన్నియున్నారు. లంకయందు వేయి యేనుఁగులు, రథములు పదివేలు, అశ్వములు, పదివేలు, పదాతులగు రాక్షసులు కోటియుగలవు (ఏనుఁగులు, గుఱ్ఱములు, రథములన్నపుడు వానిపైనుండి యుద్ధము చేయువారని భావము) వీరందరుమహాశూరులు, హింసాసక్తులు, రావణునిచే మెప్పు పడసినవారు, భయంకరులు. ఈ తెగలలో నొక్కొక్కదానికి పది లక్షల పరిచారకు

లున్నారు, అని మంత్రులు చెప్పిరని చెప్పి వారినే వారియెదుట విమర్శార్థము నిలిపెను. ఇటుచేసి రామచంద్రమూర్తితో విభీషణుఁ డిట్లనియె. తనతో సమాను లయిన రాక్షసులను నఱువది వేలమందిని దీసికొని రావణుఁడు కుబేరునిఁ గెలిచెను. అప్పటిసేన యంతయే. ఇప్పుడు అంతకంటె గొప్పసేన గలదు.

కం. కినియకుము నీకు రోషం,బును గూర్పఁగ నిట్లు పలుకఁ • బూనితి నీవున్
ఘనుఁడవు సమర్థుఁడవు దుర,మున వేల్పుల నేని గెలుతు • పురుశౌర్యమునన్.

తాత్పర్యము

శత్రువుల నిట్లు పొగడవచ్చునా యని కోపింపకుమా, నిన్ను బెదరించి నిరుత్సాహము గూర్ప నేను జెప్పలేదు. రోషము దెచ్చుకొని వారిని జంపుటకుఁ దగిన ప్రయత్నము చేయుదు వని చెప్పుచున్నాను. నీవు గొప్పవాఁడవు. ఎంత కార్యమైన సాధింపఁగలవాఁడవు. యుద్ధమునందు నీవు ఘనశౌర్యముచే దేవతలనైన గెలువఁ గలవు. కావున దానికిఁ దగిన సన్నాహము చేయుము.

కం. రామా ! చతురంగ బల,స్తోమముతో శాత్రవులను • దూలింపు మనన్
రాముఁడు యోజించి బలం, బీమెయి విభజించె రిపుల • నెల్ల • జయింపన్. ౨౨౭

అర్థములు. చతురంగబల స్తోమము=నాలుగు విధము లగు సేనల సమూహము-రథగజ తురగ పదాతులకు చతురంగ సేన యని పేరు. దీని తద్భవము చదరంగము.

తాత్పర్యము

రామచంద్రా! నీవు నాలుగు విధములైన సేనలుగల పగవారిని వధింపుము. అని చెప్పఁగా రామచంద్రమూర్తి యాలోచించి శత్రువుల జయించుటకై తన సేన నిట్లు విభజించెను.

—• శ్రీరాముఁడు లంకాద్వారముల సేనల నిలుపుట •—

తే. తూర్పుగవనిని నీలుండు • దొడ్డసేన
తోఁ బ్రహస్తునితో నని • దోడరవలయు
దక్షిణపుదిక్కునన్ మహో • దరుని వెండి
యును మహాపార్శ్వ నంగదుం • డొప్పగెలువ. ౨౨౮

తాత్పర్యము

గొప్ప సేనతో నలుఁడు తూర్పు గవని యొద్ద నిలచి ప్రహస్తుని గెలువ వలయును. దక్షిణపుదిక్కున నంగదుఁడు మహోదర మహాపార్శ్వుల గెలువ వలయును.

తే. అప్రమేయబలుండైన • యాంజనేయుఁ, డమితసైన్యంబుతోఁ జని • హరిహయారి
యుండు పశ్చిమదిక్కున • గండుమీఱి, యహితపుటభేదనంబుఁ దా • నఱుమవలయు.

అర్థములు. హరిహయ + అరి = ఇంద్రజిత్తు, అహితపుట భేదనము= శత్రువు పట్టనము, అఱుమవలయు = ఆక్రమింపవలెను.

## తాత్పర్యము

అపరిమితబలముగల యాంజనేయుఁడు గొప్పసేనతోఁ జని యింద్రజిత్తుఁడున్న పడమటి గవని దిక్కున నిలచి లంక నాక్రమింపవలయును.

సీ. మహితు లౌ ఋషులకు ♦ మఱి దానవాళికి, గుండెగాలం బైన ♦ దుండగీని
వరము పైఁ గండకా ♦ వరమును గలవానిఁ, బ్రజ లెల్ల నల్లాడఁ ♦ బఱచు నీచు
హతుఁ జేయువంతు నా ♦ యది గాన వతేఁ డుండు, నుత్తరదిశను నే ♦ నుండువాఁడ
సౌమిత్రియుతుఁడ నై ♦ జాంబవంతుండు సుగ్రీవవిభీషణుల్ ♦ ప్రోవవలయు
తే. మధ్యమంబును, వానరుల్ ♦ మనుజరూప
ములను దాల్పంగ రా దిది ♦ వలయు నియతి
యగచరసమూహమునకుఁ జి ♦ హ్నంబు దీనిఁ
దప్ప రా దెవ్వరైన నే ♦ తఱుణమునను. ౨౦

అర్థములు. గుండెగాలము = గుండెలలో నాటుకొనిన యినుప ములికి - అనఁగా నంత బాధాకర మని భావము. కండకావరము=దేహబలము - పొగరు. అగచర సమూహమునకున్=వానరుల గుంపునకు, చిహ్నంబు=గుర్తు, ఏతఱుణమునను=ఏ సమయమందైనను.

## తాత్పర్యము

గొప్పవారగు ఋషులకు దానవులకు గుండెలో నాటిన గాలమువంటి దుష్టుని, వరము గలదని గర్వించిన వానిని, లోకుల నల్లాడఁబెట్టు నీచుని, రావణుని చంపు వంతు నాది. కావున వాఁడుండు నుత్తర దిశయందు నేను లక్ష్మణునితో నుండెదను. జాంబవంతుఁడు సుగ్రీవుఁడు విభీషణుఁడు సేనామధ్యమును రక్షింపవలెను. అది యునుగాక వానరు లెవ్వరును మనుష్యరూపమును ధరింపరాదు. ఇది నియమము. ఎవ్వఁడైన నెప్పుడైన దీనిని దప్పరాదు.

కం. నేనును నా తమ్ముండును, నా నెచ్చెలి యసురరాజు ♦ నలువురు సచివుల్
మానవరూపంబుల నరి, సేనం బరిమార్పఁ గలము ♦ సిద్ధ మిది సుఁడీ. ౨౧

## తాత్పర్యము

నేను, నా తమ్ముఁడు లక్ష్మణుఁడు, నా స్నేహితుఁడు విభీషణుఁడు, ఆయన నలువురు మంత్రులు - ఈ యేడుగురు మాత్రము మనుష్యుల రూపముతో యుద్ధముచేసి శత్రువులఁ జంపగలము. మఱి యెవఁడైన మనుష్యరూపముతోఁ గనబడినాఁడా వానిని శత్రువని వెంటనే వధింపవలయును. కావున వానరు లెవ్వరు మనుష్యరూపములు ధరింపరాదు.

కం. అని సేనల నియమించి యుఁ, దన కార్యము సిద్ధికొఱకు ♦ దశరథసుతుఁడున్
మనమునఁ దలఁచి సువేలా, వనిధరకూటంబు నెక్కెఁ ♦ బత్తనముఁ గనన్.

అని సేనల నేర్పాటుచేసి తన కార్యము ఫలించుకొఱకు రామచంద్రుఁడాలోచించి లంకను జూడఁదలఁచి సువేలాద్రి నెక్కెను.

—• ౩౮-వ సర్గము. శ్రీరాముఁడు సుగ్రీవాదులతో సువేలాద్రి నెక్కుట •—

సీ. తనతోడ సౌమిత్రి • చను దేర సుగ్రీవు, ననురక్తు ధర్మజ్ఞు • నఖిలమంత్ర
వేత్త విధిజ్ఞు వి • భీషణుఁ గనుగొని, మధురసూక్తుల నిట్లు • మందలించు
వివిధధాతుచిత సు • వేలాద్రిపై నెక్కి, యుంద మీ రాతిరి • యుంతె గడపి
వఱువాతఁ జూతము • వాని నాశమునకై, నాపత్నిఁ గొనిచన్న • పాపచరితు
ఆ. నిలయు, మయ్యొ యెంత • నీచుఁడో యాతఁడు, వంశ మైన సాధు • వర్తనంబు
నైన ధర్మమైన • నాత్మఁ దలంపక, జగము దిట్టుపనికి • జలిపెఁ జెనఁటి. ౭౮౩

అర్థములు. అనురక్తున్=ప్రేమగలవానిని, ధర్మజ్ఞున్ = ధర్మము తెలిసినవానిని, అఖిల మంత్రవేత్త=అన్ని యాలోచనలు తెలిసినవానిని, మందలించున్=చెప్పెను. దీనికి చివాట్లు పెట్టుట యను నర్థము గ్రంథస్థముగాదు. వివిధధాతుచిత=అనేకవిధములైన ధాతువులచే వ్యాపించిన, సువేలాద్రి = సువేల యను పేరుగల కొండ, దీనిపై నెక్కిన లంకానగరము లోపలిభాగము కానవచ్చును, వఱువాతన్=ఉదయమున, చెనఁటి=దుష్టుఁడు, సుగ్రీవ విభీషణ శబ్దములకు నడుమనున్న శబ్దములు కాకాక్షిన్యాయముచే నిరువురకు నన్వయింపవలెను. అనురక్తుఁడు, ధర్మజ్ఞుఁడు, అఖిలమంత్రవేత్త, విధిజ్ఞుఁడగు సుగ్రీవుఁడు, అట్టివాఁడే యను విభీషణుఁ డని యన్వయము.

తాత్పర్యము

రామచంద్రమూర్తి తనతోఁడ లక్ష్మణుఁడు రాఁగా తనయందనురాగము గలవారు, ధర్మమెఱింగినవారు, ఆలోచన లన్నియుఁ దెలిసినవారు, కార్యము లెట్లు చేయవలయునో తెలిసినవారు నగు సుగ్రీవ విభీషణులఁజూచి యిట్లనియె. నానావిధ ధాతువులుగల యీ సువేల పర్వతమెక్కి యీ రాత్రియందే యుండి యుదయము కాఁగానే తన చావు నిమిత్తమై నా భార్య నపహరించిన పాపాత్ముని స్థానమగు లంకను జూతము. అయ్యో! వీఁడెంత నీచుఁడో కదా! తాను బుట్టినవంశముగాని, పెద్దల సాధుచరిత్రముగాని, ధర్మమైనఁగాని, యాలోచింపక దుష్టుఁడై లోకము దిట్టు పనిని జేసెను.

ఉ. ఆతనిపేరు విన్నఁ దను • వంతయు మండెడి, నైన నొక్క దు
ర్జాతు నిమిత్తమై సకల • రాక్షసులన్ వధియించు టెట్లొకో ?
పాతకముం బొనర్చు యమ • పాశవశంగతుఁ డైన యొక్కఁడా
పాతకి నీచుహేతువునఁ • బాడగు నాతనివంశ మంతయున్. ౭౮౪

అర్థములు. దుర్జాతు నిమిత్తమై=దుష్టజన్మము గలవానికొఱకు, రాక్షసవేళ యగు సంధ్యాకాలమందుఁగదా వీనితల్లి విశ్రవసుఁ గామించెను, పాతకి=పాపి,

తాత్పర్యము

వానిపేరు విన్నంత మాత్రమున నాద్యంతము దేహము మండుచున్నది. ఈయొక్క దుష్టు నిమిత్తమై రాక్షసుల నందఱ నిరపరాధు లగు వారిని గూడ నెట్లు చంపుదును. యమపాశములకుఁజిక్కి చావనున్న వాఁడొకఁడు పాపము చేయును, ఆ పాపాత్ముఁడు, నీచుఁ డగువాని హేతువున వాని వంశమంతయుఁ బాడగును. మంచి నీళ్ళ మడుఁగునందుఁ బాము చేరినఁ బాము నేకాక దానియందలి చేఁపలను గూడఁ జంపుదురుగదా! 'ఏకః పాపాని కురుతే, ఫలం భుఙ్క్తే మహాజనాః' 'ప్రల్లదుఁడైన యొక్క కులపాంసను జేసిన దానఁ దత్కులం బెల్ల మహాపిలం బగుట యేమి యపూర్వము' భార, ఆది. ఒక తక్షకుని నిమిత్తమై కదా సర్పము లన్నియుఁ జచ్చెను. పాములలోనైన దుష్టమృగముల వలనఁగదా యడవులలోని చెట్లు కాలిపోవుట. వడ్లతోడ తట్ట యెండవలయును. ఇనుముతోడ నగ్ని సమ్మెట పెట్లు దినవలయును.

సీ. అని యిట్లు క్రోధవ•శాత్ముఁడై పలుకుచు, మున్నుగ నెక్క రా•ముండు గిరిని
    నతులవిక్రమరతుం•డైన సౌమిత్రియు, శరచాపహస్తుఁడై•చనియె వెంట
    నాతని వెన్నంటి•హరిరాజ సామాత్యుఁ,డగు విభీషణుఁడును • హనుమ వాలి
    తనయనీలురును మైం • దద్వివిదగజులు, గవయగవాక్షులు • గంధమాద
తే. నుండు శరభుండు జాంబవం•తుండు హరుఁడు,పనసరంభకుముదశత•వలిసుషే,ణ
    ఋషభదుర్ముఖు లాదిగ•వృక్షచరులు, పెక్కు రెక్కిరి మారుత•వేగు లగుచు.

అర్థములు. క్రోధవశాత్ముఁడై=కోపమునకు వశపడిన మనస్సుగలవాఁడై, మారుత వేగులు = వాయువువలె వేగముగఁబోవువారు. వ్యాకరణము. వాలి తనయ నీలురు-దీర్ఘపూర్వక లకారోపధ కాదంత సంస్కృత మహచ్ఛబ్దమగుటచే బహువచనంబున లకారంబునకు రేఫంబు.

తాత్పర్యము

ఈ ప్రకారము రామచంద్రమూర్తి కోపముతో నెక్కఁగా విల్లు, బాణములు ధరించి మిగులఁ బరాక్రమ వంతుఁడైన లక్ష్మణుఁడు వెంటనే యెక్కెను. ఆయన వెనుక సుగ్రీవుఁడు, మంత్రులతోడ విభీషణుఁడు, హనుమంతుఁడు, అంగదుఁడు, నీలుఁడు, మైంద ద్వివిద గజగవయ గవాక్షులు, గంధమాదనుఁడు, శరభుఁడు, జాంబవంతుఁడు, హరుఁడు, పనసరంభకుముద శతవలి సుషేణ ఋషభ దుర్ముఖులు మొదలుగాఁగల వానర ముఖ్యులు పెక్కురు వాయువేగమున నెక్కిరి.

ఉ. అందఱు శైల మెక్కి దివి • నంటిన భంగిఁ ద్రికూటకూటమం
    దందము మీఱి సాలనిచ•యంబులు నుత్తమ మైన ద్వారముల్
    నందడి మీఱ రాత్రిచర•సంఘములుం బొలుపొంద లంక వే
    డ్కం దగఁ జూచి సాలగత•కాలనిశాటులు వేటుకోటనాన్. ౭౬

అర్థములు. దివిన్ = ఆకాశమును, త్రికూటకూటమందు = త్రికూట శిఖరమునందు, సాలనిచయములు = ప్రాకార సమూహములు, సాలగత=ప్రాకారము మీఁదనుండు, కాల నిశాటులు=నల్లని రాక్షసులు, వేఱుకోటనాన్ =మఱియొక కోటయో యనునట్లు, త్రికూట పర్వతశిఖరంబున లంక గలదు. దానికి సమీపమందే దాని యెత్తున సువేలగలదు.

తాత్పర్యము

ఇట్లందఱు కొండయొక్క యాకాశమును దాఁకుచున్న దానివలెనుండు త్రికూట పర్వతశిఖరమునందు సందమైన ప్రాకారముల వరుసలు, ద్వారములను జూచి యా ప్రాకారము లందున్న నల్లని రాక్షసులు వేరొక ప్రాకారమో యనునట్లు (కాంచిరి.)

ఉ. కాంచిరి; కాంచి రక్కసులు • కయ్యపు టుత్తున నుంటఁ జూచి గ
ర్జించిరి రామసన్నిధిని • వృక్షచరుల్ వివిధధ్వనంబులన్;
మించినరాగవర్ణమున • నీరజబాంధవుఁ డస్తమించె; నం
దించెను బూర్ణశీతకర•దీప్తవిభావరియున్ మనోజ్ఞమై. ౭౪౭

అర్థములు. కయ్యపుటుత్తునన్=యుద్ధప్రయత్నముతో, రాగవర్ణమునన్ = ఎఱ్ఱనికాంతితో, నీరజబాంధవుఁడు=సూర్యుఁడు, అస్తమించెన్ =క్రుంకెను, పూర్ణశీతకరదీప్త విభావరియున్ = నిండు చంద్రునిచేఁ బ్రకాశించు రాత్రి, దీనిచే నీ దినము పున్నమ యనియుఁ బాడ్యమినాఁడు యుద్ధారంభమనియు మహేశ్వర తీర్థీయము. దీపములచేఁ బూర్ణచంద్రుఁడు గలరాత్రివలెఁ బ్రకాశించుచునని గోవింద రాజీయము.

హనుమంతుఁడు లంకఁ బ్రవేశించినది శుద్ధత్రయోదశి యగునేని నేఁడు బహుళాష్టమిగా నుండవలెను. కొందరు నేఁడు చతుర్దశియందురు. ఈ విషయము ముందు చర్చింపఁ బడును.

కం. వృక్షచరాగ్రేసరుఁడును, రక్షోనాథుండు గొలువ•రాముఁడు జాగ్ర
ల్లక్షణుఁ డగు లక్ష్మణుతో, ఋక్షాదులు గొల్వ గిరిని•రేయి వసించెన్.

తాత్పర్యము

వానరనాథుఁడు సుగ్రీవుఁడు రాక్షస నాయకుఁడగు విభీషణుఁడు భల్లూకము లగు జాంబవదాదులు గొలువఁగా మెలఁకువయే చిహ్నముగాఁ గల లక్ష్మణునితో రామచంద్రమూర్తి యారాత్రి పర్వతమందే వసించెను. జాగ్రల్లక్షణుఁడనుటచే లక్ష్మణుఁడు నిద్రపోక కాచియుండెనని భావము. ఇది యాయన లక్షణ మనుటచే నాయన రాత్రియందు నిద్రింపఁ డనియు నెఱుఁగనగు.

—•౩౯-వ సర్గము. శ్రీరాముఁడు లక్ష్మణ సుగ్రీవాదులతో లంకం జూచుట•—

సీ. వేవినయంత న • వ్వీరులు లంకలో, సమసౌమ్యరమ్యవి • శాలదీర్ఘ
ముల నుపవనములఁ • దిలకించి యబ్బుర, పోయి రందలు దాని•పోలుపునకును

సాలతాలతమాల • చంపకాశోకపు, న్నాగనీపార్జున • నాగమాల
పాటలార్జున సప్త • పర్ణ నీపావళీ, కర్ణికారతిలక • కాండములను
తే. బుష్పితాగ్రలతావృత • భూరుహముల, వింతకుసుమంబులను రక్త • కాంతమృదుల
పల్లవంబులఁ బచ్చిక • పట్లగముల, నీలవనరాజులను గిరి • నెమ్మిఁ గూర్చె. ౭౦౯

అర్థములు. వేవిన యంతన్ = ఉదయము కాఁగానే, సమ = మిట్టపల్లములు లేనివి, సౌమ్య = క్రూరమృగములు లేనివి, రమ్య = మనోహరములైనవి, విశాల = వెడలుపైనవి, దీర్ఘములన్ = నిడుపులైనవి యగు, ఉపవనములు = లంకకు వెలుపల సమీపమందే యుండు తోఁపులను, లంకలోనని చెప్పినను ప్రాకారములకు వెలుపలనున్నను లంకకుఁ జేరినవనియే భావము, తిలకించి = చూచి, అబ్బురపోయిరి = ఆశ్చర్యపడిరి, పొలుపునకు = అందమునకు, సాల = మద్దిచెట్లు తాల = తాటిచెట్లు, తమాల = చీఁకటి మ్రాకులు, చంపక = సంపెఁగలు; పున్నాగ = సురపొన్నలు, నీప = ముంకెనచెట్లు, అర్జున = ఏరు మద్దిచెట్లు, నాగమాల = నాగకేసరములు, సప్తపర్ణ = ఏడాకుల యరఁటులు, పాటలార్జున = ఎఱ్ఱ మద్దిచెట్లు, నీప = నల్లయిరుగుడు చెట్లు, కర్ణికార = తేల చెట్లు, తిలక = బొట్టుగు చెట్లు, కాండములను = వీని సమూహములను, పుష్పితాగ్ర = పూచిన కొనలుగల, లతావృత = తీఁగలచేఁ జుట్టుకొనఁబడిన, భూరుహములన్ = చెట్లను, వింత కుసుమంబులను = ఆశ్చర్యకరములైన క్రొత్తరకము పుష్పములను, రక్తకాంత = ఎఱ్ఱని చిగుళ్ళుగల, మృదుల = మెత్తని, పల్లవంబులన్ = చిగుళ్ళను, నెమ్మిన్ = సంతోషము, గిరి = సువేల పర్వతము.

తాత్పర్యము

ఉదయము కాఁగానే యా వీరులు లంకానగరమున కానుకొని ప్రాకారములకు వెలుపలనుండు సమములై క్రూరమృగములు లేనివై మనోహరములై వెడలుపులై దీర్ఘములై యుండు తోఁపులను జూచి వాని యందమునకు నాశ్చర్యపడిరి. సాలతాలాదివృక్షములను కొనలందుఁ బూవులుగల తీగలచేఁ జుట్టుకొనఁబడినచెట్లను క్రొత్తరకపుఁ బూలను ఎఱ్ఱని కాంతిగల మెత్తని చిగుళ్ళను, పచ్చిక బయళ్ళను నల్లని వనరాజులను గలదై వారికి సువేలపర్వతము సంతోషము కలిగించెను.

కం. మానవులు భూవనంబుల, మానుగ ధరియించుకీతి • క్ష్మాజములు సుగం
ధానూనపుష్పఫలసం, తానంబులఁ దాల్చి చూడ్కి • తనుపుం గూర్చెన్.

అర్థములు. మానవులు = మనుష్యులు, క్ష్మాజములు = చెట్లు, సుగంధ = మంచి వాసనగలవై, అనూన = కొఱఁతలేక సమృద్ధములైన, పుష్పఫల సంతానములను = పూలయొక్కయు పండ్లయొక్కయు సమూహములను, తనుపున్ = తృప్తిని.

తాత్పర్యము

మనుష్యులు భూషణములను సొగసుగ ధరించునట్లు పరిమళము గలిగి సమృద్ధములైన పూల పండ్ల గుంపుల ధరించి చెట్లు దృష్టికిఁ దృప్తి కలిగించెను.

క. నందన చైత్రరథాభం, బిందిందిరబృందనాద • మింద్రియనికరా
నందం బై సర్వర్తుక, మందలి వనరాజి గూర్చె • హర్షము మిగులన్. ౭౯౧

అర్థములు. నందన చైత్రరథాభంబు=నందనముతోను చైత్రరథముతోను సమానమైనది. ఇందిందిర బృందనాదము = తుమ్మెద గుంపుల ఝుంకారములు గలది, ఇంద్రియనికరానందంబై =ఇంద్రియ సమూహములకు, అన్ని యింద్రియములకు సంతోషకరమైనది, సర్వర్తుకము = అన్ని ఋతువులందుఁ బూచి కాచునది, అందలి=ఆ పర్వతమందలి, వనరాజి=తోఁపుల వరుసలు, హర్షము=సంతోషము.

తాత్పర్యము

ఇంద్రుని నందనముతోను గుబేరుని రథముతోను సమానములై, తుమ్మెదల ఝుంకారములు గలవై, ఇంద్రియములకు సంతోషము గలిగించునవియై, అన్ని ఋతువులలోఁ గాచు పూచు చెట్లు గల వనములు వారికి మిగుల సంతోషము గలిగించెను.

సీ. వననిర్ఝరంబుల • భరతపక్షులు చీకు, కొక్కొర లింపుగాఁ • గూయుచుండ
నెమ్మిళ్లు గేరి నృ • త్యమ్ములు గావింప, బంభరనాదసం • రంభ మొసర
మత్తవిహంగము • ల్మధుపసంచారము, లోఁ-కిలసముదయ • కూజితములు
విహగరుతంబులు • భృంగసంగీతము, ల్సారసగానము • ల్మరమిోలు
తే. తద్వనోపవనంబులఁ • దరుచరాళి, చొచ్చి చెలరేఁగి కేరుచు • నిచ్చవచ్చి
నట్టిరూపంబులం గొని•మట్టుమిోఱి, సంతసిల్లిరి యం దందు•సంచరించి. ౭౯౨

అర్థములు. వన నిర్ఝరంబులన్ = వనమందలి వంకలందు - నెమ్మిళ్లు= నెమిళ్ళు-కేరి=విజృంభించి=పురివిచ్చి-బంభరనాద సంరంభము=తుమ్మెదలధ్వనుల యాటోపము, మత్తవిహంగముల్=మదించిన పక్షులు, మధుపసంచారములు = తుమ్మెదల తిరుగుటలు - కోకిల సముదయ కూజితములు = కోవిల గుంపుల కుహూకారములు-విహగరుతంబులు = పక్షులకూఁతలు - భృంగ సంగీతముల్ - తుమ్మెదల పాటలు - సారసగానముల్ = బెగ్గురుపక్షుల సంగీతములు - తత్ = ఆ పర్వతముయొక్క, వన - ఉపవనములన్= వనములందు-చిన్నతోఁపులందు - తరుచరాళి = క్రోఁతిగుంపు.

తాత్పర్యము

వనములలోని వంకలయందు భరతపక్షులు గ్రుడ్డికొంగలు మనోహరముగఁ గూయుచుండఁగా నెమళ్ళాడుచుండఁగా తుమ్మెదలుఝుంకారములుచేయుచుండగా మదించిన పక్షుల తుమ్మెదల సంచారములు కోకిలల కోకూయుమానములు పక్షుల

ధ్వనులు తుమ్మెదల సంగీతములు వెగ్గురుల పాటలు వతిశయించు నాపర్వతము నందలి పెద్ద వనములందు చిన్న తోఁపులందు వానరులగుంపు ప్రవేశించి విచ్చల విడి సందర్భములకోలఁది పొట్టి పొడుగు నగుచు నక్కడక్కడఁదిరిగి సంతోషించెను.

కం. ఇట్లయి వానరు లుద్యా♦నమ్ములఁ జొరబాఱ పుష్ప♦నవ్యసురభిస
ర్గమ్ములు మందానిలములు, ఘుమ్మని పై వీచె నపుడు♦ఘ్రాణసుఖముగన్. ౭౯౩

అర్థములు. చొరఁబాఱన్=ప్రకాశింపఁగా-పుష్ప నవ్య సురభి సర్గమ్ములు= పూవుల క్రొత్తావులతోఁ గూడిన - మందానిలములు = మెల్లగా వీచు గాలులు- ఘ్రాణసుఖముగన్=ముక్కులకు సుఖము గలుగునట్లు.

తాత్పర్యము

ఈ ప్రకారము వానరు లుద్యానమ్ములందుఁ బ్రవేశించి తిరుగఁగా పూవుల క్రొత్తావులుగల మందవాయువులు వారికి ఘ్రాణసుఖము కలుగునట్లుమీఁదవీచెను.

కం. హరిరాజాజ్ఞను దక్కిన, హరివీరులు దండు వెడలి♦యరిగిరి లంకా
పురిపైఁ దద్గర్జల నా♦పుర మల్లలనాడెఁ బాద♦ముల ఘట్టనచేన్. ౭౯౪

అర్థములు. హరిరాజాజ్ఞను = సుగ్రీవుని యాజ్ఞ ప్రకారము, తక్కిన హరివీరులు=సువేలయందుండు వారుగాక తక్కిన వానరవీరులు, తత్+గర్జలన్= వారి సింహనాదములచే, పాదముల ఘట్టనచేన్=కాళ్ళ త్రొక్కుడులచే.

తాత్పర్యము

సుగ్రీవుని యాజ్ఞప్రకారము సువేలయం దుండు వానరులు తప్పఁ దక్కిన వానరులు దండుగా బయలుదేఱి లంకపైకి పోయిరి. వారి సింహనాదములచేతను కాలి త్రొక్కుళ్ళచేతను లంకానగర మల్లల్ల చలించెను.

ఉ. కంపితమయ్యె భూమి, పద♦ఘాతసముత్థిత ధూళిపాళులం
బెంపు గనెం. దదారవము♦భీతిని ఋక్షవరాహసింహముల్
ఱంపు లెసంగఁ బాఱె దిశ♦లం బసి యున్నతమున్ సమంబునై
సొం పయి పుష్పజాలముల♦జొంపము లంతట నిండ నోలమై. ౭౯౫

అర్థములు. కంపితమయ్యెన్ = వణఁకెను, పదఘాత = కాలిదెబ్బలచే, సముత్థిత = లేచిన, ధూళిపాళులున్ = దుమ్ముల గుంపులు, పెంపు = అభివృద్ధి, తత్+ఆరవము భీతిని=వారి ధ్వనివలనఁ గలిగిన భయముచే, ఋక్ష = ఎలుగులు, వరాహ=అడవిపందులు, జొంపములు = గుత్తులు, ఓలము = వృక్షములులోనగు వానిచే మఱుఁగుపడిన స్థలము.

త్రికూటపర్వతమునకు మూఁడు శిఖరములు, అందొకటి కడపటిది సువేల. నడిమిది లంకాపురి యుండునది. ఇంతవఱకు సువేల వర్ణింపఁబడెను. ఇప్పుడు లంక యుండు త్రికూట శిఖరము వర్ణింపఁబడుచున్నది.

తాత్పర్యము

లంకయందు భూమి వణఁకెను, కాలిదెబ్బలచే లేచిన ధూళి యతిశయించెను. ఆ ధ్వని విని భయముచే ఏనుఁగులు వరాహములు సింహములు కూఁతలు పెట్టుచు దిక్కులవెంటఁ బరువెత్తెను, ఎత్తైనవియై యందమై పూలసమూహముల గుత్తులు మఱుఁగుపడఁజేయుచుండె.

కం. లలితమహారజమునకుం, దులితం బై పక్షులకును ♦ దుష్ప్రాపం బై
కలిత శ్రీనిర్మలమై, చెలువారెడు దాని మిగుల♦స్నిగ్ధం బగుచున్. ౨౫౬

అర్థములు. మహారజతమునకున్ = బంగారునకు, తులితంబై = సమానమై, దుష్ప్రాపంబై = పొందరానిదై, కలిత = పొందఁబడిన, శ్రీ = శోభచే, నిర్మలమై = మలినము లేనిదై, స్నిగ్ధము = నునుపు.

తాత్పర్యము

మనోహర మగు బంగారుతో సమానమై పక్షులకుఁ గూడఁ బొందరానిదై, పరిశుద్ధమైన కాంతిగలదై మిక్కిలి నునుపై యందమైనదానిని.

కం. మనుజులు తలఁపన నేనియుఁ, జనగఁ నశక్యం బనంగ ♦ జతనంబునఁ బో
గొనసాగ దనఁగ నేలా, గొన బగు తద్ధారిణీధ్ర ♦ కూటమునందున్. ౨౫౭

అర్థములు. జతనంబునన్ = ప్రయత్నమున, అనఁగా కాలి నడకచే-పోన్ = పోవుటకు, తత్ + ధారిణీధ్ర కూటమునందును = ఆ పర్వత శిఖరమునందు.

తాత్పర్యము

ఆ లంకానగరమునకు మనస్సుతోఁ బోవుటయే యసాధ్యమైయుండఁ గాలి నడకతో పోవుట సాధ్యము కాదని చెప్పవలయునా? ఆ పర్వతశిఖరమునందు.

సీ. అసురేంద్రపాలితం ♦ బైన లంకాపురి, నిడివి నూఱామడ ♦ వెడలుపునను
ముప్పదామడ యయి ♦ గొప్ప వౌ నెల్లమబ్బులఁబోలుచుండు గో ♦ పురము లొప్ప
స్వర్ణ రాజతభూరి ♦ సాలశోభిత మయి, శ్రీ సౌధసువిమాన ♦ భాసిత మయి
ఘనములచే వాన ♦ కాలంబునందు మధ్యమ వైష్ణవపద మన్ ♦ తలఁపు గూర్చి

తే. క్రాలు చుండఁగ నందు నా ♦ కసము నంటు
రజతగిరిశిఖరాభ మై ♦ రాణమీఱు
వేయిరాడుల మాడువు ♦ వెలుఁగు నదియు
ననయ మాశరరక్షితం ♦ బగుచు నుండు. ౨౫౮

అర్థములు. స్వర్ణ రాజత = బంగారు వెండిగల - సాల = ప్రాకారముచే-శోభితమై = ప్రకాశించునదియై శ్రీసౌధ = కాంతిగల మేడలచేతను-సువిమాన = మంచి యంతస్తుల కొనలచేతను-భాసితమయి=ప్రకాశించునదియై-ఘనములచేన్ = మబ్బులచే మధ్యమ వైష్ణవ పదము = ఆకాశము - త్రివిక్ర మావతారంబున మూఁడడుగులలో నడిమి యడుగు చేఁగొలువఁబడినది-రజతగిరిశిఖరాభమై=కైలాస

పర్వత శిఖరముతో సమానమై, వేయిరాసుల = వేయి స్తంభముల, మాడువు = మేడ-అనయము = ఎల్లవేళ-ఆశర రక్షితము=రాక్షసులచేఁ గాపాడఁబడునది.

తాత్పర్యము

రావణుచేఁ బాలింపఁబడు లంకానగరము నిడివి నూఱామడ, వెడలుపున ముప్పదామడ గలది. అందు గోపురములు తెల్లని మబ్బులవలె నుండును. ప్రాకారము బంగారు వెండిచేఁ బ్రకాశించుచుండును. కాంతిగల మేడలు ఏఁడంతస్తుల మేడలు ప్రకాశించుచు వానకాలమందు మేఘములచే నావరింపఁబడిన యాకాశమను తలఁపు గలిగించుచుండును. వానిలో కైలాసగిరి శిఖరమువలె నందమై వేయి స్తంభముల మేడగలదు. అది సర్వదా రాక్షసులచేఁ గాపాడఁబడుచుండును.

కం. ఆ లంక కలంకారం, బై లలితం బైన రావ♦ణాసురచైత్యం
బాలోకించెను గోలాం,గూలంబులు విస్మయంబు ♦ గుబ్బతిలంగన్. ౨౯

అర్థములు. చైత్యంబు = నాలుగు వీథులు కలియు చోట నుండు మేడ—చైత్యమనఁగా నాలుగు వీథులు కలియుచోటు. అక్కడనున్నది కావున నీమేడయు చైత్యమనఁబడెను. గోలాంగూలంబులు = కొండముచ్చులు - గుబ్బతిలంగన్ = అతిశయింపఁగా.

తాత్పర్యము

ఆ లంకా నగరమునకు భూషణము వంటిదై మనోహరమైన రావణాసురు మేడ గలదు. దానిని కొండముచ్చులు మిగుల ఆశ్చర్యముతోఁ జూచెను.

శా. నానాచిత్ర విచిత్రధాతుయుతము ♦ న్నానాసురాన్వీతము
న్నానారామవనాభిశోభితము నా ♦ నాపక్షి సంఘుష్టము
న్నానాసత్త్వనిషేవితంబును నగేం ♦ ద్రవ్యూహసంశోభితం
బా నీరేజవిలోచనుండు కపిసం ♦ ఘాన్వితుఁ డై కన్గొనెన్. ౩౦

అర్థములు. నానాచిత్రవిచిత్ర ధాతు యుతమున్ = అనేకములైన చిత్ర విచిత్ర గైరిక ధాతువులతోఁ గూడినది, నానా+అసురాన్వీతమున్=అనేక రాక్షసులతోఁ గూడినది, నానా+ఆరామ వనాభిశోభితము = అనేకములైన యుద్యాన వనములచే మిగులఁ బ్రకాశించునది. నానాపక్షిసంఘుష్టమున్ = అనేక విధపక్షులచే ధ్వనింపబడినది. నానా సత్త్వ నిషేవితంబు = అనేక జంతువులచే సేవింపఁబడినది, నగేంద్ర వ్యూహసం శోభితంబు = క్రీడా పర్వతములచే శోభించునది, నీరేజవిలోచనుండు=కమలములవంటి కన్నులు గల రామచంద్రమూర్తి, కపిసంఘ+అన్వితుఁడై=వానర సమూహమును గూడిన వాఁడై.

తాత్పర్యము

అనేక చిత్ర విచిత్ర గైరిక ధాతువులు గలదియు అనేక రాక్షసులతోఁ గూడినదియు అనేకము లగు నుద్యానవనములచేఁ బ్రకాశించునదియు అనేక

పక్షుల ధ్వనులు గలదియు అనేక జంతువులచే సేవింపఁబడునదియు క్రీడాపర్వతములనేకములు గలదియు నగు దానిని రామచంద్రమూర్తి వానరులతోడఁ జూచెను.

కం. కనుఁగొని సురవరనగరం, బెనసెడి తత్పురము సొంపు ♦ నీక్షించి ధరా
తనయాధవుఁ డచ్చెరువుం, గొని సకలముఁ జూచుచుండెఁ ♦ గుతుకముతోడన్.

తా త్ప ర్య ము

స్వర్గలోకముతో సమానమైన యా పురము నందముఁజూచి రామచంద్రమూర్తి యాశ్చర్యపడి సంతోషముతో సర్వముఁ జూచుచుండెను.

**♦ ౪౦-వ సర్గము. సుగ్రీవుఁడు రావణుగోపురంబునకు దాఁటి యతనితోఁ బోరుట ♦**

తే. ఆమడలు రెండు విరివియౌ ♦ నల సువేల, పర్వతాగ్రంబునను రామ ♦ భద్రుఁడర్క-
తనయహరియూథపరివృతు ♦ డన్ని దెసలఁజూచుచుఁ ద్రికూటగతలంకఁ ♦ జూచనపుడు.

తా త్ప ర్య ము

రెండామడ వెడల్పుగల సువేల పర్వతము కొనను రామచంద్రమూర్తి సుగ్రీవాది వానరులతో గూడినవాఁడై యన్ని ప్రక్కలఁ జూచుచుఁ ద్రికూట పర్వతంబున నున్న లంకను జూచునపుడు.

ఉ. అందొక గోపురంబు పయి ♦ హారిమణీచయభూషితాంగుఁడై
చందనలిప్తగాత్రుఁడయి ♦ స్వర్ణమహాధనరాజితాంగుఁడై
కందవినీల దేహుఁడయి ♦ కమ్రజయాతపవారణుండునై
సుందరగౌరచామరవి ♦ శోభితుఁడై రహి మీఱు దుర్జయున్. ౧౦౩

రాత్రివేళ వానరులు సువేల పర్వతము మీఁద వెలిఁగించిన దివిటీల కాంతుల చేతను భేగులు చెప్పుట చేతను రామచంద్రమూర్తి వానర వీరులతో సువేలమీఁదికి వచ్చి యున్నాఁడని తెలిసి వారిని జూచుటకై యుదయముననే రావణుఁడు తన మేడమీఁదికిఁబోయి యచటనుండి రామాదులఁ జూచుచుండెను.

అర్థములు. అందు=ఆలంకయందు-హారి = మనోహరమైన. మణీచయ = రత్నసమూహములచే-భూషిత =అలంకరింపఁబడిన - అంగుఁడై = దేహము గలవాఁడై, చందనలిప్త గాత్రుఁడయి = గంధము పూయఁబడిన దేహము గలవాఁడై స్వర్ణ=బంగారుచేఁ జేయఁబడిన-మహాధన=మిగుల విలువగల యాభరణములచే-రాజిత=ప్రకాశించు-అంగుఁడై =దేహముగలవాఁడై -కంద=మేఘమువలె(కం=జలమును ద=ఇచ్చునది)వినీల=నల్లని-దేహుఁడయి=దేహముగలవాఁడై -కమ్ర=మనోహరమైన-జయాతపవారణుండునై = జయచ్ఛత్రము గలవాఁడై -సుందర= అందమైన గౌర=తెల్లని, చామర=వింజామరలచే విశోభితుఁడు=మిగులఁ బ్రకాశించువాఁడు-దుర్జయున్=కష్టముచే జయింపఁదగిన వానిని.

తాత్పర్యము

ఆ లంక యందొక గోపురము మీఁద మనోహరములైన రత్నాభరణములచే నలంకరింపఁబడిన వాఁడును, ఎఱ్ఱని గంధము పూసికొన్న వాఁడును, వెలగల బంగారు సొమ్ములు ధరించిన వాఁడును, నల్ల మేఘమువలె నల్లని దేహకాంతి గల వాఁడును, జయచ్ఛత్రము పట్టించుకొను వాఁడును, తెల్లని వింజామరలచే విసరించుకొను వాఁడును, జయింపరాని వాఁడును నగు వానిని.

తే. అమరనాయక గజవిషా • ణాగ్రకలిత, కిణవిరాజితవక్షు రా • వణు దినాంత
మిహిరకాంతి సమావృత • మేఘరాశి, నా శశాస్రాభవస్త్రంబు • నవ్యరీతి. ౮౦౪

అర్థములు. అమరనాయకగజ=ఐరావతముయొక్క, విషాణాగ్ర=కొమ్ముయొక్క కొనచేత, కలిత=కలిగిన, కిణ = కాయచే, విరాజిత వక్షున్ = ప్రకాశించుఱొమ్ముగలవానిని, దినాంత=సాయంకాలమందలి, మిహిర=సూర్యునియొక్క, కాంతి=ప్రకాశముచే, సమావృత = చుట్టఁబడిన, మేఘరాశినాన్ = మేఘసమూహమో యనునట్లు, శశ+అస్ర + ఆభ = కుందేటి నెత్తుటితో సమానమైన, వస్త్రంబు=గుడ్డ.

తాత్పర్యము

ఐరావతము కొమ్ముతోఁ బొడువఁగాఁ గలిగిన గాయము కాయకాచి ఱొమ్మునందున్న వానిని, సాయంకాలమునందలి యెండచేఁ జుట్టఁబడిన మబ్బుల గుమివంటి వానిని, కుందేటి నెత్తురువలె నెఱ్ఱనైన వస్త్రము (నల్లని దేహము ఎఱ్ఱని వస్త్రము కావున నీ యుపమానము శోభాతిశయము సూచించెడి)

చం. ఎనసినవాని రాక్షస కు • లేంద్రు గపీంద్రులు రామచంద్రుఁడుం
గనఁగొను చుండ రావణునిఁ • గాంచిన మాత్రాన జాతరోషుఁడై
వనచరలోకనాథుఁడు చి • వాలునఁ దెంపును పెంపు శౌర్యమున్
జెనఁగొన నట్టి దాఁటు సుర • వీరవిరోధి వసించుమేడకున్. ౮౦౫

అర్థములు. ఎనసినవానిన్=పొందిన వానిని. ధరించిన వానిని, మాత్రన= ఈ శబ్దము కంధరాదులలోఁ జేరినది కావున మాత్రన, మాత్రమున నని రెండు రూపంబులు గలవు మాత్రాశబ్దము ఆకారాంతము, కృత్స్నావధారణంబుల నపుంసకము, జాతరోషుఁడై=పుట్టిన కోపము గలవాఁడై.

తాత్పర్యము

ధరించిన వాని, రాక్షసులందు శ్రేష్ఠుని, వానరులు రామచంద్రుఁడు చూచుచుండఁగా వారితోఁ జెప్పక రావణుని జూచిన మాత్రమున మన స్వామి రామచంద్రు నెదుట వీనికి రాజోపచారములా యని సుగ్రీవుఁడు కోపించిన వాఁడై సాహసము పెంపు మనోబలము దేహబలము కలియఁగా చివాలున రావణుఁడున్న మేడ మీఁదికి నెగిరి పోయెను.

చం. నిలిచి ముహూర్తమాత్ర మట • నిర్భయుఁడై యసురేంద్రుఁ జూచి యా
ఖలు నొకపోకకుం గొనక • కర్ణకఠోరముగాఁగ నిట్లనున్
నృపులవ! త్రిలోకభర్త రఘు • నాథున కేను సఖుండ దాసుఁడన్
దలఁగకు రాము తేజమున • దర్ప మడంపక పోవనిత్తునే. ౧౦౬

అర్థములు. ముహూర్తమాత్రము=అల్పకాలము, మాత్రమే = ముహూర్తమే యని యవధారణమున నపుంసకము నిలిచి యనుటచే వానిమీఁదనే మాఁక లేదని యర్థము. పోకకుం గొనక = పోకకున్న విలువయైన వానియం దున్నదని తలంపక.

తాత్పర్యము

అల్పకాలమే నిలిచి భయములేనివాఁడై రావణునిఁజూచి యాదుష్టుని గొంచెమైన సరకు సేయక వినుటకుఁ గష్టమైన మాటల నిట్లనెను. ఓరీ! క్రూరుఁడా! మూఁడు లోకములకు నాథుఁడగు రామచంద్రమూర్తికి నేను ఆయన యభిప్రాయమున మిత్రుఁడను, నా యభిప్రాయమున దాసుఁడను, తొలఁగిపోకుము. రాముని తేజస్సు నాయందుండుటచే నీగర్వమణంపక పోనిత్తునా? రాముని తేజస్సుచే ననుటకు నాయందలి శక్తి రామునిశక్తియేకాని నాశక్తిగాదు. నే నస్వతంత్రుఁడనని భావము.

కం. అని దుమికి మీఁదికిం ద, ద్ఘనమణిమయముకుట మాడ్చి • ధర మొత్తి మఱిం
దనమీఁదికి నరుదెంచెడి, యినసుతు నీక్షించి రాక్ష • సేశ్వరుఁ డనియెన్. ౧౦౭

అర్థములు. ముకుటము = కిరీటము.

తాత్పర్యము

అని మీఁద దుమికి వానిరత్నమయమైన కిరీటము లాగి నేలపైఁగొట్టి మరలఁ దనమీఁదికి వచ్చుచున్న సుగ్రీవునిఁ జూచి రావణుఁ డిట్లనియె.

కం. సుగ్రీవా! యింతకు మును, సుగ్రీవుఁడ వీవు నాదు • చూపునఁ బడి హీ
నగ్రీవుఁడ వయ్యెదవని, యాగ్రహమున నతని విసరి • యావల వైచెన్. ౧౦౮

అర్థములు. మును=పూర్వము, సుగ్రీవుఁడవు = మంచి మెడగలవాఁడవు, హీనగ్రీవుండవు=మెడ లేనివాఁడవు, ఆగ్రహమునన్ = కోపమున, ఆగ్రహశబ్దము, నకుఁ బట్టుదల యనియు నర్థము గలదు. సత్యాగ్రహము = ఆనుదాని పట్టుదల, మొండితనమని యర్థము.

తాత్పర్యము

సుగ్రీవా! నా కంటఁబడక ముందు నీవు చక్కని మెడగలవాఁడవే. ఎప్పుడు నాకంటికిఁ గానవచ్చితివో యప్పుడే మెడలేనివాఁడ వయ్యెదవని కోపముచే నతని నెత్తి యావలఁ బాఱవైచెను.

ఉ. వైచినఁ బుట్టచెండువలె • వానరనాథుఁడు లేచి బాహులన్
ద్రోచె నిశాచరేంద్రు నిలఁ • ద్రోచినమాత్రన యీడఁబోక వే